ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2017 Q2 ఏప్రిల్ - జూన్ ఆర్టికల్స్

## (పిడిఎఫ్ రూపంలో)

## విషయసూచిక


దలైలామా తవాంగ్ పర్యటన చిచ్చు
భీమసేన్ జోషి కొడుకు ఆవేదన
మంత్రిగా లోకేశ్
వికిలీక్స్ అసాంజే అదృష్టం
సోషల్ మీడియాలో బోగస్ న్యూస్‌పై ఫేస్‌బుక్ పోరాటం
2019లో టిడిపి గెలుస్తుందనకూడదా?
గుడ్డులో తుపాను
ఉదారవాద విద్యాలయంపై హంగరీ కన్నెర్ర
ఒడిశాలో ఊపు మీదున్న బిజెపి - బిజెడిలో రగడ
జాతీయతావాదంలో తప్పేముంది?
ఓటింగు యంత్రాలను నమ్మవచ్చా?
ఇదీ మన బ్యాంకుల డిజిటల్ భద్రత...!
శివరాజ్ చౌహాన్‌కు స్థానచలనమా...?
బాహుబలి చావుపై అంత ఆసక్తా...?
బరువూ తగ్గింది, పరువూ తగ్గింది...
ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలు
తమిళనాడు మిస్టరీలు
మరాఠీ నాయకుల వీరంగం
హిందువునని చాటుకుంటున్న మమత
ఆప్‌లో సంక్షోభం
స్మారక చిహ్నాన్ని వదుల్చుకోవడం ఎలా?
పుదుచ్చేరిలో కిరణ్ బేదీ ఘర్షణ
రాజమౌళి నిజాయితీ
ముమ్మారు తలాకుల పద్ధతి ముగుస్తుందా?
గుజరాత్‌లో ఎన్నికల ఆతురత
హిమాచల్‌లో కాంగ్రెసు అవస్థ
ఐర్లండ్‌కు భారత సంతతి ప్రధాని
కేరళలో ఐసిస్ ప్రభావం
కతార్ దిగ్బంధం
నారాయణరెడ్డి గారు
ఓడి గెలిచిన ఛాందసుడు కోర్బిన్
గూరా?లాండ్ ఆందోళనకు అసలు కారణం...?
మహారాష్ట్రలో ఋణమాఫీ
గృహనిర్బంధంలో సౌదీ మాజీ యువరాజు
పోరాటయోధుడు ఫిడల్ కాస్ట్రో (నోట్స్ మాత్రమే వ్యాసం అసంపూర్ణం)

**నోట్ల రద్దుపై పాయింట్లు**

**2017 ఏప్రిల్ 01** **ఎమ్బీయస్ : దలైలామా తవాంగ్ పర్యటన చిచ్చు**

ఏప్రిల్ 4 నుంచి 13 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌ను పర్యటించాలని దలైలామా నిశ్చయించడం భారత్–చైనా సంబంధాలలో మరో సమిధను చేర్చింది. తమ పొరుగు రాజ్యమైన టిబెట్‌ను చైనా 1959 లో ఆక్రమించింది. టిబెట్ ప్రజలు దైవసమానుడిగా ఆరాధించే దలైలామా వ్యవస్థపై విరుచుకుపడింది. దాంతో 14 వ దలైలామా (పేరు టెంజిన్ గ్యాట్సో) చైనాపై తిరుగుబాటు చేసి అది విఫలమైతే కొందరు అనుచరులతో 1959లో లాసాను వదిలి వదిలి పారిపోయి వచ్చి ఇండియాలో శరణు కోరాడు. టిబెట్ శరణార్థులకు ఇండియా ఆశ్రయం యిచ్చింది. అనేక చోట్ల స్థలాలు యిచ్చి నివసించమంది. దలైలామా హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నివసిస్తూ ప్రవాస టిబెట్ ప్రభుత్వం నడుపుతూంటాడు. కర్ణాటకలోని కూర్గు (కొడగు) జిల్లాలో కూడా టిబెట్‌వారికి ఆశ్రయం యివ్వగా అక్కడ పెద్ద బౌద్ధారామం కట్టుకున్నారు. ప్రవాసంలో వుంటూనే దలైలామా ప్రపంచమంతా పర్యటిస్తూ తమకు జరిగిన అన్యాయాన్ని అందరికీ వినిపిస్తూంటాడు. అందరూ విన్నారే కానీ చైనాకు బుద్ధి చెప్పినవారెవరూ లేరు. పైగా టిబెట్ సమస్యను శాంతియుతంగా డీల్ చేస్తున్నందుకు మెచ్చుకుంటున్నామంటూ 1989లో నోబెల్ శాంతి బహుమతిని ప్రసాదించారు. టిబెట్ సంస్కృతిని నాశనం చేసి, తమ సంస్కృతిని అక్కడ నెలకొల్పడానికి చైనా శతథా ప్రయత్నిస్తోంది. అయినా కొందరు టిబెట్ వారు తిరగబడుతూనే వున్నారు. 2008 చైనా ఒలింపిక్స్ సమయంలో టిబెట్‌వారు ప్రదర్శనలు నిర్వహించి తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రపంచం ద ృష్టికి తీసుకురావడానికి ప్రయత్నించారు. వీటన్నిటి వెనుక దలైలామా వున్నాడని చైనా భావిస్తుంది. అందుకే అతను సన్యాసి కాదు, రాజకీయనాయకుడు. సన్యాసి దుస్తులు ధరించిన తోడేలు అంటుంది. ఇటీవల జాన్ ఆలివర్ నిర్వహించే అమెరికా టీవీ కార్యక్రమంలో దలైలామా మాట్లాడుతూ చైనాలోని అతివాదులు (హార్డ్‌లైనర్స్)కు మెదడులో కొంత భాగం పనిచేయదని వ్యాఖ్యానించాడు. వెంటనే చైనా స్పందించింది – చైనా వ్యతిరేకులను ప్రోత్సహించే టక్కరి దలైలామా అంటూ. ఇద్దరి మధ్య బంధాలు యింత సొగసుగా వుండగా యిప్పుడు దలైలామా తవాంగ్‌లోని భారతదేశంలోనే అతి పెద్దదైన బౌద్ధారామం (మొనాస్టరీ) వారి ఆహ్వానంపై అక్కడకు వెళతానంటున్నాడు. అది తమదే అని చైనా భారత్‌తో వివాదం వేసుకుని వుంది. తమ ప్రాంతంలోకి తమ శత్రువు ప్రవేశిస్తే ఎలా? అనేది చైనా ప్రశ్న.

ఏప్రిల్ 4 మంగళవారం నాడు పొద్దున్న తవాంగ్‌లో వున్న బౌద్ధారామాన్ని దర్శించి, కొత్తగా కట్టిన తారా ఆలయాన్ని ప్రారంభించి, 5 వ తారీకు నుంచి 7 వ తారీకు వరకు అక్కడ మతబోధనలు చేసి దిరాంగ్‌కు వెళ్లి అక్కడ 10 నుంచి బోధనలు చేసి చివరకు ఈటానగర్‌కు 12 న చేరి అక్కడా బోధనలు చేసి వస్తారు. లాసా నుంచి భారత్‌కు వచ్చినపుడు దలైలామా తవాంగ్ ద్వారా వచ్చారు. అక్కడకు 50 ఏళ్ల తర్వాత 2009లో మన్‌మోహన్ సింగ్ అనుమతితో వెళ్లి వచ్చారు. మళ్లీ 8 ఏళ్ల తర్వాత యిప్పుడు వెళుతున్నారు. దీనికి అనుమతి 2016 నవంబరులో లభించింది. న్యూక్లియార్ సప్లయిర్స్ గ్రూపులో ఇండియా సభ్యత్వానికి చైనా అడ్డు తగిలిన నేపథ్యంలో మోదీ సర్కారు యీ నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని 90 వేల చ.కి.మీ. ప్రాంతాన్ని చైనా దక్షిణ టిబెట్‌గా పేర్కొంటూ అది కూడా తమదే అంటుంది. ఆ విషయంగా 1962లో ఇండియాపై దాడి చేసింది కూడా. ఆ తర్వాత నుంచి చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి యిరు దేశాలు చూశాయి కానీ యిప్పటికి దాకా వివాదం సాగుతూనే వుంది. ఈ మధ్యలో చైనా ఒక ప్రతిపాదన తెచ్చింది. 'పశ్చిమ సెక్టార్‌లో వున్న వివాదాస్పద ప్రాంతమైన అక్‌సాయి చిన్‌పై హక్కులు వదులుకుంటాం, తవాంగ్‌పై హక్కులు మీరు వదులుకోండి' అని. 1962లో అక్‌సాయ్ చిన్ కీలకమైన ప్రాంతం. కానీ లాసా రైల్వే కట్టాక, టిబెట్ రోడ్ల వ్యవస్థ నిర్మించాక దానికి ప్రాధాన్యత పోయింది. అందుచేత దాన్ని వదులుకోవడానికి చైనా సిద్ధపడుతోంది. తవాంగ్‌పైనే దాని ద ృష్టి యిప్పుడు. అలాటి తవాంగ్‌లో తమ శత్రువు దలైలామాను అనుమతించడం చైనాను మండిస్తోంది. 2009లో గొడవ చేయనిది యిప్పుడే ఎందుకు చేస్తోంది అంటే దలైలామా తన యింటర్వ్యూలో చైనా నాయకుల గురించి చేసిన వ్యాఖ్యలు అని కారణం చెపుతున్నారు.

దలైలామా పర్యటన ప్రారంభించడానికి నాలుగు రోజుల ముందు చైనా విదేశాంగ మంత్రి మాట్లాడుతూ "చైనా, భారత్‌లు అభివ ృద్ధి బాటలో నడుస్తున్న రెండు పెద్ద యిరుగుపొరుగు దేశాలు. ఇద్దరి మధ్య సఖ్యత ఎంతో అవసరం. దానికి గట్టి పునాది ఏర్పడాలి. దలైలామా వంటి వేర్పాటువాదిని తవాంగ్ అనుమతించడం ద్వారా భారత్ సత్సంబంధాలను దెబ్బ తీస్తోంది. చైనాతో సఖ్యత ముఖ్యమో, దలైలామా ముఖ్యమో భారత్ తేల్చుకోవాలి." అని హెచ్చరిక లాటిది చేశాడు. ఇవేమీ పట్టించుకోకుండా భారత ప్రభుత్వం దలైలామాను ముందుకు వెళ్లమంది. ఆయన ఏప్రిల్ రాగానే ముందుగా అసాంకి వెళ్లాడు. అక్కడ గువాహటిలో వుండగా 76 ఏళ్ల గార్డు ఒకతను కలిసి నమస్కరించాడు. 58 ఏళ్ల క్రితం దలైలామా లాసా నుంచి పారిపోయి వస్తున్నపుడు భారత్ ప్రభుత్వం అసాం రైఫిల్స్‌లోని ఐదుగుర్ని రక్షణగా పంపింది. నరేన్ చంద్ర దాస్ అనే యితను అప్పుడు అసాం రైఫిల్స్‌లో పని చేస్తుండేవాడు. అసాం రైఫిల్స్ 9 వ నెంబరు ప్లాటూన్ దలైలామాను, అనుచరులను జుతాంగ్‌బో నుంచి తీసుకుని వచ్చి శక్తి వద్ద ఐదుగురు సభ్యుల వీళ్ల బ

ృందానికి అప్పగించింది. వీళ్లు వారిని లుంగ్లా వరకు తీసుకుని వచ్చి వేరే దళానికి అప్పగించారు. వాళ్లు ఆయనను తవాంగ్ కు తీసుకెళ్లారు. ఇప్పుడా గార్డు వచ్చి పలకరించడంతో దలైలామా పులకరించి, ధన్యవాదాలు అర్పించాడు. ఈ 10 రోజుల పర్యటనలో దలైలామాను యింకెందరు సత్కరిస్తారో, దానికి చైనా ఎలా స్పందిస్తుందో, మొత్తం మీద దీని పర్యవసానాలు ఎలా వుంటాయో యిప్పుడే చెప్పలేం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**న్యూస్ వ్యూస్ 124 ఏప్రిల్ 02, 03 ఎమ్బీయస్ : భీమసేన్ జోషి కొడుకు ఆవేదన**

కళాకారులు ప్రజాభిమానాన్ని చూరగొంటారు. వారిలోని సరస్వతీ అంశను చూసి, ప్రజలు వారిని దైవాంశ సంభూతులుగా భావించి, ఎక్కడో ఎత్తున కూర్చోబెడతారు. మామూలు మనుష్యుల కుండే రాగద్వేషాలు, బలహీనతలు వారి కుంటాయని మర్చిపోతారు. తాము అంటగట్టిన సుగుణాలు వారికి లేవని తెలిస్తే తట్టుకోలేరు. ఈ విషయాలు తెలిసిన కళాకారులు తమ వ్యక్తిగత విషయాలు బహిరంగంగా చర్చించడానికి యిష్టపడరు. తమపై పుస్తకాలు రాస్తానన్నా, సినిమాలు తీస్తానన్నా వద్దని వారిస్తారు. వారి కుటుంబసభ్యులు కూడా ఓ పట్టాన అంగీకారం తెలుపరు. కానీ కళాభిమానులకు వారి ఆరాధ్యదైవాల గురించి తెలుసుకోవాలన్న కుతూహలం వుంటుంది. ఏ మాత్రం సమాచారం తెలిసినా దానికి అతిశయోక్తులు జోడించి, అంతకింత చేసి తమలో తాము చెప్పేసుకుంటూ వుంటారు. పనికట్టుకుని ప్రచారం చేస్తూ వుంటారు. ఇది చాలా సందర్భాల్లో ఆ కళాకారుల కుటుంబసభ్యులకు అసహనం కలిగిస్తుంది. ప్రజలంతా వారి కడుపున పుట్టడం మీ అదృష్టం అంటూ వుంటే చికాకు పుడుతుంది. కళాకారుల విషయమే కాదు, మహాదాతగా పేరుబడిన లేదా ఉద్యమం కోసం జైలుకెళ్లిన, త్యాగాలు చేసిన వారిని సమాజమంతా ఆరాధిస్తుంది. కానీ ఆ దానాల వలన, త్యాగాల వలన కుటుంబం ఎంత నష్టపోయి వుంటుందో ఆలోచించండి. ఇంట్లో డబ్బు లేక, దారి చూపే తండ్రి లేక, చదువుకోలేక, వాళ్లు ఎంత కుములుతారో వూహించండి. వాళ్లకి సహజంగా తండ్రిపై కోపం వుంటుంది. కానీ దాన్ని వ్యక్తం చేయలేరు. సమాజం కోసం అందరితో బాటు వాళ్లని పొగడాలి. అలా పొగడలేక 'మీరనుకున్నంత కాదు, ప్రతి దీపం కింద నీడ వుంటుంది. ఆ నీడలో ఎదిగాం మేం. మా తండ్రి లేదా తల్లి మచ్చలు, వాటి వలన పడిన అవస్థలు మాకే తెలుసు. జరిగిందేదో జరిగింది. వదిలిపెట్టండి.' అని చెప్పబుద్ధవుతుంది. కానీ చెప్పలేరు. ఎవరైనా తెగించి చెప్పబోయినా, ప్రజలు దాన్ని వినడానికి యిష్టపడరు సరికదా తిట్టిపోస్తారు.

ఓసారి ఘంటసాల పెద్ద కుమారుడు, స్వర్గీయ విజయకుమార్ రవీంద్ర భారతిలో సభలో 'మీరంతా ఆకాశానికి ఎత్తేస్తున్న మా నాన్నగారి వలన మేమెంత అవస్థ పడ్డామో తెలుసా?' అని చెప్పబోతే ప్రేక్షకులంతా గట్టిగా కేకలు వేసి అతన్ని మాట్లాడ నీయలేదట. ఘంటసాల గురించి వారి అమ్మాయి డా।। శ్యామల "నేనెరిగిన నాన్నగారు" పేరుతో 2013లో పుస్తకం వెలువరించి, దానిలో ఘంటసాలకు రెండు కుటుంబాలు వుండడం వలన ఎటువంటి క్లేశాలు అనుభవించారో వివరించారు. ఘంటసాలకు యిద్దరు భార్యలున్న సంగతిని దాశరథి, ఆరుద్ర తమ వ్యాసాల్లో ప్రస్తావించడం జరిగింది. కానీ ఘంటసాలపై వచ్చిన అనేక పుస్తకాల్లో రెండో సంసారం గురించిన ప్రస్తావన వదిలేశారు. ఘంటసాల గారి మొదటి భార్య సావిత్రిగారు ఆ కుటుంబం ఉనికిని గుర్తించడానికి నిరాకరించడంతో ఆ కుటుంబసభ్యుల గురించి వివరాలు బయటకు రాలేదు. కానీ శ్యామల 'మా రెండు కుటుంబాలు కలిసికట్టుగా వుండాలనేదే మా నాన్నగారి కోరిక' అంటూ అన్ని విషయాలూ బయటపెట్టడానికి నిశ్చయించుకున్నారు. "భువనవిజయం" అనే ఆన్‌లైన్ పత్రికలో 2004లో "నాణానికి మరోవైపు" పేరుతో సీరియల్ ప్రారంభించారు. సావిత్రిగారు కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకుని కూతురు రాసే సీరియల్ ప్రచురణ ఆపించివేశారు. శ్యామల ఐదేళ్లు పోరాడి స్టే తీయించేసుకుని, పుస్తకాన్ని అచ్చురూపంలో తీసుకుని వచ్చారు. ఘంటసాల రెండో భార్య కోడలు పార్వతీ రవి ఆ పుస్తక ప్రచురణలో సహకరించారు. డా।। శ్యామల ఒక పరిశోధకురాలి లాగానే ఎలాటి పక్షపాత ధోరణి ప్రదర్శించకుండా, ఒక సాక్షిలా ఘంటసాల–సావిత్రి–సరళ ముక్కోణంలో ఎవరి పొరపాటు ఎంత వుందో చక్కగా బేరీజు వేశారు.

"దేవదాసు" నిర్మాణంలో వున్న రోజుల్లో ఘంటసాల, సావిత్రి గార్లు అద్దె కుంటున్న యింట్లో పక్క వాటాలో రంగూన్ నుంచి వచ్చిన నాయుడుగారి కుటుంబం వుండేది. వారి చిన్నమ్మాయి సరళ పియుసి చదువుకునేది, సావిత్రి కంటె పెద్దది. మంచి మాటకారి. వచ్చి సరదాగా కబుర్లు చెప్పేది. అందరి చేత మంచిదాన్నని, విశాలహృదయురాలినని అనిపించుకునే తాపత్రయంతో సావిత్రి సరళను, ఘంటసాలను ఏకాంతంగా వదిలేసి వంటింట్లో పని చేసుకుంటూ వుండేవారు. ఘంటసాలతో చనువు పెరిగాక సరళ 'మిమ్మల్నే పెళ్లాడతాను, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటాను' అనడంతో ఆయన బిత్తరపోయారు. అప్పటికి ఆయనకు పెద్దగా ఆదాయమూ లేదు. అటువైపు, యిటువైపు పెద్దలెందరు చెప్పినా సరళ మొండిపట్టు పట్టారు. గతంలో ఒకమ్మాయి యిలాగే ఘంటసాలను ప్రేమించి, పెద్దలు వేరే వాళ్లతో పెళ్లి నిశ్చయం చేస్తే పారిపోదామంది. ఈయన వద్దని వారించి, పెళ్లి జరిగేట్లు చూశాడు. పెళ్లయ్యాక ఆవిడ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇప్పుడు యీమె కూడా అలాగే చేస్తుందేమోనని యీయన భయం. గతంలో చివరకు సరళ పెద్దలు సావిత్రి వద్ద సమ్మతి పత్రం తీసుకుని 1950 జూన్‌లో పెళ్లి జరిపించారు. సావిత్రి ద్వారా ఐదుగురు పిల్లలు కలిగితే, సరళ ద్వారా ముగ్గురు పిల్లలు కలిగారు.

ఈ వివాహాన్ని సావిత్రి జీర్ణించుకోలేక పోయారు. ఆ యింటి మీద వాలిన కాకి యీ యింటిమీద వాలడానికి వీల్లేదన్నారు. అటు

సరళ తన అహాన్ని సంతృప్తి పరుచుకోగలిగారు కానీ సమాజంలో గౌరవాన్ని కోల్పోయారు. సావిత్రిది సనాతన బ్రాహ్మణ కుటుంబం. ఆచారవ్యవహారాలు పాటించే పల్లెటూరి మనస్తత్వం. సరళది రంగూన్‌లో పెరిగిన అబ్రాహ్మణ కుటుంబం. ఆధునికత, చదువు కలిగిన పట్టణవాస మనస్తత్వం. మనస్తత్వాలకీ, జీవన విధానాలకి పొత్తు కుదరలేదు. ఇద్దరు భార్యలకూ కోపం, తన మాటే నెగ్గాలన్న పంతం, మొండితనం, పట్టే తప్పు విడుపు లేని లక్షణం సమానంగా వున్నాయి. ఈ ఘర్షణలో నలిగిన ఘంటసాల మనశ్శాంతికి దూరమయ్యారు. ఇక లోకులు యీ ఎనిమిది మంది పిల్లల వద్ద "మీ అమ్మ పెద్ద పెళ్లామా? రెండో పెళ్లామా? మీ నాన్న మీతోనే వుంటాడా? వచ్చి వెళుతూంటాడా?" వంటి వికృతమైన ప్రశ్నలు వేసేవారు. వీటన్నిటి మధ్య పెరిగిన డా॥ఎ శ్యామల చాలా సంయమనంతో రాసిన పుస్తకం "నేనెరిగిన మా నాన్నగారు".

ఇప్పుడీ పుస్తకం ప్రస్తావన ఎందుకు వచ్చిందంటే ఘంటసాల లాగానే మరో సరస్వతీ పుత్రుడైన భీమసేన్ జోషి (1922–2011) గురించి ఆయన కుమారుడు రాఘవేంద్ర జోషి రాసిన మరాఠీ పుస్తకానికి ఇంగ్లీషు అనువాదమైన "భీమసేన్ జోషి, మై ఫాదర్" అనే పుస్తకం మార్కెట్లోకి వచ్చింది. హిందూస్తానీ సంగీతంలో నిష్ణాతుడై భజనలు, అభంగాలు పాడడంలో అందె వేసిన చేయి అయి, 'భారతరత్న' బిరుదు పొందిన భీమసేన్‌కి కూడా యిద్దరు భార్యలు. ఘంటసాల యిద్దర్నీ సమాంతరంగా చూసుకున్నారు. అయితే భీమసేన్ తనతో బాటు కన్నడ నాటకంలో నటించిన నటి వత్సలా ముధోల్కర్ పరిచయమయ్యాక ఆమెతో ప్రేమలో పడి, పెళ్లయిన ఏడేళ్లకు మొదటి భార్యను, ముగ్గురు పిల్లల్ని వదిలేసి వెళ్లిపోయాడు. అందరి కంటె పెద్దవాడైన రాఘవేంద్ర (యీ రచయిత)కు ఆరేళ్లు. పెద్ద భార్యకు విడాకులు యివ్వలేదు. బొంబాయి ప్రెసిడెన్సీలో బహుభార్యలు నిషిద్ధం కనుక సెంట్రల్ ప్రావిన్స్‌లోని నాగపూర్‌లో కాపురం పెట్టాడు. మొదటి భార్యకు తల్లికి తిండి గడవక, వేరే గతిలేక రెండో భార్య యింట్లో పనిమనిషిగా పనిచేయవలసి వచ్చింది. ఈ రచయిత సవతి తల్లి చేతిలో అవమానాలు పడ్డాడు.

క్రమేపీ భీమసేన్ తన మొదటి కుటుంబాన్ని లోకానికి తెలియకుండా చేయాలని చూశాడు. గుల్జార్ తనపై తీసిన డాక్యుమెంటరీలో వారి ప్రస్తావన రాకుండా చేశాడు. సంగీత ప్రపంచమంతా కొలిచే తన తండ్రిలో దుర్మార్గుడైన భర్త, కర్కశుడైన తండ్రి వున్నారని లోకులకు చాటి చెప్పడానికి నిశ్చయించుకుని రాసిన పుస్తకమిది. ఆ రెండో భార్య పేరు కూడా రాయలేదు. వట్టి 'ఆమె' అనే రాశాడు. అందువలన యిది శ్యామల గారి రచనకు భిన్నంగా సాగింది. ఎందుకంటే వారికి ఎదురైన అనుభవాలు కూడా భిన్నమైనవి. ఈ రచయితకు శాస్త్రీయ సంగీతం తెలుసు కానీ నిష్ణాతుడు కాడు. వేరే ఉద్యోగం చేసుకుని పైకి వచ్చాడు. ఈ పుస్తకంలో తండ్రి సంగీతప్రావణ్యం గురించి పెద్దగా ఏమీ రాయలేదు. ఒక వ్యక్తిగా భీమసేన్ ఎటువంటి వాడు అన్నదే దీని ద్వారా బయటకు వస్తుంది.

భీమసేన్ మొదటి భార్య సునంద కట్టి. అతని మేనమామ కూతురే. వాళ్లది కర్ణాటకలోని బాదామి. భీమసేన్ ఆమె యింటికి చాటుగా వచ్చి ఫేస్ క్రీమ్, టాల్కమ్ పౌడరు బహుమతులుగా యిచ్చి 'నన్ను పెళ్లి చేసుకోవా?' అని అడిగాడు. 1944లో పెళ్లయ్యాక ఆమె బావిలోంచి నీళ్లు చేదుతూంటే 'నా భార్య యిలాటి చాకిరీ చేయడమా?' అని విలవిలలాడేడు. ఆమె కూడా అతనంటే చాలా ప్రేమగా వుండేది. అతనికి టైఫాయిడ్ వస్తే దగ్గరుండి సేవ చేసి, అతని గొంతు మళ్లీ అతనికి వచ్చేట్లు చేసింది. ఓ సారి సునంద వాళ్ల సోదరి యింటికి వెళ్లి విపరీతంగా వర్షం పడడంతో ఆ రాత్రి అక్కడే వుండిపోయింది. ఆమెను చూడకుండా వుండలేని భీమసేన్ సైకిలేసుకుని బురదలోనే తొక్కుకుంటూ తెల్లవారుఝూమున 3 గం॥ఎలకు అక్కడకు చేరాడు. భార్యపై యింత ప్రేమ చూపించిన అతను ఒక నటీమణిని చూసి మోహంలో పడ్డాడు. ఉచితానుచితాలు మరచాడు. 1951లో భార్యను, ముగ్గురు పిల్లల్ని వాళ్ల కర్మానికి వాళ్లను వదిలేసి, తన భార్య నగలు తీసుకుని వుడాయించి ఆవిడ గొలుసుతోనే రెండో భార్యకు మంగళసూత్రం చేయించాడు!

సునంద సొంతంగా బతకాలని చూసి, కుదరక చివరకు భర్త పుణెలో వున్నట్లు తెలుసుకుని, అక్కడకు వెళ్లి 'మీ యింట్లో పనిమనిషి స్థానమైనా యిమ్మన'మని వేడుకుంది. అతను సరేనన్నాడు. ఇక ఆమె ఆ యింట్లోనే వుంటూ తన సవతి ప్రసవానికి సాయపడి, ఆమె ముగ్గురు పిల్లలకు ఆయాగా పనిచేసింది. కొంతకాలానికి అతనికి కచ్చేరీల ద్వారా బాగా డబ్బు రావడంతో సునంద కంటూ వేరే యిల్లు ఏర్పాటు చేశాడు. అప్పుడప్పుడు రెండో భార్యకు తెలియకుండా వచ్చి వెళ్లేవాడు. కాస్తో కూస్తో డబ్బు చేతిలో పెట్టేవాడు. పిల్లల కోసం సైకిలు, రసగుల్లాలు, బట్టలు తెచ్చేవాడు. వాళ్లని తీసుకుని తన మోటారు సైకిలు మీద, కారులోనూ ఓ రౌండు కొట్టేవాడు. కెమెరా తెచ్చి ఫోటోలు తీసేవాడు. రచయిత రాఘవేంద్రకు యివి మధురమైన బాల్యస్మృతులు. "కానీ యివి ఎప్పుడో కానీ జరిగేవి కావు. సాధారణంగా ఆయన యింటికి వచ్చినప్పుడల్లా మా అమ్మతో పోట్లాట, అరుపులు, కేకలు – యివే వుండేవి." అంటాడతను.

రెండో ఫ్యామిలీ విచ్చలవిడిగా ఖర్చు పెట్టేది. రాఘవేంద్ర, అతని తమ్ముడు స్కూలు ఫీజుల కోసం ఆ యింటికి వెళ్లి తండ్రి నడిగి, చివాట్లు తినేవారు. 'మా కంటె పనివాళ్లను బాగా చూశాడు మా నాన్న, కారణం సవతి తల్లి అసూయ, మత్సరం' అంటాడు. ఆవిడంటే భయం చేతనే మా నాన్న మాకు దూరమయ్యాడంటాడు. "మా స్థితిగతులు చూసి బాధపడినా, తను చేసిన తప్పును ఎలా సరిదిద్దుకోవాలో మా నాన్నకు తెలియలేదు. తనకు అనారోగ్యం కలిగినప్పుడు ఆ కుటుంబం ఆయనను నిర్లక్ష్యం చేసింది. అంపశయ్యపై పరుండినట్లు వుండేవాడు. మా యింటికి రమ్మనమన్నా రాలేదు. 'నా డబ్బును దోచుకున్నవారికి నా బాగోగులు పట్టించుకునే మాత్రం బాధ్యత లేదా? మంచం మీద పడ్డాక సేవలు చేయడం వారి పని కాదా?' అనేవాడు. మమ్మల్ని గుర్తించకపోవడం వలన నాకు అవమానాలు ఎదురయ్యాయి, సహించాను. కానీ యిప్పుడు మా పిల్లలకు తామెవరో చెప్పుకోవాలో లేదో తెలియటం లేదు" అన్నాడు.

మరాఠీలో రాసిన యీ పుస్తకాన్ని శిరీష్ చింద్‌హాడే ఇంగ్లీషులోకి అనువదించగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ వారు ముద్రించారు. ఘంటసాల విషయంలో రెండో కుటుంబం వెలుగులోకి రాకపోతే మొదటి కుటుంబంలోని వ్యక్తి సదవగాహనతో వారికి గుర్తింపు యిచ్చారు. భీమసేన్ విషయంలో మొదటి కుటుంబం వెలుగులోకి రాకపోతే ఆ కుటుంబ వ్యక్తి తన గురించి తనే చెప్పుకోవాల్సి వచ్చింది. ఆ క్రమంలో వెలిబుచ్చిన ఆవేదన, ఆక్రోశం సహజం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**ఏప్రిల్ 04, 05** **ఎమ్బీయస్ : మంత్రిగా లోకేశ్**

లోకేశ్ మంత్రి అయ్యారు. మంత్రి కావడానికే ఎమ్మెల్సీ అయ్యారు. ఎమ్మెల్యేగా ఎన్నికై కాబినెట్‌లోకి వచ్చి వుంటే ప్రజల కోరిక మేరకు మంత్రి అయ్యారని చెప్పుకునే వీలుండేది. కానీ ఎమ్మెల్యే కావాలంటే ఉపయెన్నిక జరపాలి. ఈయన కోసం ఎవరి చేతనైనా రాజీనామా చేయించి, ఆ స్థానంలో ఉపయెన్నిక పెడితే వైసిపి నుంచి వచ్చిన ఫిరాయింపుదారుల నియోజకవర్గాల్లో కూడా ఉపయెన్నిక పెట్టాలన్న డిమాండు రావచ్చు. ప్రతిపక్షాలు ఏమన్నా చలించని స్థితికి బాబు వచ్చారు కాబట్టి రేపు భూమా నాగిరెడ్డి ఖాళీ చేసిన స్థానంలో మాత్రమే ఎన్నిక జరిపి తక్కినవాటిని వదిలేసినా వదిలేయవచ్చు. ఏం చేసినా చెల్లుబాటు అయిపోతోంది. అందువలన లోకేశ్ కోసమే ఏదైనా ఉపయెన్నిక పెట్టినా పెట్టి వుండవచ్చు. కానీ ప్రతిపక్షాలన్నీ కక్ష కట్టి ప్రచారానికి దిగితే అనుకున్నంత మెజారిటీ రాకపోయినా చిక్కే. ఎందుకొచ్చిన రొష్టు అనుకుని ఎమ్మెల్సీ రూటు ఎంచుకున్నారు బాబు. ముఖ్యమంత్రి కొడుకు మంత్రి కావడం యీ మధ్య వింతగా తోచటం లేదు. పంజాబ్‌లో చూశాం, తెలంగాణలో చూశాం, యిప్పుడు ఆంధ్రప్రదేశ్. కాంగ్రెసు నడిపిన వారసత్వపు రాజకీయాలను తీవ్రంగా విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలన్నీ వారసత్వపు రాజకీయాలే నడుపుతున్నాయి. వాటిలో తెలుగుదేశం కూడా వుంది అనుకుని నోరు చప్పరించి వూరుకోవడమే. బాలకృష్ణ హీరోగా టాప్ రేంజ్‌లో వుండగా అతని రాజకీయ సభలకు విపరీతంగా జనం రావడం చూసిన ఎన్టీయార్ మురిసిపోయి 'నా వారసుడు బాలకృష్ణే' అని ఆవేశంలో ప్రకటించేస్తే చంద్రబాబు 'ఇది విమర్శలకు దారి తీస్తుంది' అని నచ్చచెప్పి, పట్టుబట్టి ఆ స్టేటుమెంటు విత్‌డ్రా చేయించారు. అలాటి బాబు యిప్పుడు తన దగ్గరకు వచ్చేసరికి కొడుకుని ఎమ్మెల్సీ దారిలో మంత్రిగా చేయడమేమిటి అని ఆశ్చర్యపడడమూ అనవసరమే! బాలకృష్ణ ఎన్టీయార్ కొడుకు, లోకేశ్ 'నిప్పు' మార్కు బాబు కొడుకు!

వారసత్వ రాజకీయాల గురించి ఆదర్శాలు వల్లించి, లోకేశ్ మంత్రి కావడాన్ని నిరసించేవారిలో నేను చేరను. దాన్ని నేటి వాస్తవంగా గుర్తిస్తున్నాను. కాంగ్రెసులో వారసత్వం అనగానే నెహ్రూ కుటుంబం స్ఫురిస్తుంది కానీ చాలామంది కాంగ్రెసు నాయకులు వారి సంతానాన్ని రాజకీయాల్లోకి తెచ్చారు. సత్తా వుండి నిలదొక్కుకున్నవారు నిలదొక్కుకున్నారు, తక్కినవారు తప్పుకున్నారు. ఇక ప్రాంతీయ పార్టీలైతే కుటుంబ పార్టీలుగానే నడుస్తున్నాయి. ఇతర జాతీయ పార్టీల్లో కమ్యూనిస్టులు వారసుల్ని తీసుకురారు. బిజెపిలో కూడా మొన్నటిదాకా లేదు. ఇటీవల వారసులకు టిక్కెట్లు యిప్పించుకుంటున్నారు. ఎవరైనా నాయకుడు చనిపోతే సానుభూతి ఓట్ల కోసం అతని భార్యకు లేదా యితర కుటుంబసభ్యులకు టిక్కెట్లు యివ్వడం దాదాపు అన్ని పార్టీలు చేస్తున్నాయి. ఇలాటి పరిస్థితుల్లో ప్రత్యేకంగా ఎవర్నీ ఎత్తి చూపలేం. ఒక విషయం మాత్రం మనం ఒప్పుకుని తీరాలి. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ వారసత్వం ప్రవేశానికి మాత్రమే ఉపయోగపడుతుంది. తొలి దశలో పరాజయాలు కలిగినా నిలదొక్కుకోవడానికి ఉపకరిస్తుంది. కానీ చాలాకాలం నిలవాలంటే ప్రజామోదం వుండి తీరాలి. కాస్త ఆలస్యంగానైనా తన ప్రతిభాపాటవాలు చూపించగలిగితేనే వారసులు నిలుస్తారు. ఇప్పుడు లోకేశ్ పార్టీ యూత్ వింగ్‌లో తర్ఫీదై వచ్చారనుకోవాలి. ఇక పాలనలో తర్ఫీదు పొందాలి.

బాబు చాలా నీతులు వల్లిస్తారు కాబట్టి తన కుటుంబసభ్యుణ్ని రాజకీయాల్లోకి తీసుకురారని నమ్మి, తర్వాత కంగు తిన్నవారూ వున్నవారు. ఆయన స్థానంలో మనం వున్నపుడే ఆయన యిక్కట్లు తెలుస్తాయి. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చారు, అదీ అర్ధరాష్ట్రంలో. పైగా ఏ వసతులూ లేని, కేంద్ర నుంచి కానీ, పొరుగు రాష్ట్రం నుంచి కానీ సహాయసహకారాలు అందని కొత్త రాష్ట్రం. ఎన్నికలకు యింకో రెండేళ్లు మాత్రమే వున్నాయి. బ్రోషర్ల ద్వారా ప్రజల్ని ఊరించడమే తప్ప ప్రభుత్వం యిప్పటిదాకా సాధించినది ఏమీ లేదు. ఏదో ఒకటి చేసి చూపించాలి. ఆ ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓ పక్కన పార్టీ కూడా చూసుకోవాలి. పార్టీలో ద్వితీయశ్రేణి నాయకత్వం లేదు. అన్నీ తనే చూసుకోవాలి. ఇటు ప్రభుత్వంలోనూ అంతే. ఏదైనా కాన్ఫరెన్సు పెడితే దాని లోగో దగ్గర్నుంచి తనే ఫైనలైజ్ చేయాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులను తిట్టినా, కొట్టినా తనే మధ్యస్తం చేయాలి. ఎవరికీ అప్పగించడానికి లేదు. జాతీయ స్థాయి వ్యవహారాలు పట్టించుకోవడం మానేశారు కానీ లేకపోతే ఆ భారమూ వుండేది. ఇవన్నీ ఒంటి చేతిమీద నడపడం చాలా కష్టం. ఆరోగ్యాన్ని ఎంత బాగా చూసుకున్నా, వయసు దాని ప్రభావాన్ని అది చూపిస్తూనే వుంటుంది. చటుక్కున ఎప్పుడో దెబ్బ కొట్టవచ్చు.

పాలకులకు వున్న పెద్ద యిబ్బంది అనారోగ్యాన్ని దాచుకోవాలి. ఒంట్లో నలతగా వున్నట్లు బయటకు పొక్కినా, వెంటనే పార్టీలో గ్రూపులు తయారై పోతాయి. కొంతమంది అటూ, కొంతమంది యిటూ, కొంతమంది అటూయిటూ...! ఆశావహులు జాతకాలు చూపించేసుకుంటూ వుంటారు. శూన్యం ఏర్పడితే అన్నివిధాలా సమర్థుడైన నాయకుడు అంటూ అనుకూల మీడియాలో వ్యాసాలు రాయించేసుకుంటారు. పెద్ద గందరగోళం ఏర్పడిపోతుంది. ముఖ్యమంత్రి తిరిగి వచ్చాకనే, నాయకుడెవరో తేలాకనే పని చేద్దాంలే

యీ లోపున నిర్ణయాలు తీసుకుంటే చివాట్లు తినాల్సి వస్తుంది అనుకుని అధికారగణం నిదానిస్తారు. పాలన పడకేస్తుంది. అందువలననే ముఖ్యమంత్రులు ఓ పట్టాన ఆసుపత్రిలో చేరరు. ఇంటి వద్దే వైద్యం చేయించుకుంటారు. రొటీన్ చెకప్ అని చెప్పుకుంటారు. ఒక్కోప్పుడు తాత్సారం జరిగి, జయలలిత కేసులో లాగ అడ్డం తిరుగుతుంది. జయలలిత మరణం ఆమెకే కాదు, ఆమె పార్టీకే విషాదాన్ని తెచ్చిపెట్టింది. ఆమె ఎవర్నీ వారసులుగా ప్రకటించకపోవడంతో ఎవరికి వారే తాము వారసులమంటూ తయారయ్యారు. పార్టీ చీలింది. ప్రభుత్వం అయోమయంలో పడింది. అదే కనక డిఎంకెలో జరిగి వుంటే, యింత గందరగోళం వుండేది కాదు. ఎందుకంటే అక్కడ వారసుడెవరో అందరికీ తెలుసు.

మృత్యువు రకరకాలుగా వస్తుంది. జబ్బు పడి, మంచం మీద పడి, పార్టీ నాయకులందరినీ పిలిచి 'ఇదిగో ఫలానావాడే నా వారసుడు, మీరంతా జీహుజూర్ అనాలి మరి' అని చెప్పే సావకాశం వుండకపోవచ్చు. హఠాత్తుగా గుండెపోటు రావచ్చు, యాక్సిడెంటు జరగవచ్చు. హత్యకు గురి కావచ్చు. మామూలు వ్యక్తి అయితే వీలునామా రాసే ముందే పోతే, వారసులంతా కూర్చుని చర్చించుకుని ఎవరి వాటాలు వారు తేల్చుకుంటారు. కొన్ని సందర్భాల్లో కోర్టుకి వెళతారు. కానీ పార్టీ వ్యవహారాల్లో అలా వుండదు. ఆలస్యమైన కొద్దీ ఆశావహులు పెరుగుతారు. అందువలన చావు సంభవించగానే ఓ పట్టాన ప్రకటించరు. మొఘల్ చక్రవర్తుల విషయాల్లో యిలా జరిగేవని విన్నాం. ఫరూక్ అబ్దుల్లా విషయంలో చూశాం. ఇందిర హత్య జరగ్గానే ప్రణబ్ తనే ఆపద్ధర్మ ప్రధాని అవుతానని ఆశించారని, అందుకే రాజీవ్ ఆయనపై పగబట్టారని చెప్పుకుంటారు. ఆయన లాటి సీనియర్ కాంగ్రెసు నాయకులు ముందుకు వస్తారేమోనన్న భయంతో ఇందిర శవం అక్కడ వుండగానే రాజీవ్‌ను ప్రధానిని చేసేశారు. ఎన్టీయార్ మరణానికి ముందే ఆయన నుంచి బాబు అధికారం లాగేసుకున్నారు కాబట్టి అధికారం ఎవరిది అనే సమస్య రాలేదు. అలా జరగకుండా పదవిలో వుండగానే ఎన్టీయార్ పోయారనుకోండి, ఏం జరిగేదో వూహించండి. లక్ష్మీపార్వతి వర్గం, చంద్రబాబు వర్గం, మధ్యలో మధ్యేమార్గంగా హరికృష్ణ... యిలా అందరూ పోటీ పడేవారు. ఎవరు నెగ్గినా, పార్టీ మాత్రం చీలికవాలికలయ్యేది. ఇలాటి డ్రామాలు అనేకం జరుగుతాయి కాబట్టి అధికారంలో వున్న పార్టీ నాయకుడు తన వారసుణ్ని ముందే ప్రకటించి పెట్టుకుంటే అధికార బదిలీ సజావుగా సాగుతుంది. ఇది ప్రజాస్వామ్య పద్ధతి కాదు, నాయకుడు లేనప్పుడు తక్కినవారందరూ సమావేశమై, తమలో ఎవరికి ఎక్కువ ఆమోదయోగ్యుడున్నాడో వాణ్ని నాయకుడిగా ఎన్నుకోవాలి – అని సుద్దులు చెప్పవచ్చు. మన దగ్గర ప్రజాస్వామ్యం నడవటం లేదు. అంతా రాజరికమే. అన్నీ హైకమాండ్ నిర్ణయాలే. పార్టీలో సంస్థాపరమైన ఎన్నికలు జరగటం లేదు. అధికభాగం కాంట్రాక్టులు నామినేషన్లే, పార్టీ పదవులూ నామినేషన్లే. జిల్లా స్థాయిలో ఏకవాక్య తీర్మానం – 'నాయకుడి ఎన్నికను అధిష్టానం నిర్ణయానికి వదిలేస్తున్నాం' అని. ప్రస్తుతం దేశం మొత్తం ఏకవ్యక్తి పాలనపై నడుస్తోంది. మంచి జరిగినా, చెడు జరిగినా అతడినే బాధ్యుణ్ని చేయవలసి వస్తోంది. అలాటప్పుడు ఒక రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలో ప్రజాస్వామ్యం వుండాలని ఎలా ఆశిస్తాం?

చంద్రబాబుగారు ఆరోగ్యవంతుడు. ఓపికమంతుడు. అనేక విషయాలు క్షుణ్ణంగా తెలిసినవాడు. ఆయనకు యిప్పట్లో ఏ అనారోగ్యమూ రాదనే ఆశిద్దాం. కానీ తన పనిభారం తగ్గించుకోవడానికైనా, కనీసం పంచుకోవడానికైనా ఒక ద్వితీయ శ్రేణి నాయకుడిని తయారు చేయవలసిన అవసరం వుంది. దుపున పుట్టినవాడైనంత మాత్రాన లోకేశ్ ఆటోమెటిక్‌గా అన్ని గుణాలూ పుణికి పుచ్చుకోడు. అతనికి తర్ఫీదు అవసరం. ఇప్పటికే పార్టీ ఆఫీసులో వుండి వ్యవహారాలు చక్కబెడుతున్నాడు. కొన్ని విషయాలలో మంచి సలహాలు యిస్తున్నాడు అని చెప్పుకుంటే సరిపోదు. బాక్‌సీట్ డ్రైవింగ్ వేరు ఫ్రంట్ సీట్ డ్రైవింగ్ వేరు. మంత్రిగా, అధికారులతో ఎలా వ్యవహరించాలి, ఎప్పుడు కసరాలి, ఎప్పుడు మెచ్చాలి, ప్రజాదర్బారులో ప్రజల ప్రశ్నలు ఎలా ఎదుర్కోవాలి వంటివి అనుభవం మీదనే అలవడుతాయి. లోకేశ్ యిప్పటిదాకా ఎమ్మెల్యే కూడా కాదు. సాధారణ ప్రజలను ఎప్పుడూ ఎదుర్కోలేదు. పార్టీ సమావేశాల్లో మాట్లాడారుగా అంటే అక్కడ అందరూ జై కొట్టేవారే! ప్రజల్లో తన పార్టీ వారే కాదు, అన్ని పార్టీల అభిమానులూ వుంటారు. ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయి. తన శాఖలో తనకు తెలిసో, తెలియకుండానే అక్రమాలు జరుగుతాయి. అవి మీడియాకు పొక్కకుండా చూసుకోవడం, పొక్కితే ఏమీ జరగలేదని బుకాయించడం, వీలు కాకపోతే దోషులెవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని హుంకరించడం.. అన్నీ నేర్చుకోవాలి. స్టార్‌సన్స్ లాగనే లోకేశ్‌కు కూడా ఒక యిబ్బంది వుంది. ప్రతీదీ తండ్రితో పోల్చి పెదవి విరుస్తూంటారు. ఆయన వేరే, యీయన వేరే అని గ్రహించరు. లోకేశ్ తండ్రి భుజాల వరకైనా ఎదగాలి. లేకపోతే వ్యతిరేక వ్యాఖ్యలు వస్తూంటాయి.

అది చాలనట్లు కెటిఆర్‌తో పోలిక ఒకటి వచ్చిపడింది. కెసియార్, కొడుకు కెటియార్‌కు ఐటీ, పంచాయితీ రాజ్ యిచ్చారు కదాని కాబోలు బాబు కూడా అవే శాఖలు కొడుక్కి యిచ్చారు. కెటియార్‌తో ఓ స్థాయి వరకైనా పోటీ పడకపోతే లోకేశ్ విమర్శలకు గురవుతాడు. ఏ మాట కా మాట చెప్పాలంటే కెటియార్‌కి మంచి వాగ్ధాటి వుంది. ఇంగ్లీషు, తెలుగు, హిందీలలో అనర్గళంగా, మేధావులను సైతం మెప్పించేట్లు మాట్లాడగలడు. బహిరంగ సభలో ఆవేశంగా మాట్లాడతాడు, కాన్ఫరెన్సుల్లో సంయమనంతో మాట్లాడతాడు. బిజినెస్ మాగ్నెట్స్‌తో సమావేశమైనప్పుడు సూటులో హుందాగా కనబడతాడు. లోకేశ్‌లో యింత వాక్చాతుర్యం వుందో లేదో నాకు తెలియదు. నేనెప్పుడూ గమనించలేదు. అతను చేసిన ట్వీట్లే చదివాను. కానీ ట్వీట్లు అతని తరఫున మీడియా ఎడ్వయిజర్ కూడా చేసి వుండవచ్చు. సభల్లో, చర్చల్లో చమత్కారం ప్రదర్శించినపుడే మనకు నమ్మకం చిక్కుతుంది. లోకేశ్ ఉపన్యాస కళలో తప్పకుండా మెరుగు పరుచుకోవాలి. ఆకారం విషయంలో కూడా తను జాగ్రత్తపడాలని లోకేశే చెప్పుకున్నారు. 'నేను మా తాతగారి (ఎన్టీయార్)లా భోజనప్రియుణ్ని.' అని సంజాయిషీ యిచ్చుకున్నారు. లోకేశ్ వయసులో ఎన్టీయార్ నాజూగ్గానే వున్నారు.

''మాయాబజార్''లో వేసేనాటికి ఎన్టీయార్‌కు 35. ఇప్పుడు లోకేశ్‌కు 34. తండ్రి చంద్రబాబు ఐతే చెప్పనే అక్కరలేదు. ఇప్పటికీ చువ్వలా వుంటారు. 67 యేళ్ల వృద్ధుడు అనబుద్ధి కాదు. ఇటు పోటీదారు కెటియార్ చూస్తే లోకేశ్ కంటె ఏడేళ్లు పెద్దవాడైనా చాలా గ్లేమరస్‌గా వుంటాడు. 'నన్ను కెటియార్‌తో, జగన్‌తో పోల్చకండి. నేను వారి కంటె చిన్నవాణ్ని, వారి కున్నంత అనుభవం నాకు లేదు' అని లోకేశ్ చెప్పుకున్నారు. అనుభవం మాట తర్వాత, చిన్నవాడైనపుడు వాళ్ల కంటె స్మార్ట్‌గా కనబడాలి కదా. లోకేశ్ కుటుంబంలో తల్లి, తండ్రి, భార్య ఎవరూ స్థూలకాయులు కారు. వారిని చూసి యిన్స్పయిర్ కావాలి. ఇంట్లో వున్నపుడు ఎలా వున్నా ఫర్వాలేదు. పబ్లిక్‌లోకి వచ్చినపుడు ఎప్పియరెన్స్ చాలా ముఖ్యం. లోకేశ్ తన శాఖను ఎంత బాగా చేస్తారో ముందుముందు తెలుస్తుంది. ఐటీ విషయంలో అన్ని సౌకర్యాలూ యిప్పటికే వున్న హైదరాబాదుతో పోటీ పడడమంటే మాటలు కాదు. అది చాలా పెద్ద ఛాలెంజ్. పంచాయితీ రాజ్ శాఖలో తన అధికార వికేంద్రీకరణ లాటివి చేపట్టి తన పాటవం చూపించవచ్చు.

లోకేశ్ అన్నీ చక్కగా నేర్చుకుని, దక్షత గల మంత్రిగా తయారవ్వాలని కోరుకోవడంలో నా స్వార్థం ఏమీ లేదు. ప్రస్తుతం ఆంధ్రలో టిడిపి ప్రభుత్వం వుంది. పరిపాలన అస్తవ్యస్తంగా ఉన్నా 2019లో కూడా మళ్లీ టిడిపియే గెలిచేట్లు వుంది. ప్రతిపక్ష నాయకుడు జగన్ ప్రజాగ్రహాన్ని సరిగ్గా వ్యక్తీకరించలేక పోతున్నాడు. మంచి నాయకులను తన వద్ద నిలుపుకోలేక పోతున్నాడు. తెలంగాణలో టిపిడి దెబ్బ తిన్నంతగా, ఆంధ్రలో వైసిపి దెబ్బ తినలేదు కానీ, అధికారంలోకి వచ్చేటంత సత్తా కనబడటం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కడప జిల్లాలో సైతం గెలవకపోవడం కార్యకర్తలకు జగన్ పై నమ్మకాన్ని చెదరగొడుతోంది. జగన్‌కు తండ్రి నుంచి వాక్చాతుర్యం, చమత్కారం అబ్బలేదు. మాటల్లో ఆవేశం, ప్రవర్తనలో దూకుడు ప్రదర్శితమౌతున్నాయి. అనవసర వ్యాఖ్యలతో వివాదాలతో చిక్కుకుంటున్నాడు. అసలే మీడియా ప్రతికూలం. అవకాశం దొరికితే అతన్ని విలన్‌గా చూపుతున్నారు. లోకంలో ఏ అనర్థం జరిగినా దాన్ని జగన్‌కు ముడిపెట్టి మాట్లాడుతున్నారు. ఇలాటి పరిస్థితుల్లో 2019లో అతన్ని బాబుకి ప్రత్యామ్నాయంగా ఓటర్లు పరిగణిస్తారా అన్నది ప్రశ్నార్థకమే. ఇక కాంగ్రెసు 2019 నాటికి ఏ మేరకు కోలుకుంటుందో ఎవరికీ తెలియదు. కాంగ్రెసు అధిష్టానమే మన్ను తిన్న పాములా పడి వుంది. ఇక బిజెపి, టిడిపితో అధికారం పంచుకోవడం వలన, రాష్ట్రానికి తగినంత సాయం చేయకపోవడం వలన ప్రజల అభిమానాన్ని చూరగొనటం లేదు. ఒకవేళ విడిగా పోటీ చేసినా పెద్దగా సీట్లు గెలిచే పరిస్థితి లేదు. అనేక జిల్లాలలో దానికి శాఖలే కనబడటం లేదు. వాళ్లు ప్రజల్లో తిరిగే కార్యక్రమాలు చేపట్టటం లేదు. ఈ పరిస్థితుల్లో టిడిపి 2019 తర్వాత కూడా పాలిస్తుందని అనుకోవచ్చు. అప్పటికి బాబుకి 69 ఏళ్లు వుంటాయి. 1995లో ఆయన చొరవ, ముందు చూపు పాతికేళ్ల తర్వాత కూడా అలాగే వుంటాయని అనుకోలేము. ఓటమి ఆయన ఆలోచనావిధానంలో చాలా మార్పు తెచ్చింది. అప్పుడు లేని చాదస్తాలు యిప్పుడాయనను చుట్టుముట్టాయి. ఓపిక తగ్గో, వారసుణ్ని తీర్చిదిద్దుదామనో, ఆయన 36 ఏళ్ల లోకేశ్‌ను ఉపముఖ్యమంత్రిగానో, ముఖ్యమంత్రిగానో కూర్చోబెట్టవచ్చు. అందువలన లోకేశ్ ఎంత సమర్థుడైతే ఆంధ్ర ప్రజలకు అంత మంచిది. ఆంధ్ర ప్రజల మేలు కోరే లోకేశ్ ప్రతిభాపాటవాలు పెరగాలని ఆశిస్తున్నాను. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**ఏప్రిల్ 06** **ఎమ్బీయస్ : వికిలీక్స్ అసాంజే అదృష్టం**

వికిలీక్స్ స్థాపకుడు జూలియన్ అసాంజేపై పాశ్చాత్య దేశాలన్నీ పగబెట్టాయి. వింత కేసు ఏదో పెట్టిన స్వీడన్ అతన్ని ఎలాగైనా బందీ చేయాలని చూస్తోంది. లాటిన్ అమెరికాలోని ఈక్వడార్ దేశాన్ని పాలించే సోషలిస్టు అధ్యక్షుడు రాఫెల్ కారియా అతనికి లండన్‌లోని తమ దౌత్యకార్యాలయంలో ఆశ్రయం కల్పించాడు. కారియా పదేళ్ల పాలన ముగిసి, ఎన్నికలు ప్రకటించారు. కారియా వద్ద ఉపాధ్యక్షుడిగా పనిచేసిన లెనిన్ మొరెనో, రైటిస్టు భావాలు కల గిలెర్మో లాసో అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. అనేక అంశాలతో బాటు అసాంజే అంశం కూడా ఎన్నికలలో చర్చకు వచ్చింది. తను నెగ్గితే అసాంజేను లండన్‌లోని తమ ఎంబసీ నుంచి తరిమివేస్తానన్నాడు లాసో. కొనసాగిస్తానన్నాడు మొరెనో. ఒకప్పుడు వామపక్షాల నాదరించిన లాటిన్ అమెరికాలో కమ్యూనిస్టు, సోషలిస్టు ప్రభుత్వాలు అవినీతి, అసమర్థతలలో మునిగి పోవడంతో, పైగా ఆర్థికమాంద్యం ఏర్పడడంతో విసిగిన ప్రజలు గత పదేళ్లగా వెనెజులా, పెరు, అర్జంటీనా, బొలీవియాలలో రైటిస్టు పార్టీలను గెలిపించసాగారు. బ్రెజిల్ అధ్యక్షురాలు సోషలిస్టు దిల్మాను అభిశంసించి దింపేశారు. ఈక్వడార్ కూడా ఆ దారి పడితే అసాంజే వీధిన పడాలి. అందువలన కోటీ అరవై లక్షల మంది ఓటర్లు పాల్గొనే ఈక్వడార్ ఎన్నికల ఫలితాలు అతనికి కీలకమయ్యాయి.

పోటీ పడిన యిద్దరు అభ్యర్థులలో మొరెనో కారియాకు అనుచరుడు. కారియా చాలా తీవ్రభావాలున్న సోషలిస్టు. అతనికి ముందు దేశాన్ని ఏలిన అధ్యక్షుడు జమీల్ మహువాద్ హయాంలో బ్యాంకింగ్ సంక్షోభం సంభవించింది. జమీల్ దేశాన్ని అమెరికన్ డాలర్ వైపు నడిపించి దేశపు కరెన్సీని నాశనం చేశాడు. దీని వలన 15 లక్షల మంది దేశాన్ని విడిచి వలస పోవలసి వచ్చింది. దేశం విదేశాలకు ఋణగ్రస్తురాలై పోయింది. ఆ దశలో అధికారానికి వచ్చిన కారియా ఈ విదేశీ అప్పును అనైతికంగా ప్రకటించి ఎగ్గొట్టేసినట్లు ప్రకటించాడు. ''సిటిజన్స్ రివల్యూషన్'' పేర ప్రభుత్వరంగానికి పెద్ద పీట వేశాడు. ప్రభుత్వధనాన్ని పేదల విద్య, గృహవసతి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మళ్లించాడు. కొత్త రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విధంగా దేశాన్ని పేదరికం నుంచి బయటకు లాగాడు. అయితే యీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో అవినీతి జరిగినట్లు కూడా ఆరోపణలున్నాయి. పెట్రోలు ధరలు తగ్గడంతో ఆర్థికంగా ఒత్తిడి

పడసాగింది. కొన్ని కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. తనపై విమర్శలు వచ్చినపుడు కారియా తీవ్రంగా స్పందిస్తాడు. ఎత్తి చూపిన జర్నలిస్టులపై కేసులు పెడతాడు. అతని వద్ద ఉపాధ్యక్షుడిగా పనిచేసిన మొరెనో తన గురువు కారియాలా మొరటువాడు కాదు. సాత్వికుడు. సరదా మనిషి. 1990లో ఒక దోపిడీలో అతను గాయపడడం వలన చక్రాలకుర్చీలో తిరుగుతాడు. కారియా తలపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రధాన పాత్ర వహించాడు. తను ఎన్నికైతే కారియా విధానాలను ముందుకు తీసుకుని వెళతానని వాగ్దానం చేస్తున్నాడు.

అతనికి ప్రత్యర్థిగా నిలిచిన లాసో ఒక బ్యాంకర్. జమీల్ హయాంలో బ్యాంకింగ్ శాఖ చూశాడు. ఆనాటి బ్యాంకింగ్ సంక్షోభానికి కారకుడిగా అతన్ని విమర్శిస్తారు. 2013లో కారియాతో పోటీ పడి పెద్ద మార్జిన్‌తో ఓడిపోయాడు. ఇటీవల ఒక అర్జంటీనా పత్రిక అతను ఆ సంక్షోభ సమయంలో విపరీతంగా డబ్బు సంపాదించి విదేశాల్లో దాచుకున్నాడని ఆరోపించింది. లాసో ఆ ఆరోపణను తిరస్కరించాడు. అతనివి రైటిస్టు భావాలు. తను ఎన్నికైతే ప్రభుత్వరంగంలోని ఉద్యోగాలను, సంక్షేమ పథకాలను తగ్గించేస్తాను, అంతేకాదు వ్యాపారస్తులకు, ధనికులకు పన్నులు తగ్గిస్తాను అన్నాడు. అయినా అతనికీ ప్రజాదరణ లభించింది. ఫిబ్రవరిలో ఫస్ట్ రౌండ్ ఓటులో మొరెనోకు 39% రాగా లాసోకు 28% వచ్చాయి. మార్చి ఎగ్జిట్ పోల్స్‌లో యిద్దరు అభ్యర్థులకూ దాదాపు సమానంగా ఓట్లు వచ్చాయి. నాదే గెలుపు అంటే నాదే గెలుపు అని యిద్దరూ చెప్పుకున్నారు. కానీ జిల్లాలలో కౌంటింగ్ జరిగాక నేషనల్ ఎలెక్టొరల్ కౌన్సిల్ '97% కౌంటింగ్ పూర్తయింది. ఇప్పటివరకు మొరెనోకు 51.12%, లాసోకు 48.88% ఓట్లు వచ్చాయి.' అని ప్రకటించింది. అంటే మొరెనో నెగ్గినట్లే అన్నమాట.

ఈ ఫలితాలను నేను ఒప్పుకోను అన్నాడు లాసో. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అతని అనుచరులు అనేక చోట్ల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అవి అలా జరుగుతూండగానే మొరెనో విజయోత్సవం జరిపేసుకున్నాడు. దానిలో పాటలు పాడాడు కూడా. నిష్పక్షపాతానికి పేరుబడిన ఒక స్వతంత్ర సంస్థ ఎన్నికల వాచ్‌డాగ్‌గా పనిచేసి యిద్దరు అభ్యర్థుల మధ్య 0.6% ఓట్ల తేడా వుంది అంది. ఎవరికి ఎక్కువో మాత్రం చెప్పనంది. పెట్రోలు ధరలు తగ్గి ఆదాయం దెబ్బతిని, యీ ఏడాది ఆర్థిక వ్యవస్థ 2.7% కుంచించుకుపోతుందని అంచనాలున్న యీ తరుణంలో మొరెనో ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేర్చగలడో తెలియదు కానీ అసాంజె మాత్రం మహా ఖుషీగా వున్నాడు – అతను గూడు చెక్కు చెదరలేదు కాబట్టి! ఫలితాలు రాగానే "లాసో ఈక్వడార్‌ను 30 రోజుల్లో వదిలి వెళ్లాలని కోరుతున్నాను. వెళ్లేటప్పుడు అతని విదేశీ నిధులను వెంటపెట్టుకుని వెళతాడో లేదో అతని యిష్టం." అని వెక్కిరిస్తూ ట్వీట్ చేశాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017) (ఫోటో – ఈక్వడార్ ఎన్నికలో నెగ్గిన లెనిన్ మొరెనో, అసాంజెతో)**

## ఏప్రిల్ 07, 08 ఎమ్బీయస్ : సోషల్ మీడియాలో బోగస్ న్యూస్‌పై ఫేస్‌బుక్ పోరాటం

సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చిపడుతున్నాయి. దేన్ని నమ్మాలో, దేన్ని నమ్మకూడదో తెలియని అవస్థ వచ్చి పడింది. దీని వలన జర్నలిజానికే ముప్పు వచ్చే పరిస్థితి వచ్చింది. ఇటీవల జరిగిన అమెరికన్ ఎన్నికలలో అనేక అబద్ధపు వార్తలు చలామణీలోకి వచ్చి ఓటర్లను ప్రభావితం చేశాయి. ఇప్పుడు యూరోప్‌లో ఎన్నికలకు సిద్ధమవుతున్న దేశాల్లో కూడా అదే పరిస్థితి. ఎవరికి తోచినట్లు వాళ్లు కట్టుకథలల్లేసి దాన్నే వాస్తవాలుగా ప్రచారం చేసేస్తున్నారు. సామాన్య పౌరుడికి ఏది నిజమైన వార్తో, ఏది మిస్‌ఇన్ఫర్మేషనో ఎలా తెలుస్తుంది? ఈ సమస్యను పరిష్కరించడానికి, వార్తల నాణ్యత పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా టెక్నికల్ ఇండస్ట్రీ పెద్దలు, ఎకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్, జర్నలిస్టు సంఘాలు "ద న్యూస్ ఇంటెగ్రిటీ ఇనీషియేటివ్" పేర 14 మిలియన్ డాలర్ల పెట్టుబడితో నడుం బిగించాయి. ఫేస్‌బుక్, ఫోర్డ్ ఫౌండేషన్, మొజిల్లా వంటి సంస్థలు నిధులివ్వడానికి ముందుకు వచ్చాయి.

అబద్ధపు వార్తలను గుర్తుపట్టి వాటిని మొగ్గలోనే తుంచేయడం అన్ని సందర్భాల్లో జరగదు. కానీ నాలుగు రోజుల క్రితం సింగపూర్ కోర్టు యిచ్చిన తీర్పు గమనిస్తే తలచుకుంటే ఏదీ అసాధ్యం కాదనిపిస్తుంది. నల్లా మొహమ్మద్ అబ్దుల్ మాలిక్ అనే ముస్లిం మతగురువు తమిళనాడుకి చెందినవాడు. 2010లో సింగపూర్‌కు వర్క్ పర్మిట్‌పై వెళ్లి అక్కడ జామే చూలియా మసీదులో చీఫ్ ఇమామ్‌గా పనిచేయసాగాడు. ఏడేళ్లగా అతని మీద ఫిర్యాదు లేవీ రాలేదు కానీ ఈ జనవరి 6 న అతను శుక్రవారపు ప్రార్థనల సమయంలో యిచ్చిన ఉపన్యాసంపై సింగపూర్ ప్రభుత్వం కేసు పెట్టింది. కురాన్ సూక్తులు చెప్తున్నానంటూ అతను 'యూదులు, క్రైస్తవులకు వ్యతిరేకంగా మాకు సాయం చేయి' అని అరబిక్‌లో ఓ మంత్రం చదివాడు. ఆ ఉపన్యాసం వీడియోను ఒకతను ఆన్‌లైన్‌లో పెట్టాడు. సింగపూర్ యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసే మరొకతను ఫేస్‌బుక్‌లో పెట్టాడు. దానిపై విమర్శలు రావడంతో ప్రభుత్వంలోని హోం శాఖ అతన్ని కోర్టుకి రప్పించింది. బోనులో నిలబెట్టేసరికి మాలిక్ 'అది కురాన్‌లో లేదు. ఇండియాలో మా వూళ్లో ఒక పాత పుస్తకంలో చదివాను. విదేశంలో వున్నపుడు అలాటివి ఉటంకించి, యిక్కడి మతసామరస్యానికి భంగం కలిగించకూడదు. నేను చేసినది తప్పే.' అని అతను రాతపూర్వకంగా క్షమాపణ రాసి యిచ్చాడు. కోర్టు అతనికి 4 వేల సింగపూరు డాలర్ల జరిమానా విధించడంతో బాటు ఇండియాకు తిప్పి పంపేసింది. అంతేకాదు, ఆ ఉపన్యాసాన్ని ఆన్‌లైన్‌లో, ఫేస్‌బుక్‌లో పెట్టినవారికి గట్టి వార్నింగులు యిచ్చింది. గట్టిగా నిలదీయకపోయి వుంటే నిజం ఎప్పటికీ బయటకు వచ్చేది కాదు.

కురాన్ పేర ఆ సూక్తి చలామణీ అయిపోయేది.

మన దగ్గర యిటీవల ఒక వాట్సప్ మెసేజి షికార్లు చేస్తోంది – టాల్‌స్టాయ్, హెర్బర్ట్ వెల్స్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, హ్యూస్టన్ స్మిత్, నోస్ట్రాడమస్, బెర్‌ట్రండ్ రస్సెల్, గోస్టా లోబోన్, బెర్నార్డ్ షా, జోహాన్ గీత్ వంటి పాశ్చాత్య వేదాంతుల కొటేషన్స్ అంటూ. వాటిల్లో హిందూత్వ గొప్పదని, హిందూమతం ఒకనాటికి ప్రపంచాన్ని ఏలుతుందని చెప్పినట్లు రాసేశారు. నిజానికి యీ ఫిలాసఫర్లలో చాలామంది పేర్లు మనకు తెలియవు. వాళ్లు మన మతాన్ని మెచ్చుకుంటున్నారంటే ఓహో అని సంతోషిస్తాం. అయితే హిందూ అనడంతో సరిపెట్టకుండా, హిందూత్వ (అతివాద హిందూయిజం అనే అర్థంలో దీన్ని వాడుతున్నారు)ని కూడా మెచ్చుకున్నారేమిటా అని ఆశ్చర్యపడతాం. వాళ్లు నిజంగా అన్నారో లేదో వెతికే పని పెట్టుకోము. అలా పని పెట్టుకున్నవారు బయటపెట్టినదేమిటంటే 'హిందూత్వ' పదం మొదటగా వాడినది వీర సావర్కార్‌ట. 1923లో వెలువరించిన "ఎస్సెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ" అనే కరపత్రంలో మొదటిసారి ఆ పదాన్ని కల్పించాడట. మరి యీ వాట్సప్‌లో హిందూత్వ పదాన్ని వాడిన టాల్‌స్టాయ్ 1910లో చచ్చిపోయాడు. నోస్ట్రాడమస్ 1566లో చచ్చిపోయాడు. అంటే యీ కొటేషన్స్ పూర్తిగానో, సగమో అబద్ధాలయి వుంటాయి. ఇంకో తమాషా ఏమిటంటే ఇస్లామిస్టులు వీళ్ల పేర్లతోనే యివే కొటేషన్స్ చలామణీ చేస్తున్నారట. వాటిల్లో హిందూమతం ఒకనాటికి ప్రపంచానికి ఏలుతుంది అనే మాట స్థానంలో ఇస్లాం, షరియా ఒకనాటికి ప్రపంచాన్ని ఏలుతుంది అని వుందిట!

నాకీ వాట్సప్ పంపిన మిత్రుణ్ని ఏమిటి స్వామీ హిందూత్వ పదం అప్పుడెప్పుడుంది? అని అడిగాను. 'మన హిందువులను అందరూ అణగదొక్కుతున్నారండీ' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. 'అది వేరే సబ్జక్ట్. మహానుభావులను మిస్‌కోట్ చేసే అధికారం మనకు ఎవరిచ్చారని నా ప్రశ్న.' అన్నాను. 'అది కోటో, మిస్‌కోటో మనకెలా తెలుస్తుంది? నాకెవరో పంపారు. మన గురించి గొప్పగా చెప్తోంది కదాని మీకు పంపా' అన్నాడాయన. నాలుగేళ్ల క్రితం యిలాగే మార్క్ ట్వేన్ పేర 'ఇండియా ఈజ్ మదర్ ఆఫ్ హిస్టరీ, గ్రాండ్‌మదర్ ఆఫ్ లెజెండ్, గ్రేట్ గ్రాండ్‌మదర్ ఆఫ్ ట్రెడిషన్.. అంటూ ఒక కొటేషన్ చలామణీలోకి వచ్చింది. చమత్కారానికి మారుపేరైన మార్క్ ట్వేన్ పేర యింత చప్పగా యీ అబద్ధపు కొటేషన్ వెలువడడం అతని స్మృతికి అవమానం. "మోతీలాల్ తండ్రి ముస్లిమా?" అనే వ్యాసంలో యిలాటి ప్రచారాల గురించి రాసి వున్నాను. మెకాలే ప్రసంగం అంటూ ఒక అబద్ధపు ఉపన్యాసాన్ని చాలాకాలం క్రితమే ప్రచారంలో పెట్టారు. మెకాలే భాష తెలిసినవాడెవడూ అది అతనిదంటే నమ్మరు. కానీ ఎంతమందికి తెలుస్తుంది? కామమ్మ మొగుడంటే కాబోలు ననుకున్నాను అన్నట్లు నడిచిపోతుంది.

అలాగే యింకో వాట్సప్ వచ్చింది. ఎవరో వక్త భారతదేశం గొప్పతనాన్ని ఉగ్గడించడానికి అలెగ్జాండర్‌ను వాడేసుకున్నాడు. అలెగ్జాండర్ భారతదేశంపై దండయాత్రకు వెళుతూ తన గురువుకి చెప్పాడట. 'అక్కడకి వెళితే నీకు ఆశ నశిస్తుంది, సంపాదించినది చాలనిపిస్తుంది, ప్రపంచాన్ని జయించాలనే నీ ఆశయం నెరవేరదు' అని గురువు హెచ్చరించాడట. చివరకు అలాగే జరిగిందట! నిజానికి పురుషోత్తముడితో యుద్ధం తర్వాత అలెగ్జాండర్‌లో ఆశ నశించలేదు. ఇంకా ముందుకు వెళదామనుకున్నాడు. కానీ సైన్యం మొండికేశారు. ఇల్లు వదలి చాలాకాలమైంది, వెనక్కి వెళ్లి మళ్లీ వద్దామన్నారు. విధిలేక అలెగ్జాండరు వెనక్కి మరలాడు. ఇదీ మనం చదువుకున్న చరిత్ర. తర్వాత ఈయన యింకో కథ చెప్పాడు – భారత్‌లో ఒక ఋషి వద్దకు అలెగ్జాండరు వెళ్లాడట. నేను అలెగ్జాండర్ ద గ్రేట్‌ని అన్నాడట, 'గ్రేట్ అని స్వయంగా చెప్పుకునేవాడు ఏం గ్రేట్, సరే ఏదో ఒకటి అయితే అయ్యావులే, ముందు పక్కకు తప్పుకో, ఎండకు అడ్డుగా వున్నావు, ఎండపొడ పడనీ' అన్నాడట ఋషి. ప్రాచుర్యంలో వున్న అసలు కథలో అలెగ్జాండర్ దేశాలు జయించాక తన గురువు అరిస్టాటిల్ వద్దకు వెళ్లి 'ఇన్ని దేశాలు జయించాను, నేను మీకు ఏ సాయం చేయగలను గురుదేవా' అని అడిగితే ఆయన 'ఎండ పడకుండా అడ్డంగా నిలబడ్డావు, పక్కకు తప్పుకో, అదే పదివేలు' అన్నాడట. అరిస్టాటిల్ సింప్లిసిటీకి, వాంఛారాహిత్యానికి ఉదాహరణగా చెప్తారిది. ఆ తర్వాత యీ వక్త అలెగ్జాండరుకు ఎడారిలో ఒక ఋషి ఎదురైనట్లు, అలెగ్జాండరుకు దాహం వేసి మంచినీళ్లు అడిగితే సగం నీళ్లు యిస్తానన్నట్లు ఏదో పిట్టకథ చెప్పారు. అలెగ్జాండరు భారత్‌లో ఏ ఎడారిలో తిరిగాడు? పైగా ఆ స్థాయి వ్యక్తి తనకు దాహం వేస్తే స్వయంగా వెళ్లి అడుగుతాడా? ఎవడో సైనికుణ్ని వెళ్లి పట్టుకురమ్మంటాడు, అవతలివాడు యివ్వకపోతే వాడి తలకాయ తెగ్గోసి మరీ పట్టుకొస్తాడు సైనికుడు. భారతదేశం ఔన్నత్యం చెప్పాలంటే ఎన్నో ఉదంతాలున్నాయి. ఇలా లేనివి పుట్టించడం దేనికో తెలియదు.

పురాణాలను వక్రీకరించడం కూడా మిస్‌ఇన్‌ఫర్మేషన్ కిందే వస్తుందని నా భావన. అది చరిత్రే కాదు, పుక్కిటి పురాణం అనుకుంటే వాటిలో ఏముందో అదే చెప్పాలి. ఒకదానితో మరొకటి విభేదిస్తే అదీ చెప్పాలి. అంతేగాని దానిలో కొంత భాగాన్ని మాత్రం తీసుకుని, అది చరిత్ర అంటూ చెప్పి, యీనాటి రాజకీయ అవసరాల కోసం పాత్రల స్వభావాన్ని మార్చివేయకూడదు. మహిషాసురుడు దళితుడు, అతన్ని అన్యాయంగా చంపేశారు అనే వాదనకు ఆధారం ఏముంది? ఆ పురాణంలో రాసి వున్నంతవరకే తీసుకో, కానీ లేనిపోనివి కల్పించడం దేనికి? మహిషుడు దళితుడు, నరకాసురుడు దళితుడు, రావణాసురుడు దళితుడు అంటూ విలన్లందరినీ అణచివేతకు గురైనవారిగా చిత్రీకరించడం అనుమతించ కూడదు. రేపెవరో 'బకాసురుడు కూడా దళితుడు. తన పాటికి తను ఎద్దుమాంసం తింటూ వుంటే 'గోరక్షాదళ్' సభ్యుడైన క్షత్రియుడు భీముడు బ్రాహ్మణవాదం ప్రేరణతో (మధ్యలో యిదెందుకు అని అడక్కండి, దేనికైనా సరే యిలాటివాటిల్లో బ్రాహ్మణవాదం అనే తాలింపు పెడితే ఆ కిక్కే వేరప్పా!) వచ్చి వాణ్ని అన్యాయంగా చంపేశాడు' అనే థీమ్‌తో ఓ నాటకం రాసి జనాల మీదకు వదలవచ్చు. భావస్వేచ్ఛ వుండాలి నిజమే, పురాణాలపై ఆధారపడి

ఊహాజనితమైన కథలు రాయడం భాసుడి కాలం నుంచి వుంది. దుర్యోధనుణ్ని విషాదాంత నాయకుడిగా ఆయన చిత్రీకరించాడు. ఎన్టీయార్ తీసిన అనేక పౌరాణిక సినిమాల్లో పురాణాల్లో లేనివి చొప్పించారు. కానీ అవన్నీ కల్పనలో భాగంగా చేశారు తప్ప రాజకీయ ఎజెండాతో, సమాజంలో ఘర్షణలు సృష్టించడానికి రాయలేదు. ప్రస్తుత ప్రయత్నాల్లో అది జరుగుతోంది కాబట్టే యీ ఆవేదన.

ఇలాటివి సమాజంలో అనేకం జరుగుతున్నాయి. కనీసం కొంతమేరకైనా మిస్ఇన్ఫర్మేషన్‌పై ముకుతాడు వేయడానికే పైన చెప్పిన ఇనీషియేటివ్ ప్రారంభమైంది. ఫేస్‌బుక్, గూగుల్ దొంగ వార్తలను ఏరివేయడానికి పూనుకున్నాయి. వాటిని ప్రచారం చేసే వెబ్‌సైట్లకు యాడ్స్ తగ్గించేందుకు నిశ్చయించాయి. ఎన్‌బిసి, సిఎన్ఎన్ జర్నలిస్టుగా పనిచేసిన కాంప్‌బెల్ బ్రౌన్ అనే ఆయన్ను జనవరిలో ఉద్యోగంలోకి తీసుకున్నారు. ఆయన ఫేస్‌బుక్ న్యూస్ పార్ట్‌నర్‌షిప్ టీముకి నేతృత్వం అప్పచెప్పారు. దీనికి విరాళాలు అందించేందుకు పైన చెప్పినవే కాక జాన్ ఎస్. జేమ్స్ ఎల్. నైట్ ఫౌండేషన్, టో ఫౌండేషన్, ఏప్‌నెక్సస్, బీటా వర్క్స్ ముందుకు వచ్చాయి. దీనికి హెడ్‌క్వార్టర్స్ న్యూయార్క్ సిటీ యూనివర్శిటీలో వుంటుంది. వార్తల యాదార్థ్యాన్ని తేల్చడానికి మరిన్ని యూనివర్శిటీలు తోడుగా వచ్చాయి. అరిజోనా స్టేట్ యూనివర్శిటీ, ద ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్స్, ద న్యూస్ లిటరసీ ప్రాజెక్టు, ద ట్రస్ట్ ప్రాజెక్ట్, పబ్లిక్ రిలేషన్స్ గ్రూప్ ఐన వెబర్ షాండ్‌విక్! ఈ ఉద్యమం యూరోప్‌కి, ఆసియాకు కూడా విస్తరించింది. డెన్మార్క్‌లోని ఆర్హస్ యూనివర్శిటీలో వున్న 'కనస్ట్రక్టివ్ ఇన్‌స్టిట్యూట్', నెదర్లాండ్స్‌లోని యూరోపియన్ జర్నలిజం సెంటర్, హేంబర్గ్ మీడియా స్కూల్, జర్మనీలో హాన్స్ బ్రెడో ఇన్‌స్టిట్యూట్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లోని పోలిస్ మీడియా డిపార్ట్‌మెంట్, ఫ్రాన్స్‌లోని సైన్సెస్ పో యూనివర్శిటీ, హాంగ్‌కాంగ్ కేంద్రంగా గల సొసయిటీ ఆఫ్ పబ్లిషర్స్ ఇన్ ఏసియా, ఆస్ట్రేలియాలోని వాక్‌లీ ఫౌండేషన్, వికిపీడియా వ్యవస్థాపకుడు జిమ్మీ వేల్స్, యునెస్కో. యిలా యిన్ని చేతులు కలిపాయి. త్వరలో జరగబోతున్న ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలను మిస్‌యిన్ఫర్మేషన్ ప్రభావితం చేయకుండా చూడడానికి త్వరలో జరగబోతున్న ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలలో మిస్‌యిన్ఫర్మేషన్ ప్రభావితం చేయకుండా చూడడానికి ఫిబ్రవరిలో గూగుల్ సహకారంతో 37 ఫ్రెంచ్, అంతర్జాతీయ మీడియా సంస్థలు వెలువడుతున్న వార్తలను క్రాస్‌చెక్ చేయడం ప్రారంభించాయి. సత్యం గెలుస్తుందో, అబద్ధం గెలుస్తుందో వేచి చూదాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**ఏప్రిల్ 09, 10, 11** **ఎమ్బీయస్ : 2019లో టిడిపి గెలుస్తుందనకూడదా?**

ఈ చర్చ యిప్పుడే చేయడం తొందరపాటు. ఇంకా రెండేళ్లు టైముంది. ఈ మధ్యలో ఏదైనా జరగవచ్చు. అయితే ''మంత్రిగా లోకేశ్'' అనే వ్యాసంలో నేను '2019 నాటికి టిడిపి మళ్లీ గెలిచి, లోకేశ్ ఏ ఉపముఖ్యమంత్రో కావచ్చు కాబట్టి అతను తన పాలనాపాటవాలను పెంచుకోవాలని ఆశిద్దాం' అని అనడంతో అలా ఎలా అంటారు అని నాపై చాలామంది విరుచుకు పడ్డారు. అంతే కాదు, లోకేశ్‌కి అంత సామర్థ్యం లేదు అని కూడా ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు జవాబుగానే యీ వ్యాసం రాస్తున్నాను. ఆ వ్యాసాన్ని మెచ్చినవారి కంటె మెచ్చనివారు ఎక్కువని అక్కడ అంకె చూపుతోంది. కానీ దానివలన నేను ప్రభావితం కావటం లేదు. నేననుకున్నది నేను రాశాను, దానిపై వాళ్లనుకున్నది వాళ్లు తెలియపరిచారు. నిజానికి చాలా విమర్శలకు మూడు, నాలుగు రోజుల పాటు నేను జవాబులిచ్చాను. అవి ఇంగ్లీషులో వున్నాయి. ఒకసారి వ్యాసం చదివాక కామెంట్ల కోసం, వాటిపై నా రెస్పాన్సు కోసం మళ్లీమళ్లీ ఎవరూ వెళ్లి చదవకపోవచ్చు. వ్యక్తిగతంగా కూడా చాలామంది మెయిల్స్ రాశారు. జవాబిచ్చాను. ఇంకా రాస్తున్నారు. నా ఉద్దేశాన్ని స్పష్టంగా రాయడానికి యిది సుదీర్ఘంగా రాస్తున్నాను. ఈ అంశంపై యిదే ముక్తాయింపు.

**హైదరాబాదులో ఓటమికి లోకేశ్ బాధ్యుడా?**

చాలామందికి లోకేశ్‌పై ఏ మాత్రం నమ్మకం వున్నట్లు కనబడటం లేదు. నేనూ అతను వీరుడు, శూరుడు అని రాయలేదు. కావాలనే అతను ప్రఖ్యాత యూనివర్శిటీల్లో చదివిన విషయాన్ని ప్రస్తావించలేదు. అతని మేధస్సు యిప్పటిదాకా ప్రకటితం కాలేదు. ఏదైనా జాతీయ మీడియా కాన్‌క్లేవ్‌లో అతను పాల్గొని వాదించి వుంటే కాస్త తెలిసేది. ఇప్పటిదాకా అతను బ్యాక్‌రూమ్ బాయ్‌గానే వున్నాడు. అందుకే అది నేర్చుకోవాలి, యిది నేర్చుకోవాలి అని సూచిస్తూ రాశాను. మనం సూచించాం కదాని అతను పాటించాలని ఏమీ లేదు. అతను మెరుగుపడ్డాడో లేదో కాలమే చెపుతుంది. ఈ లోపునే అతను పనికిరాడు అని తీర్మానించడం పొరపాటు. చంద్రబాబు కూడా ఎన్టీయార్‌కు బాక్‌రూమ్ బాయ్‌గానే వుండేవారు. తర్వాత జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయికి వెళ్లారు. నేర్చుకుంటే ఏదీ అసాధ్యం కాదు. నేను 40 ఏళ్లు దాటాకనే వ్యాసాలు రాయడం మొదలుపెట్టాను. 50 ఏళ్లు దాటాక నా వాయిస్ రేడియోకు అనువుగా వుంటుందని తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా వినిపించే శాటిలైట్ రేడియోలో ఆర్‌జెగా పనిచేశాను. 55 ఏళ్లు దాటాక టీవీ తెరమీద కనబడి ఏడాది పైన ఓ కార్యక్రమాన్ని నిర్వహించాను. నాలో యిన్ని కళలున్నాయని నాకే తెలియదు. మోదీ ప్రధానిగా వెలుగుతాడని పదేళ్ల క్రితం ఎవరైనా అనుకున్నారా? అంతమాత్రాన ప్రతీవాడూ మోదీ అవుతాడని చెప్పలేం, కాలేడనీ చెప్పలేం. గబుక్కున 'యూస్‌లెస్ ఫెలో' అనేస్తాం కానీ అది తప్పు. వాడివలన ఎవడో ఒకడికి ప్రయోజనం వుండవచ్చు. వాడు

పనికిమాలినవాడని, ఎప్పటికీ బాగుపడడని, ఎన్నేళ్లయినా ఏదీ నేర్చుకోకుండానే వెళ్లిపోతాడని తీర్మానించడానికి మనమెవరం? లోకేశ్ విషయంలో హైదరాబాదు మునిసిపల్ ఎన్నికలలో ఓటమిని అతని నెత్తిన కొందరు రుద్దారు. అతని స్థానంలో చంద్రబాబు వున్నా అదే ఫలితం వచ్చేది. తెలంగాణలో పార్టీని పూర్తిగా కరారావుడు చేసేసిన ఘనత చంద్రబాబుది. దానికి లోకేశ్‌ను తప్పుపట్టడం అనవసరం.

## మాట్లాడే కళను అభ్యసించాలి

ఇక ఫలానా చోట అతని ఉపన్యాసం విన్నారా? అంటూ కొంతమంది అడిగారు. నేను ముందే చెప్పాను – అతను ఉపన్యాసకళ నేర్చుకోవాలని. నిజానికి ఆంధ్రలో యిప్పుడు నాకు మంచి వక్తలే కనబడటం లేదు. చంద్రబాబుకి క్లుప్తంగా, సూటిగా మాట్లాడడం రాదు. స్వోత్కర్ష, సోది, చెప్పినదే చెప్పి గంటల తరబడి మాట్లాడతారు. జగన్‌కి మాట్లాడేటప్పుడు మొహం ఎలా పెట్టుకోవాలో తెలియదు. ఉపన్యాసంలో పాయింట్లు వున్నా ఎప్పుడూ బాధతో, ఆవేదనతో మాట్లాడుతున్నట్లే వుంటుంది తప్ప వేరియేషన్స్ వుండవు. వైయస్ మంచి వక్త. వైసిపిలో రోజా మంచి వక్త, సబ్జక్ట్ వుంటుంది, అనర్గళంగా, ఎప్పుడే భావం పలికించాలో అది పలికిస్తూ, సమయస్ఫూర్తి చూపుతూ మాట్లాడతారు. ఇక ఉండవల్లి అయితే ఎదురే లేదు. అద్భుతమైన వక్త. కానీ ఆయన ఏ పార్టీలోనూ యాక్టివ్‌గా లేదు. ఇంకెవరున్నారు? పేర్లు తట్టడం లేదు. టీవీ చర్చల్లో బాగా వాదించే నాయకులున్నారు. వీళ్లంతా బహిరంగసభల్లో శ్రోతలను ఎలా ఆకట్టుకోగలరో కానీ నేను ఆ రాష్ట్రంలో నివసించను కాబట్టి, చెప్పలేను. అసెంబ్లీలో విందామంటే అంతా గోలగోల, ఎవర్నీ మాట్లాడనివ్వరు.

నిజానికి వక్తృత్వానికి చాలా ప్రాధాన్యత వుంది. సీజర్ దగ్గర్నుంచి విదేశాలు వెళ్లి 'రెటరిక్'లో తర్ఫీదు పొంది వచ్చేవారు. గతంలో ఎందరో నాయకులు అద్భుతంగా మాట్లాడేవారు. పోనుపోను క్వాలిటీ తగ్గిపోయింది. ప్రజల్ని మాటలతో కాక నోట్లతో ఆకట్టుకోవచ్చనే ధీమా పెరిగిపోయి, ఆ వైపు ద ృష్టి పెట్టడం మానేశారు. ఇప్పటికీ బాగా మాట్లాడేవారిలో ఆరెస్సెస్  నుంచి వచ్చిన వారు, కమ్యూనిస్టులు, ద్రవిడ పార్టీవారు కనబడతారు. వీళ్లందరికీ పుడుతూనే ఆ కళ అబ్బదు. తర్ఫీదు యిస్తారు. ఒక పాఠకుడు రాశారు – గొంతులో జీర వుంటే తప్ప లాభం లేదని. సాధన చేస్తే ఆ జీర అదే వస్తుంది. దాని ప్రాముఖ్యత గుర్తించాలి ముందుగా. ఎన్టీయార్ పార్టీ పెట్టిన కొత్తల్లో గండిపేట శిబిరంలో ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు రాజకీయ పరిజ్ఞానంపై, అసెంబ్లీ కార్యకలాపాలపై, మాట్లాడే తీరుపై అవగాహన కల్పించడానికి రాజకీయ తరగతులు నిర్వహింపచేశారు. చంద్రబాబే వాటిని పర్యవేక్షించేవారు. బాబు పార్టీ అధ్యక్షుడయ్యాక అవన్నీ అనవసరం అనుకున్నారు లాగుంది. ఇటీవల జరుగుతున్నట్లు లేవు. వాటి స్థానంలో యోగా క్లాసులు పెట్టిస్తున్నారు. మర్నాడు ఆ యోగా టీచరుకు ఎకరాలకు ఎకరాలు భూమి కేటాయిస్తున్నారు.

## లోకేశ్‌ను బూస్ట్ చేసి తీరతారు

లోకేశ్ రూపం గురించి ప్రస్తావన అనవసరం అని కొందరు ఫీలైతే, మరికొందరు అతను మారలేదు అని తీర్మానించారు. ప్రజానాయకుడు – ముఖ్యంగా యువనేత – ట్రిమ్‌గా, స్మార్ట్‌గా వుంటే దాని సంగతే వేరు. జయలలిత బొద్దుగా వున్నా ఒకప్పుడు బ్రహ్మాండమైన ఓపికతో వుండేది. మొన్నటి ఎన్నికలలో నడవడానికి అవస్థ పడుతూ వుంటే విజయకాంత్ ఆమెను అనుకరించి వెక్కిరించాడు. మరి స్టాలిన్‌ను అలా వెక్కిరించగలిగాడా? జయలలిత కంటె స్టాలిన్ 4 ఏళ్లు మాత్రమే చిన్నవాడు. సుదీర్ఘ పాదయాత్ర చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాడు. ప్రయత్నించినా లోకేశ్ తగ్గలేడు అనడం అన్యాయం. ఎందరో సినిమా యాక్టర్లు పాత్రల కోసం పెరుగుతున్నారు, తరుగుతున్నారు. చిత్తశుద్ధి వుండాలంతే!

లోకేశ్ ఏం నేర్చుకున్నా, నేర్చుకోకపోయినా బాబు అతని యిమేజి పెంచడానికి ఎలాగూ బోల్డు కసరత్తు చేస్తారు. వైయస్ జగన్‌ను పెంచినట్లు కాకుండా తను తన కొడుకుని బ్రహ్మాండంగా పెంచానని ఎప్పుడో చెప్పుకున్నారు. 2009లో నగదు బదిలీ ఐడియా అతనిదే అని చెప్పారు. తను ప్రధాని కావాలా వద్దా అని అతన్నే అడిగి సలహా తీసుకున్నానని చెప్పారు. ఇప్పుడీ మంత్రి పదవి కట్టబెట్టాక, ఆ శాఖల్లో సమర్థులైన అధికారులను వేయడం, ఆ శాఖలు అదరగొట్టేస్తున్నాయని, మంత్రిగా లోకేశ్ అధికారులను తన ప్రశ్నలతో బెదరగొట్టేస్తున్నారని మీడియాలో ఎలాగూ వార్తలు రాయిస్తారు. ఇకపై ఐటీ కంపెనీలేవైనా ఆంధ్రలో పెట్టుబడులు పెడతాయని అంటాయని అంటే, వాటిని తన ఖాతాలో కాక కొడుకు ఖాతాలో వేస్తారు. ఇన్నాళ్లూ దానికి వేరే మంత్రి వున్నపుడు పరిస్థితి వేరు. ఇప్పుడు లోకేశ్ వచ్చారు కాబట్టి, ఆయన స్టాన్‌ఫోర్డ్‌లో విద్యార్థిగా వుండగానే అక్కడి బిగ్‌విగ్స్‌తో ఆంధ్రలో పెట్టుబడుల గురించి మంచిచెడ్డా మాట్లాడారని చెప్పేసుకోవచ్చు. మంత్రి కాక ముందు నుంచే ఆ ప్రయత్నాల్లో వున్నానని లోకేశ్ చెప్పుకున్నారు కూడా. 'చినబాబుగారా, అమ్మో తండ్రినే మించిపోయేట్లున్నారు' అనే భజనపరులు కూడా చేరతారు. మనం ఏమనుకున్నా సరే, 2019లో టిడిపి మళ్లీ గెలిస్తే ఆయన ప్రధాన పాత్రలో అవతరిస్తాడు అనేది గోడ మీద రాత అయినపుడు లోకేశ్ తన శక్తిసామర్థ్యాలను పెంచుకోవాలని ఆశించడంలో తప్పు లేదనే భావంతోనే వున్నాను.

## గోడ మీది రాతను చూడకపోతే ఎలా?

నేను టిడిపి పాలనకు, వారసత్వ పాలనకు నైతిక మద్దతు యిచ్చానని కొందరు బాధపడ్డారు. నేనెవరికీ ఏ మద్దతూ యివ్వలేదు. ఉన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నానంతే. నా బోటి 'మేధావి' కూడా యిలా సమర్థిస్తే ప్రజాస్వామ్యం ఏమైపోతుందంటూ కొందరు ప్రశ్నించారు. నా బొంద, నేను అవునంటే అవుతుందా, కాదంటే మానుతుందా? స్వాతంత్ర్యపోరాట కాలంలో మహానుభావులు శక్తివంతమైన సంపాదకీయాలు రాసి ప్రజాభిప్రాయాన్ని మలచేవారట. ఇప్పుడెవరూ అలాటివారు కనబడటం లేదు. ఫిరాయింపులను ఖండిస్తున్నాను అంటూ ఘాటుగానో, వెటకారంగానో ఓ వ్యాసం రాస్తే పాఠకులు ఓహో అనవచ్చు తప్ప ఫిరాయింపులు ఆగుతాయా? వారికి మంత్రిపదవులు ఆగుతాయా? నేను ఆదర్శవాదిని కానని, రాజకీయాలను ఒక చదరంగంలా మాత్రమే చూస్తానని ఒక పరిశీలన. చాలాకాలం రాజకీయాలను అధ్యయనం చేస్తే ఎవరికైనా యిదే పరిస్థితి ఎదురవుతుంది. నేనూ చాలామందిపై ఆశలు పెట్టుకున్నాను. వాళ్లందరూ వాటిని వమ్ము చేశారు. అందువలన ప్రాక్టికల్‌గా జరుగుతున్నదే రాస్తాను తప్ప సంపాదకీయాల తరహాలో నీతిబోధలు చేయను. ఇప్పటికీ కలలు కనేవారికి అవి నచ్చకపోవచ్చు.

మోదీ దేశాన్ని గొప్పగా నడిపించేస్తాడని నేను అనుకోలేదు. నేను అనుకోకపోవడం చాలామందికి నచ్చలేదు. వారిలో కొంతమందికి తత్త్వం బోధపడింది. మరి కొంతమందికి ఆశలు చావలేదు. ఎవరి అనుభవాలు వారివి. యుపిఏ అంత అధ్వాన్నం కాకపోయినా మోదీ పాలన బాగాలేదని నా అభిప్రాయం. కానీ ప్రత్యామ్నాయం లేదు కాబట్టి మోదీ యింకో రెండు టెర్మ్‌లు, కనీసం ఒక టెర్మ్ కొనసాగుతాడనే అవగాహన నాకుంది. అది రాయడానికి జంకను. అంతమాత్రం చేత నేను మోదీ చర్యలను సమర్థిస్తున్నా ననుకోకూడదు. క్షేత్రవాస్తవాన్ని వాస్తవంగా గుర్తించకుండా 'మోదీని ఓడించండి' అని యావద్భారత ప్రజలకు నా కాలమ్ ద్వారా పిలుపు నిచ్చి భుజాలు చరుచుకోవడం అవివేకం. లేని బావ కంటె గూనిబావ మేలన్నారు. ఉన్న గూనిబావ తన గూనిని సవరించుకుంటాడనో, కనీసం కవర్ చేసుకుంటాడనో కోరుకోవడం తప్పు కాదు. మోదీ పాలన ఎలాగూ తప్పదు కాబట్టి అదేదో కాస్త మెరుగ్గా వుంటే బాగుండునని చిన్ని ఆశ. కెసియార్ విషయానికి వస్తే అతని వాగ్దానాలకు, వాటి అమలుకు హస్తిమశకాంతరం వుంది. అన్నీ అమరి వున్నాయి కాబట్టి ఏదోలా బండి లాగిస్తున్నారు. నగరం పరిస్థితి మెరుగు పడలేదు. గ్రామాల్లో ఎలా వుందో తెలియదు. మిషన్ భగీరథ మరో జలయజ్ఞమో, కాదో కొన్నాళ్లకు తెలుస్తుంది. అయినా యింకో టెర్మ్ నెగ్గడం ఖాయమనిపిస్తోందని రాస్తే అతని అప్రజాస్వామిక చర్యలను సమర్థించినట్లు కాదు.

## ఆశ కాదు, అవగాహన...

ఇదే ధోరణిలో టిడిపి 2019లో మళ్లీ నెగ్గే అవకాశం వుంది అని రాయడం జరిగింది. అది నా కోరిక కాదు, నెగ్గించండని ఓటర్లకు యిచ్చిన పిలుపు కాదు, మరేదీ కాదు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని వేసిన అంచనా మాత్రమే. ఆంధ్రలో పాలన అస్తవ్యస్తంగా వుందని ఆ వ్యాసంలోనే రాశాను. అక్కడ ఆర్భాటం, అనవసర వ్యయం ఎక్కువ, జరిగేది అతి తక్కువ. ఋణమాఫీ, ప్రత్యేక హెూదా, వికేంద్రీకరణ, రాజధాని నిర్మాణం, పోలవరం, రైల్వే జోన్, మెట్రో, కేంద్రనిధులు... ఏ అంశం తీసుకున్నా బాబు వైఫల్యం కనబడుతోంది. ఇచ్చిన నిధులకు కేంద్రం లెక్కలడుగుతూంటే రాష్ట్రప్రభుత్వం చెప్పలేకపోతోంది. ఏ పనీ సాగటం లేదు. అయితే మీడియాను చేతిలో పెట్టుకుని అద్భుతాలు జరిగిపోతున్నాయని చాటుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. రాజకీయ అవినీతి, మంత్రుల దాష్టీకం, తనవారి తప్పులను కాయడం, అస్మదీయులకు దోచిపెట్టడం అన్నీ యథేచ్ఛగా సాగిపోతున్నాయి. మామూలుగా అయితే ప్రజలు టిడిపిని మళ్లీ ఎన్నుకోనక్కరలేదు. అయితే 2019 నాటికి వారి వద్ద ప్రత్యామ్నాయం ఏముంది? 2014 పార్లమెంటు ఎన్నికలకు ముందు మోదీకి వ్యతిరేకంగా నేను వ్యాసాలు రాస్తూ వుంటే కొందరడిగారు – 'మోదీ పెట్టుబడిదారులకు మాత్రమే లాభం చేసే వ్యక్తి అని చెపుతున్నారు. సరే, అతనికి ఓటేయం. మరి ఎవరికి వేయం? రాహుల్ గాంధీకా?' అని. పోయిపోయి రాహుల్‌కు, కాంగ్రెసుకు వేయమని నేనెలా చెప్తాను? సరైనవాడు కనబడక నేనే 'నోటా' మీట నొక్కాను. 'ప్రత్యామ్నాయం చూపడం నా పని కాదు. మోదీపై మరీ ఆశలు పెట్టుకోకండి అని చెప్పడమే నా లక్ష్యం' అని జవాబిచ్చాను. ఇప్పుడు 2019లో ఆంధ్ర ఓటర్లు అడిగినా ఏం చెప్తాం? టిడిపి మళ్లీ నెగ్గితే దానికి కారణం వాళ్ల ప్రతాపం కాదు, ప్రతిపక్షం వైఫల్యం!

## పవన్ ప్రత్యామ్నాయం కాదా?

ఈ ముక్క అంటే జగన్ అభిమానులు హర్షించలేదు. కాంగ్రెసు మళ్లీ కోలుకోలేదు అనే మాట ఎవరూ ఖండించలేదు. కొందరైతే పవన్‌పై ఆశలున్నాయన్నారు. బిజెపితో కలిసి అతను అద్భుతాలు చేయగలడన్నారు. నాకైతే అతని రాజకీయాల్లో చిత్తశుద్ధి, నిజాయితీ, కమిట్‌మెంట్ కనబడటం లేదు. రాష్ట్రం అధ్వాన్నంగా వున్నా, ఏ సమస్యపై ఎప్పుడు ఎలా స్పందిస్తాడో ఎవరూ వూహించలేరు. ఏదో కాల్‌షీటు యిచ్చినట్లు ఒకసారి వస్తాడు, ఏదో గందరగోళంగా మాట్లాడతాడు, శ్రోతలను కిర్రెక్కిస్తాడు, అంతే ఫాలోఅప్ కార్యక్రమం

ఏమీ వుండదు, ఆచరణలో ఏమీ కనబడదు, ఆయన ప్రొడ్యూసర్లకే దొరకడు, యిక ప్రజలకు ఎలా అందుబాటులో వుండగలడు? వాళ్లు ఎన్నాళ్లు తపస్సు చేసినా ఆయన తలచుకున్నపుడే ప్రత్యక్షమవుతాడు. పోనీ అలా అని పార్టీలో ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నాయకుల్ని తయారుచేసి ప్రజలతో సంపర్కం వుండేట్లా కార్యాలయాలు ఏర్పాటు చేశాడా అంటే అదీ లేదు. అదేమంటే నా దగ్గర డబ్బు లేదంటాడు.

ఎన్నికలు యింకో రెండేళ్లల్లో వస్తున్నాయంటే యీ పాటికి ఎన్ని సన్నాహాలు జరిగి వుండాలి! చివరకు ఎన్నికల టైముకి ఏదో ఒక పార్టీకి పక్కవాయిద్యంగా తేలతాడనుకుంటున్నాను తప్ప ప్రధాన భూమిక వహించి, ప్రజానాయకుడిగా వస్తాడనుకోవడం లేదు. మరి ఏ పార్టీకి కాల్‌షీట్ యిస్తాడన్నది యిప్పుడే చెప్పలేం. అయితే బిజెపికో లేక టిడిపికో తప్ప వైసిపికి అయితే కాదు కదా! పవన్ మద్దతు యిచ్చినా బిజెపి 2019లో ఆంధ్ర గెలిచేస్తుందా? ఓ పాఠకుడు రాశాడు – 2014కు ముందు యుపిలో బిజెపికి వున్న బలమెంత? అయినా మోదీ 80లో 75 సీట్లు గెలవలేదా? అని. యుపిలో బిజెపికి ఎప్పుడూ కొన్ని ఓట్లు స్థిరంగా వున్నాయి. పైగా మోదీ తరహా నాయకుడు ఆంధ్ర బిజెపికి వున్నాడా? ఉన్నవాళ్లల్లో చాలామంది బిజెపి మౌలిక సిద్ధాంతాలేమిటో తెలియని ఫిరాయింపుదారులే. పైగా ఆంధ్ర బిజెపి టిడిపి సమర్థకులు–వ్యతిరేకులుగా చీలిపోయి వుంది. అమిత్ షా దీనిపై దృష్టి పెట్టాలి, పార్టీ నిర్మించాలి, యివన్నీ ఎప్పటి కవుతాయో తెలియదు. అందుకని ప్రతిపక్షం అంటే వైసిపి ఒక్కటే కనబడుతోంది. దాని పరిస్థితి ఏమిటి?

## వైసిపి బలం పెరుగుతోందా? తరుగుతోందా?

దాని పరిస్థితి ఎలా వుందన్న విషయంలోనే చాలామంది పాఠకులు నాతో విభేదించారు. వారి వాదనలో రెండు అంశాలు – 2014 ఎన్నికలలో టిడిపికి, వైసిపికి ఓట్ల శాతంలో వ్యత్యాసం అతి తక్కువ, సంఖ్యలో అయిదు లక్షల చిల్లర. అందువలన జగన్‌కు ప్రజాదరణ బాగా వుందనుకోవాలి! ఇక్కడ ఓట్ల శాతం మాత్రమే లెక్కలో తీసుకుంటే సరైన చిత్రం రాదు. వైసిపి బలమంతా కొన్ని జిల్లాలకే పరిమితమై అక్కడే చాలా ఓట్లు వచ్చాయి. అనేక జిల్లాలలో వైసిపి ఘోరంగా దెబ్బ తింది. 34 సీట్లున్న ఉత్తరాంధ్రలో 4 సీట్లు, 34 సీట్లున్న ఉభయగోదావరుల్లో 3, 33 వున్న కృష్ణా, గుంటూరులలో 10... యిలాటివి కూడా లెక్కలోకి తీసుకోవాలి. రెండో విషయం 2014 తర్వాత యీ మూడేళ్లలో వైసిపి యీ జిల్లాలలో పుంజుకుందా అనే ప్రశ్న. దానికి ఆధారం ఏమీ కనబడటం లేదు. తాజా ఎన్నికల్లో కడప జిల్లాలో సైతం వైసిపి ఓడిపోవడమేమిటి? అంటే టీచర్స్ విభాగంలో మరో సీటు నెగ్గిందిగా అంటున్నారు. నాయకుడి సొంత జిల్లాలోనే యిలా ఓదార్చుకోవలసి వస్తోంది చూడండి.

జగన్ తన ఎమ్మెల్యేలను పోగొట్టుకుంటున్నాడు అని రాస్తే అధికార పార్టీ ఒత్తిళ్లు అలా వున్నాయి మరి.. అంటున్నారు కొందరు. బాబు పదేళ్లు ప్రతిపక్షంలో వున్నారు. ఈ స్థాయిలో ఎమ్మెల్యేలను పోగొట్టుకున్నారా? ఎన్నో రాష్ట్రాలలో పార్టీలు దశాబ్దాల తరబడి అధికారంలో లేకపోయినా నాయకులను తమతో వుంచుకోగలుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాలలోనే ప్రతిపక్షాలు చతికిల పడుతున్నాయి. ఎందువలన? ఇవి మళ్లీ అధికారంలోకి రావు అని ఆ పార్టీల ఎమ్మెల్యేలు అనుకోవడం చేతనే! వాళ్లకీ గ్రౌండ్ రిపోర్టులు వుంటాయి కదా! ఫిరాయింపుల తర్వాత వాళ్ల యిళ్ల ముందు ప్రజలు ప్రదర్శనలు చేయడం లేదు కదా! మంత్రులుగా మారి వస్తే దండలు వేయడం మానటం లేదు కదా! పార్టీలు మారేవారికి 2019లో ప్రజలు బుద్ధి చెప్తారు అనుకుని మధ్యతరగతి మేధావులు తమకి తామే నచ్చచెప్పుకుంటూ కూర్చోవాలి తప్ప అప్పటికి చమత్కారాలు ఏమీ జరగవు. దేశమంతా ఫిరాయింపులే. అధికారపక్షాలు నిస్సిగ్గుగా స్పీకరు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యంతో ఆడుకుంటున్నాయి. ప్రజల్లో చైతన్యం ఏమైనా కనబడుతోందా? వాళ్లకి తీరిక ఎక్కడ? ఏ ఎటిఎంలో క్యాష్ వస్తోందోని పరుగులు పెట్టడంతోనే సరిపోతోంది.

## ఫిరాయింపుల గురించి ఫిర్యాదులు ఎన్నాళ్లు?

ఫిరాయింపుల గురించి ఫిర్యాదులు చేస్తూ తిరగడంతోనే జగన్‌కు సరిపోతోంది. అసలు అతని పార్టీయే ఫిరాయింపుదార్లతో ప్రారంభమైంది. ఎన్టీయార్‌లా కొత్త మొహాలతో, యువతతో పార్టీ పెట్టి వుంటే తనకు విశ్వాసంగా వుండేవారు. కాంగ్రెసును చీల్చివేసి, వాళ్ల ప్రభుత్వాన్ని పడగొట్టేసి, ముఖ్యమంత్రి అయిపోదామనే ఆదుర్దాతో ఫిరాయింపులపై ఆధారపడ్డాడు. అయితే అందులో ఒక నీతి పాటించాడు. వాళ్ల చేత రాజీనామా చేయించి, తన పార్టీ ద్వారా మళ్లీ గెలిపించుకున్నాడు. ఇప్పుడు బాబుకి ఆ నీతి కరువైంది. రాజీనామా చేయించి ఉపయెన్నిక పెట్టడం లేదు. అవసరం కనబడకో, ధైర్యం చాలకో చెప్పలేం. కేంద్రమో, మీడియానో కలగచేసుకుంటే తప్ప ఆ పని చేయకపోవచ్చు. ఉపయెన్నికలంటూ జరిగితే అప్పుడు పడిన ఓట్లు బట్టి ప్రతిపక్షం పుంజుకుందో, చతికిలబడిందో స్పష్టంగా తెలుస్తుంది. అప్పటిదాకా ఎవరికి నచ్చినట్లు వాళ్లు వూహించుకోవడమే!

ఏది ఏమైనా ఫిరాయింపుదారు ఫిరాయింపుదారే. ఎన్నికల ముందు కొందరు గోడ దూకితే, తర్వాత కొందరు దూకారు. దూకుతూ దూకుతూ పాత నాయకుడి మీద రాళ్లు రువ్విపోతారు. జగన్ నియంత అని, ప్రతిభ వున్నవాళ్లను సహించలేడని, మంచీమర్యాద తెలియనివాడని ఏవేవో అనేసి పోతున్నారు. అవన్నీ నమ్మనక్కరలేదు అనుకున్నా జగన్ పార్టీలోంచి మైసూరా రెడ్డి వంటి చాలామంది

మంచి వక్తలు, ప్రతిభావంతులు వెళ్లిపోయారన్న మాట వాస్తవం. తెలంగాణలో అయితే మరీనూ. జగన్ వ్యవహారశైలి ఎటువంటిదో మనకైతే తెలియదు. కానీ యీ స్థాయిలో అనుచరులను పోగొట్టుకోవడం ఉత్తమ నాయకత్వ లక్షణమైతే కాదు. చంద్రబాబు పాలన పట్ల ప్రజల్లో ఆగ్రహం ఎంత వుందో తెలియదు కానీ అసహనం, అసంతృప్తి అయితే ధారాళంగా వుంది. దాన్ని ఛానెలైజ్ చేసే వ్యూహం వైసిపి వద్ద లేదు. ఎంతసేపూ "సాక్షి" పత్రికలో, టీవీలో చెప్పుకుంటే సరిపోయిందా? ప్రజలు ఓ పట్టాన తిరగబడరు. సహిస్తూనే పోతూ వుంటారు. వారిలో చైతన్యం రగిలించాలంటే ప్రజాసంఘాలను కూడగట్టుకోవాలి, ప్రజావేదికలను ఏర్పరచాలి. సదస్సులు పెట్టి, సమావేశాలు పెట్టి జరుగుతున్నదానిపై ప్రజలకు అవగాహన ఏర్పరచాలి. ఊరూరా నాయకులు తయారుచేయాలి. బాబు వంటి మీడియా మేనేజర్‌ను తట్టుకోవడానికి యిప్పుడు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం చాలవు.

### ప్రజల కోసం ప్రతిపక్షం ఏం చేస్తోంది?

టిడిపి చేతిలో అవస్థలు పడుతున్న సాధారణ ప్రజలు వైసిపి తమకోసం ఏం చేస్తోందా అని చూస్తారు. కనీసం అసెంబ్లీలో తమ బాధలను వినిపించగలుగుతోందా అని ఆలోచిస్తే సమాధానం శూన్యం. 'ఏం చేయమంటారు, మమ్మల్ని మాట్లాడనివ్వటం లేదు' అని వీళ్లు చెప్తే 'మాట్లాడనిచ్చేట్లుగానే ప్రవర్తించు' అని జనాలు సలహా చెప్తారు. జగన్ లేవగానే టిడిపి వారందరూ 'లక్ష కోట్లు' అనో, 'జైలుపక్షి' అనో ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంటారు. ఇతనికి చికాకు వేసి ఏదో అంటాడు, మైకు లాక్కుంటారు. పరిస్థితి యిలా వున్నపుడు జగన్ తను కాకుండా తక్కినవారిని మాట్లాడనివ్వాలి. అభ్యంతర పెట్టలేని భాష ఉపయోగించాలి. 'వచ్చీరాని ఇంగ్లీషులో బాబు..' అంటూ రెచ్చగొట్టడం దేనికి? ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు వచ్చుని బాబుకి జనాలు ఓట్లేయలేదు. ఇటికకు కంకర్రాయితో సమాధానం చెప్తాం అన్నట్లు వుంది అధికార పార్టీ. వాళ్లు ఏం చేసినా చెల్లిపోతోంది. స్పీకరు వాళ్లు చెప్పినట్లే ఆడుతున్నాడు. ఇక్కడే కాదు, అనేక రాష్ట్రాలలో యిదే పరిస్థితి. అలాటప్పుడు ఎంత లౌక్యంగా, దొరక్కుండా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తామనేది ఒక కళ. తను ఏం చేసినా భూతద్దంలో చూపుతారని తెలిసినపుడు జాగ్రత్తగానే వుంటే పోయె.

ప్రజలకు కావలసినది తమ సమస్యలు తీరడం, వచ్చేసారి తమరు ముఖ్యమంత్రి అవుతారా లేదా అన్నది కాదు. అది గ్రహించాలి. 'ఆ ఒక్కటీ అడక్కు'లో రాజేంద్రప్రసాద్‌లా 'ఆఫ్టర్ టూ ఇయర్స్, ఐ యామ్ ద సిఎం' అని చెప్పుకుంటే ఎబ్బెట్టుగా వుంటుందని తోచదా? కావాలంటే అలాటివి పార్టీ సమావేశంలో కార్యకర్తలను ఉత్సాహపరచడానికి చెప్పుకోవచ్చు. ప్రజల మధ్య, అధికారుల ముందు ఎందుకు? ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిపక్ష నాయకుడిలో ఎన్నో లోటుపాట్లు కనబడుతున్నాయి. అతన్ని సవరించే పార్టీ ప్రిసీడియం వంటి వ్యవస్థ ఏమీ లేదు. తక్కిన ప్రాంతీయ పార్టీలలాగానే అక్కడా అధినాయకుడి మాటే వేదం. అతనే కేంద్రబిందువు. ఎవరూ కిక్కురుమనడానికి లేదు. పొగడగలిగినంత కాలం పొగడడం, తేడా వస్తే బయటకు నడవడం. ఇలాటి పరిస్థితుల్లో టిడిపి మళ్లీ గెలుస్తుందని అనుకోవడంలో తప్పు లేదని నా భావన. ఎన్నికలు వచ్చేలోగా మార్పులు వస్తే రావచ్చు. వస్తే అప్పుడే మాట్లాడుకోవచ్చు. ఈ లోపున చర్చలు అనవసరమనుకుంటాను. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

### ఏప్రిల్ 12 ఎమ్బీయస్ : గుడ్డులో తుపాను

ఏసుక్రీస్తు శిలువ నుంచి లేచిన మూడోనాడు ఈస్టర్ పండుగ జరుపుతారు. ఆ రోజు ఆదివారం కాబట్టి పిల్లలు కూడా పాల్గొనే వేడుకగా దాన్ని మలచారు. గట్టిగా ఉడికించిన గుడ్లకు రంగులేసి, లేదా గుడ్డు ఆకారంలో వున్న ప్లాస్టిక్ డబ్బాల్లో చాక్‌లెట్లు, కాండీలు కుక్కి తోటలోనో, యింట్లోనో ఎక్కడో దాచివేసి పిల్లల్ని వెతుక్కుని రమ్మంటారు. పిల్లల వయసును బట్టి ఆ గుడ్లను చేరడానికి కొన్ని అవరోధాలను కూడా కల్పిస్తారు. పిల్లలు ఒక బుట్ట పట్టుకెళ్లి దానిలో సాధ్యమైనన్ని గుడ్లు వేసుకుని తెస్తారు. చివరిలో ఎవరు ఎక్కువ తెచ్చారో చూసి బహుమతులు యిస్తారు. ఒక్కోప్పుడు ఫలానా రంగు గుడ్డు తెచ్చినవారికి ప్రత్యేక బహుమతి అంటారు. ఈ విధంగా పిల్లలకు సాహస క్రీడలతో పాటు పొలాల, తోటల పరిచయం కూడా అవుతుందని పెద్దల ఆశ. ఇది తరతరాలుగా సాగుతూ వస్తోంది. అయితే యీసారి బ్రిటన్‌లో యీ ఆట వివాదానికి దారి తీసింది.

క్యాడ్‌బరీ చాక్లెట్ కంపెనీ అందరికీ తెలుసు. అది యీ ఆటను తన మార్కెటింగ్‌కై వాడుకుందామని అనుకుంది. బ్రిటన్‌లోని అనేక గ్రామీణ ప్రాంతాలను, తీరప్రాంతాలను, ప్రాచీన కట్టడాలను పరిరక్షించే నేషనల్ ట్రస్టుతో కలిసి కో-స్పాన్సరింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. దాని ప్రకారం కాడ్‌బరీ చాక్లెట్లు నింపిన ఈస్టర్ గుడ్లను ట్రస్టు తాలూకు స్థలాల్లో దాస్తుంది. అక్కడకు వెళ్లిన పిల్లలకు ఆ యా ప్రాంతాల గురించి అవగాహన పెరుగుతుంది, అదే సమయంలో కాడ్‌బరీకి ఎడ్వర్టయిజింగ్ జరుగుతుంది. పదేళ్లగా యీ ఏర్పాటు "ఈస్టర్ ఎగ్ ట్రైల్" పేరుతో చక్కగా జరిగింది. ఉభయులూ లాభపడ్డారు. లక్షలాది పిల్లలకు తమ సాంస్కృతిక వారసత్వం గురించి తెలిసి వచ్చింది. ఈ ఏడాది 300 చోట్ల యీ హంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అయితే ఈ ఏడాది కాంపెయిన్‌కు పేరు పెట్టినపుడు "కాడ్‌బరీస్ గ్రేట్ బ్రిటిష్ ఎగ్ హంట్" అని పెట్టారు తప్ప ఈస్టర్ అని చేర్చలేదు. ఇది చర్చిని మండించింది. పండగ ప్రాముఖ్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందంటూ దాడి మొదలుపెట్టింది. నిజానికి 16 వ శతాబ్దం నుంచి ఇంగ్లండుకి చర్చ్ ఆఫ్

ఇంగ్లండ్ మతవిషయాల్లో మార్గదర్శకత్వం వహిస్తోంది. కానీ పోనుపోను ఇంగ్లండ్‌కు అనేక యితర చర్చిలకు సంబంధించిన క్రైస్తవులు వలస వచ్చారు. జనాభాలో ఇతర మతస్తులు, హేతువాదులు కూడా పెరిగారు. దానాదీనా చర్చి ఆఫ్ ఇంగ్లండుకు ప్రాబల్యం తగ్గింది. ఇప్పుడీ అవకాశాన్ని అదనుగా తీసుకుని క్రైస్తవానికి అవమానం జరిగిపోయినట్లు గగ్గోలు పెడుతోంది.

కాడ్‌బరీ కంపెనీని కీర్తిశేషుడైన క్యాడ్‌బరీ అనే ఇంగ్లీషు వ్యక్తి 1824లో స్థాపించాడు. ఆ కంపెనీ చాలా వృద్ధి చెందింది. 2010లో దాన్ని 20 బిలియన్ డాలర్లకు క్రాఫ్ట్ ఫుడ్స్ గ్రూపు అనే అమెరికన్ సంస్థ తీసుకుంది. 2012 నాటికి దాని పేరు మెండెలెజ్ ఇంటర్నేషనల్‌గా మారింది. బ్రెగ్జిట్ తర్వాత బ్రిటన్‌లో ఇంగ్లీషు ఐడెంటిటీ కోసం తపన పెరిగింది. 'కాడ్‌బరీ కంపెనీ యిప్పుడు అమెరికన్ల వశమైంది. డబ్బు తప్ప అమెరికన్లకు మన సెంటిమెంట్లేం తెలుసు? అందుకే యిలా జరుగుతోంది' అనే భావన ప్రజల్లో వ్యాపిస్తోంది. ఆ సెంటిమెంటును ప్రతిబింబించేట్లు యార్క్ ఆర్చిబిషప్ జాన్ సెంటామూ "ఈ కంపెనీని స్థాపించిన కాడ్‌బరీకి క్రైస్తవ మతాచారాలంటే ఎంతో గౌరవం. ఆయన తన కార్మికుల కోసం యిళ్లు కట్టించడమే కాక, చర్చిలు కూడా కట్టించాడు. ఈస్టర్ పండగ జరుపుకోవడానికి ప్రాతిపదిక ఐన మతవిశ్వాసాన్ని వీళ్లు ఎగరగొట్టేస్తున్నారు. దీనిలో 'ఈస్టర్' పదాన్ని తొలగించడం కాడ్‌బరీ స్మృతిని అవమానించడమే (స్పిటింగ్ ఆన్ హిజ్ గ్రేవ్)" అన్నాడు.

దీనికి సమాధానమిస్తూ కాడ్‌బరీ, నేషనల్ ట్రస్టు 'మేం ఈస్టర్ పేరు తీసేయలేదు. కాంపెయిన్ పేరులో మాత్రం ఈస్టర్ లేదు కానీ మా వెబ్‌సైట్లలో, పబ్లిసిటీ మెటీరియల్స్‌లో పదేపదే ఈస్టర్ గురించి ప్రస్తావించాం. మొత్తం 13 వేల చోట్ల ఈస్టర్ పేరు వుంది, గమనించండి. మాకు ఈస్టర్‌పై భక్తి లేక కాదు, కేవలం క్రైస్తవులే కాక అన్ని మతాల వారు దీనిలో పాలుపంచుకోవాలనే సదుద్దేశంతో ఈస్టర్ పేరు వాడలేదంతే.' అన్నారు. కానీ ఈ వివరణపై బ్రిటన్ ప్రధాని థెరిసా మే కూడా సంతృప్తి చెందలేదు. "నేను ఒక వికార్ (పూజారి) కూతుర్నే కాదు, నేషనల్ ట్రస్టు సభ్యురాల్ని కూడా. వాళ్లు చేస్తున్న పని అసంబద్ధంగా (రిడిక్యులస్) వుంది." అంది. నేషనల్ ట్రస్టు సభ్యులు కొందరు ఈ అంశంపై అలిగి, తమ సభ్యత్వాలకు రాజీనామా యిచ్చేద్దామనుకుంటున్నారట. ఏప్రిల్ 16 న రాబోయే ఈస్టర్‌లోగా యింకేమైనా ప్రకటనలు వస్తాయేమో చూడాలి.

అయితే అసలైన చమత్కారం యింకోటి వుంది. ఏ కాడ్‌బరీ పేరు చెప్పి చర్చి ఆఫ్ ఇంగ్లండు యింత రగడ చేస్తోందో, ఆయన క్రైస్తవంలో క్వాకర్ తెగకు చెందినవాడు. ఆ మాటకు అర్థం స్నేహితులని. దాన్ని రెలిజియస్ సొసైటీ ఆఫ్ ఫ్రెండ్స్‌గా వ్యవహరిస్తారు. వాళ్ల దృష్టిలో ప్రతి మానవుడిలో దైవం వుంటాడు. అందువలన ఒకరిని ప్రత్యేకంగా దేవుడు లేదా పూజారి అననక్కరలేదు. విశ్వాసం వున్న ప్రతివాడూ పూజారే. క్రిస్మస్, ఈస్టర్ వంటి పండుగలు జరపనవసరం లేదు. కాడ్‌బరీ కూడా క్వాకర్ కాబట్టి ఆయన తన జీవితకాలంలో ఎప్పుడూ ఈస్టర్ జరపలేదు. ఈ విషయాన్ని ఆయన వారసులు చెపుతున్నారు. "ఇప్పుడీ కాంపెయిన్‌లో ఈస్టర్ పేరు లేకపోవడం చేత ఆయన ఆత్మ శాంతించదనడం అర్థరహితం. అనవసరంగా ఆయన పేరు దీనిలోకి లాగకండి." అని ప్రకటించారు. ఒక పరిశీలకుడు 'టీ కప్పులో తుపాను అంటూ వుంటాం కదా, యిది గుడ్డులో తుపాను' అని చమత్కరించాడు కానీ పిల్లల కోసం ఉద్దేశించిన యాడ్ కాంపెయిన్ పేరు విషయంలో ప్రధాని దగ్గర్నుంచి కలగచేసుకోవాలా? అనే ప్రశ్న మనసులో మెదిలితే పరాయి శక్తుల బూచి చూపించి జాతీయతావాదాన్ని రెచ్చగొట్టడం బ్రిటన్‌లోనూ జరుగుతోందన్నమాట అనే సమాధానం వస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**ఏప్రిల్ 13** **ఎమ్బీయస్ : ఉదారవాద విద్యాలయంపై హంగరీ కన్నెర్ర**

రైటిస్టు భావాలున్న హంగరీ ప్రధాని విక్టర్ ఆర్బన్ ఉదారవాదానికి, స్వతంత్ర భావాలకు నిలయంగా బుడాపెస్టులో వున్న సెంట్రల్ యూరోపియన్ యూనివర్శిటీపై, దాని వ్యవస్థాపకుడు, దాత అయిన జార్జి సోరోస్‌పై కత్తికట్టాడు. ఆ యూనివర్శిటీని మూతవేసే పరిస్థితి కల్పించడానికి 199 మంది సభ్యులున్న పార్లమెంటు ద్వారా ఒక చట్టం చేయించాడు. గతవారం హంగేరియన్ పార్లమెంటులో ఆ బిల్లుకు 123 ఓట్లు అనుకూలంగా, 38 ఓట్లు ప్రతికూలంగా పడ్డాయి. దీనికి వెనుక ట్రంప్‌తో ముడిపడిన రాజకీయ నేపథ్యం వుంది. ప్రధాన పాత్రధారులైన సోరోస్, అర్బన్‌ల గురించి కాస్త తెలుసుకుంటేనే కథ అర్థమవుతుంది.

జార్జి సోరోస్ 1930లో హంగేరీలోని బుడాపెస్టులో పుట్టాడు. నాజీలు తమ దేశాన్ని ఆక్రమించినప్పుడు దేశం విడిచి పారిపోయాడు. 1947లో ఇంగ్లండు చేరి, లండన్ స్కూలు ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకుని, బ్యాంకుల్లో పనిచేసి, 1969లో హెడ్జ్ ఫండ్ బిజినెస్‌లోకి దిగాడు. అక్కణ్నుంచి ఫండ్ మేనేజ్‌మెంట్‌లోకి వెళ్లి విపరీతంగా సంపాదించాడు. తన వ్యూహాత్మక పెట్టుబడులతో 1992లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండునే గడగడలాడించాడు. అమెరికాలో స్థిరపడి పౌరసత్వం తీసుకున్నాడు. అతని ఆస్తి 25 బిలియన్ డాలర్లు వుంటుందని అంచనా. ప్రపంచంలోని తొలి 30 మంది అత్యంత ధనికులలో అతను ఒకడు. అయితే అతను మహాదాత కూడా. కమ్యూనిస్టు వ్యతిరేక, ఉదారవాద ప్రజాస్వామ్య విధానాలను సమర్థించడానికి ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ అని పెట్టి 1979 నుంచి 2011 మధ్య 11 బిలియన్ డాలర్లు విరాళాలుగా యిచ్చాడు. 1980, 1990లలో రష్యా పతనం తర్వాత తూర్పు యూరోప్ దేశాలు కమ్యూనిజం నుంచి బయటకు వచ్చి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆర్థిక సాయం అందించాడు.

1991లో తన సొంతవూరు బుడాపెస్టులో సెంట్రల్ యూరోపియన్ యూనివర్శిటీ నెలకొల్పి తన లిబరల్ భావాలకు అనుగుణంగా

దాన్ని తీర్చిదిద్దాడు. దాన్ని న్యూయార్క్‌లో రిజిస్టరు చేయించాడు. ప్రస్తుతం వున్న 1440 మంది మాస్టర్స్, రిసెర్చ్ విద్యార్థుల్లో 335 మంది హంగరీవారు, తక్కినవారు 107 దేశాల నుంచి వచ్చినవారు. అన్ని దేశాలలోను భావప్రకటనా స్వేచ్ఛ వుండాలని, ప్రజాస్వామ్యం నెలకొనాలని వారు భావించి, దాని సాధించడానికి చర్చలు జరుపుతూంటారు. ఇటీవల శరణార్థులుగా వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు కూడా. సోరోస్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పడదు. ట్రంప్ మైనారిటీ వ్యతిరేక, శరణార్థి వ్యతిరేక, విదేశీవలసల వ్యతిరేక భావాలను సోరోస్ అసహ్యించుకుంటాడు. ఈ మధ్యే "వైట్ హౌస్‌ను ప్రస్తుతం ఆక్రమించిన వ్యక్తి ఒక ఇంపోస్టర్ (మారువేషగాడు), రాజకీయంగా టక్కరి, కాబోయే నియంత" అన్నాడు. ట్రంప్ బదులు తీర్చుకోవాలనుకున్నాడు. తనలాటి భావాలే కలిగి వుండి, హంగరీలో ప్రధానిగా వున్న తన మిత్రుడు విక్టర్ అర్బన్‌ను గిల్లాడు. దాని ఫలితమే యీ కొత్త చట్టం!

అర్బన్ 1963లో పుట్టాడు. బుడాపెస్టు యూనివర్శిటీలో లా చదివాడు. ఫుట్‌బాల్ ఆటగాడిగా పేరు తెచ్చుకున్నాడు. 1989లో సోవియత్ సైన్యాలు దేశం విడిచి వెళ్లిపోవాలని, అప్పుడే ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని ప్రకటించి అందరి దృష్టినీ ఆకర్షించాడు. అదే భావాలున్న సోరోస్ అతన్ని యిష్టపడి స్కాలర్‌షిప్ యిస్తే ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి వెళ్లి బ్రిటిష్ లిబరల్ పొలిటికల్ ఫిలాసఫీని అధ్యయనం చేశాడు. హంగరీ అనేక పార్టీలుండే ప్రజాస్వామ్య దేశంలా మారినప్పుడు ఎన్నికలలో నిలిచి 1990లో ఎంపీగా గెలిచాడు. 1993లో ఫెడరేషన్ ఆఫ్ యంగ్ డెమొక్రాట్స్ (ఫిడెస్‌జ్)కు నాయకత్వం వహించాడు. దాన్ని రైటిస్టు భావజాలంవైపు నడిపించి, అదే భావాలతో వుండే పార్టీలతో కలిసి 1998లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పరచి, ప్రధాని అయ్యాడు. అమెరికా నేతృత్వంలోని నాటోలోకి హంగరీని చేర్పించాడు. ఆర్థిక ప్రగతి సాధిస్తూనే ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచగలిగాడు. కానీ అవినీతి ఆరోపణల్లో చిక్కుకోవడం చేత నాలుగేళ్లలో పదవి పోగొట్టుకుని 8 ఏళ్ల పాటు ప్రతిపక్షంలో వుండిపోవలసి వచ్చింది.

ప్రతిపక్షంలో వుండగా అతను పాప్యులిస్టుగా, విభజనవాదిగా వున్నాడు. అధికారంలో వున్న వామపక్ష ప్రభుత్వనేతలు అంతఃకలహాల్లో మునగడంతో ఓడిపోయి అర్బన్, అతనితో పొత్తు పెట్టుకున్న క్రిస్టియన్ డెమొక్రాట్లు 2010లో గెలిచి అధికారంలోకి వచ్చారు. 2014లో మళ్లీ ఎన్నికయ్యారు. అర్బన్ ప్రధానిగా అనేక విధానపరమైన మార్పులు తెచ్చాడు. 2011లో తన పార్టీకి మేలు కలిగేట్లా పార్లమెంటు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేసి, ఎంపీల సంఖ్యను సగానికి తగ్గించేశాడు. (2013లో హంగరీ కోర్టు దీన్ని కొట్టివేసింది) యూరోపియన్ యూనియన్, ఐఎంఎఫ్ వారిస్తున్నా తమ సెంట్రల్ బ్యాంకు చట్టాన్ని మార్చేశాడు. యూరోపియన్ కమిషన్ అతని ప్రభుత్వంపై న్యాయపరమైన చర్య తీసుకుంది. అన్నిటా నియంతృత్వపు, కన్సర్వేటివిస్టు పోకడలు కనబడడంతో సోరోస్ అతనితో విభేదించసాగాడు. యూరోప్‌లో రాజకీయపరమైన అలజడి పెరిగి వలసలు పెరగడంతో అర్బన్ శరణార్థులకు వ్యతిరేకంగా ప్రకటనలు యిచ్చి యూరోపియన్ యూనియన్ విధానాలను ఎదిరించసాగాడు. ఇటీవల ఉపయెన్నికలలో రెండు సీట్లలో అతని పార్టీ ఓడిపోయింది. అతని కంటె అతివాద రైటిస్టు పార్టీ అయిన జోబిక్ ఒక సీటు గెలిచింది. 2018లో రాబోయే ఎన్నికలలో ఆ పార్టీ మధ్యేమార్గానికి చెందిన ఓటర్ల సాయంతో అధికారంలోకి వస్తుందేమోనన్న భయంతో అర్బన్ మరింత జాతీయవాదం ప్రదర్శించసాగాడు. ట్రంప్ ధోరణిలోనే సెర్బియా సరిహద్దులో 175 కి.మీ.ల కంచె కడతానంటున్నాడు. శరణార్థుల ఆక్రమణలో హంగరీ నలిగిపోతోందన్నాడు. పనిలో పనిగా సోరోస్‌పై విషం చిమ్ముతూ అతను హంగరీకి శరణార్థుల వలసను ప్రోత్సహిస్తున్నాడని, హంగరీ రాజకీయాల్లో వేలు పెడుతున్నాడని ఆరోపించాడు.

సోరోస్‌పై కసి తీర్చుకోవడానికి ట్రంప్‌కు ఇలాటి అర్బన్ అనువుగా తోచాడు. బహుశా ట్రంప్ ప్రోద్బలంతో అర్బన్ నేతృత్వంలోని హంగరీ ప్రభుత్వం హంగరీలో నడుస్తున్న 27 విదేశీ విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు విధిస్తూ చట్టం జారీ చేసింది. దాని ప్రకారం సెంట్రల్ యూరోపియన్‌లా విదేశంలో రిజిస్టరయిన యూనివర్శిటీలు తమ స్వదేశంలో 2018 ఫిబ్రవరిలోగా క్యాంపస్ నెలకొల్పాలి. ఆ దేశప్రభుత్వం హంగరీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలి. సోరోస్‌కు ఎంత డబ్బున్నా కొన్ని నెలల్లో న్యూయార్క్‌లో క్యాంపస్ నిర్మించడం అసాధ్యం. ఇక సోరోస్ అంటే మండిపడే ట్రంప్, అర్బన్ అతని యూనివర్శిటీ కోసం ఒప్పందం మీద సంతకాలు పెడతారా? ఛస్తే పెట్టరు. ఆ విధంగా యూనివర్శిటీ మూతపడేట్లు పన్నాగం పన్నారు. ఒకవేళ అది కొనసాగాలంటే తన పేరు మార్చుకుని, న్యూయార్కులో క్యాంపస్ పెట్టి అమెరికన్, హంగరీ ప్రభుత్వాలు చెప్పినట్లల్లా ఆడాలి.

పాలకులందరికీ మేధావులన్నా, ఆలోచనాపరులన్నా చికాకు. ఓటర్లు విద్యావంతులైతే తమకు ముప్పు వస్తుందని భయపడతారు. చౌకగా ఆహారపదార్థాలు, మద్యపానీయాలు, పెళ్లి ఖర్చులు, పండగ కానుకలు, పెన్షన్లు, నిరుద్యోగ భృతులు యివ్వడానికి డబ్బు వెచ్చిస్తారు కానీ నాణ్యమైన ఉచిత విద్య అందించి, వారిలో జ్ఞానం పెంపొందించుదామని కోరుకోరు. మితిమీరిన జాతీయవాదంతో, ప్రాంతీయవాదంతో వారిని జోకొట్టి, వారిని వర్గాలుగా విభజించి ఒకరిపై మరొకరిని ఉసిగొల్పి తమ పాలన నిరాటంకంగా సాగేట్లా చూస్తారు. వారిలో ఉదార భావాలను వ్యాప్తి చేద్దామని చూసే, స్వతంత్రంగా ఆలోచించేందుకు అనువుగా తయారుచేసే విద్యావంతులను, విద్యాలయాలను భూస్థాపితం చేద్దామని చూస్తారు. లోకమంతా యిదే పోకడ. హంగరీది తాజా ఉదాహరణ. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017) (ఫోటో బుడాపెస్టులోని సెంట్రల్ యూరోపియన్ యూనివర్శిటీ (ఎడమవైపు సోరోస్, కుడివైపు అర్బన్)**

ఏప్రిల్ 14, 15 శని, ఆదివారాల్లో బిజెపి ఒడిశాలోని భువనేశ్వర్‌లో జాతీయ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరుపుకుంటోంది. ఫిబ్రవరిలో జరిగిన పంచాయితీ ఎన్నికలలో బిజెపి ఘనఫలితాలను సాధించడంతో మంచి వూపులో వుంది. గత నాలుగుదఫాలుగా నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా ఏలుతూ 2019లో కూడా మళ్లీ ఎన్నికవుతాడేమో అనుకుంటూన్న తరుణంలో మొత్తం 849 జిల్లా పరిషత్ జోన్లలో బిజెపి 294 వాటిల్లో గెలుపొందింది. ఒక అసెంబ్లీ స్థానంలో రమారమి ఆరు జిల్లా పరిషత్ స్థానాలుంటాయి కాబట్టి దీన్ని అసెంబ్లీ స్థానాలుగా అనువదిస్తే 49 అసెంబ్లీ స్థానాలైంది. బిజెడి నెగ్గిన 467 స్థానాలను బట్టి 78 వస్తాయనుకోవాలి. అదే లెక్కలో 60 గెలిచిన కాంగ్రెసుకు 10 వస్తాయనుకోవాలి. మొత్తం 147 స్థానాలు కాబట్టి 78 వస్తే బిజెడియే ఐదోసారీ అధికారం చేపడుతుంది. మరి బిజెపికి ఎందుకంత ఆనందం అంటే గతంలో 2014లో దేశం మొత్తం మోదీ ప్రభంజనం వూపేస్తూ వుండగా ఒడిశాలోని 21 పార్లమెంటు స్థానాల్లో బిజెపి ఒక్కటి మాత్రమే గెలిచింది. తక్కిన యిరవై బిజెడికే! దానితో బాటే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెడికి 117 రాగా, కాంగ్రెసుకు 16, బిజెపికి 10 వచ్చాయి. మూడేళ్లు తిరిగేసరికి జిల్లా పరిషత్ ఎన్నికలలో బిజెపి బలం దాదాపు 5 రెట్లు పెరిగినట్లే కదా! ఈ ఊపును మరింత బలంగా ముందుకు తీసుకుని వెళ్లి 2019లో అధికారాన్ని కైవసం చేసుకుందామని బిజెపి ప్రయత్నిస్తోంది. జిల్లా పరిషత్ ఎన్నికలలో ఓటమిని బిజెడి జీర్ణం చేసుకోలేకపోతోంది. దాని నాయకులు ఒకరినొకరు నిందించుకుంటున్నారు. ఇప్పటివరకు నవీన్ ఎవరి పక్షాన నోరు విప్పలేదు. అతని స్వభావమే అంత.

70 ఏళ్ల నవీన్ ఒడిశాకు దశాబ్దాలపాటు నాయకుడిగా వెలిగిన బిజూ పట్నాయక్ కొడుకు. బిజూ కరిజ్మాటిక్ లీడర్, చొరవ ఎక్కువ. మొదట్లో కాంగ్రెసు నాయకుడిగా, తర్వాత ప్రతిపక్ష నాయకుడిగా జాతీయ రాజకీయాల్లో కూడా ఒక వెలుగు వెలిగాడు. నవీన్, అతని తమ్ముడు హిమాంశు దెహరాదూన్‌లో, ఢిల్లీలో చదువుకున్నారు. ఒడిశా బయటే వుండడంతో ఒడియా రాదు. సభల్లో ఒడియా ఉపన్యాసాన్ని రోమన్ లిపిలో రాసుకుని చదువుతాడు. హిందీ, ఇంగ్లీషు, ఫ్రెంచ్ భాషలు బాగా వచ్చు. పుస్తకరచయిత కూడా. 1997లో బిజూ పట్నాయక్ చనిపోయాడు. అప్పుడతను జనతా దళ్ పార్టీ నాయకుడిగా వున్నాడు. అతని అనుచరుల బలవంతం మేరకు నవీన్ అయిష్టంగా రాజకీయాల్లోకి రావలసి వచ్చింది. తండ్రి స్థానంలో ఆస్కా నియోజకవర్గం ఉపయెన్నికలో నెగ్గి పార్లమెంటుకి వెళ్లాడు. ఇతని విద్వత్తు చూసి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ పాలకులు అనేక కమిటీల్లో స్థానం యిచ్చారు. పై ఏడాది నేషనల్ ఫ్రంట్, దానితో బాటు జనతా దళ్ విచ్ఛిత్తి కావడంతో నవీన్ తన తండ్రి పేర బిజూ జనతా దళ్ (బిజెడి) అని పార్టీ పెట్టి వాజపేయి నేతృత్వంలోని ఎన్‌డిఏలో భాగస్వామిగా మారాడు. కాబినెట్‌లో మంత్రిగా చేరాడు. 1999 అసెంబ్లీ ఎన్నికలలో బిజెడి-బిజెపి కూటమి జానకీ వల్లభ్ పట్నాయక్ నేతృత్వంలోని కాంగ్రెసుపై ఘనవిజయం సాధించడంతో కేంద్రపదవికి రాజీనామా చేసి 2000లో ఒడిశా ముఖ్యమంత్రి అయ్యాడు. తన రాష్ట్రపు భాష రాని ముఖ్యమంత్రి అని అతన్ని ఎద్దేవా చేస్తారు.

కానీ అతని మృదుస్వభావం, మితభాషిత్వం, నిరాడంబరత, అవినీతికి దూరంగా వుంటూ అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులను, అధికారులను దండిస్తాడనే యిమేజి ప్రజలకు దగ్గర చేసింది. తన తండ్రి పేర పార్టీ పెట్టినా మాటిమాటికీ తండ్రి పేరు స్మరించడు. అవివాహితుడు. తన బంధువులను, తన కులస్తులను చేరదీసి పదవులు యివ్వడు. మీడియాతో పెద్దగా మాట్లాడడు. సహజ వనరులు అనేకం వున్నా ఒడిశా అనేక విధాలుగా వెనుకబడిన ప్రాంతం. రైతు ఆదాయం విషయంలో జాతీయ సగటు కంటె ఒడిశా రైతు ఆదాయం 20-25% తక్కువే వుంటుంది. తండ్రిలాగా పరిపాలనా దక్షుడిగా పేరు తెచ్చుకుని, అధికారులను అదుపుచేస్తూ, ప్రోత్సహిస్తూ పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఏర్పరచాడు. పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు అనేకం చేపట్టాడు. దారిద్ర్య రేఖ (బిపిఎల్) కంటె దిగువ వున్న 82 లక్షల కుటుంబాలను రేఖ పైకి తెచ్చామని అతని ప్రభుత్వం చెప్పుకుంటుంది. దేశంలోని రైతు ఆత్మహత్యలలో 3-7% ఒడిశాలో జరుగుతున్నాయన్న అంశం ప్రతిపక్షం అసెంబ్లీలో ప్రస్తావించినపుడు సంబంధిత మంత్రి ఆ విషయం ఒప్పుకుంటూనే కానీ ఆ సంఖ్య ఎపి, యుపి, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల కంటె తక్కువని ఎత్తి చూపాడు. నిజానికి ఒడిశా మెల్లమెల్లగా ఎదుగుతూన్న విషయాన్ని ఎవరూ విస్మరించలేరు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు ప్రభుత్వస్పందన చాలా ప్రశంసనీయంగా వుంటోందన్న పేరు కూడా వచ్చింది. 2013 అక్టోబరులో ఫైలాన్ తుపాను వచ్చినపుడు 10 లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రదేశాలకు సమర్థవంతంగా తరలించినందుకు యునైటెడ్ నేషన్స్ నవీన్‌ను సత్కరించింది. అప్పుడప్పుడు అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు వస్తూన్నా, పెద్దగా వివాదాల్లో చిక్కుకోకుండా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తూ పోతున్నాడు నవీన్.

అతని రాజకీయాలకు వస్తే 2004లో బిజెపితో కలిసి అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి కాంగ్రెసును ఓడించి ఘనవిజయం సాధించాడు. అయితే సంకీర్ణ ప్రభుత్వం సరిగ్గా సాగలేదు. బిజెడి-బిజెపి మధ్య కీచులాటలు ప్రారంభమయ్యాయి. 2007-08 సంఎలలో కంధమల్ జిల్లాలో బజరంగ్ దళ్ కార్యకలాపాలు, స్వామి లక్ష్మణానంద సరస్వతి హత్య కారణంగా సంఘటనలు కారణంగా చూపి, బిజెపిని మతతత్వ పార్టీ అని నిందిస్తూ నవీన్ ఎన్‌డిఏతో తెగతెంపులు చేసుకున్నాడు. అయితే యుపిఏతో చేతులు కలపలేదు. 2009 ఎన్నికలలో మూడో ఫ్రంట్‌కు మద్దతిచ్చాడు. ఒడిశాలో ఒంటరిగా పోటీ చేశాడు. 147 అసెంబ్లీ స్థానాల్లో 103, 21 పార్లమెంటు స్థానాల్లో 14 గెలిచాడు. బిజెపి తీవ్రంగా నష్టపోయింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యుపిఏ ఒడిశా కాంగ్రెసు

నాయకుడు జానకీ వల్లభ్‌ను అసాం గవర్నరుగా నియమించింది. ఆయన 2015లో చనిపోయాడు. జానకీ వల్లభ్ అలా వెళ్లిపోయి కాంగ్రెసులో ప్రఖ్యాత నాయకుడు ఎవరూ లేకపోవడం, బిజెపికి రాష్ట్రస్థాయిలో పెద్ద నాయకుడు లేకపోవడం నవీన్‌కు కలిసి వచ్చింది. 2014 ఎన్నికలలో కళ్లు చెదిరే విజయాన్ని అందుకున్నాడు.

అది గ్రహించిన బిజెపి ఒడిశాలో తమ పార్టీ తరఫున కాబోయే ముఖ్యమంత్రిని ప్రొజెక్టు చేయడం మంచిదనుకుంది. ప్రస్తుతం కేంద్రమంత్రిగా వున్న ధర్మేంద్ర ప్రధాన్‌కు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానపాత్ర యిస్తోంది. దేశంలో బిజెపి ప్రాభవం పెరుగుతోంది కాబట్టి, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగి జిల్లా పరిషత్ ఎన్నికలలో మంచి ఫలితాలు రాబట్టింది. కారణాలు విశ్లేషించిన పరిశీలకులు ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెసు నాయకులు లేక, ఉన్నవారు అంతఃకలహాలలో మునగడమే అని తేల్చారు. 2016లో సిఎల్‌పి-పిసిసి నాయకులు రాష్ట్ర అధ్యక్ష పదవితో తన్నుకులాడుతూ వుంటే అధిష్టానం ఉదాసీనం వహించి సమస్యను పరిష్కరించలేదు. ఎట్టి పరిస్థితుల్లో కూడా కాంగ్రెసుకు 20% ఓటు పడుతూ వుండేది. ఇప్పుడది యిగిరిపోయింది. దాంతో రంగంలో బిజెడి, బిజెపి మాత్రమే మిగిలాయి. బిజెడి అంటే పడని వారు, అధికార పక్షంలో అసమ్మతి నాయకుల అనుచరులు బిజెపిని ఎంచుకున్నారు. నరేంద్ర మోదీ ఆకర్షణ ఎటూ వుంది. 17 ఏళ్లగా ఏలుతున్న ప్రభుత్వంపై సహజమైన వ్యతిరేకతా వుంది. రేషన్ కార్డుల పంపిణీ సరిగ్గా జరగకపోవడం, అంటువ్యాధులు ప్రబలడం, టీచర్లు ఎన్నికలు బహిష్కరించడం వంటి స్థానిక కారణాలూ వున్నాయి. అసంతృప్తితో వున్న కార్యకర్తలను స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని, తమ ముఠాలకే తప్ప తక్కినవారికి డబ్బులు పంపిణీ చేయలేదని కూడా చెప్పారు. ఏం చేసినా, చేయకపోయినా తామే గెలుస్తామన్న ధీమాతో వున్న బిజెడి ఫలితాలతో కంగు తింది. దామోదర్ రౌత్ అనే సీనియర్ మంత్రి 'పార్టీ ఓటమికి కారణం పార్టీలోని విభీషణులే' అని స్టేటుమెంటు యిచ్చి కలవరం రేపాడు.

ఆ విభీషణుడి పేరు బయటపెట్టడానికి నిశ్చయించుకున్నాడు బిజెడి ఎంపీ తథాగత శతపథి. ఇతను పూర్వ ముఖ్యమంత్రి నందినీ శతపథి కుమారుడు. అప్పట్లో బిజూ పట్నాయక్ పాత కాంగ్రెసుతో కలిసి వుంటే, నందిని ఇందిరా గాంధీ పక్షాన వుండేది. ఎమర్జన్సీ సమయంలో ఒడిశాలో నియంతృత్వం చలాయించింది. ఆమె చిన్న కొడుకు తథాగత సంజయ్ గాంధీ అడుగుజాడల్లో నడిచి ఒడిశా సంజయ్ అనే పేరు తెచ్చుకున్నాడు. తర్వాత సంజయ్ నందినిని, తథాగతను తన పార్టీలోంచి తరిమివేశాడు. కాలక్రమంలో తథాగత ఒడియా పత్రిక "ధరిత్రి", దాని ఇంగ్లీషు వెర్షన్ "ఒడిశా పోస్ట్"కు ఎడిటర్-పబ్లిషర్ అయ్యాడు. నవీన్ పట్నాయక్ పెట్టిన బిజెడిలో చేరాడు. 2000లో అతన్ని పార్టీ నుంచి బహిష్కరిస్తే బయటకు వెళ్లి ఒడిశా గణ పరిషద్‌లో చేరి దానికి జనరల్ సెక్రటరీ అయ్యాడు. నవీన్ ముఖ్యమంత్రి అయ్యాక తన పేపరు ద్వారా అతని విధానాలను తీవ్రంగా విమర్శించేవాడు. 2004లో ఎన్నికలకు ముందు నవీన్‌తో రాజీ పడి మళ్లీ పార్టీలో చేరాడు. 'మా పార్టీ కాంగ్రెసుతో చేతులు కలుపుతోంది కాబట్టి అది నచ్చక బయటకు వచ్చేశాను' అని చెప్పుకున్నాడు. 2014లో ఢెంకనాల్ పార్లమెంటు నియోజకవర్గం ద్వారా నెగ్గిన తథాగతను నవీన్ తన పార్టీకి లోకసభలో విప్‌గా చేశాడు. పంచాయితీ ఎన్నికల ఫలితాల తర్వాత నెల్లాళ్లకు మార్చి 27న తథాగత 'బిజెపి ఎడిఎంకె పార్టీని చీల్చినట్లే తమ పార్టీనీ పార్లమెంటులోను, అసెంబ్లీలోను చీల్చుదామని ప్రయత్నిస్తోంద'ని ఆరోపిస్తూ ట్వీట్ల యుద్ధం మొదలుపెట్టాడు. బిజెపి పక్షాన ఆ పని చేయడానికి తమ పార్టీ ఎంపీ ఒకడు ప్రయత్నిస్తున్నాడని పుకార్లు వస్తున్నాయని కూడా ట్వీట్ చేశాడు.

ఆ ఎంపీ వేరెవరో కాదు వైజయంత్ పండా అని అనుకోసాగారు. జయ్ పాండా అని అందరూ వ్యవహరించే 53 ఏళ్ల వైజయంత్ మిషిగన్ టెక్నలాజికల్ యూనివర్శిటీలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ చదివాడు. కార్పోరేట్ సెక్టార్‌లో పనిచేసి రాజకీయాల్లోకి వచ్చాడు. మొదట్లో బిజూ పట్నాయక్‌కు, తర్వాత నవీన్ పట్నాయక్‌కు సాయపడ్డాడు. అతని భార్య జగీ మంగత్ పండా విదేశాల్లో చదువుకుని ఇండస్ట్రియలిస్టుగా మారింది. జయ్ పాండా ఎంపీగా అనేక అంశాల్లో చాలా చురుగ్గా వుంటాడు. 'తథాగత ప్రస్తావిస్తున్న ఎంపీవి నువ్వేనా?' అని ఎవరో ట్విట్టర్‌లో అడిగితే 'పార్టీలోంచి సస్పెండ్ కావడం, ఇంకో పార్టీలో చేరడం వంటి విషయాల్లో మా విప్‌కు చాలా అనుభవం వుంది' అని జవాబిచ్చాడు. అంతేకాదు మార్చి 28న ఒక ఒడియా దినపత్రికలో పంచాయితీ ఫలితాల తర్వాత బిజెడి పార్టీ తనను తాను ఆత్మావలోకనం చేసుకోవలసిన తరుణం వచ్చిందంటూ వ్యాసం రాశాడు. 'అధికారులు ప్రభుత్వాన్నే కాదు, పార్టీని కూడా నడిపేస్తున్నారు' అంటూ ఆరోపించాడు. పార్టీ అధినాయకత్వంపై యీ ఘాటు విమర్శ చేసేముందు నవీన్‌తో మాట్లాడి వుండవలసిందని పార్టీ సీనియర్ నాయకులు భావిస్తున్నారు. నిజానికి యీ వ్యాసం ప్రచురణకు ఐదు రోజుల ముందే పత్రికాఫీసుకి చేరింది. కానీ తథాగత ట్వీట్, దానికి జయ్ పాండా ప్రతి ట్వీట్ వెలువడ్డాకనే యీ వ్యాసాన్ని పత్రిక ప్రచురించింది.

ఇలా యిద్దరు నాయకులు కలహించడం నవీన్‌ను కలవరపరచి వుంటుంది. 2012లో అతనికి అత్యంత సన్నిహితుడైన ఒక నాయకుడు అతనిపై కుట్ర పన్నితే నవీన్ టివి కెమెరాల ఎదురుగానే అతన్ని 'బేఇమాన్' (నీతిలేని వాడు) అని వర్ణించి అవమానకరంగా అతనికి ఉద్వాసన చెప్పాడు. అవసరమైతే కాఠిన్యం వహించగలడని అప్పుడే తెలియవచ్చింది. ఈసారి అతను యింకా ఏమీ మాట్లాడలేదు కానీ పత్రికలో యీ వ్యాసం రాగానే అతని అక్క, ప్రఖ్యాత రచయిత్రి గీతా మెహతా భువనేశ్వర్‌కు వచ్చి నవీన్ నివాస్‌లో సమావేశాలు నిర్వహించింది. గీత ఇండియాలో విద్యాభ్యాసం పూర్తయాక కేంబ్రిజ్ యూనివర్శిటీలో చదువుకుంది. ఆమె రచనలు 21 భాషల్లో అనువదితమయ్యాయి. అంతేకాదు, డాక్యుమెంటరీలు తీస్తుంది కూడా. యుకె, యుఎస్, యూరోపియన్ టెలివిజన్ నెట్‌వర్క్‌లు వాటిని ప్రసారం చేస్తాయి. తండ్రిలాగే సాహసి. 1970-71లో అమెరికన్ టీవీ నెట్‌వర్క్ ఎన్‌బిసి తరఫున బంగ్లాదేశ్ యుద్ధంలో వార్ కరస్పాండెంట్‌గా పనిచేసి ఆ సమాచారంతో 'డేట్‌లైన్ బంగ్లాదేశ్' అనే సినిమా కూడా తీసింది. సోనీ మెహతాని పెళ్లాడింది.

న్యూయార్క్, లండన్, ఢిల్లీల మధ్య తిరుగుతూ వుంటుంది. ఆవిడ యిప్పటిదాకా రాజకీయాల్లోకి రాలేదు. ఇప్పుడు హఠాత్తుగా వచ్చి చర్చలు జరపడంతో ఆవిడ రాజకీయాల్లోకి వస్తోందన్న పుకారు వచ్చింది. తన ఎంపీల మధ్య వివాదం గురించి మౌనాన్ని ఆశ్రయించిన నవీన్ అక్క గీత గురించి అడిగినప్పుడు మాత్రం ఆమె రాజకీయాల్లోకి రాదని ధృవీకరించారు. బిజెపి సమావేశాల తర్వాత ఒడిశా రాజకీయాలు రాజుకుంటాయని ఊహించవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017) (ఫోటోలు – తథాగత శతపథి, జయ్ పండా, నవీన్ పట్నాయక్, )**

**ఏప్రిల్ 16 – 17 ఎమ్బీయస్ : జాతీయతావాదంలో తప్పేముంది? – 1/2**

యూరోప్‌లో, యితర దేశాల్లో యిటీవల పెరుగుతున్న విదేశీ వ్యతిరేక విధానాల గురించి, భూమిపుత్ర వాదం గురించి, విదేశీ జాతీయతావాదం గురించి నేను కొన్ని వ్యాసాలు రాశాను, యింకా రాయబోతున్నాను. వాటిలో జాతీయవాదం గురించి ప్రస్తావన రాగానే కొందరు పాఠకులు అడుగుతూంటారు – జాతీయవాదంలో తప్పేముంది? అని. చాలా సహజమైన ప్రశ్న. కానీ అది పాత్రికేయ రంగంలో ఏ అర్థంలో వాడబడుతోందో దాని గురించి వివరణ యిచ్చే అవసరం పడుతోంది. మొదటగా గ్రహించవలసినది ప్రతి వ్యక్తికి జాతిగౌరవం, దేశభక్తి సహజమైనవి. ఆ భావం ఎక్కణ్నుంచి వస్తుంది? ప్రతివాడికి అహంకారం పుట్టుకతో వుంటుంది. దాన్ని మన కుటుంబసభ్యులు పెంచి పోషిస్తారు. మనకు మనం గొప్పవాళ్లం. మన వూరు, మన ప్రాంతం, మన దేశం, మన భాష, మన కుటుంబం, మన ఉపకులం, మన కులం, మన మతం, మళ్లీ మతంలో మన వర్గం, అన్నీ గొప్పవే. చిన్నప్పటినుంచి యివే మనకు నేర్పుతారు, మనమూ నమ్ముతాం. మన పాఠ్యపుస్తకాలలోనూ దేశభక్తి నూరిపోస్తారు. జాతివీరుల గురించి చెప్తారు. అందువలన జాతీయతావాదం సహజంగానే వుంటుంది. మన విషయంలో ఇండియా, మరొకరి విషయంలో ఇంగ్లండు లేదా హాలండు – ప్రతివాడికీ వాడి దేశం గొప్పదే. తన జాతి గొప్పదే. మరి కొన్ని పాలకవర్గాలు జాతీయవాదం పేర కొత్తగా నూరిపోసేదేమిటి?

'నేను గొప్ప' అనే ఫీలింగు నుంచి 'నేనే గొప్ప, అవతలివాడు నీచం' అనుకోవడంతో చిక్కు వస్తుంది. 'నేను ఎలాగూ గొప్ప, పక్కవాడూ పాపం గొప్పవాడేమోలే' అనే సందేహంతో వున్నా చాలా చిక్కులు వుండవు. అలాటి సందేహం వున్నా లేకపోయినా పక్కవాళ్లను పట్టించుకోకుండా తమ పని తాము చూసుకుంటూ వుంటారు చాలామంది ప్రజలు. అందుకే ఏదోలా సమాజం నడిచిపోతూ వుంటుంది. ఏదో ఒక జండా పట్టుకుని అధికారంలోకి వద్దామనుకున్నవాడికి యిది గిట్టదు. అందువలన వర్గీకరణ మొదలుపెడతాడు. 'మన జాతి, మన వర్గం, మన ప్రాంతం... గొప్పది, కానీ మనం మంచితనానికి పోయి యితరులను సహిస్తున్నాం. అది అలుసుగా తీసుకుని వాళ్లు పేట్రేగిపోతున్నారు. మనతో అడుకుంటున్నారు. మన కష్టాలకు మూలం వారే' అంటూ నూరిపోస్తూ వుంటాడు. గతంలో అయితే రాజులు ఎవరికీ జవాబుదారీగా వుండేవారు కారు. వాళ్లకి అధికారం వంశానుగతంగా వచ్చేది, ప్రజల ఆమోదంతో కాదు. జాతీయత, సమసమాజ స్థాపన వంటి మాటలు వుపయోగించి ప్రజలను ఉబ్బేయాల్సిన అవసరం వారికి పడేది కాదు. కానీ రోజులు మారుతూ వచ్చాక ప్రజల్లోంచి నాయకులు రావడం మొదలయ్యాక వారిని ఎలా మెస్మరైజ్ చేసి పైకి రావాలా అని అనేక ఉపాయాలు ఆలోచించవలసిన అవసరం పడింది.

చరిత్ర చూస్తే ఏ నియంతైనా సరే తొలిదశలో శ్రామికవర్గాన్ని ధనికవర్గం దోచుకుంటోంది అనే నినాదంతో మొదలుపెడతాడు. నెపోలియన్ విప్లవసేనానిగా మొదలై చివరకు తనే రాజరికం నెలకొల్పి, చక్రవర్తిగా తేలాడు. ఆధునిక యుగంలో ప్రజల్లోంచి పైకి వద్దామనుకున్న ప్రతి నాయకుడు సోషలిజం అనే మాట వాడి తీరతాడు. లేదా ఆ భావాన్ని మరోలా వ్యక్తం చేస్తాడు. ధనికులను దోచి ఆ డబ్బంతా తమకు పంచుతాడనే ఆశతో పేదలంతా అతని పక్షాన నిలుస్తారు. ముస్సోలినీ, హిట్లర్ అందరూ సోషలిస్టులుగా మొదలుపెట్టినవారే. వీళ్లు పైకి రావడానికి కారణం – ప్రజాస్వామ్యవాదుల వైఫల్యం. ఇలాటి వర్గీకరణలు చేయని, ఘర్షణ వాతావరణాన్ని సృష్టించని సాధారణ రాజకీయవాదులు చాలామందే వుంటారు. అయితే వ్యక్తిగత స్వార్థాలుండడం చేత వాళ్లల్లో వాళ్లకు పొసగదు. ఎన్నికలలో ఎవరికీ పూర్తి బలం రాదు. కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. చేస్తారు. కానీ అంతఃకలహాల వలన ప్రభుత్వం నడవదు. ప్రజలు విసిగిపోతారు. ఎవడో గట్టివాడు వచ్చి అందరికీ బుద్ధి చెప్పాలి అని మనసులో అనుకుంటూ వుంటారు.

అలాటి సమయంలో యిలాటి ఫాసిస్టు నాయకులు ముందుకు వస్తాడు. వీళ్లకు మంచి వక్తృత్వకౌశలం వుంటుంది. వ్యవస్థను దుయ్యబట్టగలరు. ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడగలరు. మెజారిటీ జనాల్ని మెప్పించి వాళ్లను తన మాట వినేట్లా చేసుకోగలరు. సహజంగా పేద ప్రజలే ఎక్కువమంది వుంటారు కాబట్టి ధనికుల బూచి చూపించి, తనను నమ్ముకుంటే వాళ్ల జీవితాలు బాగుపడతాయని నమ్మిస్తారు. ఈ విధంగా ఓ మేరకు అధికారాన్ని కైవసం చేసుకుంటారు. అప్పుడు ప్రజాస్వామ్యవాదులు మేల్కొంటారు. తాము సంఘటితంగా లేకపోవడం చేతనే యిలా జరిగిందని తెలుసుకుని వారిలో కొందరు కూటమిగా ఏర్పడి యీ నాయకుణ్ని విమర్శించడం మొదలుపెడతారు. అప్పుడు యీ నాయకుడు కొత్త ఎత్తు ఎత్తుతాడు. తాను అచ్చమైన దేశభక్తుణ్నని, దేశం కోసం ప్రాణాలు అర్పిస్తానని, తనను ఎదిరించేవారిలో విదేశాల్లో పుట్టినవారో, విదేశాల మద్దతు వున్నవారో, విదేశీ సిద్ధాంతాలతో ప్రభావితమైన వారో వున్నారని ప్రచారం మొదలుపెడతాడు. సాధారణంగా ఒక దేశపు రాజకీయాలపై పొరుగుదేశానికి ఆసక్తి వుంటుంది. తమకు అనుకూలంగా వుండేవారు, తమతో సఖ్యంగా వుండేవారు అధికారంలోకి వస్తే మంచిదని భావిస్తూ, ఆ భావజాలం వున్నవారికి సహకారం అందిస్తూ

వుంటుంది. అలాటి సహాయం అందుకున్నవారు దేశానికి ద్రోహం చేస్తారని, దేశప్రయోజనాలను తాకట్టు పెడతారని అనుకోవడానికి లేదు. కానీ వాళ్లనలా చూపిస్తారు వీళ్లు. అలాటి సహకారం అందుకోనివాళ్లపై సైతం ఆరోపణలు చేయడానికి వెనుకాడరు.

కొన్ని విషయాల్లో ప్రజల్ని నమ్మించగలిగితే చాలు, యిక రుజువులు అడిగే ప్రజలెవరూ వుండరు. అసలు నీ మూలాలేమిటి అని కూడా అడగరు. హిట్లర్ పుట్టినది జర్మనీలో కాదు, ఆస్ట్రియాలో. అయినా జర్మనీ పేర జనాల్ని కూడగట్టి వారిలో నేషనలిజం – జాతీయతావాదం రెచ్చగొట్టాడు. అతని పార్టీ పేరేమిటో తెలుసా? "నేషనల్ సోషలిస్టు జర్మన్ వర్కర్స్ పార్టీ" నేషనలిజం, సోషలిజం రెండూ కలిపాడు. అతని కంటె సీనియరైన ముస్సోలినీని చూద్దాం. అతని పార్టీ పేరు "నేషనల్ ఫాసిస్టు పార్టీ". సిద్ధాంతరీత్యా – అది ఉదారవాదానికి విరోధి, మార్క్సిస్ట్ సోషలిజానికి వ్యతిరేకి, అలా అని మార్క్సిజానికి విరుద్ధమైన రియాక్షనరీ (విప్లవాన్ని విఫలం చేసే శక్తులు – ప్రతీప శక్తులు అంటారు తెలుగులో) సిద్ధాంతానికీ వ్యతిరేకమే. సమాజంలో వర్గవిభేదాలు వున్నాయని ఒప్పుకుంటూనే వాటిని ఘర్షణ ద్వారా కాక, చర్చల ద్వారా పరిష్కరించాలి అని ఫాసిజం ప్రతిపాదిస్తుంది. దాంతో బాటు ఇటలీ జాతీయత ఔన్నత్యాన్ని బోధిస్తుంది. తరతరాల ఇటాలియన్ సంప్రదాయాన్ని గౌరవిస్తున్నానంది. గతంలో ఈజిప్టును కూడా గెలిచిన ఇటాలియన్ పౌరుషం స్ఫూర్తిగా ఆ దేశాలను మళ్లీ గెలిచి ఘనతను తిరిగి తెస్తానంది. ముస్సోలినీ, హిట్లర్ యిద్దరూ తమ దేశాలకు వున్న చోటు సరిపోవటం లేదని, కాస్త చేయిచాచుకునే వీలుండాలని (ఎల్బో రూమ్) అంటూ పక్క దేశాలపై దాడి చేశారు. దీనికి వారి దేశప్రజలు అడ్డు చెప్పలేదు. పోనుపోను యుద్ధంలో ఓటమి ఎదురయ్యాక, అప్పుడు ప్రతిఘటన (రెసిస్టెన్స్) పుట్టుకువచ్చింది.

ఈ నియంతలు సోషలిజం పాఠాలు వల్లించినా, ఆచరణలో వాళ్లు ధనికులను దోచనూ లేదు, పేదలకు పెట్టనూ లేదు. ప్రతి నియంత మొదట్లో విదేశీ సంస్థలను జాతీయం చేస్తాడు, డబ్బున్నవాళ్ల కోరలు పీకుతానంటాడు. ప్రజలు చప్పట్లు కొట్టి మాయలో పడిపోయాక మళ్లీ వాళ్ల జోలికి వెళ్లడు. పేదల బతుకులు అలాగే అఘోరిస్తాయి. ఎవరైనా ఎదిరిస్తే నీకు దేశభక్తి లేదంటూ హుంకరిస్తాడు. వీళ్లు జాతీయతావాదాన్ని ఏ అర్థంలో ప్రయోగిస్తున్నారో జాగ్రత్తగా గమనించాలి. దేశంలోని కొందరు ప్రజలకు వ్యతిరేకంగా వారిని విడగొట్టి అధికసంఖ్యాకులను దేశభక్తి పేరుతో సంఘటితం చేయడానికి జాతీయతావాదం పేరు వాడుకుంటారు. తాము ఏం చేసినా దేశభక్తితోనే చేశామంటారు. ఒకసారి దేశం పేరుతో రెచ్చగొట్టాక ప్రజలతో ఆడుకోవచ్చు. తను చేసిన ప్రతీ అకృత్యాన్ని సమర్థించుకోవచ్చు. దేశం పేరు చెపుతున్నాడు కాబట్టి ప్రజలు కిక్కురుమనరు. అధికాంశం ప్రజలు ఆరాధించడం మొదలుపెట్టడంతో, అది తలకెక్కి, అపరిమిత అధికారం ఉపయోగించి నియంతలుగా మారారు. ప్రజల్లో తమను వ్యతిరేకులను అణిచివేశారు. హిట్లర్ యూదులను, మరి కొన్ని జాతులను భూమిపై వుండడానికి అర్హత లేనివారిగా తీర్మానించి నిర్మూలిస్తున్నపుడు, రాజకీయంగా తనను వ్యతిరేకించినవారిని చంపిపారేస్తున్నపుడు జర్మన్ ప్రజలందరూ ఏం చేశారనే ప్రశ్న సహజంగా వస్తుంది. 'మన జర్మనీ, మన ఆర్యన్ జాతి, ప్రపంచాన్ని పాలించే హక్కు మనకే ఉంది' అంటూ నూరిపోసిన నియంతకు తమ మెదళ్లను అప్పగించేసి గుడ్డిగా అతన్ని అనుసరిస్తూ పోయారు. అందుకే యుద్ధానంతరం జర్మనీ కోలుకోవడానికి దశాబ్దాలు పట్టింది. ఇటలీ అయితే యింకా కోలుకోలేదనే చెప్పాలి.

ఇంకోరకం నేతలున్నారు – సైనికనియంతలు! వారు ప్రజల్లోంచి రారు, ప్రజలకు జవాబుదారీ కాదు. ఏ ఆకర్షణీయమైన పదాలూ వుపయోగించవలసిన అవసరం లేదు. ప్రజాస్వామ్యం ద్వారా ఎన్నికయిన ప్రభుత్వాలు సరిగ్గా పనిచేయక, నాయకులు తమలో తాము కలహించుకుంటూ వుంటే దేశం కుక్కలు చింపిన విస్తరి కాకుండా కాపాడడానికి గోదాలోకి దిగాం అని చెప్పుకుని, సైన్యాధిపతి సైన్యబలంతో గద్దెను ఆక్రమిస్తాడు. నాయకులందరినీ ఉరి తీయడమో, జైల్లో పడేయడమో చేస్తాడు. ఎమర్జన్సీ విధించి, సెన్సార్‌షిప్ పెట్టి, రాత్రికి రాత్రి విపరీతంగా నిబంధనలు మార్చేస్తాడు. అయితే యిదంతా తనకోసం చేయడం లేదని, ప్రజల కోసం, ముఖ్యంగా పేదల కోసం చేస్తున్నానని చెప్పుకుంటాడు. తమ పాలన తాత్కాలికమైన ఏర్పాటేనని, సైన్యం ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపి అసలైన ప్రజాప్రతినిధులకు అధికారం అప్పగించి తమపాటికి తాము మళ్లీ బారక్స్‌కు వెళ్లిపోతామని చెప్పుకుంటాడు. అప్పణ్నుంచి విదేశీ శక్తులతో, ధనికవర్గాలతో కలిసి వూరేగుతాడు. సైన్యం అత్యాచారాలకు తెగబడుతుంది. నోరెత్తితే పీక నొక్కుతారు. అడ్డదారిలో అధికారంలోకి వచ్చాడనే మాట పడకుండా కొంతకాలానికి ఎన్నికలు పెడతాడు కూడా. అప్పుడు ప్రజాదరణ వున్న పార్టీపై ఆంక్షలు పెట్టడమో, దాని నాయకుడిపై అవినీతి ఆరోపణలు చేసి, విధేయులైన న్యాయాధీశుల చేత ఔననిపించడమో చేస్తాడు. పోటీ ఎవరూ లేకుండా చేసుకుని తనూ అభ్యర్థిగా నిలబడతాడు. ఎన్నికలు రిగ్గింగ్ చేయిస్తాడు. ఏం చేసినా ప్రజల్లో కొంతయినా మద్దతు సంపాదించకపోతే సైన్యపాలన ఎక్కువకాలం సాగదు. అలాటి పరిస్థితుల్లో వాళ్లు చాలా సందర్భాల్లో ఆశ్రయించేది – మతాన్ని!

మతం అనేది వ్యక్తిగతం. మతాచారాలు, సంప్రదాయాలు వున్నా వాటిని ఏ మేరకు ఆచరించాలనేది వ్యక్తి యిష్టం. మధ్యయుగాల్లో సమాజంపై మతం పట్టు బాగా వుండేట్లు, మతాధికారుల మాట చెల్లేట్లు రాజులు చూశారు. దానికి ప్రత్యుపకారంగా మతాధికారులు రాజును దైవాంశసంభూతుడని, అతన్ని అధికారాన్ని ధిక్కరించరాదని, ధిక్కరిస్తే నరకంలో పడతారని ప్రజలకు నూరిపోశారు, మతం పేరుతో బెదిరించారు. పారిశ్రామికీకరణ తర్వాత మతం పట్టు తగ్గసాగింది. దేశాల మధ్య, వివిధ జాతుల మధ్య సంపర్కం పెరిగింది. పరమతసహనం పెరిగింది. మతాచరణలో కూడా వెసులుబాట్లు, సంస్కరణలు వచ్చాయి. విద్యార్జన, జ్ఞానం పెరిగిన కొద్దీ మతఛాందసత్వం తగ్గింది. మతాధికారుల మాటలు పట్టించుకోవడం మానేశారు. ఇది మిలటరీ పాలకుడికి రుచించే విషయం కాదు. పాతకాలపు రాజులా అతను మతాధికారుల ద్వారా ప్రజలను అదుపులో తెద్దామని చూస్తాడు. నిజానికి సైన్యంలోకి వెళ్లినవాణ్ని ప్రగాఢ మతావలంబి అనుకోలేం. కానీ సైనికనియంతగా మారినవాడు మాత్రం హఠాత్తుగా మతఛాందసత్వం ప్రదర్శించడం మొదలుపెడతాడు. పాకిస్తాన్

ఉదాహరణ తీసుకుంటే బాగా అర్థమవుతుంది. అక్కడ అడ్డదారిలో అధికారం చేజిక్కించుకున్న సైన్యాధిపతులందరూ ముల్లా వేషాలు కట్టారు, షరియత్ అమలు చేశారు. ఇస్లాం పరిరక్షణే తమ ధ్యేయం అని చెప్పుకున్నారు. ఆధునికతవైపు మళ్లిన పాకిస్తాన్ సమాజపు గడియారాన్ని వెనక్కి తిప్పి మధ్యయుగాల్లోకి నడిపించబోయారు. ఎందుకిలా అంటే ప్రజల్లో ముస్లిములు అధికంగా వున్నారు కాబట్టి 'మన ఇస్లాం మనం పరిరక్షించుకోకపోతే ఎలా?' అనే మెజారిటీవాదంతో ప్రజలను కొంతకాలమైన ఆకట్టుకున్నారు. సాగినంతకాలం పాలించారు.

ఈ మెజారిటీవాదం చాలా ప్రమాదకరమైనది. బహుళ సంఖ్యలో వున్నవారే మాట చెల్లాలనడం ముప్పు తెస్తుంది. పైన చెప్పిన అనేక ఉదాహరణల్లో మెజారిటీ ప్రజలను మెప్పించి అధికారంలోకి వచ్చాక దాన్ని ఎలా దురుపయోగం చేశారో చూపడం జరిగింది. ఈ చరిత్రే మన రాజ్యాంగనిర్మాతలను భయపెట్టింది. వారు రాజ్యాంగం రాసేనాటికి శతాబ్దాలుగా కలిసివున్న దేశం అప్పుడే భారత్, పాకిస్తాన్‌లుగా మతపరంగా విడిపోయింది. పాకిస్తాన్ జనాభా కంటె ఎక్కువగా భారత్‌లో ముస్లిములు వుండిపోయారు. జనాభాలో దాదాపు 80% హిందువులున్నా భారత్‌ను హిందూరాజ్యం అనడం సబబు కాదనుకున్నారు. అందుకే లౌకిక – సెక్యులర్ – రాజ్యంగా రూపొందించారు. ఆచరణలో వ్యత్యాసాలున్నా ప్రపంచంలో చాలా దేశాలు తమను తాము సెక్యులర్‌గా ప్రకటించుకున్నాయి. పాకిస్తాన్ సైతం 1956 వరకు ఇస్లామిక్ దేశంగా చెప్పుకోలేదు. కొన్ని దేశాలు క్రైస్తవ లేదా ముస్లిం దేశాలుగా చెప్పుకుంటాయి. సెక్యులర్‌గా వున్న కొన్ని దేశాల్లో మతపరమైన విప్లవాలు వచ్చి తమ అధికారమతం ఫలానా అని చెప్పుకున్నాయి.

లౌకిక, లేదా సెక్యులర్ అంటే అర్థమేమిటి? మతప్రమేయం లేని... అని! తరతరాలుగా మతవిశ్వాసాలు ప్రజల్లో పాతుకుపోయినప్పుడు మతాన్ని తీసి పక్కన పడేయగలుగుతారా? మన దగ్గర ఏదైనా ప్రభుత్వ భవంతి కట్టబోతూ వుంటే శంకుస్థాపన చేయకుండా, కట్టాక కొబ్బరికాయ కొట్టకుండా వుంటారా? ప్రభుత్వ ట్రెజరీలో లక్ష్మీదేవి పటం తీసేయమంటే తీసేస్తారా? దీపం ముట్టించకుండా సభ ప్రారంభిస్తారా? మరి లౌకిక రాజ్యంలో యిది తగునా? ఇది కొన్ని యితర దేశాల్లో కూడా వుంది. అధిక సంఖ్యాకులు వెళ్లే చర్చిల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లిస్తుంది. (మన దగ్గర కూడా ప్రభుత్వం ఆలయాల అజమాయిషీ తీసుకుని, అర్చకుల జీతాలు, నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ కూడా ప్రభుత్వం చూస్తుంది) అక్కడ యితర మతస్తులు తక్కువ కాబట్టి చర్చి ప్రత్యక్షంగా రాజకీయాల్లో జోక్యం చేసుకోకుంటే చాలు సెక్యులరిజం అనేస్తున్నారు. అనేక మతాలున్న, మైనారిటీలు గణనీయంగా వున్న మన దగ్గర లౌకికవాదం అంటే 'సర్వమత సమభావన' అనే అర్థం రూఢి అయింది. అంటే ఏదైనా ప్రారంభోత్సవం జరుగుతూంటే అన్ని మతాల నుంచి గురువులను పిలిచి ప్రార్థనలు చేయిస్తారు. నాయకులు అన్ని ప్రార్థనాలయాలకు వెళతారు, అందరు మత గురువుల దగ్గర్నుంచి ఆశీస్సులు తీసుకుంటారు. ఒక మేరకు యిది బహుళత్వంతో కూడిన భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది కాబట్టి నడిచిపోతూ వచ్చింది.

పోనుపోను ఓటుబ్యాంకు రాజకీయాలు మొదలయ్యాయి. కులస్తులను, మతస్తులను ఓటు బ్యాంకులుగా చూసి వారి కోసం రిజర్వేషన్లు, ప్రత్యేక సౌకర్యాలు ప్రకటించడం మొదలుపెట్టారు. తమాషా ఏమిటంటే యిదంతా సెక్యులరిజం పేర నడపసాగారు. మతప్రమేయం లేని లేదా సర్వమతాలను సమానంగా చూసే సిద్ధాంతం లౌకికవాదం అన్నప్పుడు మతపరంగా కాని, కులపరంగా (మతం వుంటేనే కదా కులం వుండేది) కాని బుజ్జగించడాలు, తాయిలాలు చూపడాలు సెక్యులరిజం కిందకు ఎలా వస్తాయి? (సెక్యులరిజం పేర నాయకులు ఎటువంటి తమాషాలు ఆడుతున్నారో, ఏ రోటి దగ్గర ఆ పాట ఎలా పాడుతున్నారో గంగాధర గాడ్గీళ్ అనే మరాఠీ రచయిత గొప్ప కథ రాస్తే నేను దాన్ని "లౌకికవాదర వర్ధిల్లాలి" పేరుతో అనువదించాను. ఎమ్బీయస్ కథలు 25). http://telugu.greatandhra.com/articles/mbs/mbs-kathalu-25-61176.html ఈ నాటకాల వలన సెక్యులరిజం పదమే వెక్కిరింతకు గురి కాసాగింది. అది సెక్యులరిజం కాదు, సిక్(రోగగ్రస్తం)యులరిజం అనసాగారు. కొందరైతే దాన్ని క్వాలిఫై చేసి కుహనా లేదా సూడో సెక్యులరిజం అనసాగారు. మొత్తానికి కొందరికి అది తిట్టుపదం అయిపోయింది. అయితే వెక్కిరించేవారు కూడా మతపరమైన బుజ్జగింపులు, రిజర్వేషన్లు గురించి మాట్లాడతారు తప్ప కులపరమైన బుజ్జగింపులు, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడరు. ఎందుకంటే వారికి యితర మతస్తుల ఓటు బ్యాంకులు అక్కరలేదు కానీ కులపరమైన ఓటు బ్యాంకులు కావాలి.

హిందువులు మెజారిటీలో వున్నారు కాబట్టి దేశాన్ని హిందూరాజ్యంగా ప్రకటించాలి అని కొందరు వాదిస్తారు. ప్రపంచంలో వందలాది దేశాలు అలా చేయలేదు. తమ దేశంలో మెజారిటీ మతం ఏదో ఒకటి వున్నా తమది సెక్యులర్ దేశమే అని చెప్పుకున్నారు. ఎందుకంటే మెజారిటీ మతం అని పేరుకు వున్నా మళ్లీ దానిలో ఉపమతాలుంటాయి. విభజనలుంటాయి. ముస్లింలలో షియాలు, సున్నీలే కాదు, యింకా బోల్డు వుంటాయి. అలాగే క్రైస్తవుల్లోనూ వందలాది విభజనలు. హిందూమతంలో చూడండి, విష్ణ్వాలయంలో శైవ పూజారి వుండడు. మతం సంఘటితం చేస్తుంది – పరమతస్తులపై దాడి చేసేటప్పుడు మాత్రమే! ఆ భయం తొలగాక మళ్లీ వీళ్లల్లో వీళ్లు కొట్టుకుంటారు. క్రైస్తవ మతావలంబీకులైన దేశాల మధ్య, ఇస్లాం దేశాల మధ్య యుద్ధాలు జరగటం లేదా? మన రాజులందరూ హిందువులే అయినా కొట్టుకుని చావలేదా? అందువలన ఫలానా చోట ఫలానా వారిది మెజారిటీ కాబట్టి వారిది గొప్ప, తక్కినవాళ్లు వాళ్లకు వంత పాడాలి అనే సిద్ధాంతంతో మొదలుపెడితే చివరకు అది ఎక్కడ ఆగుతుందో తెలియదు.

మనం మైదాన ప్రాంతాల వాళ్లం. పర్వతప్రాంతాల వాళ్ల ఆచారవ్యవహారాలు వేరే వుంటాయి. వాటిని అనాగరికంగా తీర్మానించి

మనం మెజారిటీలో వున్నాం కాబట్టి మన పద్ధతులు వాళ్ల మీద బలవంతంగా రుద్దబోతాం. వాళ్లు ప్రతిఘటిస్తారు. వాళ్లను సంస్కరిస్తున్నాం అనే ఉద్దేశంలో ఆ ప్రతిఘటనను అణచివేస్తాం. నిజానికి వారి పద్ధతుల్లో కొన్ని మార్చాల్సి వున్నా, కొన్నిటిని మనం స్వీకరించడమో, ఆమోదించడమో చేయవచ్చు. కానీ మనకు వాళ్లపై చిన్నచూపు. వాళ్లే మన దారికి రావాలన్న పట్టుదల. దాంతో ఘర్షణ. మన దగ్గర వున్న కోయవాళ్లననే కాదు, మనం ఈశాన్య భారతంలో వున్న వాళ్లని కూడా ఖాతరు చేయం. అందరూ చైనా వాళ్లల్లా వున్నారనుకుంటాం. అసలక్కడ ఎన్ని రాష్ట్రాలున్నాయో, ఏ పార్టీ ప్రభుత్వాలున్నాయో కూడా చాలామంది పట్టించుకోము.

మనం వాళ్లని ఎలా లక్ష్యపెట్టమో, ఉత్తరాది వాళ్లు మననూ లక్ష్యపెట్టరు. దక్షిణాదిన ఎన్ని రాష్ట్రాలంటే వాళ్లల్లో చాలామంది చెప్పలేరు. అసలే అక్కడ అక్షరాస్యత తక్కువ, ఉన్నది కూడా హిందీలోనే వుంటుంది. జనరల్ నాలెజ్ పెంచుకోవాలన్న త ృష్ణ వుండదు. వాళ్ల కడుపే కైలాసం, వాళ్లున్నదే వైకుంఠం. 'దక్షిణాది వాళ్లందరూ మద్రాసీలే, అక్కడ అందరూ నల్లగా రాక్షసుల్లా వుంటారు, రావణాసురుణ్ని పూజిస్తారు. మనం ఎడ్డెం అంటే వాళ్లు తెడ్డెం అంటారు' ఇదీ జనరల్‌గా వాళ్లకుండే అభిప్రాయం. ఉత్తరాదిన ప్రయాణాలు చేసినపుడు అనేకమందిని కలిశాను. చాలామంది సహోద్యోగులున్నారు. తక్కినవిషయాల్లో వాళ్లకు కొంతయినా జ్ఞానం వున్నా, దక్షిణాది విషయంలో అస్సలు ఏమీ తెలియదు. డికె, డిఎంకె వాళ్లు రావణలీల చేస్తే దాన్ని హైలైట్ చేస్తూ హిందీ పత్రికలు కథనాలు వేస్తాయి. అవి చదివి అందరూ రావణభక్తులే అనుకుంటారు వాళ్లు. చదువుకోసమో, ఉద్యోగం కోసమో దక్షిణాది వచ్చినప్పుడు చాలా విషయాలు బోధపడి ముక్కున వేలేసుకుంటారు.

దానికి తోడు మనకు దేశభక్తి లేదనే చిన్నచూపు తోడవుతుంది. వాళ్ల చరిత్ర పుస్తకాల్లో లాలా లజపతి రాయ్, భగత్ సింగ్, పటేల్, బాల గంగాధర టిళక్, చంద్రశేఖర ఆజాద్, సుభాష్ బోసు గురించి వుంటుంది తప్ప దక్షిణాది స్వాతంత్ర్యయోధుల గురించి ఏమీ వుండదు. అందువలన మేం త్యాగాలు చేసి స్వాతంత్ర్యపోరాటం చేసే రోజుల్లో మీరు హాయిగా ఇడ్లీ సాంబారు మెక్కుతూ కూర్చున్నారు అంటారు. నా చిన్నప్పటి పాఠ్యపుస్తకంలో గోవింద వల్లభ్ పంత్ గురించి పాఠం వుండేది. మరి వాళ్ల పుస్తకాల్లో ప్రకాశం పంతులు పాఠం వుందా? ఛస్తే వుండదు. పార్లమెంటులో కూడా దక్షిణాది నాయకుల ఫోటోలు ఎన్ని వున్నాయో లెక్క వేయండి. ఇప్పటికీ సైన్యంలో దక్షిణాది వారి సంఖ్య తక్కువ. ఇవన్నీ మనసులో మెదలడం వలన, విదేశీ దాడులు ఎదుర్కునేది, మతకలహాల్లో, దేశవిభజనలో నష్టపోయేది, ప్రాణాలకు ఒడ్డి సరిహద్దులు కాపాడేది – మేము, కడుపులో చల్ల కదలకుండా ఉద్యోగాలు చేసుకుంటూ అతి తెలివి ప్రదర్శించేది మద్రాసీలు (అనగా యావన్మంది దక్షిణాది వాళ్లు) అనే భావం ఉత్తరాది వాళ్లల్లో పాతుకుపోయి వుంది. గత 20 ఏళ్లగా శాటిలైట్ టీవీలు వచ్చి దక్షిణాది గురించిన వార్తలు ఎక్కువ తెలిసేందుకు అవకాశం వుంది కాబట్టి మన గురించి అవగాహన కొంత పెరిగి వుండవచ్చు. ఏదైనా సరే ఆసక్తి వున్నవాడికి తెలుస్తుంది. వీళ్ల గురించి తెలుసుకునేదేముంది బోడి అనుకునేవాడు ప్రాంతీయ ఛానెల్ తప్ప మరొకటి పెట్టనే పెట్టడు.

ఉత్తరాది వాళ్లల్లో మెజారిటీవాదం ఎలా వుందో తాజాగా తరుణ్ విజయ్ వ్యాఖ్య చెప్తుంది. ఆయన బిజెపి లీడరు కాబట్టి అది బిజెపి పార్టీ అధికార వైఖరి అనే వాదన నేను చేయను. వ్యక్తిగతమైన పాప్యులారిటీ కోసం కొందరు బిజెపి నాయకులు తీవ్రవ్యాఖ్యలు అప్పుడప్పుడు చేస్తూంటారు, తర్వాత క్షమించమని అడుగుతూ వుంటారు. మమతా బెనర్జీ తల నరికితే బహుమతి.. వంటి వ్యాఖ్యలు అలాటివి. వెంటనే వాళ్లను పార్టీలోంచి తీసేస్తే తప్ప వాళ్లకు బుద్ధి రాదు. తరుణ్ విజయ్ ఆగ్రహంలో చేసిన వ్యాఖ్య కాదు. మా ఇండియన్స్‌కు వర్ణవివక్షత లేదు అనే వాదనను సోదాహరణంగా చెప్పడానికి 'మాకు అలాటిది వుంటే నల్లగా వుండే దక్షిణాది వాళ్లతో కలిసి ఎందుకు వుంటాం?' అని తర్కించాడాయన. అతన్ని ఖండిస్తూ 'దక్షిణాది వారిలో తెల్లగా వుండేవారు, ఉత్తరాది వాళ్లలో నల్లగా వుండేవారు వుంటారు' అంటూ కొందరు వాదించారు. అసలు అక్కడ కీలకమైన మాట – 'మేం'! దాని అర్థం మా ఉత్తరాదివాళ్లం అని. వాళ్లే ఇండియన్స్! మరి మనమంతా ఏమిటో!? తరుణ్ విజయ్ ఏ సాధుయో, సాధ్వియో అయితే అంత పట్టించుకోనక్కరలేదు. కానీ ఆయన ఆరెస్సెస్ వారి "పాంచజన్య" పత్రికకు ఎడిటరుగా చేసినవాడు. నిస్సందేహంగా మేధావి, ఆలోచనాపరుడు, సీనియర్ పాత్రికేయుడు. వివాదం వచ్చిన తర్వాత క్షమాపణ చెప్పి హుందాగా బయటపడ్డాడు. అసలా భావం అలా ఎలా వెలువడింది అంటే మనసులో అంతర్లీనంగా వున్న అభిప్రాయమే అది. నార్త్ ఇండియన్సే ఇండియన్స్ అని.

ఇలాటి భావమే గతంలో ఒక ఉత్తరాది రాజకీయ నాయకుడు అన్నాడు – "కడవా చౌథ్ జరుపుకోని మహిళ హిందూ స్త్రీ కానే కాదు' అని. మా అమ్మ, నా భార్య ఆ పండగేదో చేయనే చేయరు. హిందీ సినిమాల్లో చూపారు కాబట్టి అదో జల్లెడ పండగని గుర్తుంది కానీ లేకపోతే మాకు తెలిసేదే కాదు. మరి మా అమ్మ, నా భార్య హిందూ స్త్రీలు కారా? వాడెవడు సర్టిఫికెట్టు యివ్వడానికి? ఆ మూరు?డు క్షమాపణ చెప్పలేదు, అతని పార్టీ నాయకులు బహిరంగంగా మందలించలేదు. ఏ మతస్తులైనా సరే, దేశపౌరులందరికీ ఒకడే పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్) వుండాలని కొందరు వాదిస్తారు. ఆచరణలో అదెలా సాధ్యమో నాకు అర్థం కాదు. హిందువుల్లోనే దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచారం వుంది. తండ్రి ఆస్తంతా పెద్దకొడుక్కే వస్తుంది కొన్ని చోట్ల, మగపిల్లలకే వస్తుంది కొన్ని చోట్ల, ఆడపిల్లలకే వస్తుంది కొన్ని చోట్ల, అన్నగారు పోతే వదినగార్ని పెళ్లాడి, ఆమె పిల్లలకు సంరక్షకుడు కావడం ఒప్పు ఒకచోట, యింకోచోట అది వూహించడానికే బెదిరే ఆలోచన. ఇలాటి పరిస్థితుల్లో నార్త్ ఇండియాలో వున్న ఆచారమే దేశప్రజలందరి ఆచారం అంటూ అందరిపైనా రుద్దుతారేమో!

జాతీయతావాదంతో మొదలుపెట్టి, మతరాజకీయాల మీదుగా మెజారిటీవాదం గురించి చర్చించడం జరిగింది. ఇవన్నీ ఒకదానితో

మరొకదానికి లింకు వున్నవే. రేదర్, లింకు పెడతారు. ఇప్పుడు ట్రంప్ చూడండి, అమెరికా ఫస్ట్ అంటూ జాతీయతావాదాన్ని ఎత్తుకున్నాడు. ఇతర దేశస్తులు వచ్చి మన సంస్కృతిని కలుషితం చేసేశారన్నాడు. సమాజాన్ని నేరపూరితం చేశారన్నాడు. ఇతరుల వేషభాషలను వెక్కిరించాడు. మెజారిటీ ప్రజలైన అమెరికన్లకు అవకాశాలు లేకపోతే ఎలా అని వాపోయి, వాళ్ల హక్కులు పరిరక్షిస్తానన్నాడు. అలా మెజారిటీ వాదం కలిపాడు. అంతటితో ఆగాడా? మతాన్నీ కలిపాడు. శరణార్థుల్లో ముస్లిములను, క్రైస్తవులను వేర్వేరుగా చూడాలన్నాడు. చర్చి అబార్షన్లను వ్యతిరేకిస్తుంది కాబట్టి దాని మద్దతు కోసం తనూ అబార్షన్లకు వ్యతిరేకమన్నాడు. అతని జీవనశైలి చూస్తే అచ్చమైన, స్వచ్ఛమైన క్రైస్తవుడిగా బతికినట్లు తోచదు. కానీ యిప్పుడు జనాల ఆదరణ కావాలి కాబట్టి, ఇస్లాం దేశాలను వేరు పరచాలి కాబట్టి రష్యాతో చేయి కలపడానికి క్రైస్తవ ప్రస్తావన తెచ్చాడు.

ఈ గిమ్మిక్కులన్నీ అంతిమంగా సామాన్య అమెరికన్ల బతుకు మెరుగుపరచడానికే చేస్తున్నాడని కాస్సేపు అనుకుందాం. కానీ ఒకసారి యిలాటి భావాలను వ్యాప్తిలోకి తెచ్చాక దాని ప్రభావం సామాన్యుడిమీద ఎలా వుంటోందో చూస్తున్నాం. ఎవడు అక్రమ వలసదారుడో, ఎవడు సక్రమ వలసదారుడో వాడికి అనవసరం. తమ రంగులో లేనివాడు పరాయివాడు, తమ అవకాశాలు దోచుకోవడానికి వచ్చినవాడు అనుకుని ద్వేషం పెంచుకుంటున్నాడు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని దండిస్తున్నాడు. పోలీసుల్లో కూడా గోధుమరంగు వారిపై అనుమానాలు పెరిగిపోయి, అవమానాలకు గురి చేసే ధోరణి పెరుగుతోంది. ట్రంప్ సంస్కరణలకు కోర్టులు అడ్డు తగులుకున్న కొద్దీ సామాన్య అమెరికన్‌లో ఫ్రస్ట్రేషన్ పెరిగి అన్ని రకాల మైనారిటీలపై అసహ్యం పెరుగుతుంది. క్రమేపీ యిది కార్యాలయాల్లో, బయటా వ్యాపించే అవకాశం వుంది. క్రైస్తవేతర ప్రార్థనాలయాలపై దాడులూ జరగవచ్చు. ప్రభుత్వం ఏమేరకు వాళ్లను ఆపగలదో ఎవరూ చెప్పలేరు. పైన చెప్పినట్లుగా ఏదో ఒక వాదం ఎత్తుకుని ప్రజలను రెచ్చగొట్టడం సులభం, నియంత్రించడం కష్టం. ఈ ధోరణి యూరోప్‌కూ వ్యాపించేట్లు వుంది. మన దేశప్రజల్లో కొందరైనా ప్రభావితులవుతున్నారనేది వాస్తవం. (సమాప్తం)

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017) (ఫోటో –తీవ్ర జాతీయవాదంతో ఫ్రాన్సు రాజకీయాల్లో సంచలనం రేపుతున్న లే పెన్)**

**న్యూస్ వ్యూస్ 126 ఏప్రిల్ 20 ఎమ్బీయస్ : ఓటింగు యంత్రాలను నమ్మవచ్చా?**

'ఆడలేనమ్మ వేదిక ఎగుడుదిగుడందట' అనే సామెతను ఓడిపోయినవాళ్లను వెక్కిరించడానికి వాడతాం. కానీ వేదికో, దానికి ఎక్కడానికి వేసిన మెట్లవరసో నిజంగానే మిట్టపల్లాలతో వుంటే....? ఇండియాలో ఎన్నికలలో ఓడిపోయినవాళ్లు ఇవిఎమ్‌లను తప్పుపడుతూ వుండడం, అధికారంలో వున్నవాళ్లు వాటిని కొట్టిపారేయడం జరుగుతూనే వుంది. ఇవిఎంలను ట్యాంపర్ చేయవచ్చని గతంలో ఒక నిపుణుడి చేత టిడిపి నిరూపించబోయినా అది అరణ్యరోదనే అయింది. ప్రపంచంలో సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం యీ యంత్రాలను విశ్వసించటం లేదని, బ్యాలట్ పేపర్‌నే ఉపయోగిస్తున్నారని, అలాటప్పుడు నిరక్షరాస్యత యీ స్థాయిలో వున్న యిండియాలో మాత్రం ఎందుకివి అని ఓడిపోయిన పార్టీల వాళ్లు గగ్గోలు పెడుతున్నా, ఎన్నికల కమిషన్ మాత్రం 'అవన్నీ సిస్టమ్స్ కంప్యూటర్ ఆధారిత, ఇంటర్నెట్ అనుసంధానిత యంత్రాలు, మన దేశంలో వేటికవే. అందువలన వీటిని ట్యాంపర్ చేయడం, మానిప్యులేట్ చేయడం అసాధ్యం' అని వాదిస్తోంది. 'ఎలక్ట్రానిక్ పరికరం ఏదైనా సరే, దాన్ని లొంగదీసుకునే ఘనులున్నారు. ఈ యంత్రాన్ని కూడా తమకు అనుకూలంగా మలచుకునే అవకాశం వుండే వుంటుంది అనే అనుమానం వుంది కాబట్టి దీన్ని చెక్ చేసే, ఆడిట్ చేసే ఒక ప్రింటవుట్ పెట్టుకోవాలి' అని రాజకీయ పార్టీలు వాదించాయి. సరే అని ఎన్నికల కమిషన్ 'ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్' (వివిపిఎటి) యంత్రాన్ని తయారు చేయించాయి.

ఈ వివిపిఎటి యంత్రాన్ని ఓటింగు యంత్రానికి ఎటాచ్ చేస్తారు. ఓటరు ఓటేశాక, ఏడు సెకండ్ల పాటు అతను ఎవరికి ఓటేశాడో తెరపై కనబడుతుంది. తను ఓటేసిన అభ్యర్థికాక వేరేవారి పేరు కనబడితే అప్పుడే అతను ఫిర్యాదు చేసే అవకాశం వుంది. ఏడు సెకండ్ల తర్వాత ఆ డిస్‌ప్లే మాయమవుతుంది. ఏ అభ్యర్థికి ఓటేశాడో అతని పేరు, సీరియల్ నెంబరు, పార్టీ గుర్తు ఓ కాగితంపై ప్రింటయి, సరాసరి ఒక పెట్టెలోకి వెళ్లి పడుతుంది. ఆ కాగితాన్ని ఓటరు బయటకు తీసుకెళ్లలేడు. కౌంటింగులో ఏదైనా తకరారు వస్తే అప్పుడు ఆ పెట్టె తెరిచి యీ కాగితం స్లిప్పులను లెక్కపెట్టి ఇవిఎం ఫలితంతో సరిచూస్తారు. ఇదీ ప్రింటవుట్ యంత్రం పనితీరు. మొన్న జరిగిన యుపి ఎన్నికలలో 30 నియోజకవర్గాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా వాడి చూశారు. వాటిలో 25 స్థానాల్లో బిజెపి గెలిచింది. యుపి ఎన్నికల ఫలితాలలో బిజెపి హవా వుంటుందనుకున్నా, ఎవరూ వూహించనంత స్థాయిలో బిజెపి గెలవడంతో మాయావతి ఇవిఎం యంత్రాలపై అనుమానం వ్యక్తం చేసింది. పంజాబ్ ఎన్నికలలో ఓడిపోయిన అరవింద్ కేజ్రీవాల్ కూడా అలాటి ఆరోపణలే చేశాడు. మాయావతి అనుమానాలు నివృత్తి చేయవలసిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై వుందని అఖిలేశ్ అని వూరుకున్నాడు. మాయావతి, అరవింద్ మాటలు ఎవరు పట్టించుకుంటారులే అనుకుని ఎన్నికల కమిషన్ కూడా వాటిని తేలిగ్గా తీసుకుంది.

అయితే మహారాష్ట్రలో స్థానిక ఎన్నికలలో మరిన్ని ఆరోపణలు వచ్చాయి. ఒక స్వతంత్ర అభ్యర్థికి ఒక్క ఓటు కూడా పడలేదు. 'కనీసం నా ఓటైనా నాకు రావాలి కదా' అని అతను వాదించాడు. పంచవటిలో అభ్యర్థుల ఓట్లన్నీ కూడితే పోలయిన ఓట్ల కంటె ఎక్కువగా వచ్చాయి. 2 లక్షల ఓటర్లున్న నియోజకవర్గంలో 90 వేల మెజారిటీతో ఓ అభ్యర్థి గెలవడం వంటివి నమ్మశక్యంగా లేవని కొందరు వాపోయారు. ఎటిఎం కార్డులు కూడా సురక్షితం అనుకుంటూ వచ్చాం, కానీ యిటీవలే 32 లక్షల కార్డులు హేకింగ్‌కు

గురయ్యాయి. ప్రతి సాఫ్ట్‌వేర్‌లోను ఏదో ఒక లోపం కనిపెడుతున్నారు హ్యాకర్లు. మరి ఇవిఎంలు మాత్రం అంత పక్కాగా వుంటాయా? అన్న సందేహాలు ఎల్లెడలా రావడంతో ఎన్నికల కమిషన్ 2019 పార్లమెంటు ఎన్నికల సమయానికి వివిపిఎటిని ఎటాచ్ చేయడానికి సన్నిద్ధమవుతోంది. అదెలా పనిచేస్తుందో చూపించడానికి మధ్యప్రదేశ్‌లో అప్పటికి 10 రోజుల్లో ఉపయెన్నిక జరపబోతున్న భీడ్‌లో మార్చి 31న మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఎదుట ఒక ప్రదర్శన నిర్వహించింది. మధ్యప్రదేశ్ చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ సలీనా సింగ్ విలేకరుల ఎదుట ఇవిఎంలో కొన్ని పార్టీలకు ఓటేసి, దానికి ఎటాచ్ చేసిన వివిపిఎటి నుంచి ప్రింటవుట్ తీసి చూపించారు. తీరా చూస్తే ఆ ప్రింటవుట్‌లో బిజెపి గుర్తుకే చాలా ఓట్లు పడ్డాయి. ఇవిఎంలో ఏ పార్టీకి మీట నొక్కినా, ప్రింటవుట్‌లో మాత్రం బిజెపియే వస్తోంది. దాంతో అంతా బిత్తరపోయారు. సలీనా గారికి కూడా ఏం జరిగిందో అర్థం కాలేదు. 'ఇవిఎంలకు బిజెపి పక్షపాతమున్నట్లుందే' అని ఒక విలేకరి చమత్కరించాడు. 'ఇదిగో యీ విషయం మీరు పేపర్లో రాశారో, మీ అందరినీ నేను పోలీసు స్టేషన్లో చూడాల్సి వస్తుంది జాగ్రత్త' అని యీవిడ చమత్కరించింది. మర్నాటి కల్లా పేపర్లలో వచ్చేసింది – ఇవిఎంలు సరిగ్గా పనిచేయటం లేదని, ఆ విషయం బయటకు పొక్కితే అరెస్టు చేయిస్తానని అధికారి బెదిరించారనీ! ఆ ఇవిఎంను కాన్పూరునుంచి తెచ్చారని, అక్కడ కూడా యిలాగే ఏం నొక్కినా అన్నీ కమలానికే వెళ్లడం చేతనే బిజెపి అంత మెజారిటీతో గెలిచిందని పుకార్లు వ్యాపించాయి. ఇక్కడ గమనించవలసిన దేమిటంటే సరిగ్గా పనిచేయనిది వివిపిఎటి. అది తప్పు ఫలితాలు యిచ్చింది. ఇవిఎం ఎలా పనిచేస్తుందో పరీక్షించలేదు. ఆవిడ నొక్కిన ప్రకారం ఫలితం వచ్చిందో లేదో చెక్ చేసినట్లు పేపర్లలో రాలేదు.

ఈ వార్తలు రాగానే ఎన్నికల కమిషన్ మొహం మాడిపోయింది. పరువు పోయిందని ఫీలై ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ భవర్‌లాల్‌ను అక్కడకు వెళ్లి పొరపాటు ఎక్కడ జరిగిందో తేల్చమని ఆదేశించారు. ఆయన వెళ్లి ఆ ప్రింటర్‌ను యుపిలోని గోవిందనగర్ నుంచి తెచ్చారని, దీనికి ఎటాచ్ చేసేముందు ఫార్మాట్ (పూర్తిగా తుడిచివేయడం) చేయకపోవడం చేత మెమరీలో వున్న ఆ నియోజకవర్గ ఫలితాలనే చూపిస్తోందని తేల్చారు. తుడిచి వేయకుండానే పత్రికల ముందు పరీక్షకు రెడీ చేసిన 19 మందిని ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఏది ఏమైనా మానవవైఫల్యం వలన ఫలితాలు తారుమారు కావచ్చు అని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనకు బలం చేకూరింది. ఇక అరవింద్ కేజ్రీవాల్ రెచ్చిపోయారు. అతన్ని అదుపు చేయడానికి కాబోలు ఎన్నికల కమిషన్ భేషుగ్గా పనిచేస్తోందని కేంద్ర ప్రభుత్వం కితాబు నిచ్చింది. దాని మాట ఎలా వున్నా ఇవిఎంలలో కూడా యిలాటి మెమరీ వుండిపోతే...? అనే సందేహం తటస్థులకు కూడా కలగవచ్చు. భారత ఇవిఎంలకు ఒక ఎలక్ట్రిక్ పరికరాన్ని జోడించి దాన్ని సెల్‌ఫోన్ ద్వారా నియంత్రణలోకి తీసుకోవచ్చు అని మిచిగన్ యూనివర్శిటీ వారు డిమాన్‌స్ట్రేట్ చేసి చూపించారట. అయినా మా ఎవిఎంలు ఫూల్‌ప్రూఫ్, లోపరహితమైనవి అని ఎన్నికల కమిషన్ మొండిగా వాదిస్తోంది. సైబర్ క్రైమ్ పట్టుకోవలసిన పోలీసు వారి వెబ్‌సైట్‌లే హ్యాకింగ్‌కు గురి అవుతున్న యీ రోజుల్లో తమ ఇవిఎంల భద్రత్కట ఎన్నికల కమిషన్‌కు అంత ధీమా ఏమిటో తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**న్యూస్ వ్యూస్ 126 ఏప్రిల్ 21** **ఎమ్బీయస్ : ఇదీ మన బ్యాంకుల డిజిటల్ భద్రత...!**

లావాదేవీలన్నీ డిజిటల్‌గానే నడపాలని, బ్యాంకుల ద్వారానే సాగాలని లక్ష్యం పెట్టుకుని ప్రభుత్వం, దాని ఆదేశాలపై రిజర్వ్ బ్యాంకు ప్రజలకు నగదు దొరక్కుండా చేస్తోంది. ఎటిఎంలు విగ్రహపుష్టి, నగదు నష్టిగా తయారయ్యాయి. మరి బ్యాంకుల్లో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లను ఆపే సామర్థ్యం మన వ్యవస్థ కుందా? యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2016 జులైలో జరిగిన 171 మిలియన్ డాలర్ల (సుమారు రూ. ...... కోట్లు) సైబర్ నేరం గురించి 9 నెలల తర్వాత గతవారమే బయటకు వచ్చింది. జులై 20 న ఆ బ్యాంకు ట్రెజరీ డిపార్టుమెంటులో పనిచేసే ఒక అధికారి బ్యాంకుల మధ్య జరిగే స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వ(ర)ల్డ్ వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్) లావాదేవీలను సరి చూసుకుంటూ వుంటే తమ బ్యాంక్ డాలర్ ఖాతా నుంచి గత రాత్రి 171 మిలియన్ డాలర్లు ఎక్కడికో బదిలీ అయిపోయినట్లు గమనించి, కంగారు పడి పై అధికారులకు తెలియపరిచాడు. ఆ బ్యాంకు తన ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ ఖాతాలను న్యూయార్క్‌లోని సిటి బ్యాంక్, జెపి మోర్గాన్ ఛేజ్‌లలో నిర్వహిస్తుంది. వాటి ద్వారా ఆ నిధులు కంబోడియాలోని కెనడియా బ్యాంక్, ఆర్‌ఎచ్‌బి ఇండోచైనా బ్యాంక్, థాయిలాండ్‌లోని సియామ్ కమ్మర్షియల్ బ్యాంక్, తైవాన్‌లోని బ్యాంక్ సైనోపాక్, ఆస్ట్రేలియాలోని మరో బ్యాంక్‌లకు చేరాయి. ఈ దేశాలతో వ్యవహరించాలంటే విదేశాంగ శాఖ సాయం కూడా తీసుకోవాలి. బ్యాంకు ఉన్నతాధికారులు, సైబర్‌గూఢచారులు అందరూ కలిసి ఆరురోజులు శ్రమించి ఆ నిధులను వెనక్కి తెచ్చారు. తైవాన్ ప్రభుత్వంతో మనకు రాయబార సంబంధాలు లేవు. బ్యాంకు ఎంట్రీ రివర్స్ చేయాలంటే కోర్టునుంచి ఆదేశాలు తెచ్చుకోవాలి. అయినా అమెరికా అధికారులు కలగజేసుకుని అది కూడా వచ్చేట్లు చేశారు.

నేరస్తులు ఈ ఫ్రాడ్ ఎలా చేయగలిగారంటే ఒక ఆఫీసరు ఈమెయిల్‌కు మాల్‌వేరున్న ఒక మెయిల్ పంపారు. అది ఆయన తెరిచాడు. అంతే, సమాచారం, ఆ పైన నిధులు చోరీ అయిపోయాయి. ఈ నేరం జరిగిన నెల్లాళ్ల తర్వాత మాత్రమే ఆగస్టు 15 న ముంబయి సైబర్‌సెల్‌లో ఎఫ్‌ఐఆర్ దాఖలైంది. తర్వాత ఏమైందో, చార్జిషీటు వేశారో లేదో, అవతలి దేశాల్లో తర్వాతి చర్యలు తీసుకున్నారో లేదో బాంకు అధికారులు చెప్పలేకపోతున్నారు. డబ్బు తిరిగి వచ్చేసింది, అమ్మయ్య అనుకుని వూరుకున్నారు లాగుంది. ఇటువంటిది మళ్లీ జరగకుండా తీసుకున్న జాగ్రత్తలేమిటంటే బ్యాంకుల సైబర్ సిస్టమ్‌లో లోపాలేమున్నాయో కనిపెట్టి హెచ్చరించడానికి

రిజర్వ్ బ్యాంక్ సి-సైట్ పేరుతో ప్రత్యేక సెల్ తెరిచారు. యూనియన్ బ్యాంకు విషయంలో డబ్బు తిరిగి వచ్చింది, రాని వాటి మాట ఏమిటి? బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లోని అనేక ఖాతాల్లోంచి రూ.25 కోట్లు మాయమయ్యాయి. స్థానిక వెండార్ యుపిఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)లో సమస్య వుందని సైబర్ పరిశోధకులు కనుగొన్నారు కానీ ఆ డబ్బులో చాలాభాగం రాబట్టలేకపోయారు. మన దేశంలో సెక్యూరిటీ సిస్టమ్స్ బలహీనం కాబట్టి యిలా జరిగింది అనుకుందామంటే విదేశాల్లో కూడా పరిస్థితి మెరుగ్గా లేదని "షాడో బ్రోకర్స్" అనే హ్యేకర్ సంస్థ అమెరికన్ గూఢచారి వ్యవస్థ (నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ - ఎన్ఎస్ఏ)కు వ్యతిరేకంగా 8 నెలల పరిశోధన తర్వాత బయటపెట్టిన సాక్ష్యం చాటిచెప్తోంది.

మధ్య ప్రాచ్యంలోని టెర్రరిస్టులకు, జిహాదీలకు నిధులు ఎలా అందుతున్నాయో కనుగొనే ప్రయత్నంలో ఎన్ఎస్ఏ బ్యాంకుల స్విఫ్ట్ సిస్టమ్స్‌ను ఛేదించి వివరాలు తెలుసుకుంటోందని, ఆ సందర్భంగా వారికి మిగతావారి వివరాలు కూడా వారికి తెలిసిపోతున్నాయని షాడో బ్రోకర్స్ బయటపెట్టింది. స్విఫ్ట్ నెట్‌వర్క్‌కు క్లయింట్లుగా వున్న చిన్న బ్యాంకులకు సేవలందించడానికి స్విఫ్ట్‌కు అనుబంధంగా 120కు పైగా సర్వీసు బ్యూరోలు పనిచేస్తాయి. వాటి భద్రతా ఏర్పాట్లు అంత దృఢంగా వుండవు. ఎన్ఎస్ఏ ఆ బ్యూరోల సైబర్ సిస్టమ్స్‌ను ఛేదించింది. దాని ద్వారా దానికి క్లయింటుగా వున్న బ్యాంకుల్లో జరుగుతున్న లావాదేవీలన్నిటి గురించి దానికి తెలిసిపోతోంది. ఉదాహరణకి దుబాయి కేంద్రంగా వున్న ఈస్ట్‌నెట్స్ అనే సంస్థ మిడిల్ ఈస్ట్‌లో వున్న అనేక బ్యాంకులకు, కతార్, దుబాయి, అబూ ధాబీ, సిరియా, యెమెన్‌లలో వున్న కంపెనీలకు సేవలందిస్తోంది. ఈ బ్యాంకులు ఇండియా, బంగ్లాదేశ్ వంటి అనేక దేశాలతో లావాదేవీలు జరుపుతున్నాయి. దీనిలోకి ఎన్ఎస్ఏ చొరబడి దాని భద్రతా వ్యవస్థకు తూట్లు పొడిచింది. అది గూఢచర్యం కోసం చేసిన రంధ్రాల్లోకి మరొకరు దోపిడీ కోసం దూరుతున్నారు. 2016 ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ నుండి 81 మిలియన్ డాలర్ల చోరీ యీ మార్గంలోనే జరిగిందని అంటున్నారు. యూనియన్ బ్యాంకు చోరీకి, దీనికి సంబంధం వుందో లేదో ప్రస్తుతానికి తెలియలేదు.

తమ వ్యవస్థ హ్యేక్ కాలేదని ఈస్ట్ నెట్స్ ట్విటర్ ద్వారా ప్రకటించింది కానీ షాడో బ్రోకర్స్ ఎన్ఎస్ఏను హ్యేక్ చేసి, తాము సంపాదించిన సమాచారమంటూ ఈస్ట్ నెట్స్ నిర్వహిస్తున్న కంపెనీల ఐపీ ఎడ్రసులతో సహా ఒక ఎక్సెల్ షీటులో బహిరంగపరచింది. కతార్ ఫస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు, బహరైన్‌కు చెందిన అరబ్ పెట్రోలియం ఇన్వెస్ట్‌మెంట్స్ కార్పొరేషన్, దుబాయి గోల్డ్ అండ్ కమోడిటీస్ ఎక్స్‌ఛేంజ్, తధామోన్ ఇంటర్నేషనల్ ఇస్లామిక్ బ్యాంక్, నూర్ ఇస్లామిక్ బ్యాంక్, కువాయిత్ పెట్రోలియం కంపెనీ, కతార్ టెలికామ్ వగైరా సంస్థల పేర్లు వున్నాయి దానిలో. ఎన్ఎస్ఏ యీ కంపెనీ కంప్యూటర్ వ్యవస్థలలో స్పైవేర్ ప్రవేశపెట్టి ఎవరు ఎవరికి నిధులు పంపుతున్నారో ఆ సమాచారమంతా తెలుసుకుంటోంది. అంతేకాదు, పనామా కేంద్రంగా పనిచేసే బిజినెస్ కంప్యూటర్ గ్రూప్ (బిసిజి) పై కూడా దృష్టి పెట్టింది. దానిలో విజయం సాధించిందో లేదో యింకా తెలియదు. ఎన్ఎస్ఏ చేష్టలు బయటపెట్టడానికి షాడో బ్రోకర్స్ విండోస్ 10 తప్ప తక్కిన అన్ని వెర్షన్లలోను లోపాలు కనిపెట్టి వాటి ద్వారా ఎన్ఎస్ఏ నెట్‌వర్క్‌లోకి చొరబడిందట. ఇలాటి లోపాలన్నీ సవరించకుండా మన దేశపాలకులు డిజిటల్ లావాదేవీలంటూ ఊదరగొట్టేస్తున్నారు. బ్యాంకుల్లో దాచుకునే మన కష్టార్జితంపై ఎవడి కళ్లు పడతాయో, దానికి ఎప్పుడు కాళ్లు వస్తాయోయని భయపడుతూ మనం నిరంతరం భగవంతుణ్ని ధ్యానించాలి.

**- ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**న్యూస్ వ్యూస్ 127 ఏప్రిల్ 22 ఎమ్బీయస్ : శివరాజ్ చౌహాన్‌కు స్థానచలనమా...?**

బిజెపి ఒక్కో రాష్ట్రం గెలుస్తూ వస్తోంది. తాజాగా ఢిల్లీ స్థానిక ఎన్నికలలో సిద్ధించిన ఘనవిజయం దృష్ట్యా తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగితే అప్పుడు (ఏదో వంక పెట్టి ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేసేస్తే ఆ ఘడియ త్వరలోనే రావచ్చు) అక్కడా నెగ్గేట్లా వుంది. ఈ వూపు యిలా వుండగానే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఒకేసారి నిర్వహించి, దేశంలోని సాధ్యమైనన్ని ఎక్కువ రాష్ట్రాలలో, కేంద్రంలో ఒకేసారి పాగా వేద్దామనే వూహలో బిజెపి వుంది. ఏ కారణం చేతనైనా ఏ రాష్ట్రంలోనైనా పార్టీ బలహీనంగా వుందంటే దాని ప్రభావం పార్లమెంటుపై కూడా పడుతుందన్న సంకోచం వుంది. అందువలన ఏ రాష్ట్రమూ చేజారిపోకూడదని లెక్కలు వేస్తోంది. ఆ విధంగా చూస్తే 2018 నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగవలసిన మధ్యప్రదేశ్‌లో నాల్గోసారి అధికారంలోకి రావడానికి ప్రభుత్వ వ్యతిరేకత అడ్డుపడుతుందాన్న భయం వుంది. 29 పార్లమెంటు స్థానాలున్న రాష్ట్రాన్ని తేలికగా తీసుకోవడానికి వీల్లేదు.

15 ఏళ్లు ఏకధాటీగా పాలించాక ఏ పార్టీకైనా వ్యతిరేకత రావడం, ప్రత్యామ్నాయానికి ఓ ఛాన్సు యిచ్చి చూద్దామని ఓటర్లు అనుకోవడం సహజం. 2003లో బిజెపి గెలిచాక ఉమాభారతి ముఖ్యమంత్రి అయ్యారు. 9 నెలల తర్వాత ఆమె దిగిపోయి, బాబూలాల్ గౌర్ ముఖ్యమంత్రిగా 15 నెలలు చేసి, 2005 నవంబరులో అధిష్టానం ఆదేశం మేరకు ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్‌కు పగ్గాలు అప్పగించారు. అప్పణ్నుంచి చౌహాన్ ముఖ్యమంత్రిగా వుంటూ వచ్చాడు. వ్యాపమ్ కుంభకోణంలో చిక్కుకున్నాడు. కొన్ని రంగాలలో ప్రభుత్వ వైఫల్యం కొట్టవచ్చినట్లు కనబడుతోంది. పౌష్టికాహార లోపం వలన దేశవ్యాప్తంగా సంభవించే మరణాలలో, ప్రసూతి మరణాలలో అత్యధిక శాతం మధ్యప్రదేశ్‌లోనే! నిధులు లేక, అయ్యవార్లు లేక విద్యారంగం అస్తవ్యస్తమైంది. అందువలన అతన్ని కేంద్రానికి మంత్రిగా రప్పించేసి, ఎన్నికలు ఏడాదిన్నర ముందుగానే అతని స్థానంలో వేరే వ్యక్తిని పెడితే శివరాజ్ పాలన

ప్రజలు మర్చిపోతారని, బిజెపిని ఫ్రెష్‌గా చూస్తారని పార్టీ అంచనా. గుజరాత్‌లో అలాటి ప్రయోగమే జరిగింది. దాని ఫలితం త్వరలోనే తెలుస్తుంది. శివరాజ్ ఆడ్వాణీకి అనుచరుడిగా వెలుగులోకి వచ్చాడు. అందువలన మోదీకి, అమిత్‌కు అతనిపై ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. అయితే శివరాజ్ ఆరెస్సెస్‌తో సత్సంబంధాలు పెట్టుకున్నాడు కాబట్టి నెట్టుకుని వస్తున్నాడు.

అధిష్టానం ఆలోచన ఎలా వున్నా, శివరాజ్‌కు సొంత ఐడియాలున్నాయి. "మీరు కేంద్రంలో వ్యవసాయ మంత్రిగా వెళతారటగా?" అని ఎవరో అడిగితే "నేను పార్టీకి విధేయుడైన కార్యకర్తను. ఏ బాధ్యత అప్పగిస్తే అదే చేస్తాను." అంటూనే "ప్రస్తుతం ఎక్కడున్నానో అక్కడ సంతోషంగానే వున్నాను." అని చేర్చాడు. అతను రాజకీయాల్లో ఢక్కామొక్కీలు తిన్న అనుభవజ్ఞుడు. తన వైఫల్యాలకు గతంలో అయితే కేంద్రాన్ని తప్పుపట్టి నెగ్గుకొచ్చాడు. ఇప్పుడది కుదరదు. అందువలన అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి జనాలలో మంచి పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. రూపాయికి కిలో గోధుమల పథకం, రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం, దీన్‌దయాళ్ రసోయీ యోజనా పేరుతో జిల్లా కేంద్రాలలో రూ.5కు భోజనం పథకం, గ్రామాల్లో యిళ్లు కట్టుకోవడానికి ముఖ్యమంత్రి ఆశ్రయ్ యోజనా పేరుతో ఉచితంగా భూమి యిచ్చే పథకం, నర్మదా నది ఒడ్డున హెక్టేరు భూమిలో మొక్కలు పాతడానికై రైతులకు రూ.20,000 యిచ్చే పథకం ప్రవేశపెట్టాడు.

వీటితో బాటు పర్యావరణ రక్షణ, మతప్రయోజనం కూడా కలిసి వచ్చేట్లు నర్మదా సేవా యాత్ర పేరుతో డిసెంబరు 11 నుంచి మే 11 వరకు నిర్వహిస్తున్నాడు. 16 జిల్లాలలో 70 అసెంబ్లీ నియోజకవర్గాలు పర్యటించేట్లా యాత్ర రూపొందించాడు. అమర్‌కంటక్‌లో యాత్ర ప్రారంభించిన రోజున గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీని రప్పించాడు. మధ్యలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్, దలైలామా, బాబా రాందేవ్‌లను రప్పించాడు. ఆఖరి రోజున మోదీ వస్తాడనుకుంటున్నారు. ఈ పేరుతో ప్రజల్లో నిత్యం తిరుగుతూ తన యిమేజి పెంచుకుంటున్నాడు. రోజుకి 16 గంటలు పనిచేయగల ఓపిక వున్నవాడు కాబట్టి, అందర్నీ కలుపుకుని పోగల స్వభావం వున్నవాడు కాబట్టి బండి లాక్కుని వస్తున్నాడు. ఇప్పుడతన్ని తీసేయాలంటే అధిష్టానానికి కష్టమే అంటున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**న్యూస్ వ్యూస్ 127 ఏప్రిల్ 23 ఎమ్బీయస్ : ఆల్వార్ సంఘటన బాధితులు స్మగ్లర్లు కారు...**

ఏప్రిల్ 1వ తారీకున రాజస్థాన్‌లోని ఆల్వార్ జిల్లాలో గోరక్షకులమని చెప్పుకునే కొందరు జయపూరు సంతలో ఆవులను కొనుక్కున్న వెళుతున్న కొందరిపై దాడి చేసిన ఘటనలో 55 ఏళ్ల పెహలూ ఖాన్ అనే వ్యక్తి చనిపోయాడని, అతని కుమారులతో బాటు మరో యిద్దరు గాయపడ్డారని విదితమే. ఆ సంఘటనలో పోలీసులు దాడి చేసినవారితో పాటు బాధితులపై కూడా కేసులు పెట్టారు. దీనిపై రాజస్థాన్ అసెంబ్లీలో విపక్షాలు వివరణ కోరగా, హెూం మంత్రి గులాబ్ చంద్ కటారియా సమాధానమిస్తూ ఆ ఖాన్‌ల కుటుంబం ఆవులను స్మగ్లర్లని, వారిపై కేసులున్నాయని ప్రకటించాడు. దానిపై లోతుగా పరిశోధించిన "హిందూస్తాన్ టైమ్స్" అవి స్మగ్లింగ్‌కు సంబంధించిన కేసులు కావని యీ వారం తేల్చింది. ఆ వివరాలలోకి వెళ్లబోయే ముందు సంఘటన గురించిన సమాచారం –

హర్యాణాలోని మేవాట్ జిల్లాలోని నూహ్ తాలూకాలోని జైసింగ్‌పూర్‌లో హతుడు పెహలూ ఖాన్ కుటుంబం నివసిస్తుంది. వాళ్లు ముస్లిములలో మేవో వర్గానికి చెందినవారు. వాళ్లలో చాలామంది రైతు కూలీలుగానో, కౌలు రైతులగానో జీవిస్తూ వుంటారు. కొందరు పాల వ్యాపారం చేస్తూ వుంటారు. ఖాన్ వాళ్లది కూడా పాల వ్యాపారమే. గేదెల కంటె ఆవులైతే బాగా పాలిస్తాయని జయపూర్‌లో జరిగే పశువుల సంతకు ఖాన్ అతని యిద్దరు కొడుకులతో, తన గ్రామానికే చెందిన మరో యిద్దరితో కలిసి ఏప్రిల్ 1న వచ్చాడు. రెండు పాలిచ్చే ఆవులను దూడలతో సహా రూ. 45 వేలకు కొన్నాడు. వాళ్లతో పాటు వచ్చిన వారిలో ఒకతను మరో ఆవుని కొన్నాడు. పశువులను వేరే రాష్ట్రం తీసుకెళ్లాలి కాబట్టి, జయపూర్ మునిసిపల్ కార్పోరేషన్ వాళ్లు ఇంటర్–స్టేట్ ట్రాన్స్‌పోర్టుకై అధికంగా చార్జీలు వసూలు చేశారు. పెహలూ కొడుకులు ఆరిఫ్, ఇర్షాద్, ఓ గ్రామస్తుడు ఆవులతో సహా ఒక వ్యాన్‌లో ఎక్కగా పెహలూ, అజ్మత్ అనే మరో గ్రామస్తుడు యింకో వాహనంలో ముందు వెళుతున్నారు. ఆల్వార్‌లో ఢిల్లీ–జయపూర్ నేషనల్ హైవే మీద మోటార్ సైకిళ్లపై వచ్చిన కొందరు యువకులు సాయంత్రం 7 గం.ఎలకు పెహలూ వాహనాన్ని ఆపారు. పెహలూ, చూడగానే ముస్లిం అని తెలిసేట్లు గడ్డంతో వుంటాడు. పెహలూను, అజ్మత్‌ను వాహనంలోంచి బయటకు లాగి బెల్టులతో, హాకీ స్టిక్కులతో, కర్రలతో చావకొట్టారు. వేడుక చూడడానికి వచ్చినవారు కూడా హింసాకాండలో చేతులు కలిపారు. క్రమంగా వారి సంఖ్య వందల్లోకి చేరింది. డ్రైవర్‌ను పట్టుకుని పేరు అడిగారు. అతను హిందువని తెలియడంతో నాలుగు లెంపకాయలు కొట్టి పొమ్మన్నారు. రెండో వాహనం గురించి కాచుకున్నారు. అది రాగానే వాళ్లనూ బయటకు లాగి చితక్కొట్టారు.

"మేం పోలీసు స్టేషన్ల మీదుగా వచ్చాం. జయపూర్ మునిసిపల్ కార్పోరేషన్ వారి రసీదులు చూపిస్తే వాళ్లు వదిలేశారు. కావాలంటే మీరూ చూడండి" అని రసీదులు చూపించాడు ఇర్షాద్. 'గోరక్షకులు' "మేం వీటిని పట్టించుకోం" అంటూ చింపి పారేశారు. వాళ్ల బట్టలు చింపేశారు. మొబైల్స్ లాక్కున్నారు. డబ్బు గుంజుకున్నారు. ఆవుల్నీ, దూడల్నీ తీసుకుపోయారు. వాళ్లు కొట్టిన దెబ్బలకు వీళ్లంతా నేలమీద పడిపోయారు. "అందర్నీ కుప్పపోసి తగలబెట్టేయండి' అని గుంపులో ఎవరో అరిచారు. ఇంతలో ఎవరో కానీ పోలీసులను పిలవడంతో వీళ్లు అప్పటికి బతికిపోయారు కానీ ఆ దెబ్బలతో రెండు రోజుల తర్వాత 55 ఏళ్ల పెహలూ ఖాన్

చనిపోయాడు. ఈ దృశ్యాలన్నీ ఎవరో కానీ వీడియో తీసి వైరల్ చేశారు. పోలీసులు వ్యాన్ దిగి వచ్చేటప్పుడు తమలో తాము నవ్వుకోవడం కూడా దానిలో కనబడిందట. పోలీసులు వచ్చి చేసిందేమిటంటే దాడి చేసిన వారితో బాటు, బాధితులపై కూడా కేసులు పెట్టేశారు. అంతేకాదు, వీళ్లు బుక్ చేసిన వాహనాలను సీజ్ చేసి తమ వద్ద పెట్టుకున్నారు. రమేశ్ చంద్ సిన్సివర్ అనే ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసరు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఆరుగుర్ని నిందితులుగా పేర్కొన్నారు. 200 మంది పేరు తెలియని యితరులు కూడా హింసలో పాలుపంచుకున్నారని రాశారు. చిత్రమేమిటంటే పెహలూ యిచ్చిన మరణవాంగ్మూలంలో చెప్పిన ఆరుగురిపై కాని, బతికి వున్న బాధితులు పేర్లు చెప్పినవారిపై కాని కేసులు పెట్టలేదు. ఇక పెహలూ, అతని కొడుకులు, వాళ్లతో పాటు వచ్చిన గ్రామస్తులు మేవో వర్గానికి చెందిన యితర పాలవ్యాపారులు యిలా మొత్తం 16 మంది మీద కేసులు పెట్టారు. వాళ్లపై పెట్టిన కేసు రాజస్థాన్ బొవైన్ యానిమల్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటర్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ టెంపరరీ మైగ్రేషన్ ఆర్ ఎక్స్‌పోర్ట్) అనే 1995 చట్టం కింద పెట్టారు. ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి చట్టవిరుద్ధంగా ఆవుల్ని తరలించేవారిపై కేసులు పెట్టే చట్టం అది. దాని ప్రకారం అలా తరలించే వాహనాలను స్వాధీనం చేసుకుని, ఆ వ్యక్తులను అరెస్టు చేయవచ్చు. అయితే యీ సందర్భంలో వాళ్లు చట్టవిరుద్ధంగా తరలించటం లేదు. జయపూర్ మునిసిపల్ కార్పొరేషన్ వారికి సర్‌చార్జి కట్టి మరీ తీసుకెళుతున్నారు. ''అది సరిపోదు, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేటు నుంచి అనుమతి తీసుకుని వుండాల్సింది'' అంటున్నారు రాజస్థాన్ పోలీసులు.

పార్లమెంటులో దీనిపై చర్చ జరిగినపుడు మైనారిటీ ఎఫయిర్స్ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ 'అది గోరక్షకుల పని కాదు' అన్నాడు. తర్వాత అలా అనలేదన్నాడు. హెూం శాఖ సహాయమంత్రి కిరణ్ రిజ్జు ''గోరక్షులు చట్టాన్ని తమ చేతుల్లో తీసుకుంటే సహించం'' అంటూనే 'ఇది రెండు గ్రూపుల మధ్య కొట్లాట' అనేశాడు. ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ దేశమంతా గోవధ నిషేధించాలని అంటూనే, గోరక్షకుల అత్యాచారాలను ఖండించారు. రాజస్థాన్ హెూం మంత్రి గులాబ్ చంద్ కటారియా ''అక్రమంగా గోవులను తరలించేవారిని ఎవరైనా పట్టుకుంటే మరీ ఆందోళన చేయనక్కరలేద'ని అన్నాడు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర చట్టాన్ని అతిక్రమించినవారెవరైనా సరే వదలం అన్నారు. దానితో పాటు ఏప్రిల్ 6 న గోరక్షణకై నిధుల కోసం అన్ని డాక్యుమెంట్లపై 10% అదనపు సర్‌చార్జిని విధించారు. ఈ సంఘటన జరగడానికి ఒక రోజు ముందు మార్చి 31న గుజరాత్ ప్రభుత్వం గోవధ చేసేవారిపై శిక్షను 10 సం॥ల జైలు నుంచి యావజ్జీవ శిక్షకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిని, బజరంగ్ దళ్ వంటి సంస్థల సహాయంతో గోవాలో గోమాంస భక్షణను అరికడతామని ఏప్రిల్ 17 న ప్రకటించింది. ఇప్పుడీ ఆల్వార్ ఘటనలో కూడా దాడి చేసినవారు తాము విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్‌లకు చెందిన వారమని చెప్పుకున్నారట. వాళ్లను ఐడెంటిటీ కార్డులు చూపించమని అడిగినవారెవరూ లేరనుకోండి.

దీనికి తోడు రాజస్థాన్ హెూం మంత్రి అసెంబ్లీలో ''పెహలూ ఖాన్ కుటుంబమంతా ఆవులను స్మగ్లింగ్ చేసే కుటుంబం. అతని కొడుకు ఇర్షాద్‌పై రెండు కేసులున్నాయి.'' అన్నాడు. దానిపై హిందూస్తాన్ టైమ్స్ పత్రిక విచారణ జరిపి ఆ రెండు కేసుల్లోనూ అతను నిర్దోషిగా విడుదలయ్యాడని, కటారియా ఆ విషయం దాచాడని ప్రకటించింది. ఆ కేసుల్లో మొదటిది 2011లో నూహ్‌లోని తావ్‌డూ గ్రామంలో దాఖలు చేసినది. ఆవుల్ని తరలిస్తున్నందుకు పోలీసులు ఒకణ్ని పట్టుకున్నారు. అతను యీ ఆవుల సొంతదారు ఇర్షాద్ అంటూ అతని పేరు చెప్పాడు. దాంతో ఆవుల పట్ల అతను క్రూరంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ పోలీసులు కేసు పెట్టారు. దానిపై నాలుగేళ్లు విచారణ జరిగింది. అది అన్యాయంగా మోపిన కేసు అని కోర్టు అభిప్రాయపడి 2015లో కొట్టేసింది. రెండవ కేసు కూడా 2011లో రోహటక్‌లో నమోదు చేసినది. రోహటక్ సంతలో ఎద్దులు కొని సాటి గ్రామస్తులతో సహా వూరికి తిరిగి వస్తూ వుంటే కొందరు 'గోరక్షకులు' అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు వాళ్లు వచ్చి 'మీరు ఎద్దులను నడిపించి తీసుకుని వెళు తున్నారు. ఇది జంతుహింస కింద వస్తుంది' అంటూ ఇర్షాద్‌పై, మరో 51 మందిపై కేసులు పెట్టారు. తక్కినవాళ్లందరూ నేరం చేశామని ఒప్పుకుని జైల్లో కొన్నాళ్లుండి, రూ. 30 వేల రూ॥ల బ్యాండ్ యిచ్చి బయటకు వచ్చేశారు. కానీ ఇర్షాద్ కేసు ఎదుర్కున్నాడు. చివరకి 2015లోనే కోర్టు ఆ కేసూ కొట్టేసింది. ఏ కేసులోనూ స్మగ్లింగ్ ఆరోపణ లేదు. అయినా రాష్ట్రం హెూం మంత్రి అసెంబ్లీకి తప్పుడు సమాచారం యిచ్చి తప్పించుకోజూశాడు. ఇవన్నీ పక్కకు పెట్టినా బాధాకరమైన విషయం ఏమిటంటే సిపిఎం, ఆప్ తప్ప ఏ రాజకీయ పార్టీ నాయకుడు కానీ, ఏ అధికారి కానీ చనిపోయిన పెహలూ ఖాన్ చనిపోయాక అతని కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లలేదు. గోరక్ష పేరుతో అసాంఘిక శక్తులు అరాచకం చేస్తే ఖండించడానికి వీళ్లెవరికీ నోరు పెగలటం లేదంటే అంతకంటె విషాదం వుందా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017) (సోషల్ మీడియాలో ఆల్వార్ ఘటన)**

**ఏప్రిల్ 24** **ఎమ్బీయస్ : బాహుబలి చావుపై అంత ఆసక్తా...?**

ఇవాళ కొంతమందికి నిద్ర పడుతుంది – బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడో తెలిసిపోయింది కనుక. సినిమా టిక్కెట్టు కొని, యింకా చూసే అవకాశం రానివాళ్లను ఆ ప్రశ్న యింకా వేధిస్తూనే వుండవచ్చు. 'కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు?' అన్న ప్రశ్నను మీడియా జాతీయస్థాయికి తీసుకుపోయింది. దేశంలో యింకే సమస్యా లేనట్లు ప్రజలంతా దీనికి సమాధానం తెలుసుకోవడానికే ఉగ్గబట్టుకుని వున్నట్లు బిల్డప్ యిస్తున్నారు. సినిమా కథలో ఒక మలుపు గురించి యింత చర్చ అవసరమా? గతంలో ''పులిరాజాకు

ఎయిడ్స్ వస్తుందా?" అనే ప్రశ్నకు పని గట్టుకుని ప్రభుత్వం విపరీతంగా ప్రచారం కలిగించింది. ఎయిడ్స్ గురించి అందరూ బాహాటంగా మాట్లాడేటట్లు చేయాలని, తద్వారా దానిపై అవగాహన పెంచాలని చేసిన వినూత్న ప్రయత్నమది. ఆ తర్వాత యీ ప్రశ్న గురించే కాబోలు యింత చర్చ జరిగింది. ఎవరు ఎవర్ని చంపినా కథలో భాగంగానే వస్తుంది కదా. పాత్ర స్వభావాలను ఎలాగైనా మార్చవచ్చు, దానికి లీడ్ చేసే ఘట్టాలను ఎల్కాటనా కల్పించవచ్చు ఎందుకంటే యిది కాల్పనికమైన జానపద కథ!

అదే పౌరాణికం అనుకోండి. ఆ నాటి కాలంలో పాఠకులను కన్విన్స్ చేయాలన్న తపన లేకుండా వాళ్లు సంఘటనలు చెప్పుకుంటూ పోయారు. నేటి తరం వాళ్లు అలా వూరుకోరు. ఎందుకలా చేశాడు? ఔచిత్యభంగమైంది కదా, అంటారు. సినిమాగా తీసినపుడు పాత్రధారి యిమేజి దెబ్బ తినకుండా చూడాలి. చంద్రుడికి, గురుపత్ని యైన తారతో అక్రమ సంబంధం ఏర్పడినట్లు చూపించాలంటే దానికి ముందూ వెనకా ఎంతో కల్పించాల్సి వస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ తప్పు చేసినట్లు ప్రేక్షకులను ఒప్పించడానికి కొన్ని ఘట్టాలు పెట్టాలి. ఎందుకంటే మూల కథను మార్చలేరు. అలాగే కృష్ణదేవరాయలు తనను చిన్నప్పటి నుంచి పెంచి, పెద్ద చేసి, తీర్చిదిద్దిన తిమ్మరసు కళ్లు పీకించాడు అనే చారిత్రక సత్యాన్ని మరుగు పరచలేరు, మార్చలేరు. "మహామంత్రి తిమ్మరసు"గా ఆ కథను సినిమాగా తీసినపుడు హీరో యిమేజికి భంగం కలగకుండా వుండడానికి హంవీరుడనే ఓ విలన్ పాత్ర సృష్టించి, అతని కపటం వలన అపోహలు వచ్చాయని చూపించాల్సి వచ్చింది. కృష్ణదేవరాయలు చివర్లో తన తప్పు తెలుసుకుని తిమ్మరసుకి మళ్లీ పదవి కట్టబెట్టినట్లు మార్చవలసి వచ్చింది. చరిత్ర ప్రకారమైతే కృష్ణదేవరాయలు కొడుకుని ఎవరో చంపివేశారు. అప్పటికే అతనికి సలహాదారులుగా కుదురుకున్న పోర్చుగీసు వాళ్లు తిమ్మరుసుమీద నేరం నెట్టారు. అతనికే ఈ ట్రిక్కులన్నీ తెలుసు అన్నారు. పుత్రశోకంతో వున్న కృష్ణదేవరాయలు ఆ చెప్పుడు మాటలు విన్నాడు. 80 ఏళ్లు దాటిన తిమ్మరుసు కళ్లు పీకించి, జైల్లో పెట్టాడు. అది చూసి తిరుగుబాటు చేసిన అతని కొడుకునీ, తమ్ముణ్నీ కూడా అలాగే శిక్షించాడు. అబ్బే వాళ్లని చంపించాడు అని కొందరు రాశారు. సినిమాలో అలా చూపించలేక కృష్ణదేవరాయలు పశ్చాత్తాప పడినట్లు మార్చారు.

బాహుబలి పూర్తి జానపద కథ కాబట్టి ఏ పాత్రను ఎలా తిప్పినా అడిగేవాడు లేడు. ఫలానా కారణం చేత చంపాడు అంటూ వస్తున్న ఐదారు రకాల రూమర్లన్నీ కన్విన్సింగ్‌గానే వున్నాయి. వాటిలో ఏదైనా నిజం కావచ్చు. దాని కోసమే సినిమా చూడాలనుకోవడం వింతగా తోస్తుంది నాకు. అలాగైతే డిటెక్టివ్ నవల రెండో సారి చదవనక్కరలేదు, సస్పెన్సు సినిమా రెండోసారి చూడనక్కరలేదు. కానీ చదువుతాం, చూస్తాం. ఎందుకు? కథ నడిపించిన విధానం కోసం. ఈ వాదనకు "ప్రాణమిత్రులు" సినిమా (1967) మంచి ఉదాహరణ. దానికి నేపథ్యం వుంది. 12 వ శతాబ్దంలో రెండవ హెన్రీ తన మిత్రుడైన బెకెట్‌ను ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీగా నియమించి చర్చిని తన అధీనంలోకి తీసుకుందామని ప్రయత్నించాడు. కానీ చర్చి వ్యవహారాల్లోకి లోతుగా దిగాక బెకెట్‌కు మతపరమైన భక్తిశ్రద్ధలు పెరిగి రాజు అధికారానికి అడ్డుకట్ట వేశాడు. వారి మధ్య విభేదాలు ముదిరాయి. దాంతో రాజు విసిగిపోయి ఓ సారి 'ఈ తగవులమారిని నా దారి నుంచి ఎవరైనా తప్పిస్తే బాగుండును' అన్నాడు. దాన్ని వేరేలా అర్థం చేసుకున్న సైన్యాధికారులు రాజుకి చెప్పకుండా వెళ్లి బెకెట్‌ను చంపివేశారు. అది రాజును చలింపచేసింది. దరిమిలా ప్రాయశ్చిత్తం చేసుకుని బెకెట్‌ను ఆరాధించాడు.

ఈ థీమ్‌పై "మర్డర్ ఇన్ కాథెడ్రల్" అనే నాటకం, దాని ఆధారంగా "బెకెట్" (1964) అనే ఆంగ్లసినిమా తయారయ్యాయి. ముళ్లపూడి వెంకటరమణ గారు యీ థీమ్‌ను తీసుకుని యజమాని, కార్మికుల మధ్య సమస్యగా మార్చి ప్రాణమిత్రులు కథ రూపొందించారు. షిప్‌యార్డ్ కాంట్రాక్టర్ (జగ్గయ్య) తన స్నేహితుణ్ని (నాగేశ్వరరావు) కార్మికుడిగా ప్రవేశపెట్టి, లేబర్ యూనియన్‌ను తన వశంలోకి తెచ్చుకుందామని చూస్తాడు. కానీ కార్మికుల కడగండ్లు చూసిన నాగేశ్వరరావు కార్మిక పక్షపాతిగా మారి స్నేహితుడికి ఎదురు తిరుగుతాడు. అనేక ఘర్షణల తర్వాత జగ్గయ్య నాగేశ్వరరావుపై తుపాకి ఎక్కుపెడతాడు. ఆ తరుణంలో విలన్ నాగేశ్వరరావును కాల్చి చంపేస్తాడు. జగ్గయ్య పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. సినిమా ప్రారంభంలో నాగేశ్వరరావు ఫోటోకు దండవేసి, దాని ముందు జగ్గయ్య నిలబడి ఫ్లాష్‌బ్యాక్‌లో కథ చెప్పాలని రమణ ఉద్దేశం. దర్శకనిర్మాత పి.పుల్లయ్యగారికి కథ బాగా నచ్చింది. అయితే నాగేశ్వరరావు చచ్చిపోతాడని ముందే చెపితే సస్పెన్సు పోతుందని భయపడ్డారాయన. 'ఎంత సస్పెన్సయినా మొదటి ఆట వరకే కదండీ, బెకెట్‌లో కూడా కథ ఫ్లాష్‌బ్యాక్‌లో చెప్పారుగా' అని రమణ వాదించినా లాభం లేకపోయింది. స్ట్రెయిట్ నేరేషన్‌లో కథ చెప్పించారు. సినిమా ఫెయిలయింది. పదేళ్లు పోయాక ఇదే కథను ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో చెప్పిన "నమక్ హరామ్" హిట్టయింది. అనుభవజ్ఞులైన పుల్లయ్యగారి అంచనా తప్పిందనుకోవాలి.

చెప్పవచ్చేదేమిటంటే – కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడో తెలుసుకోవడానికే బాహుబలి2కి వెళ్లాలనుకోవడం పొరపాటు. సినిమా బాగుంటే చంపడానికి తగిన కారణం చూపలేకపోయినా, లాజిక్ మిస్సయినా, కొంత మేరకు చెల్లిపోతుంది. ఎమోషన్ పండితే ప్రేక్షకులు లాజిక్ మరీ పట్టించుకోరని ఎన్నోసార్లు రుజువైంది. బాహుబలి1లో ఎమోషన్స్ తగినంత లేవని, కళ్లు మిరిమిట్లు గొలిపాయి కానీ చెమర్చలేదని అప్పుడు రాస్తే నాపై కొందరు కోపగించుకున్నారు. తర్వాత్తర్వాత అందరూ అదే అనసాగారు. మొదటిపార్టులో ఎమోషన్లు అంతగా చూపలేకపోయాం, పాత్రలను పరిచయం వదిలేశాం, మొత్తం డ్రామా అంతా రెండో పార్టులో గుప్పించాం అంటున్నారిప్పుడు. ఎమోషన్, డ్రామా, భారీతనం రెండు భాగాల్లోనూ సమంగా సర్దివుంటే బాగుండేది. సరే వాళ్ల యిష్టం వాళ్లది. బాహుబలి 2 వచ్చేసింది. ఎమోషనల్ డ్రామా బాగుందని రివ్యూ కూడా చదివాను. శుభం. దాని కోసమే సినిమా చూస్తాను. ఎందుకు చంపాడన్నది నాకు ముఖ్యం కాదు. ఎవరైనా స్పాయిల్–స్పోర్ట్ అది ముందే చెప్పేసినా చూడడం మానను. దర్శకుడు కథ

నడిపించిన తీరు గురించే నా ఆసక్తి. కథ ముందే తెలిసిపోయినా పౌరాణిక సినిమాలు అందుకే చూస్తున్నాం. స్పాయిల్–స్పోర్ట్ అంటే ఓ విషయం గుర్తుకు వచ్చింది. మేం కాలేజీలో వుండే రోజుల్లో ''హమ్‌రాజ్'' అనే మంచి సస్పెన్స్ సినిమా వచ్చింది. ఓ యిద్దరు స్టూడెంట్స్ ఎందుకోగాని కొట్టుకున్నారు. దెబ్బలు ఎక్కువగా తిన్నవాడు కసి పట్టలేక 'చూస్కో ఏం చేస్తానో, హమ్‌రాజ్ సినిమాలో విలన్ పేరు చెప్పేస్తున్నా – మదన్ పురి!" అని అరిచాడు. అవతలివాడు చలించలేదు. ''వాడెవడో నాకు తెలియదుగా!" అన్నాడు. అజ్ఞానం ఒక్కోప్పుడు వరం! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2017)**

**న్యూస్ వ్యూస్ 129 మే 01, 02** **ఎమ్బీయస్ : బరువూ తగ్గింది, పరువూ తగ్గింది...**

ఇమాన్ అహ్మద్ అనే 36 ఏళ్ల ఈజిప్షియన్ వనిత తన స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి ఫిబ్రవరిలో ముంబయిలోని సైఫీ ఆసుపత్రికి వచ్చిందని మనమంతా పేపర్లలో చదివాం. అసాధ్యమైన చికిత్స చేపట్టినందుకు ఇమాన్ సోదరి షైమా ధన్యవాదాలు చెప్పడంతో ఆ ఆసుపత్రికి, బేరియాట్రిక్ సర్జన్ డా।। ముఫజల్ లకడావాలాకు చాలా పబ్లిసిటీ వచ్చింది. మూడు నెలలు పూర్తి కాకుండానే ఆమె గురువారం నాడు ఆసుపత్రి నుంచి డిస్చార్జి అయ్యేవేళ మాత్రం వేరే రకమైన పబ్లిసిటీ వస్తోంది. షైమా ఆసుపత్రిని సిబ్బందిని, సిబ్బంది షైమాని పరస్పరం నిందించుకుంటున్నారు. ఈ వివాదానికి మూలకారణం ఆమె తగినంతగా బరువు తగ్గలేదని సైఫీ అనడం, తగ్గిందని డాక్టర్లు అనడం!

నిజం తెలియాలంటే చేర్చినపుడు ఆమె బరువు ఎంత, యిప్పుడెంత అనేది నిర్ధారణగా తెలియాలి. ఆమె ఫిబ్రవరి 11 న ముంబయికి వచ్చినపుడు 504 కిలోలుందని పత్రికలలో వచ్చింది. ఇన్నాళ్లూ అదే ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఆమె బరువు 200 కిలోలకు లోపే అని డాక్టర్లు చెప్తున్నారు. ఆమెకు ఏప్రిల్ 24 న సిటి స్కానింగ్ చేశామని, ఆ యంత్రం 204 కిలోల కు మించి బరువు మోయలేదు కాబట్టి తాము చెప్పినది నిజమే అని రుజువౌతోందని అన్నారు. అయితే ఆమె వచ్చినపుడు బరువెంత అన్న ప్రశ్న లేవనెత్తినపుడు డా।। ముఫజల్ ''2016 అక్టోబరులో ప్రపంచ మీడియా అత్యంత బరువైన వ్యక్తి అని యీమెను పేర్కొన్నారు. ఈజిప్టు డాక్టరొకాయన 500 కిలోల బరువన్నాడు. నేను షైమాను అడిగినప్పుడు తాము ఒక ఇండస్ట్రియల్ త్రాసుపై ఆమెను తూచామని దాని ప్రకారం చెప్పామని నాతో అంది. ఇప్పుడలా అనలేదంటోంది. ఆమె మాట పట్టుకునే మేము 550 కిలోల బరువు మోసే బెడ్‌ను హంగరీ నుంచి తెప్పించాం. ఆమె వచ్చిన మూడు వారాలకు మేం మార్చి 2 న తూస్తే 378 కిలోలుంది. ఇప్పుడు 176 కిలోలుంది." అంటున్నారు. మొన్నమొన్నటివరకు 500 కిలోలని ప్రచారం సాగుతూ వచ్చినపుడు ఆయన 'అబ్బే అంత వుండదు' అని చెప్పలేదన్నది యిక్కడ గమనించవలసిన అంశం.

ఎందుకు పుట్టించారో కానీ 500 అంకె ఇమాన్‌కు బ్రహ్మాండమైన గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆమె చికిత్స కయ్యే ఖర్చు భరించడానికి ప్రపంచపౌరులు చాలామంది ముందుకు వచ్చారు. అసలంత బరువెలా పెరిగింది అని అడిగితే చెప్పినదేమిటంటే – ఆమె పుట్టినప్పుడు 5 కిలోల బరువుందట. 11 ఏళ్ల వయసు నుంచి విపరీతంగా పెరగసాగిందట. దాంతో ఆమె కాళ్లు ఆమె శరీరభారాన్ని మోయలేకపోయాయి. దాంతో పాకేది. స్కూల్లో పిల్లలు అది చూసి గేలి చేసేవారు. అందువలన ఆమె 5 వ తరగతితో చదువు ఆపేసి యింట్లో వుండిపోవాల్సి వచ్చింది. అలా పాతికేళ్లగా ఆమె యింట్లో మంచం మీదనే వుంటూ అనూహ్యంగా బరువు పెరిగిపోతూ వచ్చింది. ఆమెకు ఒక జెనటిక్ డిజార్డర్ వుంది. అందువలన ఆమె మెదడు 'నీకు ఆకలేస్తోంది, తినుతిను' అని చెప్తూ వుంటుంది. అందువలన తినేసేది. ఆ జబ్బుకి మందు యింకా పరీక్షల దశలో వుంది. ఆమె శరీరానికి ఏ రకమైన వ్యాయామం లేకపోవడంతో సకల రోగాలు చుట్టుముట్టాయి. టైప్ 2 డయాబెటిస్, హైపర్‌టెన్షన్, హైపోథైరాడిజం, గౌట్, ఫ్లూయిడ్ రిటెన్షన్... యిలా. మూడేళ్ల క్రితం ఆమెకు స్ట్రోక్ వచ్చింది. ఎంఆర్ఐ స్కాన్ చేయిద్దామంటే బరువు కారణంగా చేయించలేకపోయారు. పక్షవాతం వచ్చి మాట పడిపోయింది, ఎడమ చేతివైపు చచ్చుపడిపోయింది. లేచి కూర్చునే శక్తి కూడా కోల్పోయింది.

ఈ పరిస్థితిలో ఇంజనియర్‌గా పనిచేసే ఆమె అక్క షైమా తన ఉద్యోగం మానేసి తల్లికి సహాయంగా ఇమాన్‌ను చూసుకోసాగింది. చెల్లికి చికిత్స చేయిద్దామని ఈజిప్టులో ఎందర్ని సంప్రదించినా అందరూ చేతులెత్తేశారు. 2016 సెప్టెంబరులో ఎవరో డా।। ముఫజల్ గురించి ఆమెకు చెప్పారు. ఆమె వెంటనే ఆయనకు ఉత్తరం రాసింది. ఆయన యీ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. పేషంటును తమ ఆసుపత్రికి తీసుకువస్తే తన టీముతో కలిసి ఉచితంగా వైద్యం చేస్తామన్నారు. అయితే ఆమెను ఇండియాకు తీసుకురావడం ఎలా? ఇండియాకు వీసా కావాలంటే ఆమె ఈజిప్టులోని ఇండియన్ ఎంబసీకి స్వయంగా వెళ్లాలి. ఆమె కదలల్లేదు. అప్పుడు డాక్టరు సుష్మా స్వరాజ్‌తో మాట్లాడి మినహాయింపు తెప్పించారు. రావడానికి మామూలు విమానాలు సరిపోవు కాబట్టి కార్గో ఫ్రయిటర్‌ను ఆమెకు అనుగుణంగా మార్చి ఇండియాకు తీసుకురావడానికి రూ. 83 లక్షలు ఖర్చవుతుంది. 'హెల్ప్ సేవ్ ఇమాన్' పేర డాక్టరు క్రౌడ్ ఫండింగ్ వేదిక ఏర్పాటు చేశారు. జనం నుంచి విరాళాలు పోగయ్యాక యీ ఫిబ్రవరి నెలలో ఆమెకై ప్రత్యేకమైన బెడ్ తయారుచేయించి, ఆమె నివాసముండే యింటి గోడ పగలకొట్టి క్రేన్ సహాయంతో ఆమెను విమానంలోకి ఎక్కించారు. ఆమెకున్న ఆరోగ్యసమస్యల దృష్ట్యా 300 కిలోల మెడికల్ ఎక్విప్‌మెంట్ కూడా తోడుగా తెచ్చారు.

విమానం ఫిబ్రవరి 11న ముంబయికి వచ్చాక క్రేన్ సహాయంతో ఓపెన్ ట్రక్‌లో ఎక్కించి, హాస్పటల్‌కు చేర్చారు. ఆమె కోసం

వెయ్యి చ.అ.ల గదిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన ఆహారమిచ్చి 100 కిలోలు తగ్గించామని, ఆ తర్వాత మార్చి 7 న పొట్ట సైజుని నాలుగోవంతుకి తగ్గించే బేరియాట్రిక్ సర్జరీ చేసి మొత్తం 140 కిలోలు తగ్గించడం చేత, ప్రస్తుతం 358 కిలోలుందని మార్చి 18 న డాక్టర్లు చెప్పారు. షైమా కూడా డాక్టర్లు ఎంతో శ్రమిస్తున్నారని కితాబు యిచ్చింది. అంతా బ్రహ్మాండంగా వుందని అనుకుంటూండగా మే నెల మొదటివారంలో ఆమెను వెనక్కి పంపేస్తామని డాక్టర్లు ఏప్రిల్ నెలలో అనడంతో షైమా గుండెల్లో రాయి పడింది. ఇప్పుడు మళ్లీ యీామెను వెనక్కి తీసుకుని వెళ్లి మళ్లీ సేవలు చేయడానికి ఆమె సిద్ధంగా లేదు. 'మీరు ఆమెను సొంత కాళ్ల మీద నడిచేట్లా చేస్తానని మాట యిచ్చారు. అప్పటిదాకా నేను తీసుకెళ్లను' అని గొణగసాగింది. కాళ్లు సరిగ్గా ఎదగక, పాతికేళ్లగా నడవకుండా వుండి, యీ మధ్యలో అనేక రోగాలు తెచ్చుకున్న పేషంటును నడిపిస్తామని తాము ఎన్నడూ అనలేదని, ఆమె వచ్చినపుడు యిచ్చిన ప్రెస్ మీట్‌లో కూడా తన కాళ్ల మీద తాను నిలవడం అనేది సుదూర స్వప్నం అనే అన్నామనీ, వీల్ ఛెయిర్‌లో కూర్చోబెట్టగలగడమే తమ లక్ష్యం అనీ డాక్టర్లన్నారు. పైగా తాము బేరియాట్రిక్ సర్జన్లమే తప్ప కార్డియాలజీ, న్యూరాలజీ వంటి విభాగాలతో తమకు సంబంధం లేదని నచ్చచెప్పబోయారు. పనిలో పనిగా ఏప్రిల్ 12 న ఒక ప్రకటన చేస్తూ ఇమాన్ బరువు 242 కిలోలు అయిందని, అంటే సగానికి సగం తగ్గిందని, దాని కారణంగా ఆమె ఆరోగ్యం మెరుగు పడిందని, ఆమె గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు గతంలో కంటె బాగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఏప్రిల్ 18న ఆమె వీల్‌ఛెయిర్‌లో కూర్చుని చిరునవ్వు నవ్వుతున్న వీడియోను ఏప్రిల్ 22న ప్రెస్‌కు రిలీజ్ చేశారు. ఆమెను మామూలు రూముకి మార్చారు.

ఇది ఆమె సోదరి షైమాను మండించింది. తమ పేరు మీద బోల్డంత ఉచిత పబ్లిసిటీ కొట్టేసిన ఆసుపత్రివారు యిప్పుడు తమను తరిమివేద్దామని చూస్తున్నారని ఫీలైంది. కనీసం రెండేళ్ల పాటు తమ దగ్గరే వుంచుకుంటామని హామీ పత్రం రాసిమ్మని డిమాండ్ చేసింది. డా॥ ముజఫల్ అలాటి హామీ ఏమీ యివ్వనని చెప్పారు. దాంతో రచ్చకెక్కింది. అరబిక్ భాషలో ఒక ప్రసంగం చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'ఇక్కడి డాక్టర్లందరూ ఆమె 300 కిలోలు తగ్గిందని చెప్పుకుంటున్నారు. అంతా అబద్ధాలకోర్లు. నిజానికి 10% కంటె బరువు తగ్గలేదు. ఇండియాకు వచ్చాక వాళ్లు ఒక్కసారి కూడా బరువు చెక్ చేయలేదు. పైగా వచ్చినప్పటి కంటె ఆరోగ్యం చెడిపోయింది. వాళ్లు ఇమాన్‌కు విపరీతంగా మందులిచ్చేసి, ఆమె బ్రెయిన్ యాక్టివిటీని ఆపేస్తున్నారు. తనకు ఎపిలెప్సీ స్ట్రోక్ వచ్చినా సాధారణమైన గదికి మార్చేస్తున్నారు. నేను దానికి అభ్యంతరం తెలిపితే నాకు బుద్ధి చెప్పడానికి ఓ రోజంతా నా గదికి కరంటు సప్లయి ఆపేశారు.' అంటూ ఆరోపించింది.

పేషంటును వెనక్కి తీసుకెళితే తమలా కోటి రూ.ల వైద్యాన్ని ఉచితంగా అందించడానికి ఈజిప్టు డాక్టర్లెవరు సిద్ధంగా లేరు కాబట్టి తమను బ్లాక్‌మెయిల్ చేయడానికే షైమా యిలా మాట్లాడిందని సైఫీ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అనుకున్నారు. మర్నాడే 11 మంది డాక్టర్లు 'మేం యిక ఇమాన్‌ను ట్రీట్ చేయం' అని ప్రకటించారు. ఆమె ఆరోగ్యం గతంలో కంటె మెరుగు పడిందని రుజువు చేసే వీడియోలు యూట్యూబులో పెట్టారు. అయితే షైమా అరబిక్ ప్రసంగం అరబ్బు దేశాల్లో సంచలనం రేకెత్తించింది. అబూ ధాబీలోని విపిఎస్ హెల్త్‌కేర్‌లోని డాక్టరు మేయర్, ఇమాన్ చికిత్సను తమ వద్ద కొనసాగించడానికి ముందుకు వచ్చారు. ఈ లోగా షైమా యిక్కడ రచ్చచేయడానికి నిశ్చయించుకుని చెల్లెలి బెడ్ వద్దకు వచ్చి ఆమె నోట్లో నీళ్లు పోయబోయింది. 'ఆమెకు మూణ్నెళ్లగా ముక్కు ట్యూబు ద్వారానే ఆహారం యిస్తున్నాం. ఇప్పుడు సడన్‌గా నోటి ద్వారా ఏదైనా యిస్తే కాంప్లికేషన్ వచ్చి డిస్చార్జి చేయడానికి యిబ్బంది కావచ్చు' అనుకున్న నర్సులు అడ్డుకున్నారు. అయినా ఆమె వినలేదు, వాళ్లను తోసేసింది. వాళ్లు పోలీసులను పిలిచారు. తన సోదరి ఆరోగ్యం బాగు పడకపోయినా సైఫీ ఆసుపత్రి వాళ్లు డిస్చార్జి చేసేస్తున్నారని షైమా గగ్గోలు పెట్టేస్తోంది. చుట్టపుచూపుగా వచ్చి దెయ్యమై పట్టుకుందనే సామెత నిజమైంది. అలా ఆమె పరువుతో బాటు, యిక్కడకు వచ్చినపుడు ఆమె బరువు 500 కిలోలు లేదనే వాస్తవాన్ని దాచినందుకు డాక్టర్ల పరువూ పోయింది.

సైఫీ హాస్పటల్ డాక్టర్లు అనేదేమిటంటే – ''అసలు యిన్ని రోగాలున్న భారీ మనిషితో యింత రిస్కు తీసుకోవడానికి ఏ డాక్టరూ ముందుకు రారు. మేం సేవాద ృక్పథంతో యీ పని చేపట్టాం. మనసా, వాచా, కర్మణా శ్రమించాం. చివరకు మాకు దక్కినది చెడ్డపేరు మాత్రమే. ఆమెకు వూపిరి ఆడకపోవడం సహజం. బేరియాట్రిక్ సర్జరీ చేశాక ఆ సమస్య అందరికీ వస్తుంది. ఆమె 20-30 ని॥లు కూర్చోగలుగుతోందంటేనే గొప్ప. ఆమె యిక్కడకు వచ్చాక మళ్లీ స్ట్రోక్ రాలేదని సిటి స్కాన్‌లో తేలింది. మా శక్తియుక్తులు, ఆర్థిక వనరులు ఒకే పేషంటుపై వెచ్చించలేము కదా. ఫిజియోథెరపీకి దగ్గరగా వుంటుంది కదాని ఆమెను మెయిన్ బిల్డింగుకు మార్చాం. దానికే షైమా గగ్గోలు పెట్టేస్తోంది. ఇకపై ట్రీట్‌మెంటుకు ఖర్చు ఎక్కణ్నుంచి వస్తుందాని ఆమె చింత. అందుకే యిలాటి ప్రకటనలు చేస్తోంది.'' అంటున్నారు. షైమా వారితో విభేదిస్తోంది – ''ఈజిప్టులో ఉచితంగా చికిత్స చేస్తానన్నారు. కానీ అక్కడి కంటె యిక్కడ వసతులు బాగుంటాయని నచ్చచెప్పి డా॥ ముజఫల్ యిక్కడకు రప్పించారు. ఇక్కడకు వచ్చినందుకు నేను చింతిస్తున్నాను. ఇతర డాక్టర్లతో కానీ, మీడియాతో మాట్లాడకూడదని ఆసుపత్రివారు నిర్బంధం చేస్తున్నారు.'' అంటోంది.

ఈజిప్షియన్ సొసైటీ ఫర్ బేరియాట్రిక్ సర్జరీ వ్యవస్థాపకుడు డా॥ ఖాలీద్ గాదత్ ''ఇమాన్‌తో ఇండియన్ డాక్టర్లు వ్యవహరించిన తీరుపై ఈజిప్టులో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక్కడ మా హాస్పటల్స్ సమగ్రమైన చికిత్స చేస్తామని చెప్పాం. అయితే ఇండియన్ హాస్పటల్ వారు ఆర్నెల్ల నుంచి ఏడాది వరకు తమ వద్ద వుంచుకుని చికిత్స చేస్తామని చెప్పడంతో వాళ్లు అక్కడకు వెళ్లారు. ఈజిప్టులో సరైన చికిత్స లేదు కాబట్టే తన వద్దకు వచ్చారంటూ డా॥ ముజఫల్ గొప్పగా పబ్లిసిటీ యిచ్చుకున్నాడు. దీనిలో మార్కెటింగ్ టెక్నిక్కే

తప్ప మానవీయ కోణం లేదు.” అని చాలా ఘాటుగా మాట్లాడాడు. ఇప్పుడు డాఎఎ మేయెర్ అనే ఆయన గురువారం నాడు ఇమాన్‌ను వెంటపెట్టుకుని ఎయిర్ యాంబులెన్సులో ఆబూ ధాబీలోని బుర్జీల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ న్యూరాలజికల్, సైకలాజికల్ చికిత్స చేయిస్తారట. ఇండియాలో సరిగ్గా చికిత్స జరగలేదని వాళ్లు చెప్పుకోవడం ఖాయంగా కనబడుతోంది. ఎంతో హంగామాతో ప్రారంభమైన ఇమాన్ ఉదంతం యిలా వివాదాస్పదంగా ముగిసింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2017)**

**మే 03, 04** **ఎమ్బీయస్ : ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలు**

ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలు మే 7 ఆదివారం పూర్తయ్యాయి. అంతిమ ఫలితాలు యింకా ప్రకటించలేదు కానీ ఇమాన్యుయేల్ మేక్రోన్ దాదాపు 65% ఓట్లతో తన ప్రత్యర్థి, ఫ్రంట్ నేషనల్ (ఎఫ్ఎన్) అధినేత్రి మేరీన్ లేపెనాను ఓడించినట్లు అనుకోవచ్చు. ఇవి రెండవ విడత ఎన్నికలు. ఏప్రిల్ 23 న జరిగిన మొదటి విడత ఎన్నికలలో 11 మంది అభ్యర్థులు పాల్గొన్నా ఎవరికీ 50% ఓట్లు రాకపోవడంతో యీ విడత ఎన్నికల అవసరం పడింది. 1965 నుంచి యిలా జరుగుతోంది. ఎవరికీ మొదటి రౌండులో 50% ఓట్లు రావటం లేదు. ఈ సారి 4.70 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్న మొదటి దఫా ఎన్నికలలో ఎక్కువ శాతం ఓట్లు తెచ్చుకున్నవాడు సెంట్రిస్టు (మధ్యేవాది) మేక్రోన్‌యే. అతనికి 24% వచ్చాయి. ద్వితీయస్థానంలో ఫార్ రైటిస్టు (తీవ్ర దక్షిణవాది) లే పెనా 21.3%తో, తృతీయ స్థానంలో 20%తో రిపబ్లికన్ ఫ్రాంకోయిస్ ఫిలాన్, చతుర్థ స్థానంలో 19.6%తో లెఫ్టిస్ట్ పార్టీ అభ్యర్థి జీన్ లూక్ మేలెకాన్, పంచమ స్థానంలో 6.4%తో సోషలిస్టు బెనోయిట్ ఎమోన్ నిలిచారు. మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన యిద్దరూ సాంప్రదాయకపు పార్టీలకు చెందినవారు కారు. దశాబ్దాలగా సెంటర్–రైటిస్టులైన రిపబ్లికన్ పార్టీ వాళ్లు, సెంటర్–లెఫ్టిస్టులైన సోషలిస్టు పార్టీ వాళ్లు మార్చిమార్చి ఫ్రాన్సును ఏలుతున్నారు. ఇద్దరితో ప్రజలు విసిగిపోయారనడానికి నిదర్శనం యీ ఎన్నిక. 22 ఏళ్ల తర్వాత 2012 ఎన్నికల్లో నెగ్గి మొన్నటిదాకా పాలించిన సోషలిస్టు ప్రధాని ఫ్రాంకోయిస్ హొలాండ్ పరిపాలన అంటే జనాలకు ఎంత విముఖత ఏర్పడిందంటే అతని పార్టీ అభ్యర్థి ఎమోన్ ఐదో స్థానంలో నిలిచాడు. ఈ ప్రమాదాన్ని పసిగట్టే హొలాండ్ మళ్లీ నిలబడనన్నాడు. నిజానికి అతని స్థానంలో మాజీ ప్రధాని మాన్యుయెల్ వాల్స్ నిలబడతాడనుకున్నారు. కానీ అతను పార్టీ ప్రాథమిక ఎన్నికలలోనే ఓడిపోయాడు. కన్సర్వేటివ్ పార్టీ విషయంలోనూ అదే జరిగింది. మాజీ అధ్యక్షుడు నికొలస్ సర్కోజీ ప్రాథమిక ఎన్నికలలోనే ఓడిపోయాడు. అతని స్థానంలో అభ్యర్థిగా నిలబడిన ఫిలాన్ ఈ జనవరి నుంచి ఒక వివాదంలో చిక్కుకున్నాడు. అతను అధ్యక్షుడిగా వుండగా అతని భార్య, కూతురు, కొడుకు ప్రభుత్వ పదవీ బాధ్యతలు నిర్వహించినట్లు తప్పుడు పత్రాలు చూపించి ప్రభుత్వం నుంచి పదేళ్లపాటు 5 లక్షల యూరోల డబ్బు తీసుకున్నాడు. అందువలన అతని ప్రతిష్ఠ మసకబారింది. ఇక లెఫ్టిస్టు అయిన మేలెకాన్ శ్రీమంతులపై యిప్పుడున్న పన్నుల్ని రెట్టింపు చేస్తానన్నాడు. వెనిజులా వంటి దేశాలతో స్నేహం చేస్తానన్నాడు. దాంతో యితరులు భయపడ్డారు.

ప్రపంచ వ్యవహారాల్లో, మరీ ముఖ్యంగా యూరోజోన్‌లో ఫ్రాన్సుది ముఖ్యమైన పాత్ర. ప్రపంచంలో ఆరవ పెద్ద ఆర్థిక వ్యవస్థ. యూరోప్‌లో జర్మన్ ఎకానమీ తర్వాతి స్థానం దానిదే. మిలటరీ శక్తి కూడా. అణ్వాయుధాలూ వున్నాయి. యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో దానికి వీటో అధికారం వుంది. గ్లోబలైజేషన్‌కు, యూరోజోన్‌కు, ముస్లిములకు, వలసలకు బద్ధవ్యతిరేకి, అతి తీవ్ర జాతీయవాది ఐన లే పెనా హవా చాలా ఉధృతంగా నడవడంతో ఫ్రాన్సు ఎటువైపు మొగ్గుతుందా అని ప్రపంచ విశ్లేషకులందరూ ఉగ్గబట్టుకుని చూశారు. ఆమెను ఎలాగైనా నిలవరించాలనే ప్రయత్నంలో మొదటి రౌండులో వెనుకబడిన అభ్యర్థులందరూ (మేలెకాన్ తప్ప) మేక్రోన్‌కు మద్దతిస్తామన్నారు. కానీ వాళ్ల అనుయాయులందరూ మేక్రోన్‌కు ఓటేస్తారన్న నమ్మకం లేకపోయింది. ముఖ్యంగా మేలెకాన్‌కు ఓటేసిన తీవ్రవామపక్ష ఓటర్లు ‘మేం గైరు హాజరవుతాం, లేదా ఎవరికీ ఓటేయకుండా వదిలేస్తాం తప్ప మేక్రోన్‌కు వెయ్యం’ అని చెప్పారు. మేక్రోన్, లే పెనాల మధ్య మే 3న జరిగిన వాగ్వాదంలో లే పెనా తన ప్రత్యర్థిని పెద్ద వ్యాపారస్తుల ప్రయోజనాలను కాపాడతాడని, ఇస్లామిక్ టెర్రరిజం పట్ల మెతకగా వ్యవహరిస్తాడని ఆరోపించింది. దానికి జవాబుగా మేక్రోన్ లే పెనా ఉత్తిపుణ్యాన భయాలు రేకెత్తిస్తోందని జవాబిచ్చాడు.

39 ఏళ్ల మేక్రోన్ వృత్తిరీత్యా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్. ఇప్పటిదాకా ఎన్నికలలో నిలబడలేదు. హొలాండ్ కాబినెట్‌లో ఎకానమీ, ఇండస్ట్రీ మంత్రిగా పనిచేసి, అతని విధానాలతో విభేదించి, ఏడాది క్రితం బయటకు వచ్చేసి ‘ఎన్ మార్చ్’ (కదలిక అని అర్థం) అనే ఉద్యమం ప్రారంభించాడు. అతను వ్యాపారవర్గాలకు, యూరోజోన్‌కు అనుకూలుడైన సోషల్–లిబరల్. లేబరు చట్టాలు మరీ కఠినంగా వున్నాయని, వాళ్లకు ఉద్యోగభద్రత మరీ ఎక్కువగా వుందని అందుకే పరిశ్రమలు రావటం లేదనీ అతని వాదన. ఎడ్మినిస్ట్రేషన్‌లో మార్పులు తెచ్చి, స్వయంఉపాధి అవకాశాలను పెంచుతానని, యూరోజోన్‌లోనే వుంటూ నిబంధనలు క్రమేపీ సడలిస్తూ పోయి, వ్యాపారావకాశాలను పెంచుతానని వాగ్దానాలు చేసి యువతను, నగరవాసులను బాగా ఆకర్షించాడు. ప్రభుత్వవ్యయాన్ని ఐదేళ్లలో 60 బిలియన్ యూరోల మేరకు తగ్గిస్తానన్నాడు. పెరుగుతున్న అశాంతిని, టెర్రరిజాన్ని దృష్టిలో పెట్టుకుని 10 వేల మంది పోలీసులను నియమించి, 15 వేల మందికై కొత్తగా జైళ్లు నిర్మిస్తానన్నాడు. డిఫెన్స్ బజెట్‌ను జిడిపిలో 2%కు పెంచుతానన్నాడు. పార్లమెంటు సభ్యులను మూడింట రెండు వంతులకు తగ్గిస్తానన్నాడు. మొదటి దశ ఎన్నికలలో మెట్రో సెంటర్లలో, ఫ్రాన్సు పశ్చిమ ప్రాంతంలో ఓట్లు బాగా సంపాదించుకున్నాడు. ఇంగ్లీషులో మంచి వక్త. వ్యక్తిగత జీవితానికి వస్తే మేక్రోన్ తన 32వ యేట తనకంటె

24 ఏళ్లు పెద్దదైన బ్రిగిటీని పెళ్లాడాడు. ఆమె అతని క్లాస్‌మేట్‌కు తల్లి. ఇతనితో పెళ్లి నాటికి ఆమెకు ఏడుగురు మనుమలు వున్నారు.

మెరీన్ లే పెనా తండ్రి జీన్ మారీ లే పెన్ ఎఫ్ఎన్ పార్టీని స్థాపించాడు. అతను మరీ తీవ్రవాది. ఫ్రెంచ్ క్రిస్టియన్లు కానివారిపై విషం కక్కేవాడు. దాంతో తక్కినవారందరికీ అతన్ని చూస్తే భయం. 2002లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాక్విస్ చిరాక్‌తో అధ్యక్ష ఎన్నికలలో పోటీ పడి 18% ఓట్లు తెచ్చుకున్నాడు. లే పెనా తన తండ్రిని పార్టీలోంచి తీసేసి, భావతీవ్రతను కాస్త తగ్గించి సామాన్యజనం ఘోష వినిపిస్తున్నా అని చెప్పుకోసాగింది. 2012లో 17.9% ఓట్లు తెచ్చుకుంది. ఇప్పుడు 48 ఏళ్ల వయసులో ఫైనల్ రౌండ్‌లో దాదాపు రెట్టింపు ఓట్లు తెచ్చుకోవడం వలసలకు, గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా మారుతున్న ప్రజాభిప్రాయానికి, పరిస్థితులకు అద్దం పడుతోంది. గ్లోబలైజేషన్ కారణంగా ఫ్రెంచి నాగరికతకు విఘాతం కలుగుతోందంటోంది. షెంజన్ వెసులుబాట్లు రద్దు చేసి, పాస్‌పోర్టులు చెక్ చేసే పద్ధతిని మళ్లీ పెడతానంది. యూరోజోన్ నుంచి బయటకు రావడానికి ఆర్నెల్ల లోగా రిఫరెండమ్ నిర్వహిస్తానంది. ఫ్రాన్స్ కరెన్సీ ఐన ఫ్రాంక్‌ను మళ్లీ ప్రవేశపెడతానంది. ఇతర దేశాలతో లావాదేవీలకు మాత్రం కామన్ కరెన్సీ ఏదైనా వాడినా దేశంలోపల మాత్రం ఫ్రాంక్‌నే వాడేట్లా చేస్తానంది. లే పెనా 15 వేల మంది పోలీసులను నియమించి, 40 వేల మంది పట్టే జైలు కడతానంది. ఇన్‌కమ్‌టాక్స్ చెల్లింపుదారుల్లో దిగువ మూడు స్లాబుల రేట్లలో 10% చొప్పున తగ్గిస్తానంది. ఫ్రాన్సు జనాభా 6.70 కోట్లు. ఇటీవలి కాలంలో పది లక్షల మంది దాకా వలస వచ్చారు. చట్టపరంగా వచ్చే వలసదారులను యిప్పుడు ఏడాదికి 2 లక్షల మందిని అనుమతిస్తున్నారు. ఇకపై దాన్ని 10 వేలకు తగ్గిస్తానంది. రిటైర్‌మెంట్ వయసును 62 నుంచి 60కి తగ్గించి యువతకు ఉద్యోగావకాశాలు పెంచుతానంది. రెండేళ్లగా ఫ్రాన్సు నగరాల్లో టెర్రరిస్టు దాడులు పెరిగాయి. ప్రధానంగా కాథలిక్ జనాభా కల ఫ్రాన్సులో ముస్లిముల పట్ల అనుమానాలు పెరిగాయి. లే పెనా ఆ అనుమానాలను ఎగదోసింది. ఆమె బురఖాలకు, బీచ్‌లలో బుర్కినిలకు వ్యతిరేకం. స్కూళ్లలో పోర్కు విషయంలో ముస్లిము పిల్లలకు మినహాయింపు యివ్వకూడదంటుంది.

గ్లోబలైజేషన్ పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు చెందుతున్న దేశాలను కొల్లగొట్టాలని చూశాయి. అది కొంతకాలం సాగింది కానీ గత పదేళ్లగా ట్రెండ్ రివర్స్ అయింది. ఆ దేశాల కార్పోరేట్ సంస్థల లాభాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. అందువలన అవి తమ యూనిట్లను తక్కువ వేతనాలున్న దేశాలకు తరలిస్తున్నాయి. తత్ఫలితంగా స్థానికుల ఉద్యోగాలు పోతున్నాయి. చాలా ఏళ్లగా ఫ్రాన్సులో నిరుద్యోగశాతం 10కి అటూయిటూగా వుంది. అమెరికా పారిశ్రామిక వాడల్లో జరిగినదే, ఫ్రాన్సులోనూ జరిగింది. ఉద్యోగాలు పోవడంతో భూమిపుత్రవాదం, విపరీత జాతీయవాదం పెల్లుబికాయి. అమెరికాకు చెందిన విర్ల్‌పూల్ కార్పోరేషన్‌కు ఉత్తర ఫ్రాన్సులో 34 ఏళ్లగా ఒక యూనిట్ వుంది. ఇటీవలే అది ఆ యూనిట్‌ను పోలండ్‌కు తరలించింది. అక్కడైతే కార్మికుల సంక్షేమానికి తక్కువ ఖర్చు పెట్టవచ్చు. ఈ తరలింపు ఫ్రెంచ్ కార్మికులను మండించింది. ఇలాటి సంఘటనలు చాలా జరగడంతో ఉత్తరాన వున్న యిండస్ట్రియల్ బెల్ట్‌లో అందరూ లే పెనాను సమర్థించారు. అక్కడ పరిశ్రమలు తగ్గిపోయి, నిరుద్యోగం ప్రబలడంతో ఫ్రాన్సు ఉద్యోగాలు, ఫ్రెంచివారికే అనే ఆమె నినాదం బాగా పనిచేసింది. అంతేకాకుండా ఆమెకు ఫ్రాన్స్ ఉత్తర, ఈశాన్య, ఆగ్నేయ ప్రాంతాలలో, గ్రామాలలో ఓట్లు బాగా పడ్డాయి. 2014లో ఆమె "పదేళ్లలో నేషనల్ ఫ్రంట్ అధికారంలోకి వస్తుంది." అని ప్రకటించింది. మూడేళు తిరక్కుండానే యిప్పుడున్న స్థాయికి చేరుకుంది. ట్రంప్‌లాగానే "ఫ్రాన్స్ ఫస్ట్", "గ్లోబల్ వద్దు, లోకల్ ముద్దు", "ముస్లిము టెర్రరిస్టులను దేశంలోకి రానీయకూడదు" వంటి నినాదాలు యిచ్చింది. ట్రంప్ నెగ్గినపుడు 'ఇది నా విధానాల విజయం' అని ప్రకటించింది. కానీ ఫ్రాన్సు అమెరికా దోవ పట్టలేదు. ఇప్పుడు విజేతగా నిలిచిన మేక్రోన్ "మేం దేశభక్తులం తప్ప జాతీయవాదులం కాము." అని చెప్పుకుంటున్నాడు. ప్రస్తుతానికి యూరోజోన్ నాయకులు అమ్మయ్య అనుకుంటున్నారు. జూన్ 11, 18 న 577 సీట్లున్న పార్లమెంటు దిగువ సభకు ఎన్నికలు జరగబోతాయి. ఆ ఎన్నికలలో కూడా మేక్రోన్ పార్టీకి మెజారిటీ రావాలి. అప్పుడే అతని సంస్కరణలు అమలయ్యేందుకు వీలవుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2017)**

**న్యూస్ వ్యూస్ 129 మే 05, 06** **ఎమ్బీయస్ : తమిళనాడు మిస్టరీలు**

జయలలిత మరణం కాదు కానీ అప్పణ్నుంచి తమిళనాడులో అనేక వింతలు జరుగుతున్నాయి. ఏది ఎందుకు జరుగుతోందో, ఎవరు జరిపిస్తున్నారో ఎవరి వూహలు వారివి. నోట్ల రద్దు తర్వాత బ్లాక్‌మనీ బయటకు వచ్చేస్తుందని, నల్ల ధనవంతులు జైలుకి వెళతారని ప్రభుత్వం వూదరగొట్టేసినపుడు భారత ఆర్థిక రాజధానిగా వున్న ముంబయిలోని ధనవంతులు, గుజరాత్‌లోని పారిశ్రామికవేత్తలు, నల్లధనానికి చిరునామాగా వుండే వివిధ నగరాలలోని సినిమా పరిశ్రమలోనివారు, షెల్ కంపెనీలకు ఆలవాలమైన కలకత్తా మార్వాడీ వ్యాపారస్తులు, దేశరాజధానిలో అవినీతిపరులైన అధికారులు, హవాలా ఆపరేటర్లు – వీరందరికీ మూడుతుందనుకున్నారు. తీరా చూస్తే ఇన్‌కమ్‌టాక్స్ దాడులకు తమిళనాడే కేంద్రంగా మారింది. అది కూడా జయలలిత అనుయాయులపై మాత్రమే ! జయలలిత బతికున్నంతకాలం స్తబ్దంగా వున్న కేసులు ఆమె మరణం తర్వాతనే పురులు విప్పి శశికళను జైలుకి పంపాయి. ఆమె వర్గీయులందరూ ఏదో రకమైన కేసుల్లో యిరుక్కోసాగారు. ధిక్కరించినవారికి బుద్ధి చెప్పాలన్న ధోరణిలో కేంద్రం, అణుస్తున్న కొద్దీ తిరగబడుతున్న ధోరణిలో శశికళ వర్గం వ్యవహరిస్తున్నాయి. ఎడిఎంకె పార్టీ రెండుగా చీలింది. ఎమ్మెల్యేలలో అధికసంఖ్యాకులు శశికళను విడిచిపెట్టకపోయినా, ఎన్నికల కమిషన్ పార్టీ ఎన్నికల గుర్తు రెండాకులను స్తంభింపచేసింది. ఆర్కే నగర్ ఉపయెన్నికలో యిరువర్గాలు

పోటీ పడ్డాయి. తమిళనాడులో గతంలో జరిగిన అనేక ఎన్నికలలో ధనం ప్రవహించినా పట్టించుకోని ఎన్నికల కమిషన్ యీసారి మాత్రం చురుగ్గా వ్యవహరించి, ఎన్నిక రద్దు చేసింది.

అంతేకాదు, రెండాకుల గుర్తు తమ వర్గానికి తెచ్చుకోవడానికై దినకరన్ సుకేశ్ చంద్రశేఖర్ అనే మధ్యవర్తి ద్వారా ఎన్నికల కమిషన్‌లోని అధికారికి రూ.50 కోట్ల లంచం యివ్వడానికి ప్రయత్నించాడంటూ కేసు పెట్టి అతన్ని, అతని సహచరుడు మల్లికార్జుననను మే 15 వరకు కస్టడీకై తిహార్ జైలుకి పంపారు. పోలీసుల వాదనలో స్పష్టం కాని అంశాలు కొన్ని వున్నాయి. ముఖ్యమైనది లంచం తీసుకోవడానికి సిద్ధపడిన కమిషన్ ఉద్యోగి ఎవరో యిప్పటిదాకా పోలీసులు బయటపెట్టలేదు. అతని ప్రమేయం బయటపెట్టకపోతే అది దినకరన్, సుకేశ్ మధ్య ఆర్థిక లావాదేవీగా మిగిలిపోతుంది. లంచాల కేసుల్లో పుచ్చుకోవడానికి ప్రయత్నించినవాడి పేరు చెప్పకుండా కేసెలా పెడతారు? ఎవరైనా ఎవరికైనా లంచం యిద్దామనుకోవచ్చు, నేను ఆ సంగతి చూసుకుంటానంటూ వేరేవారు నమ్మించి డబ్బు పుచ్చుకోవచ్చు, అంతమాత్రం చేత నేరం జరిగినట్లు కాదు కదా! ఎవరో ఒకరు లంచం తీసుకున్నట్లో, కనీసం ప్రయత్నించినట్లో ఆధారం దొరకాలి. ఇప్పటిదాకా దిల్లీ పోలీసులు కమిషన్ అధికారులను రంగంపైకి తీసుకురాలేదు. దినకరన్‌ను, అతని అనుచరుడు ను జైలుకి పంపారు.

దినకరన్ మధ్యవర్తిగా ఎంచుకున్న వ్యక్తి అంటూ పోలీసులు చెప్తున్న సుకేశ్ గతచరిత్రంతా నేరచరిత్రే. అది పోలీసులకు మాత్రమే కాదు, మీడియాకు కూడా తెలుసు. తన పార్టీ భవిష్యత్తును నిర్ణయించే పెద్ద వ్యవహారాన్ని నిర్వహించడానికి దినకరన్‌ను సుకేశ్‌ను ఎంచుకున్నాడంటే అతని కంటె బుద్ధిహీనుడు మరొకడు వుండడు. ఇటువంటివి ఏ రాజకీయనాయకుల ద్వారానో, ఉన్నతాధికారుల ద్వారానో చక్కబెట్టుకుందామని చూస్తారు తప్ప అందరి నోళ్లలో నానిన కిలాడీని మధ్యవర్తిగా పెట్టుకోరు. సుకేశ్ టీనేజి నుంచి మోసాలు మొదలుపెట్టాడు. తను ఫలానా నాయకుడి బంధువునంటూ చెప్పుకుని జనాలను మోసం చేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. "మద్రాసు కఫే" నటీమణి, ప్రియురాలు లీనా మారియా పాల్‌తో కలిసి అనేక మోసాలు చేశాడు. 2013లో ఆమె పట్టుబడి యితని ఆచూకీ చెప్పేసింది. అతన్ని పట్టుకుని జైలుకి పంపేనాటికి అతనిపై 50 కేసులున్నాయి. అరెస్టయ్యాక మళ్లీ బెయిలుపై బయటకు వచ్చేస్తూంటాడు. ఈసారి పోలీసులు అతన్ని అరెస్టు చేసేనాటికి ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో పది రోజులుగా నివాసముంటున్నాడు.

పోలీసులు చెప్పేదేమిటంటే – సుకేశ్ తనకు తెలిసున్న ఎన్నికల కమిషన్ అధికారికి రూ. 50 కోట్ల లంచం యివ్వాల్సి వుంటుందని, ఎడ్వాన్సుగా రూ.10 కోట్లు యివ్వాలని దినకరన్‌కు చెప్పాడు. దినకరన్ కొచీలోని ఒక ఆపరేటర్ ద్వారా చాందినీ చౌక్‌లోని షా ఫైజర్ అనే ఒక హవాలా ఆపరేటర్‌కు, అతని ద్వారా సుకేశ్‌కు ఆ డబ్బు చెల్లించాడు. ఈ విషయం ఒక యిన్‌ఫార్మర్ ద్వారా పోలీసులకు తెలిసింది. వచ్చి సుకేశ్‌ను పట్టుకుని అరెస్టు చేసి, అతని దగ్గర దొరికిన రూ.1.30 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అతని వద్ద నుంచి పెద్దగా సమాచారం లభించలేదు. దినకరన్ వద్ద అసిస్టెంటుగా వున్న జనార్దనను సాక్షిగా చేసుకుని అతనిచ్చిన స్టేటుమెంట్ల ఆధారంగా యితరులను అరెస్టు చేద్దామని చూస్తున్నారట. సుకేశ్‌కు, దినకరన్‌కు మధ్య ఫోను సంభాషణలు జరిగాయని చెపుతున్న పోలీసులు ఆ మేరకు ఆధారాలను కోర్టుకి సమర్పించలేకపోవడంతో ఏప్రిల్ నెలాఖరులో కోర్టు పోలీసులకు అక్షింతలు వేసింది. పోలీసులు దినకరన్‌కు చెందిన ఐదు ఖాతాలను పరిశీలిస్తున్నారు. అతని ఆడిటరును పిలిపిస్తున్నారు. ఈ లంచం కేసు నిలవకపోతే కనీసం మనీ లాండరింగ్ (నల్లధనాన్ని తెల్లగా మార్చే పని) కేసైనా నిలుస్తుందని పోలీసుల ఆశ. ఎన్నికల కమిషన్‌లో గుర్తు ఎవరికి యివ్వాలో నిర్ణయించగలిగిన స్థాయి అధికారి లంచం పుచ్చుకోవడానికి అంగీకరించాడని చూపితే తప్ప పోలీసులకు వాదనకు బలం చిక్కదు. మరి దిల్లీ పోలీసులు యిలా ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియటం లేదు.

అలాగే తమిళనాడు పోలీసులు కూడా! నీలగిరి జిల్లాలో జయలలితకు, శశికళ చెందిన కొడనాడు గెస్ట్ హౌస్‌లో ఏప్రిల్ 24 తెల్లవారుఝామున దొంగతనం జరిగింది. దొంగతనానికి వచ్చినవారు నేపాలీ సెక్యూరిటీ గార్డును చంపేశారు. తక్కిన 10 మంది సెక్యూరిటీ గార్డులలో యింకో అతన్ని గాయపరిచారు. పోలీసుల కథనం ప్రకారం – 10, 11 మంది సభ్యులున్న దొంగల ముఠా రెండు, మూడు వాహనాల్లో వచ్చింది. వాళ్లు కొన్ని వాచీలు, ఒక క్రిస్టల్ షో పీస్ మాత్రం దొంగిలించారు. కొన్ని సూటుకేసులు తెరిచి వున్నాయి. అవి ఖాళీగా వున్నాయి. గెస్టు హౌస్ నుంచి వెళ్లిపోయేటప్పుడు కోటగిరి పట్టణంలో వున్న సిసిటివి కెమెరాల్లో పడిన వాహనాల ఫోటోల ఆధారంగా శశికళకు 2008 నుంచి ఐదేళ్లు డ్రైవర్‌గా పనిచేసిన కనకరాజ్ అనే అతనే దాడిలో పాల్గొన్నట్లు తేలింది. అతను ముఖ్యమంత్రి పళనిస్వామి వూరివాడే. అతనికి దూరపు బంధువు కూడా, అయితే రెండు కుటుంబాలకు అస్సలు పడదు. శశికళ వద్ద పనిచేసే రోజుల్లో ఆమె వద్ద తన పలుకుబడి ఉపయోగించి, తన సోదరుడు ధనపాల్‌ను పళనిస్వామి స్థానంలో తేవడానికి ప్రయత్నించాడు. దాంతో పళనిస్వామి గొడవ చేసి ధనపాల్‌ను పార్టీ నుంచి బహిష్కరింప చేశాడు. శశికళ వద్ద పనిమానేశాక కనకరాజ్ కోయంబత్తూరులో ఒక బేకరీలో పనిచేస్తూ తనతో పాటు పనిచేసే కె వి సాయన్ అలియాస్ శ్యామ్ అనే అతనితో కలిసి దోపిడీకి ప్లాను చేశాడు. సాయన్‌కు తెలిసున్న కొందరు కేరళీయులు గ్యాంగ్‌లో చేరారు. మొత్తమంతా కలిసి యీ ఘాతుకానికి పాల్పడ్డారు. తర్వాత మాయమయ్యారు. దాడిలో పాల్గొన్న ఆరుగుర్ని అదుపులోకి తీసుకోవడం జరిగింది.

ప్రధాన నిందితుడైన కనకరాజ్ ఏప్రిల్ 28 రాత్రి సేలంలో అత్తూరు హైవే మీద తన సోదరి యింటికి మోటార్‌సైకిల్‌పై వెళుతూండగా ఒక కారు వచ్చి గుద్దేసి, చచ్చిపోయాడు. 6 గంటల తర్వాత సహనిందితుడు సాయన్ కేరళలోని పాలక్కాడ్‌లో భార్య, ఐదేళ్ల కూతురుతో సహా కారులో వెళుతూ ఆగి వున్న ట్రక్‌ను గుద్దేశాడు. భార్య, కూతురు వెంటనే చనిపోగా అతనికి తీవ్రమైన గాయాలు

తగిలి కోయంబత్తూరు ఆసుపత్రిలో చేర్చారు. ఆపరేషన్ చేయడానికి ముందు మేజిస్ట్రేటు అతని స్టేటుమెంటు రికార్డు చేశాడు. అతని కారు రిజిస్ట్రేషన్ నెంబరు కూడా బోగస్సే. అతను ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఆగి వున్న ట్రక్‌ను గుద్దాడని పోలీసుల సందేహం. ఈ రెండు సంఘటనల తర్వాత పోలీసుల కథనాన్ని అందరూ శంకించసాగారు. కనకరాజ్ భార్య "దోపిడీ రోజు రాత్రి నా భర్త చెన్నయ్‌లో మా యింట్లోనే వున్నాడు. ఏప్రిల్ 27న మాత్రమే వాళ్ల వూరికి బయలుదేరాడు. పోలీసులకు ఆయన మీద అనుమానం వుంటే ఆ రెండు రోజుల్లో మా యింటికి వచ్చి విచారణ చేసి వుండాల్సింది. కానీ వాళ్లు రానే లేదు." అంటోంది. ఇంకో తమాషా అంశమేమిటంటే – 10 మంది వచ్చి దోపిడీ చేసిన సామానులు పట్టుకున్నాం అంటూ పోలీసులు చూపించిన వాచీలు డయల్ మీద జయలలిత బొమ్మ ముద్రించి వున్న చవకరకం వాచీలు. పార్టీ ఫంక్షన్లలో పంచిపెట్టే వాచీలవి. ఏ ఎడిఎంకె కార్యకర్త యింట్లోనైనా వుంటాయి తప్ప అత్యంత ధనికురాలైన జయలలిత యింట్లో వుండదగ్గవి కావు.

ఇదంతా గందరగోళంగా వుంది. కొందరి అనుమానం ఏమిటంటే – ఆ గెస్ట్‌హౌస్‌లో జయలలితకు, శశికళకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు వున్నాయి. బహుశా జయలలిత విల్లు కూడా అక్కడే వుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గెస్ట్‌హౌస్ కోర్టు స్వాధీనంలో వుంది. దినకరన్‌ను అరెస్టు చేశాక ఢిల్లీ పోలీసులు ఆ గెస్ట్‌హౌస్‌పై దాడి చేసి ఆ పత్రాలు స్వాధీనం చేసుకుంటే శశికళ, దినకరన్ మరింత యిబ్బందుల్లో పడతారు. కోర్టు స్వాధీనంలో వుంది కాబట్టి బాహాటంగా వెళ్లి తీసుకుని వచ్చే వెసులుబాటు లేదు. అందువలన ఆమె బంధువులు ఆ యింటి ఆనుపానులు బాగా తెలిసున్నవారిని అక్కడకు పంపించి సూటుకేసుల్లో వున్న పత్రాలను తెప్పించుకుని దానికి దోపిడీ రంగు పులిమారు. శశికళ డ్రైవర్‌గా కనకరాజ్‌కు ఆ యింట్లో ఎక్కడ ఏ వస్తువుందో బాగా తెలుసు. అందువలన అతన్ని పంపి వుండవచ్చు. ఆ గెస్ట్‌హౌస్‌లో వున్న 1400 కెమెరాలు యిప్పుడు పనిచేయకపోవడం వింతగా వుంది. కనకరాజ్, సాయన్ యాక్సిడెంట్ల తర్వాత పోలీసులు ఆధారాలు దొరకలేదంటూ కేసు మూసివేసే ఛాన్సు లేకపోలేదు.

800 ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న టీ ఎస్టేటులోని కొడనాడ్ గెస్ట్‌హౌస్‌కు చరిత్ర వుంది. దాని సొంతదారు పీటరు గ్రేస్ జోన్స్ అనే ఇంగ్లీషు వ్యక్తి. దాన్ని మేన్‌టేన్ చేయలే రూ. 3.5 కోట్ల అప్పు పడ్డాడు. 1991 నుంచి 1996 వరకు ముఖ్యమంత్రిగా వున్న జయలలితకు శశికళ దాని గురించి చెప్పింది. జయలలితకు సన్నిహితుడైన లిక్కర్ బేరన్, మెడికల్ కాలేజీ అధిపతి రామస్వామి ఉడయార్ కోడలు రాధా వెంకటాచలం ఆ ఎస్టేటును జోన్స్ నుండి రూ. 7.5 కోట్లకు కొని, జయలలిత, శశికళ, ఇళవరసి భాగస్వాములుగా వున్న కంపెనీకి 1992లో అదే ధరకు అమ్మింది. దీనికి గాను రాధ తండ్రి కృష్ణమూర్తిని జయలలిత అడ్వకేట్ జనరల్‌గా నియమించింది. ఎస్టేటు తన చేతికి వచ్చాక జయలలిత దానిలో ఒక పెద్ద శ్వేతసౌధాన్ని నిర్మించింది. అక్కడ సకల సౌకర్యాలు అమర్చింది. ఎందుకంటే ఏడాదిలో మూణ్నెళ్లపాటు ప్రభుత్వాన్ని అక్కడి నుంచే నిర్వహించేదామె. ప్రతిపక్షంలో వుండగా ఆరేసి నెలలు వుండేది. 150 మంది పనివారున్నారు. జయలలిత ఆస్తిపాస్తులకు, రాజకీయాలకు సంబంధించిన అనేక ముఖ్యమైన పత్రాలు అక్కడ వుండడంలో ఆశ్చర్యం లేదు.

అంత పెద్ద యింట్లో ఏవి వుండాలో, ఏమి మిగిలాయో తేల్చుకోకుండానే వాచీలు, ఒక షో పీస్ మాత్రమే పోయాయని పోలీసులు చెప్పడమేమిటి? క్రైమ్ బ్రాంచ్–సిఐడి విచారణ జరపాలన్న డిమాండ్ వచ్చినపుడు రాష్ట్ర పోలీసు చీఫ్ రాజేంద్రన్ దాన్ని తిరస్కరించారు. సిబిఐకు అప్పగించిన మాత్రాన మిస్టరీ విడిపోతుందన్న గ్యారంటీ ఏమీ లేదు. 2016 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మూడు కంటెయినర్ ట్రక్కులు రూ.570 కోట్లు తరలిస్తూ పట్టుబడ్డాయి. మద్రాసు హైకోర్టు కేసు సిబిఐకు అప్పగించింది. పది నెలల తర్వాత ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయడం మినహా ఆ కేసు ముందుకు సాగలేదు. కేంద్ర పోలీసులు కానీ, తమిళనాడు పోలీసులు కానీ అసమర్థులని ఎవరూ అనలేరు. పాలకులు తమ రాజకీయ అవసరాల కోసం వారిని వినియోగించుకుంటూన్నంతకాలం వారి పనితీరు యిలాగే అఘోరిస్తుంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2017)**

**న్యూస్, వ్యూస్ 130 మే 07, 08** **ఎమ్బీయస్ : మరాఠీ నాయకుల వీరంగం**

హేమమాలినికి, రైతు ఆత్మహత్యలకు సంబంధం ఏమైనా వుంటుందా? ఆవిడ నాట్యకళాకారిణి, నటీమణి, బిజెపి తరఫున పార్లమెంటు సభ్యురాలు. నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, మార్కెటింగ్ సౌకర్యాల లేమి, గిట్టుబాట ధర లేకపోవడం, ప్రకృతి వైపరీత్యం యిత్యాది అనేక కారణాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారు. మరి రెండింటికి లింకెక్కడ దొరుకుతుంది? కానీ లింకు దొరకబుచ్చుకున్నారు మహారాష్ట్ర ఇండిపెండెంటు ఎమ్మెల్యే ఓంప్రకాశ్ బచ్చూ కాడూ. "మద్యపానం వలన రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని అంటున్నారు. అలా అయితే హేమమాలిని రోజూ తాగుతారు. ఆవిడేమైనా ఆత్మహత్య చేసుకుందా?" అని వాదించాడు. హేమమాలిని మద్యం సేవిస్తారో లేదో జనాలకు తెలియదు. ఆవిడ తన నృత్యకార్యక్రమాలకు కానీ, సినిమా షూటింగులకు కానీ, ఎన్నికల ప్రచారసభలకు కానీ తాగి వచ్చిన సంఘటనలు బయటకు రాలేదు. మరి ఆవిడ పేరు యితనెందుకు వాడుకున్నట్లు? ఆవిడ పేరే కాదు మరో బిజెపి ఎంపీ, కేంద్రమంత్రి గడ్కరీ పేరు కూడా వాడాడు. "ఇంట్లో పెళ్లిళ్లకు ఎక్కువగా ఖర్చు పెట్టేసి, అప్పులపాలై పోయి రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని కూడా చెప్తున్నారు. నితిన్ గడ్కరీ తన కొడుకు పెళ్లికి రూ.4 కోట్లు ఖర్చుపెట్టాడు. ఆయనేమైనా ఆత్మహత్య చేసుకున్నాడా?" అని కూడా తర్కించాడు. నోట్ల రద్దు చేసిన వెంటనే గడ్కరీ భారీ ఖర్చుతో

కొడుకు పెళ్లి చేశాడు. చేతిలో అన్ని రకాల డబ్బు, పలుకుబడి వున్నాయి కాబట్టి చేయగలిగాడు. అతనికి, ఆత్మహత్య చేసుకునే రైతుకి పోలిక ఏమిటి? ఇవేమీ కాదూకి పట్టవు. అతని తరహాయే అంత.

ఎలాగైనా ప్రజల దృష్టి ఆకర్షించడమే అతని లక్ష్యం. 1999లో అతను అమరావతి జిల్లాలోని తన అచలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి వసుధా దేశ్‌ముఖ్ అనే కాంగ్రెసు అభ్యర్థిని చేతిలో 1300 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. 'రైతు సమస్యల పట్ల నేనెంత ఎలుగెత్తి మొత్తుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ఎర మింగిన కొండచిలువలా స్తబ్దంగా పడి వుంటోంది. దాన్ని మేల్కొల్పాలంటే అలాటి కొండచిలువ ఎలా వుంటుందో చూపించాలి' అంటూ ఓ కొండచిలువను పట్టుకుని వచ్చి తనపై నెగ్గిన వసుధ యింట్లో వదిలిపెట్టాడు! పాముల్ని ఆయుధాలుగా వాడుకోవడంలో అతను ఆరితేరాడు. ఆ ప్రాంతంలో పాములు ఎక్కువగా మసలుతాయి. కరంటు కోతలూ ఎక్కువే. చీకట్లో పాములు బాగా మసలుతూ జనాలను కరుస్తూంటాయి. అయితే అక్కడున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పామువిషానికి విరుగుడు మందులు ఎక్కువగా పెట్టుకునేవారు కారు. దాంతో అనేక మంది ప్రజలు పాముకాట్లకు బలయ్యేవారు. ఈ సమస్యను ఎత్తి చూపించడానికి కాడూ బుట్టెడు బుట్టెడు పాములను ఆరోగ్యకేంద్రాల్లోనూ, కరంటు ఆఫీసుల్లోనూ విడిచిపెట్టాడు! పంటలకు మద్దతు ధర పెంచాలని ఆందోళన చేస్తూ 50 మంది అనుచరులతో సహా చందూర్ బజారు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆఫీసు ప్రాంగణంలో గోతులు తీసి పీకలదాకా కప్పెట్టుకున్నాడు. రైతు ఆత్మహత్యల గురించి అసెంబ్లీలో చర్చ జరగాలని డిమాండు చేస్తూ 2009లో తన అనుచరులతో సహా నాగపూరులో ఓ పెద్ద వాటర్ ట్యాంకు ఎక్కి అక్కడే 24 గంటలపాటు కాపురం పెట్టాడు. 2016 మార్చిలో తను చెప్పినది వినటం లేదంటూ ఒక సెక్రటేరియట్ ఉద్యోగి చెంపపై కొట్టాడు. అక్కడ ఉద్యోగులందరూ సమ్మెకు దిగారు.

ఇలాటి పెద్దమనిషిని 2004 నుంచి అతని నియోజకవర్గపు ప్రజలు గెలిపిస్తూ వస్తున్నారు. ఎందుకంటే అతను పబ్లిసిటీ కోసం కానీయండి, మరో దాని కోసం కానీయండి, కొన్ని మంచిపనులు కూడా చేస్తూంటాడు. నయన అనే ఒక ప్రొఫెసర్‌ను పెళ్లి చేసుకున్నపుడు వాళ్లు దండలు మార్చుకోలేదు. జాతీయ పతాకాన్ని యిచ్చిపుచ్చుకున్నారు. పెళ్లి సందర్భంగా విందు యిచ్చేబదులు వికలాంగులకై 100 మూడు చక్రాల వాహనాలు పంచిపెట్టాడు. ప్రహార్ యువశక్తి సంఘటన అనే సంస్థ నెలకొల్పి యిప్పటివరకు 30 వేలమంది వికలాంగులకు ఆదుకున్నాడు. ఏటా 500 సీసాల రక్తాన్ని తన అనుచరుల చేత దానం యిప్పిస్తాడు. తన ప్రాంతంలో రోజుకి 16 గంటల కరంటు కోత వున్న రోజుల్లో అర్ధరాత్రి కాగడాలతో ప్రదర్శన నిర్వహించి అనేకమంది దానిలో పాల్గొనేట్లా చేశాడు. ఇలా ప్రజల్లో పేరు తెచ్చుకుంటూ వీళ్లు తమ ప్రతాపాన్ని ఉద్యోగుల మీద చూపుతుంటారు. దీనికి తాజా ఉదాహరణ ఎయిర్ ఇండియా ఘటనతో పేపర్ల కెక్కిన రవీంద్ర గాయిక్వాడ్. అతనికి తను ఎక్కబోతున్న విమానంలో బిజినెస్ క్లాసు సీటు లేదని తెలుసు. అయినా ఎక్కాడు. దిల్లీ చేరాక తనను ఎకానమీ క్లాసులో కూర్చోబెట్టారంటూ విమానం దిగను పొమ్మన్నాడు. బతిమాలడానికి వచ్చిన ఎయిర్ ఇండియా ఉద్యోగిని చెప్పుతీసి 25 సార్లు కొట్టాడు. అలా కొట్టానని గర్వంగా చెప్పుకున్నాడు కూడా. అదేమంటే 'బిజినెస్ క్లాసు లేదని తెలిసి కూడా విమాన కంపెనీవాళ్లు నా బోర్డింగ్ పాస్‌పై బిజినెస్ క్లాస్ అని ఎందుకు వేశారు?' అని లాజిక్ లాగాడు.

అలాటి సందర్భాల్లో మనలాటి వాళ్లను కోర్టుకి వెళ్లి విమాన కంపెనీపై కేసు వేసి నష్టపరిహారం తెచ్చుకోమంటారు. కానీ యీ దొరగారు ఉద్యోగిని పట్టుకుని చితక్కొట్టాడు. ఉద్యోగులు ఆగ్రహించడంతో అతన్ని ఏ విమానంలోనూ ఎక్కనివ్వద్దంటూ కేంద్ర విమానయాన శాఖ ఆదేశాలు యిచ్చింది. తన సభ్యుడి ప్రవర్తనకు శివసేన సిగ్గుపడలేదు సరికదా ఆ వ్యవహారంపై పార్లమెంటులో గొడవ చేసింది. శివసేన మంత్రి, తన కాబినెట్ సహచరుడైన అశోకగజపతి రాజుపై చెయ్యి ఎత్తారు. కేంద్రం తమాషా చూసింది. చివరకు ఎలా సద్దు మణిగిందంటే – ''2017 మార్చి 23న ఎయిర్ ఇండియా ఫ్లయిట్‌లో జరిగిన దురదృష్ట సంఘటనకు విచారిస్తున్నాను.'' అని గాయిక్వాడ్ లేఖ రాశాడంతే. సిబ్బంది పట్ల తన అనుచిత ప్రవర్తనకు క్షమాపణ చెప్పనే లేదు. అయినా కేంద్ర ప్రభుత్వం వ్యవహారాన్ని అంతటితో వదిలేసింది. విమాన సిబ్బందికి యీ వివరణ తృప్తి కలిగించకపోయినా తమ మంత్రి సహకరించకపోవడంతో ఏమీ చేయలేక వూరుకున్నారు. గాయిక్వాడ్ మళ్లీ యింకోసారి యిలాటి పనికి తెగబడినా ఆశ్చర్యం లేదు. శివసేనకే చెందిన ఎంపీ రాజన్ విచారే దిల్లీలో మహారాష్ట్ర సదన్‌లోని కాంటీన్‌లో తింటూండగా అతనికి చపాతీ రుచి నచ్చలేదు. మరొకరైతే తినడం మానేస్తారు, కాంటీన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తారు. ఏ బొద్దింకో కనబడితే పార్లమెంటులో ఆ అంశాన్ని లేవనెత్తుతారు. అయితే యితను మాత్రం అప్పటికప్పుడు అన్నం పెట్టే సిబ్బందిని పిలిచి ''నువ్వే చూడు, ఎంత దరిద్రంగా వుందో'' అంటూ చపాతీని అతని నోట్లో కుక్కాడు. అతను ముస్లిము. 'రంజాన్ సందర్భంగా నేను ఉపవాసం చేస్తున్నాను మొర్రో' అన్నా వినిపించుకోలేదు.

ఇటువంటివాళ్లను ప్రజలు ఎన్నికల్లో ఓడించకపోవటం వింతగా తోచే వాస్తవం. 1970లలో జంబూవంత్ రావ్ ధోతే అనే శాసనసభ్యుడు స్పీకరు మీదకు పేపర్ వెయిట్ విసిరేస్తే అతన్ని సభ నుంచి బహిష్కరించారు. ఉపయెన్నిక జరిగింది. అతను నిలబడ్డాడు. గతంలో కంటె ఎక్కువ మార్జిన్‌తో నెగ్గాడు. నిఫాడ్ నియోజకవర్గం నుంచి శివసేన ద్వారా రెండుసార్లు ఎన్నికైన అనిల్ కదమ్ 2013 ఆగస్టులో ఒక స్నేహితుడి కారులో ముంబయి–ఆగ్రా నేషనల్ హైవేపై వెళుతున్నాడు. మహిళా సిబ్బంది నిర్వహించే పింపల్‌గావ్ టోల్ ప్లాజా వద్ద ఆపి టోల్ కట్టమన్నారు. 'నేను ఎమ్మెల్యేని' అన్నాడితను. కారు మీద అలాటి స్టిక్కర్ ఏదీ లేదు కదా, కట్టాల్సిందే అని సిబ్బంది అన్నారు. నేను ఎమ్మెల్యేనని చెప్తున్నా కదా అన్నాడు అనిల్ కదమ్. అయితే ఐడెంటిటీ కార్డు చూపించండి

అంది సిబ్బందిలో ఒకామె. అప్పుడతను కారులోంచి దిగి, 'ఆట్టే మాట్లాడావంటే పదిమందిలో గుడ్డలిప్పించి తంతా' అని బెదిరించాడు. అక్కడున్న సిసిటివిల్లో అంతా రికార్డయింది. టీవీ ఛానెల్స్ ద్వారా బయటకు వచ్చింది. కేసు పెట్టారు. ఇతను లొంగిపోయాడు కానీ వెంటనే బెయిల్‌పై బయటకు వచ్చేశాడు. ఇతనికి బంధువో కాదో తెలియదు కానీ రామ్ కదమ్ అని మరో ఎమ్మెల్యే వున్నాడు. అతను మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీ సభ్యుడు. వీరమరాఠీ వాది. 2009 అసెంబ్లీ ఎన్నికలు జరిగాక శాసనసభ్యులు ప్రమాణస్వీకారం చేసే వేళ సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ అసీమ్ అజ్మీ హిందీలో ప్రమాణస్వీకారం చేస్తూంటే యితను వెళ్లి అతన్ని లెంపకాయ కొట్టాడు. "హిందీలో ఎందుకు చేశావ్? మరాఠీలో చేయవచ్చుగా" అంటూ. దానిపై చాలా గొడవ జరిగింది. అతని పార్టీ సభ్యులు నలుగురు అతనికి సమర్థనగా అల్లరి చేయడంతో మొత్తం ఐదుగుర్నీ ఏడాది పాటు సస్పెండ్ చేశారు.

ఎవరినైనా తన్నే అవకాశం వస్తే అతను వదులుకోడు. 2013 మార్చిలో క్షితిజ్ ఠాకూర్ అనే యిండిపెండెంట్ ఎమ్మెల్యే కారులో బాంద్రా-ఓర్లి రోడ్డుపై వేగంగా వెళుతూంటే ప్రవీణ్ సూర్యవంశీ అనే పోలీసు అధికారి అతన్ని ఆపి మందలించాడు. క్షితిజ్ మండిపడడంతో బాటు తన హక్కులకు విఘాతం కలిగిందంటూ అసెంబ్లీలో ఆ అంశాన్ని లేవనెత్తాడు. దానిపై చర్చ జరుగుతూండగా ప్రవీణ్ విజిటర్స్ గ్యాలరీలో కూర్చుని వుండడం అతనికి కనబడింది. అంతే, రామ్ కదమ్‌కు, శివసేనకు చెందిన రాజన్ సాల్వీకి, మరో యిండిపెండెంట్ ఎమ్మెల్యే ప్రదీప్ జైస్వాల్‌కు సైగ చేశాడు. వాళ్లు విజిటర్స్ గ్యాలరీకి వెళ్లి ప్రవీణ్‌ను చితక్కొట్టేశారు. దాని వీడియో ఇంటర్‌నెట్ ద్వారా అందరికీ వెళ్లిపోయింది. స్పీకరు విచారణకు ఆదేశించాడు. ఇలాటి ఘనచరిత్ర కలిగిన రామ్ కదమ్‌ను బిజెపి తన పార్టీలోకి ఆహ్వానించి ఘాట్‌కోపర్ సీటు యిచ్చింది. అతను నెగ్గాడు కూడా. గిరీశ్ మహాజన్ అనే మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిని ఒక మూక-బధిర పాఠశాల యాజమాన్యం ముఖ్య అతిథిగా పిలిస్తే తుపాకీ నడుములో పెట్టుకుని వెళ్లాడతను. సభలో వున్నవారందరికీ అది కనబడింది. ఇదేమైనా పద్ధతిగా వుందా? అని అడిగితే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ "అతనికి తుపాకీ లైసెన్సు వుంది. లైసెన్సు కలిగిన ఆయుధాన్ని యింట్లో పెట్టుకుని పూజించరు." అని సమాధాన మిచ్చాడు. ముఖ్యమంత్రులు యిలా వెనకేసుకుని వస్తూంటే ప్రజాప్రతినిథులు చెలరేగిపోరా? **- ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2017)**

**న్యూస్, వ్యూస్ 131 మే 09, 10** **ఎమ్బీయస్ : హిందువునని చాటుకుంటున్న మమత**

బెంగాల్‌లో బిజెపి ఉత్థానం మమతకు బెంగ పుట్టిస్తోంది. 2014 పార్లమెంటు ఎన్నికలలో 17% ఓట్లు తెచ్చుకున్న బిజెపి 2016 అసెంబ్లీ ఎన్నికలలో వెనకబడి 10% తెచ్చుకుంది. కానీ ఏప్రిల్ 2 వ వారంలో తూర్పు మేదినీపూర్ జిల్లాలోని దక్షిణ కాంథీ నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఉపయెన్నిక ఫలితాలు ఆమెను కలవర పెట్టాయి. 2016లో అక్కడ నుంచి 93 వేల పై చిలుకు ఓట్లతో (53.7%) తృణమూల్ అభ్యర్థి దివ్యేందు అధికారి నెగ్గాడు. దరిమిలా అతను తామ్లూక్ పార్లమెంటు స్థానానికి జరిగిన ఉపయెన్నికలో నెగ్గి, అసెంబ్లీ సీటుకి రాజీనామా చేయడంతో అక్కడ ఉపయెన్నిక అవసరపడింది. ఏప్రిల్ రెండో వారంలో జరిగిన యీ ఈ ఎన్నికలో మళ్లీ తృణమూల్ అభ్యర్థి చంద్రిమా భట్టాచార్య 95 వేల ఓట్లతో, అంటే 55.9% ఓట్ల శాతంతో గెలిచారు. మరి చింత ఎందుకంటే - బెంగాల్‌లో తృణమూల్, లెఫ్ట్, కాంగ్రెసు, ప్రధానంగా వుండేవి. బిజెపికి పెద్దగా చోటు వుండేది కాదు. ముక్కోణపు పోటీల్లో తృణమూల్ సులభంగా గెలిచేది. ఇప్పుడు లెఫ్ట్, కాంగ్రెస్ పూర్తిగా దెబ్బ తిని పోయి, ఆ ఓట్లు కూడా బిజెపికి బదిలీ అయిపోయి, బిజెపితో ముఖాముఖీ తలపడే పరిస్థితి వచ్చేస్తుందని మమతకు భయంగా వుంది. ఈ దక్షిణ కాంథీ నియోజకవర్గమే తీసుకుంటే 2016లో లెఫ్ట్, కాంగ్రెసులు కలిపి నిలబెట్టిన ఉత్తమ్ ప్రధాన్ అనే సిపిఐ అభ్యర్థికి 34.2% ఓట్లు, అనగా దాదాపు 60 వేల ఓట్లు వచ్చాయి. తాజా ఉపయెన్నికలో మళ్లీ నిలబడితే అతనికి డిపాజిట్టు కూడా దక్కలేదు. 17,423 ఓట్లు (10.21%) మాత్రం వచ్చాయి. లెఫ్ట్‌తో పొత్తు లేకుండా పోటీ చేసిన కాంగ్రెసుకు 2270 (1.33%) ఓట్లు వచ్చాయి. ఇదే సమయంలో బిజెపి విపరీతంగా లాభపడింది. 2016లో దాని అభ్యర్థి కమలేశ్ మిశ్రాకు 15 వేల ఓట్లు అంటే 8.8% వచ్చాయి. తాజా ఉపయెన్నికలో బిజెపి అభ్యర్థి సౌరీంద్ర మోహన్ జానాకు దాదాపు 53 వేల ఓట్లు 31% ఓట్ల శాతం వచ్చి ద్వితీయ స్థానంలో నిలిచాడు. అంటే లెఫ్ట్ ఓటర్లు బిజెపికి మారిపోయారన్నమాట. అలా వేసినా తృణమూల్‌ను ఓడించే స్థాయి బిజెపికి రాలేదు. ఈ ఉపయెన్నికలో యీ ఇద్దరి మధ్య ఓట్ల శాతంలో దాదాపు 25% తేడా వుంది. దీన్ని అధిగమించడం సులభమేమీ కాదు. అయినా తృణమూల్‌కు దిగులెందుకు?

ఈ నియోజకవర్గంలో 2016-2017 మధ్య లెఫ్ట్ 24% ఓట్లు పోగొట్టుకుంది, బిజెపి 22% ఓట్లు గెలుచుకుంది. అంటే యించుమించుగా లెఫ్ట్ స్థానంలోకి బిజెపి, బిజెపి స్థానంలోకి లెఫ్ట్ వచ్చాయన్నమాట. ఈ పరిణామం లెఫ్ట్‌కు యిబ్బందికరంగా వుండడంతో బాటు, తృణమూల్‌కు కూడా యిబ్బందిగా మారింది. ఎందుకంటే లెఫ్ట్‌తో ఎలా పోరాడి గెలవాలో మమతకు బాగా తెలుసు. కానీ బిజెపిది వేరే రకమైన దాడి. అపరిమితమైన నిధులు, దేశంలో కొత్తగా రూపు దిద్దుకుంటున్న హిందూత్వవాదం, మోదీ-అమిత్‌ల దూకుడు దానికి కలిసివచ్చే అంశాలు. ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో 19% మంది ముస్లిములున్నా ఒక్క ముస్లిముకు టిక్కెట్టు యివ్వకుండా హిందువుల ఓట్లను ఏకీకృతం చేసి బిజెపి గెలవగలిగింది. బెంగాల్‌లో 27% మంది ముస్లిము ఓటర్లున్నారు. వారిని లెఫ్ట్, తృణమూల్ రెండూ చేరదీశాయి. నిజానికి దేశవిభజన తర్వాత బెంగాల్‌లో మతకలహాలు పెద్దగా జరగలదు. కులస్పృహ కూడా బెంగాలీ సమాజంలో తక్కువే. ఇటువంటి చోట బిజెపి హిందూత్వ స్పృహ తెచ్చిపెట్టి మొత్తం హిందూ

ఓట్లతో ఎన్నికలు గెలుద్దామని బిజెపి ప్రయత్నిస్తోంది.

బిజెపికి ప్రస్తుతం వున్నది యిద్దరు ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే. అయినా బెంగాల్ ఎలాగైనా గెలవాలని గట్టిగా సంకల్పించింది. గత ఆరేళ్లలో 50 వేలమంది ఆరెస్సెస్ స్వయంసేవకులు బెంగాల్ గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుకుని పోయారట. ఇటీవలే అనేక పట్టణాల్లో రామనవమి, హనుమాన్ జయంతి భారీగా నిర్వహించారు. మామూలుగా దుర్గాపూజ, కాళీపూజ మాత్రమే పెద్ద యెత్తున నిర్వహించే బెంగాల్‌కు యిది కొత్త సంగతి. కానీ బిజెపి, ఆరెస్సెస్ దాని అనుబంధ సంస్థలు ఆ ర్యాలీలను విజయవంతం చేశాయి. లెఫ్ట్ పార్టీల ర్యాలీల కంటె యీ ర్యాలీలకు ఎక్కువ జనం రావడం బిజెపియేతర పార్టీలకు గుబులు పుట్టించింది. ఆ వూరేగింపుల్లో కత్తులు, ధనుర్బాణాలు ప్రదర్శించారు కాబట్టి ఆయుధచట్టం కింద బిజెపి నాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టమని మమతా బెనర్జీ పోలీసులను ఆదేశించింది. చేతనైతే కేసులు పెట్టుకోండి, అరెస్టు చేయండి అంటూ బిజెపి నాయకులు ధిక్కరించడంతో తనను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరిస్తారేమోనన్న భయంతో వెనక్కి తగ్గింది. రామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించమని తన పార్టీ నాయకులకు కూడా చెప్పింది. కలకత్తాలో కటౌట్లు వెలిశాయి. రాముడు, హనుమంతుడుతో బాటు మమతా బెనర్జీ ఫోటోలు కూడా వేసి "రామ్‌కా నామ్ బద్‌నామ్ న కరో" అనే నినాదం చేర్చారు. 1970లలో హిప్పీలు మత్తుమందు సేవించి 'హరేరామ, హరేకృష్ణ' అని పాడ్తేవారు. ఆ పేరుతో సినిమా తీసిన దేవ్ ఆనంద్ తెరపై హిప్పీల నుద్దేశించి కిశోర్ కుమార్ స్వరంతో 'రామ్‌కా నామ్ బద్‌నామ్ కరో' అని పాడాడు. దాన్నే మమత బిజెపి అనుయాయులను ఉద్దేశించినట్లుగా పలికినట్లు అనుకోవాలి. హనుమాన్ జయంతి నాడు మమత సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్‌కు శుభాకాంక్షలు తెలిపింది. చివర్లో జై బజరంగబలి అని చేర్చింది కూడా. గతంలో యివేమీ లేవు.

మమతా బెనర్జీని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించే బిజెపి ప్రయత్నాలకు పూరి జగన్నాథాలయం పూజారులు కొందరి నుంచి సహకారం అందింది. 2019 నాటికి బిజెపికి వ్యతిరేకంగా కూటమి కట్టడానికి నవీన్ పట్నాయక్‌ను కలిసి మాట్లాడడానికి మమతా బెనర్జీ ఏప్రిల్ మూడవ వారంలో మూడు రోజుల ఒడిశా పర్యటన పెట్టుకుంది. ఏప్రిల్ 20 న ఒక పావుగంట జరిగిన ఆ సమావేశానికి రెండు రోజుల ముందు ఏప్రిల్ 18 సాయంత్రం జగన్నాథుని గుడికి వెళతానని వెల్లడించగానే శ్రీ జగన్నాథ్ సేవాయత్ సమ్మిళని సెక్రటరీ ఐన సోమనాథ్ కుంతియా అనే పూజారి ఆమె వస్తే 12 వేల మంది పూజారులు అడ్డుకుంటారని ప్రకటించాడు. "గోమాంస భక్షణపై నిషేధం విధించకూడదని ఆమె చేసిన ప్రకటన చూశాం. ముస్లిము పండగ రోజుల్లో ఆమె మసీదుల్లో నమాజు చేస్తూండగా గమనించాం. ఆమె గోమాంసం తినే వుండవచ్చని మా అనుమానం. హిందూ సంప్రదాయానికి విరుద్ధమైన పనులు చేస్తున్న ఆమెను గుడిలోకి రానీయం." అని హెచ్చరించాడు. అనేకమంది పార్టీల నాయకులు తాము హిందువులైనా యితర మతాల ప్రార్థనా స్థలాలకు వెళుతూనే వుంటారు. ప్రార్థనలు చేస్తున్నట్లు అభినయిస్తారు. వారెవ్వరికీ లేని యీ హెచ్చరిక తమ నాయకురాలికి యివ్వడంతో తృణమూల్ కార్యకర్తలు తప్పుపట్టారు. పూజారుల్లో కొందరు మాత్రం మమతను ఆహ్వానించారు. ఇద్దరి మధ్య ఘర్షణలు జరుగుతాయనే భయంతో పోలీసులు సోమనాథ్‌ను, మరో ముగ్గురు పూజారులను ముందుగానే అరెస్టు చేశారు. అయినా మమత గుడికి వచ్చినపుడు బిజెపి యువవిభాగం – భారతీయ జనతా యువ మోర్చా – నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. అంతకు ముందుగానే మమత చెప్పింది – "ఏం తినాలో ఏం తినకూడదో తేల్చుకునే ఛాయిస్ ప్రజల కుంటుంది అని మాత్రమే చెప్పాను. బీఫ్ తినమని ప్రచారం చేయలేదు. బిజెపి ఊరికే దాన్ని రాజకీయం చేస్తోంది." అని. ఆందోళనకారులను పోలీసులు తరిమివేశారు. స్వయిన్ మహాపాత్ర అనే పూజారి వెంట వుండి గుడిలోకి తీసుకుని వెళ్లగా మమత అరగంట సేపు గుడిలోని వుండి వెళ్లారు.

ఈ సందర్భంగా ఎకె బిశ్వాస్ అనే విశ్రాంత ఐయేయస్ అధికారి తరతరాలుగా పూరి జగన్నాథాలయ నిర్వాహకులు ఆడిన రాజకీయ క్రీడలను ఒక వ్యాసంలో వివరించారు. మొఘల్‌ల కంటె ముందు పాలించిన ముస్లిము పాలకులు పూరిలో యాత్రికుల పన్ను విధించారు. అక్బర్ దాన్ని ఎత్తివేశాడు, షా జహాన్ అదే పద్ధతి కొనసాగించాడు. ఔరంగజేబు మళ్లీ విధించాడు. ఆ తర్వాత హిందూ పాలకులైన పీష్వాలు వచ్చారు. వాళ్లూ ఆ పన్ను వసూలు చేశారు. 1803లో ఈస్ట్ ఇండియా కంపెనీ తరఫున వెల్లస్లీ సైన్యం ఒడిశాపై దండెత్తి కేవలం 14 రోజుల్లో దాన్ని జయించింది. పూరికి నాలుగు మైళ్ల దూరంలో సైన్యం విడిది చేసి వుండగా పూరి దేవాలయ అర్చక బృందం సైన్యాధికారిని కలిసి "జగన్నాథుడు ఒక భక్తుడిపై పూని యికపై ఆలయ నిర్వహణ కంపెనీ వారే నిర్వహించాలని ఆదేశించాడు." అని విన్నవించారు. కంపెనీ వెంటనే ఆనందంగా అంగీకరించింది. భక్తులను వర్గాలుగా విడగొట్టి తలా రూ.2 నుంచి రూ.10 వరకు రుసుం వసూలు చేసేది. పూజారులు, ప్రత్యక్ష ఆలయ సిబ్బంది మొత్తం 20 వేల మంది జీతాలిచ్చేది, సంప్రదాయ పద్ధతిలో ఆలయాన్ని నిర్వహించేది.

1806–32 సంఎల మధ్య పూరీ ఆలయంపై సగటున ఏటా రూ.1.12 లక్షలు ఆర్జించింది. ఈ పద్ధతి లాభదాయకంగా వుందనుకుని పూజారులతో, ఆలయనిర్వాహకులతో, స్థానిక రాజులతో లాభాలు పంచుకుంటూ వచ్చింది. తిరుపతి, కాశీపూర్, సర్కారా, సంబల్, గయ వంటి పుణ్యక్షేత్రాల్లో పన్నులు వసూలు చేసి ఏటా 75 వేల పౌండ్లు లాభాన్ని కళ్లచూసేది. టేకారీ మహారాజా ఏలుబడిలో వున్న గయ విష్ణుపాద ఆలయంపై వచ్చిన ఆదాయంలో 10% రాజాకు పంపేది. ఇంగ్లీషువారితో యిలాటి వ్యాపారబంధం ఏర్పడడం చేత పూజారులు వారిని రక్షించాలని చూసేవారు. 1857లో సిపాయి తిరుగుబాటు వచ్చినపుడు విష్ణుపాద ఆలయ పూజారి బృందం గయ జిల్లా మేజిస్ట్రేటు వద్దకు వెళ్లి "తిరుగుబాటుదారుల నుండి మిమ్మల్ని, మీ జాతివారిని, ప్రభుత్వ ఆస్తులను

రక్షించడానికి మేం 3 వేల మంది లాఠీధారులను సమకూరుస్తాం.” అని ఆఫర్ యిచ్చారు. ఇలా రాజకీయాలు, ఆలయాల బంధం ఎప్పుణ్నుంచో కొనసాగుతోంది. బ్రిటిష్ గవర్నరు జనరల్‌గా మౌంట్‌బాటెన్ వున్నపుడు, అతను పూరి జగన్నాథాలయానికి వెళ్తే పూజారులు అతన్ని ఘనంగా ఆహ్వానించారు. అతనితో బాటు గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా వున్న అంబేడ్కర్ కూడా వెళితే హరిజనుడని ఆయన్ని మాత్రం లోపలకి రానీయలేదు. మౌంట్‌బాటెన్ గోమాంసం తింటాడని పూరీ పూజారులకు తెలియదా? తెలుసు. కానీ అతను అధికారంలో వున్నాడు. అది చాలు వాళ్లకి. మౌంట్‌బాటెన్‌ను ఆహ్వానించినవారి వారసులు యీనాడు మమతా బెనర్జీకి అభ్యంతరం తెలపడమేమిటి? అని వ్యాసకర్త ప్రశ్నించారు.

మామూలు యీ ప్రజలకు యీ తర్కాలేవీ బుర్ర కెక్కవు కాబట్టి తనేమీ తక్కువ హిందువును కానని నిరూపించుకోవడానికి మమత చాలా ప్రయత్నాలు చేస్తోంది. తను బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందినదాన్నని, బాల్యంలో సంస్కృత శ్లోకాలు అభ్యసించానని చెప్పుకుంటోంది. ఇటీవల తన ఉపన్యాసాల్లో ఉర్దూ కవితలకు బదులుగా సంస్కృత శ్లోకాలు ఉటంకిస్తోంది. తమ రాజకీయ సభలకు గతంలోలా ముస్లిము ఇమామ్‌లను ఆహ్వానించడం మానేసింది. ప్రభుత్వ కార్యక్రమాలకు భారత్ సేవాశ్రమ్ సంఘ్ సాధువులను పిలుస్తోంది. తాజాగా ఏప్రిల్ 21న సివిల్ సర్వీసెస్ డేను ప్రభుత్వం తరఫున నిర్వహిస్తూ రామకృష్ణ మిషన్ సాధువులను ఆహ్వానించింది. “హిందూమతం ప్రేమను పంచమంటుంది. రామకృష్ణ పరమహంస, వివేకానందుడు వంటి మహనీయులు ఆచరించిన మతమది. నేను అసలైన హిందువును. బిజెపి హిందూమతానికి ఒక మచ్చ.” అంది. ఓ పక్క బిజెపిని నిందిస్తూ దాన్ని లెఫ్ట్ ఫ్రంట్‌కు ముడివేస్తోంది. ఇద్దరూ కలిసి బెంగాల్‌కు వ్యతిరేకంగా గూడుపుఠాణీ చేస్తున్నారని ఆరోపిస్తోంది. వామపక్షాలను బెంగాలీలో ‘బామ్(వామ్)’ అంటారు. ‘దిల్లీ నుంచి బామ్‌ను వెంటపెట్టుకుని రామ్ వచ్చాడు’ అని యీ మధ్య స్లోగన్ యిచ్చింది. పైకి యిలా అంటున్నా బిజెపితో యుద్ధానికి వామపక్షాలు తనతో కలిసి రావాలని ఆశిస్తోంది. ఏప్రిల్ 21న జరిగిన తమ పార్టీ సమావేశంలో కొందరు నాయకులతో అంతరంగికంగా మాట్లాడుతూ ‘’బిజెపి, ఆరెస్సెస్ ఎదుగుదల ఎంత ప్రమాదకరమో లెఫ్ట్ నాయకులు గుర్తిస్తున్నట్లు లేదు. వారిలో కొందరితో మీకు పరిచయాలు వున్నాయి కదా, మీ నియోజకవర్గాలకు వెళ్లి వారిని కలిసి నచ్చచెప్పండి, మేలుకొలపండి’ అందిట. ఎందుకంటే ఆమెకు తెలుసు తృణమూల్ అంటే పడని ఓటర్లు చాలామందే వున్నారు. వాళ్లు యిన్నాళ్లూ ప్రత్యామ్నాయంగా లెఫ్ట్ పార్టీల వైపు చూశారు. ఇప్పుడు బిజెపి వైపు మళ్లుతారు. అదే విధంగా బిజెపి అంటే పడని ఓటర్లు లెఫ్ట్‌ను వదిలిపెట్టి, తృణమూల్‌వైపే మొగ్గు చూపుతారు. కానీ లెఫ్ట్, కాంగ్రెసులు ప్రాధాన్యం కోల్పోయి ముఖాముఖీ పోటీ జరిగితే తృణమూల్‌కు మెజారిటీ తగ్గడం ఖాయం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2017)**

**మే 11, 12** **ఎమ్బీయస్ : ఆప్‌లో సంక్షోభం**

ఆప్ పార్టీ అధినాయకత్వం అనగా అరవింద్ కేజ్రీవాల్‌పై అతని ఆత్మీయుల్లో కొందరు ధ్వజమెత్తారు. ప్రస్తుతానికి అరవింద్ డిఫెన్సులో పడ్డాడు. ఇంటా, బయటా పార్టీపై విమర్శలు గుప్పించేవారికి అందివచ్చినవి – యిటీవలి అసెంబ్లీ ఎన్నికలు, మరీ ముఖ్యంగా దిల్లీ మునిసిపల్ ఎన్నికలు. ఒక దశలో పంజాబ్‌లో ఆప్ అధికారాన్ని చేజిక్కించుకుంటుందనుకున్నారు కానీ అది చేసిన కొన్ని పొరపాట్ల వలన అంతిమంగా కాంగ్రెసుకు అధికారం దక్కింది. కానీ ఆప్ అక్కడ కాలూనుకున్న వాస్తవాన్ని, 25% ఓట్లతో ద్వితీయస్థానంలో నిలిచిన నిజాన్ని విస్మరించరాదు. గోవాలో ఒక్క స్థానమూ గెలవలేదు కానీ 6% ఓట్లు తెచ్చుకుంది. ఇక 270 వార్డులలో ఎన్నికలు జరిగిన దిల్లీ మునిసిపల్ ఎన్నికలకు వస్తే ఉత్తర దిల్లీలో 28% ఓట్లతో 21 సీట్లు, దక్షిణ దిల్లీలో 26%తో 16 సీట్లు, తూర్పు దిల్లీలో 23%తో 11 సీట్లు గెలిచింది. దరిమిలా రెండు స్థానాలకు ఉపయెన్నికలు జరిగితే, వాటిలో ఒకటి ఆప్, మరొకటి కాంగ్రెసు గెలిచాయి. రెండు చోట్ల బిజెపి ఓడిపోయింది. 272 వార్డుల దిల్లీ మునిసిపాలిటీలో ఆప్ ముందెన్నడూ లేదు. ఇదే ప్రథమం. మొదటిసారే సరాసరిన 25% ఓట్లకు పైగా తెచ్చుకుంది. దానికీ, కాంగ్రెసుకు కలిపి బిజెపి కంటె ఎక్కువ ఓట్లు వచ్చాయి. అయినా ఆప్ పని పూర్తయిపోయినట్లే అంటూ హడావుడి జరుగుతోంది. ఆప్ అసంతృప్త నాయకులు యిదే అదనుగా తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నారు. ఇది కాస్త వింతగానే వుంది.

దిల్లీ నగరపాలనలో చాలా సమస్యలున్నాయి. రోడ్ల సమస్య, డ్రైనేజీ సమస్య, నీటి కొరత, అక్రమ నివాసాల సమస్య... పరమ చెత్తగా వుంటుంది ఆ నగరనిర్వాహణ. దానికి బాధ్యత వహించాల్సింది పదేళ్లగా దాన్ని పాలిస్తున్న బిజెపియే. దాని కార్పోరేటర్లు అనేకమంది అసమర్థులుగా పేరుబడ్డారని, పైగా అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారని దిల్లీ ప్రజలంతా ఫిర్యాదు చేస్తూనే వున్నారు. అందుకే బిజెపి చాలా స్థానాల్లో తన అభ్యర్థులను మార్చేసింది. 2007లో బిజెపికి 164 వుండేవి, 2012కి అవి 138కి తగ్గాయి. యీసారి ఎన్నికలలో మళ్లీ బిజెపిని 67% అంటే 184 సీట్లతో గెలిపించారు. దానికి కారణం కార్పోరేటర్లపై అభిమానం కాదు, మోదీ హవా. మోదీ ప్రభావం ఒక్కోచోట ఒక్కోప్పుడు ఒక్కోలా పనిచేస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లో ఓటర్లను వూపేసిన మోదీ హవా పంజాబ్‌లో ప్రభావం చూపించలేక పోయింది. దిల్లీలో కూడా 2015లో మోదీ హవా పనిచేయలేదు. రెండేళ్లు పోయాక పని చేసింది. 2007లో 67, 2012లో 77 తెచ్చుకున్న కాంగ్రెసుకు యీసారి 30 వచ్చాయి. బియస్పీ తన బలాన్ని కోల్పోతూ వచ్చింది. 2007లో 17 వార్డులున్న ఆ పార్టీకి 2012లో 15 వస్తే యీ సారి దాని గురించి ప్రస్తావనే లేదు. నిజానికి ఇవి కేవలం మునిసిపల్ ఎన్నికలు. కానీ

అరవింద్, మోదీ కలిసి వాటిని సిఎం వెర్సస్ పిఎం ఎన్నికలగా మార్చారు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రచారం నిర్వహించారు సరే, సాక్షాత్తూ ప్రధాని కూడా ప్రచారసభలకు హాజరయ్యారు. ఓడిపోయిన ఆప్ అభ్యర్థులు 'అప్పటిదాకా మా పట్ల సానుకూలంగా వున్న ఓటర్లు మోదీని చూడగానే తిరిగిపోయారు' అని చెప్పుకున్నారు. ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు అని అడగలేదు. అన్ని నియోజకవర్గాల్లోనూ మోదీయే అభ్యర్థి అనుకుని ఓట్లేశారు. ఇక్కడా అన్ని వార్డుల్లోనూ మోదీని చూసే ఓట్లేశారుట.

ప్రస్తుతం మోదీ కారణంగా ఢిల్లీ కార్పోరేషన్‌లో బిజెపి నెగ్గింది సరే, 2007లో, 2012లో మోదీ హవా లేదు. వేరే కారణాల చేత బిజెపి నెగ్గింది. అప్పుడు ఢిల్లీ అసెంబ్లీలోను, కేంద్రంలోను కాంగ్రెసు పార్టీయే వుంది. బిజెపి ఎన్నికైంది కాబట్టి కాంగ్రెసు పార్టీ కథ ముగిసిపోయిందని ఎవరూ అనలేదు. కానీ యిప్పుడు  ఆప్ గురించి మాత్రం యిలా మాట్లాడుతున్నారు. గోరంతలను కొండంతలు చేయడంలో మీడియా పాత్ర వుందని గ్రహించాలి. మీడియా, సోషల్ మీడియా మద్దతుతో పైకి వచ్చిన ఆప్ దాన్నే నమ్ముకుని పార్టీ నిర్మాణాన్ని పట్టించుకోవటం లేదు. తన శక్తిని అధికంగా వూహించుకుని గంతులు వేస్తోంది. బోర్లా పడుతోంది. గతంలో కాంగ్రెసు వ్యతిరేకించినందుకు ఆప్‌ను ఆకాశానికి ఎత్తేసిన మీడియా యిప్పుడు బిజెపిని వ్యతిరేకిస్తున్నందుకు పాతాళానికి తొక్కేస్తోంది. అది గుర్తించి దానికి విరుగుడు కనిపెట్టవలసిన అరవింద్ తనను తాను మోదీకి సమాన ప్రత్యర్థిగా వూహించుకుంటూ ప్రకటనలతో, ప్రలాపాలతో, ఆర్భాటాలతో  అంతకంతకు దిగజారుతున్నాడు.  2013లో ఢిల్లీలో బొటాబొటీ మెజారిటీతో నెగ్గిన ఆప్ తనే కాంగ్రెసుకు, బిజెపికి జాతీయ స్థాయి ప్రత్యామ్నాయం అనుకుంటూ 2014లో దేశమంతా పోటీ చేసి ఘోరంగా ఓడిపోయింది. అరవింద్ తాను మోదీని ఓడిస్తానంటూ ఢిల్లీ విడిచిపెట్టి వారణాశిలోనే పోటీ చేసి అక్కడ ఓడిపోవటంతో పాటు, ఢిల్లీ కూడా పోగొట్టుకున్నాడు. 2015లో ఢిల్లీలో నెగ్గాడు. కేంద్రం పెట్టే బాధలు భరించలేక ఢిల్లీనే నమ్ముకుంటే లాభం లేదని పంజాబ్, గోవాలలో గోదాలోకి దిగాడు. పంజాబ్‌లో పరువు దక్కింది కానీ గోవాలో పోయింది. అయినా పాఠాలు నేర్చుకోలేదు. ఈవిఎమ్‌లదే తప్పంటున్నాడు, గుజరాత్, రాజస్థాన్‌లకు విస్తరిస్తాం అంటున్నాడు.

రాష్ట్ర ఎన్నికలలో స్థానిక నాయకులెవరైనా వుండి పని చేస్తూ వుంటే, పై నుంచి మార్గదర్శనం చేయడం వేరు. కానీ ఆప్ విషయంలో ఆ ఢిల్లీ నాయకులే అన్నిచోట్లకూ తిరగాలి. పంజాబ్ సిఎం కావాలనే కాంక్షతో, మాటిమాటికి అక్కడకు పర్యటిస్తూ అరవింద్ ఢిల్లీ పాలనను విస్మరించాడని ఢిల్లీ వాసుల అభిప్రాయం. అరవింద్ ఒక్కడే కాదు, ఆప్ నాయకులందరూ ఢిల్లీ, గోవా ఎన్నికలపై దృష్టి పెట్టి, తమను విస్మరించారని వారి అభియోగం. వీళ్లు వెళ్లడం వలన పంజాబ్, గోవాలలో ఏమైనా ఒరిగిందా అంటే అక్కడ వీళ్లను పరాయివారిగా చూశారు. ఆప్‌ను గెలిపిస్తే ఢిల్లీ వాళ్లే పాలిస్తారని అక్కడి ప్రత్యర్థులు గగ్గోలు పుట్టించారు. ఈ విధంగా ఆప్ రెండిందాలా చెడింది. స్థానిక నాయకులను తయారుచేసుకోకుండా 2014 పార్లమెంటు ఎన్నికలలో దేశమంతా పోటీ చేసి, ఏ విధమైన తప్పు చేసిందో అదే తప్పు యింకా జరిగి, ఢిల్లీ కోట చేజారిపోతోంది.

కార్పోరేషన్ ఎన్నికలలో ఆప్ యింతకంటె మెరుగైన ఫలితాలు రాబట్టగలిగేదా? ఒక విషయం మాత్రం నిజం. మోదీ ప్రభుత్వం ఆప్‌పై, ముఖ్యంగా అరవింద్‌పై పగ బట్టింది. అది స ృష్టిస్తున్న అడ్డంకులకు అంతూ, పొంతూ లేకుండా వుంది. దానివలన అరవింద్‌పై సానుభూతి పెరగాలి. కానీ అతను తనకు అక్కరలేని విషయాలపై కూడా వ్యాఖ్యలు చేసి, వివాదాలు కొని తెచ్చుకుని, పేరు పోగొట్టుకుంటున్నాడు. అంతేకాదు, వ్యక్తిగతంగా తన యిమేజి పెంచుకోవడానికి విపరీతంగా ప్రజాధనాన్ని ఖర్చు పెడుతున్నాడు. సంప్రదాయ పార్టీలకు భిన్నంగా పార్టీ నడుపుతానంటూ రాజకీయాల్లోకి వచ్చి, వారి బాటలోనే నడుస్తూ పార్టీ ఫిరాయింపుదారుల్ని చేర్చుకుంటూ, ఎన్నారైలకు టిక్కెట్లు యిస్తూ నావల్టీ పోగొట్టుకున్నాడు. ఢిల్లీ మునిసిపల్ ఎన్నికలలో ఇంటి పన్ను రద్దు చేస్తానంటూ హామీ యిచ్చాడు! కొత్త మార్గం చూపుతాడని అతని మీద ఆశలు పెట్టుకున్న అనేకమందికి ఆశాభంగం కలిగించాడు. ఏ మాట కా మాట చెప్పుకోవాలంటే ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో మంచి అభివ ృద్ధిని సాధించింది. విద్యుత్, నీటి సరఫరా, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు విషయంలో కూడా ఫర్వాలేదనిపించుకుంది. అందువలన కార్పోరేషన్ ఎన్నికలలో యింతకంటె ఎక్కువ సీట్లు గెలిచి వుండవచ్చు. కానీ అది జరగలేదు.

కానీ అంతమాత్రాన పార్టీ పుట్టి మునిగిపోయినట్లు కొందరు ఆప్ నాయకులు అలజడి రేపారు. ఇదే వింతగా వుంది. ఈ వింత జరగడంలో ఆప్ ప్రత్యర్థి – బిజెపి అని భావం – హస్తం వుందా అనేది అందరికీ వున్న సందేహం. తమను ధిక్కరించేవారి పార్టీల పట్ల బిజెపి ఎలా వ్యవహరిస్తోందో తమిళనాడు వ్యవహారాలు చూపుతున్నాయి. ఆప్‌ను కూడా ఖండఖండాలు చేసేవరకూ బిజెపి విశ్రమించక పోవచ్చు. వరుస ఓటములతో ఆప్ క ృంగివున్న తరుణంలోనే  దెబ్బ కొట్టాలని చూడడం రాజకీయపరంగా అర్థం చేసుకోదగినదే. అరవింద్ పట్ల కినుక వహించిన కొందరు నాయకులను చేరదీసి మీడియా ద్వారా వారికి విపరీతంగా ప్రాధాన్యత కలిగించి, అరవింద్ నైతికస్థైర్యాన్ని దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతోంది. ముఖ్యంగా కుమార్ విశ్వాస్ ద్వారా అరవింద్ పదవికి ఎసరు పెట్టే ప్రయత్నం జరుగుతోంది. ''నేను పార్టీ చీలుస్తాను. మంత్రి కపిల్ మిశ్రా, అతనితో పాటు 33 మంది ఎమ్మెల్యేలు నాతో వస్తారు.'' అని  విశ్వాస్ ఏప్రిల్ 30న ఒక ఎమ్మెల్యేతో మాట్లాడితే అతను దాన్ని రికార్డు చేసి, అరవింద్‌కు వినిపించాడట. అరవింద్ అది విని వారం రోజుల తర్వాత కపిల్ మిశ్రాను తీసేశాడు తప్ప విశ్వాస్‌పై చర్య తీసుకోలేదు. ఎందుకంటే విశ్వాస్‌కు తక్కిన ఎమ్మెల్యేలలో బలం వుంది.

కాబినెట్ మంత్రి పదవి పోగానే కపిల్ మిశ్రా అరవింద్‌పై అవినీతి ఆరోపణ చేశాడు. ఐదుగురు ఆప్ లీడర్ల విదేశీ పర్యటనలపై ఖర్చు పెట్టిన నిధుల వివరాలను బహిర్గతం చేయాలన్నాడు. అంటూనే సిబిఐ వద్ద ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశాడు. దానితో బాటు ఆరోగ్యమంత్రి సత్యేంద్ర జైన్, వాటర్ మాఫియా అరవింద్‌కు రెండు కోట్లు యిచ్చారని, అది తను చూశానని ఫిర్యాదు చేశాడు. ఇతని వద్ద దృఢమైన ఆధారాలుంటే మీడియాకు తక్షణం అందించేసే వాడు. కోర్టులు లోతుగా విచారించి అటోయిటో తేల్చేలోపున మీడియా, మరీ ముఖ్యంగా సోషల్ మీడియా యీపాటికే అతన్ని ఉరి వేసేసి వుండేది. అతని మాటలు పట్టించుకోనక్కర లేదని అరవింద్ అన్నాక కూడా అతను తన వద్ద వున్న ఆధారాలు బయటపెట్టలేదు. నీ కళ్లెదురుగా అంత అవినీతి జరిగినా అప్పుడు మెదలకుండా వున్నావేం? అని అన్నా హజారే అడిగితే కపిల్ వద్ద సమాధానం లేదు. అయినా ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు జనరల్ ఎసిబి విచారణకు ఆదేశించాడు. అరవింద్ సన్నిహిత బంధువులకు అక్రమ భూలావాదేవీల ద్వారా రూ. 50 కోట్ల ప్రయోజనం సమకూరిందని కూడా మిశ్రా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశాడు. ఆరోపణలున్న యితర ముఖ్యమంత్రుల పట్ల కేంద్రం ఎలా వ్యవహరిస్తోందో, అరవింద్ పట్ల ఎలా వ్యవహరించిందో కొట్టవచ్చినట్లు కనబడుతోంది. గతంలో కూడా కేంద్ర ప్రభుత్వాలు యిలానే పక్షపాత బుద్ధితో వ్యవహరించాయి. అందుకే సిబిఐ చార్జిషీట్లు అంటే హాస్యాస్పదంగా తయారయ్యాయి.

అరవింద్ ప్రస్తుతం ఎదుర్కుంటున్న గడ్డు పరిస్థితి అతను చేతులారా చేసుకున్నదే. ఒక ఉద్యమకర్తగా అతను ప్రారంభించాడు. అధికారం చేజిక్కాక వివిధ రకాల ఆలోచనాపరులను కలుపుకుని ఉద్యమాన్ని విస్తరింపచేయాలి. దానికి బదులుగా అన్ని అధికారాలు తన చేతిలోనే కేంద్రీకరించుకున్నాడు. తనను వ్యతిరేకించినవారికి నచ్చచెప్పే ప్రయత్నం చేయలేదు, వారిని దూరం పెట్టేశాడు. అలా అని కొత్తవారిని చేర్చుకోలేదు. గుప్పెడుమంది నాయకులతో దేశమంతా వ్యాపించి, అన్ని రాష్ట్రాల్లో చొచ్చుకుపోదామని చూస్తున్నాడు. ఈ ఉద్యమకర్తల స్వభావాలను ఎవరైనా మానసిక శాస్త్రవేత్త విశ్లేషిస్తే బాగుంటుంది. అసాం గణ పరిషత్ ఉద్యమాన్ని నడిపిన విద్యార్థి నాయకులుగా ప్రఫుల్ల మొహంతా, భృగు పూకాన్ మార్తాండుల్లా వెలిగిపోయారు. ఉద్యమాన్ని పార్టీగా మార్చి అధికారం కైవసం చేసుకున్నాక యిక పతనం ప్రారంభమైంది. లోకసత్తా ఉద్యమంగా వున్నంతకాలం తెలుగునాట రాజకీయ పార్టీలన్నీ దాన్ని చూసి భయపడేవి. హితైషులు వారిస్తున్నా, అనేకమంది కార్యకర్తలు వద్దంటున్నా జెపి దాన్ని రాజకీయ పార్టీగా మార్చారు. అంతే అప్పణ్నుంచి అది ప్రభావం కోల్పోయింది. లోకసత్తా అంటే జెపి తప్ప రాష్ట్రస్థాయి నాయకులెవరూ గుర్తుకురానంతగా అధికార కేంద్రీకరణ జరిగిపోయింది. ఇతర పార్టీల్లో జెపికి ఎత్తిచూపిన లోపాలు ఆయన పార్టీలోనే పునరావృతమయ్యాయి. నాయకులు బహిరంగంగా కలహించుకున్నారు. ఇప్పుడు ఆప్‌లో అదే జరుగుతోంది.

ఆప్ ఎన్నికల వైఫల్యానికి, పార్టీ నాయకుల ప్రతిస్పందనకు తూకం కుదరటం లేదు. ఇంత తీవ్రస్పందన వస్తోందంటే యితర పార్టీల ప్రమేయం వుందని కచ్చితంగా చెప్పాలి. ముందుగా బిజెపినే అనుమానించాలి కానీ కాంగ్రెసు హస్తం కూడా వుండి వుండవచ్చు. ఎందుకంటే అరవింద్ కాంగ్రెస్‌నే ఎక్కువ యాగీ పెట్టాడు. పైగా ఆప్ ఢిల్లీ రంగంలోంచి తప్పుకుంటే బిజెపి ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం కాంగ్రెసుకే వుంది. ఆప్ నాయకుల్లో ఎవరు ఏ పార్టీ చేత ప్రభావితమవుతున్నారో యిప్పుడే తెలియదు. వివాదాల్లో ప్రముఖంగా చర్చించబడిన వారిలో పార్టీ లోపాల గురించి వీడియోలో మాట్లాడిన కుమార్ విశ్వాస్ వున్నారు. విశ్వాస్ అరవింద్‌కు ఆత్మీయుడు. యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్ తదితరులు అరవింద్‌పై తిరుగుబాటు చేసినపుడు అరవింద్ తరఫున వారిపై ఒంటికాలిపై లేచినవాడు అతనే. ఇప్పుడు యోగేంద్ర తదితరుల వాదనలే తను వినిపిస్తున్నాడు. అరవింద్‌కు అత్యంత ఆత్మీయుడు, విశ్వాస్‌కు బాల్యస్నేహితుడు ఐన మనీష్ శిశోడియా "ఈ బహిరంగ చర్చ దేనికి?" అంటూ మందలించాడు. అయినా విశ్వాస్ మొండిగానే వున్నాడు.

విశ్వాస్ ఆరెస్సెస్-బిజెపి బంటని, పంజాబ్, గోవా ఎన్నికల సమయంలో పని చేయలేదనీ, అరవింద్‌ను తోసివేసి తన పార్టీ అధ్యక్షుడు కావాలనుకుంటున్నాడని అతనిపై చర్య తీసుకోవాలని అమానుతుల్లా ఖాన్ అనే ఎమ్మెల్యే కోరినా అరవింద్ తొందరపడలేదు. తనపై యిలాటి ఆరోపణ చేసిన అమానుతుల్లా ఖాన్‌ను పార్టీ పదవుల్లోంచి తీసేయాలని విశ్వాస్ పట్టుదల. సరే అలాగేలే అని పార్టీ లోంచి సస్పెండ్ చేసి, స్పీకర్ చేత ఢిల్లీ అసెంబ్లీ కమిటీలు అనేకవాటిలో సభ్యుడిగా వేశాడు అరవింద్. విశ్వాస్‌ని వదులుకోవడం యిష్టం లేక అతనితో రాజీపడి, రాజస్థాన్ వ్యవహారాలకు యిన్‌చార్జిగా నియమించాడు. అతని అనుచరులను అసెంబ్లీ కమిటీ సభ్యులుగా నియమించాడు. ఈ ఎత్తుగడతో పార్టీలో తిరుగుబాటు ప్రస్తుతానికి చల్లారిందని అనుకోవడానికి లేదు. విశ్వాస్ ఎప్పటికైనా తిరగబడవచ్చని పరిశీలకుల అంచనా. **– (ఫోటో – అరవింద్, కుమార్ విశ్వాస్, అమానుతుల్లా ఖాన్, కపిల్ మిశ్రా) ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2017)**

**న్యూస్, వ్యూస్ 132 జూన్ 01** ఎమ్బీయస్ : స్మారక చిహ్నాన్ని వదుల్చుకోవడం ఎలా?

సాధారణంగా జాతీయ, అంతర్జాతీయ నాయకులకు సంబంధించిన జ్ఞాపకాలను, కట్టడాలను ఎలా కాపాడాలా అని ప్రభుత్వాలు ఆలోచిస్తూ వుంటాయి. కానీ ఆస్ట్రియా ప్రభుత్వం బ్రౌనౌ యామ్ ఇన్ అనే చిన్న వూళ్లో 17 వ శతాబ్దికి చెందిన ఓ భవంతిని చరిత్రనుంచి ఎలా చెరిపివేయాలా అని మల్లగుల్లాలు పడుతోంది. ప్రపంచాన్ని వణికించిన నియంత హిట్లర్ పుట్టిన ఆ భవనం నియో

నాజీలకు తీర్థస్థలంగా తయారయ్యింది. ఇటీవలి కాలంలో యూరోప్‌లో తీవ్ర దక్షిణవాదపు (ఫార్‌–రైటిస్టు) ధోరణులు ప్రబలడంతో దాన్ని సందర్శించి స్ఫూర్తి పొందేవాళ్లు ఎక్కువయ్యారు. అదీ సమస్య! 1889 ఏప్రిల్ 20న హిట్లర్ ఆ గెస్ట్‌హౌస్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో పుట్టాడు. అప్పుడప్పుడు కొన్ని నెలలు మాత్రమే అక్కడ గడిపాడు. ఆ భవనాన్ని గెర్లిండ్ పామర్ అనే అతను 1912లో కొని పెట్టుకున్నాడు. హిట్లర్ జర్మనీని పాలించే రోజుల్లో అతని ప్రయివేటు సెక్రటరీ మార్టిన్ బోర్‌మన్ నాజీ పార్టీ తరఫున దాన్ని పామర్‌నుంచి కొనుగోలు చేశాడు. రెండవ ప్రపంచయుద్ధంలో అతని ఓటమి తర్వాత ఆస్ట్రియా దేశం విముక్తి చెందింది. హిట్లర్ పరిపాలనలో అవస్థలు పడిన ఆస్ట్రియా తమ దేశస్తులు హిట్లర్‌ను పొగిడినా, నాజీయిజం గురించి గొప్పగా చెప్పినా సహించదు. 1950లలో ఆ భవనాన్ని ఆస్ట్రియా ప్రభుత్వం నాజీ పార్టీ నుంచి స్వాధీనం చేసుకుని పామర్ పేర బదిలీ చేసింది. పామర్ దాన్ని నాజీ మ్యూజియంగా మారుస్తాడన్న భయం వేసిందో ఏమో, ఆ ప్రమాదాన్ని నివారించడానికి 1972లో దాన్ని 5 వేల యూరోలకు లీజుకి తీసుకుని అనేకమంచి చిన్నా, చితకా కుటుంబాలకు, కొన్ని సంస్థలకు అద్దె కిచ్చేసింది.

అయితే ఆ పురాతన భవంతికి మరమ్మత్తులు అవసరం పడ్డాయి. పామర్‌ని అడిగితే రిపేర్లు చేయించేవాడు కాదు. దాంతో అందరూ ఖాళీ చేసి వెళ్లిపోసాగారు. వికలాంగులకు సహాయపడే సంస్థ ఆఖరిగా 2011లో ఖాళీ చేసి వెళ్లింది. 'సరే, కిరాయిదార్లందరూ వెళ్లిపోయారు. నువ్వేమో రిపేర్లు చేయించవు. పోనీ ప్రభుత్వానికి అమ్మేయ్' అంది ప్రభుత్వం పామర్‌తో. 'అమ్మను' అన్నాడు పామర్. ప్రభుత్వానికి ఏం చేయాలో పాలుపోలేదు. ఇటు చూస్తే నియో నాజీలందరూ ఆ బిల్డింగు చుట్టూ తిరుగుతూ ఫోటోలు తీసుకుంటున్నారు. దాన్నో పుణ్యక్షేత్రంగా చూస్తున్నారు. గత్యంతరం లేక 2016 డిసెంబరులో ఆ భవంతిని పామర్ నుంచి స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రజాస్వామ్యయుతంగా నడిచే ప్రభుత్వం యిలా జబర్దస్తీగా ప్రజల ఆస్తులు హరించడం వివాదాస్పదం అవుతుందన్న భయమూ వుంది. ఈ విషయమై ఒక రోజు పార్లమెంటులో అర్ధరాత్రి దాటేవరకు చర్చ చేసి, చివరకు చట్టం తయారుచేసి భవనాన్ని ప్రభుత్వపరం చేసుకుంది. ఇక ఇప్పుడు దాన్ని ఏం చేయాలి అనే సమస్య ఎదురైంది. పునాదులు అలాగే వుంచేసి పై భవంతిని పడగొట్టి, కొత్తది కట్టి అక్కడ నాజీ అకృత్యాలపై డాక్యుమెంట్లు భద్రపరిచే ప్రభుత్వ కార్యాలయం ఏదైనా పెట్టేస్తే సరి అన్నారు కొందరు.

హిట్లర్ బవేరియా ఆల్ప్స్ పర్వతశ్రేణిలో ఒబెర్‌సాల్జ్‌బర్గ్‌లో ఒక విశ్రాంతి గృహం కట్టుకున్నాడు. దాన్ని పార్టీ ముఖ్యకేంద్రంగా పదేళ్లపాటు వాడాడు. రెండవ ప్రపంచయుద్ధంలో అది చాలా భాగం నాశనమైంది. ఏదో కాస్త మిగిలితే అలాగే వుంచేశారు. యుద్ధానంతరం నియో నాజీలు అక్కడకు చేరి సమావేశాలు పెట్టుకోసాగారు. బవేరియా ప్రభుత్వానికి దడ పుట్టింది. 1952లో డైనమైట్ పెట్ట దాన్ని పేల్చేసింది. అటు వెళ్లకూడదంటూ బోర్డులు పెట్టింది. ఈ విధ్వంసంతో హిట్లర్ భక్తుల దృష్టిని అది ఆకర్షించింది. పెద్ద టూరిస్టు ఎట్రాక్షన్ అయిపోయింది. ఇది గమనించిన ప్రభుత్వం దాని ప్రాముఖ్యతను గుర్తించక తప్పదని గ్రహించి, అక్కడ డాక్యుమెంటేషన్ సెంటర్ పెట్టింది. అలాటిదే యిక్కడా పెడదామని ఆస్ట్రియన్ల ఆలోచన కానీ అది హెరిటేజి ఏరియాలో వున్న 17 వ శతాబ్ది నాటి హెరిటేజి బిల్డింగు. పురావస్తు చట్టం ప్రకారం దాని జోలికి వెళ్లడానికి వీల్లేదు. ఇవన్నీ పరిశీలించి మంచి పరిష్కారం సూచించమని ప్రభుత్వం 13 మంది సభ్యులతో ఓ కమిటీ వేసింది. ఈ లోగా తన భవంతిని స్వాధీనం చేసుకోవడానికి చేసిన చట్టాన్ని కొట్టేయమని కోరుతూ పామర్ కోర్టు తలుపు తట్టాడు. కోర్టు యింకా ఏ మాటా చెప్పలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**న్యూస్, వ్యూస్ 132 జూన్ 02 ఎమ్బీయస్ : పుదుచ్చేరిలో కిరణ్ బేదీ ఘర్షణ**

ఢిల్లీలో వున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం లెఫ్టినెంటు జనరల్ (ఎల్–జి) ద్వారా ఓ ఆట ఎలా ఆడిస్తోందో, అరవింద్ కేజ్రీవాల్ ఎల్–జితో ఎలా పోట్లాడుతున్నాడో చూస్తున్నాం. మరో కేంద్ర పాలిత రాష్ట్రమైన పుదుచ్చేరిలో అలాటి ఘర్షణ వాతావరణమే సృష్టించడానికి పూనుకుంది కిరణ్ బేదీ. గతంలో కేంద్రంలో ఎవరున్నా, రాష్ట్రంలో ఎవరున్నా పుదుచ్చేరిలో ఎల్–జి, ముఖ్యమంత్రి మధ్య యిలాటి పరిస్థితి నెలకొనలేదు. ఇప్పుడు కిరణ్ తనకు అధికారాలున్నాయని వాదిస్తూ తడాఖా చూపించడానికే నిశ్చయించుకున్నారు. పుదుచ్చేరి చాలా చిన్న కేంద్రపాలిత ప్రాంతం. ఢిల్లీకి లేని ప్రత్యేక సమస్యలు దానికి వున్నాయి. 130 కిమీల దూరంలో తమిళనాడులో వున్న కారైక్కల్, 600 కిమీల దూరంలో కేరళలో వున్న మాహే, 800 కిమీ. దూరంలో ఆంధ్రలో వున్న యానాం – యివన్నీ పుదుచ్చేరి పరిధిలోకే వస్తాయి. ఇక్కణ్నుంచే వాటిని పాలించాలి. ఇదో పెద్ద అవస్థ అనుకుని 1977లో మొరార్జీ ప్రభుత్వం యానాం, మాహే, కారైక్కల్‌లను ఆయా రాష్ట్రాల్లో కలిపేద్దామనుకుంది. కానీ ప్రజలు తిరగబడడంతో ఆగిపోయింది. పుదుచ్చేరిలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు గెలిచింది. నాలుగుసార్లు ఎంపీగా నెగ్గిన వి నారాయణస్వామిని ముఖ్యమంత్రిగా చేసి పంపించింది కాంగ్రెసు. 2004–09 మధ్య యుపిఏ1కి మెజారిటీ తక్కువగా వుండి, వామపక్షాల మద్దతుపై ఆధారపడిన రోజుల్లో పార్లమెంటులో కాంగ్రెసు తరఫున ఫ్లోర్ మేనేజరుగా వుండి, యితర పార్టీ నాయకులతో చాకచక్యంగా వ్యవహరించిన దిట్ట నారాయణస్వామి. 2009–14 మధ్య ప్రధాని కార్యాలయంలో మంత్రిగా వున్నాడు. అవినీతి ముద్ర పడలేదు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అధికారులతో బాగా మసలుతూ తన పాలనాసామర్థ్యం కనబరుస్తూనే వున్నాడు.

కిరణ్ బేదీ నిర్భయానికి, నిజాయితీకి పేరుబడిన ఐపియస్ అధికారిణి. కానీ ఆమెకు ప్రచారప్రీతి ఎక్కువ. సొంత యిమేజి

పెంచుకోవడం కోసం విలక్షణ పద్ధతులు చేపడుతూ అనేక వివాదాల్లో యిరుక్కున్నారు. ఉద్యోగ విరమణానంతరం అన్నా హజారే ఉద్యమంలో పాలు పంచుకుని, మళ్లీ అందరి నోళ్లలో నాని, దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిజెపిలో చేరి, బిజెపి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థినిగా ముందుకు వచ్చారు. కిరణ్ కార్యక్షేత్రం దిల్లీయే. కానీ దిల్లీ ఓటర్లు ఆమెను, బిజెపిని తిరస్కరించారు. ముఖ్యమంత్రి కాలేకపోయిన ఆమెను బిజెపి పుదుచ్చేరికి ఎల్‌జిగా పంపింది. చురుకుతనం పాలు ఎక్కువున్న కిరణ్ పుదుచ్చేరికి రాగానే ఏదో ఒకటి అడావుడి చేయసాగింది. దిల్లీ విషయంలో నైతే అరవింద్ మాటిమాటికీ కేంద్రంతో పేచీలకు దిగుతాడు. నారాయణస్వామి కూడా ప్రతిపక్ష ముఖ్యమంత్రే అయినా కేంద్రంతో తగాదాలకు దిగడు. అందువలన కిరణ్‌కు అవకాశం దొరకలేదు. అయినా దిల్లీ ఎల్‌జిని ఆదర్శంగా తీసుకుని నాదే సర్వాధికారం అనసాగింది. అధికారులు ఫైళ్లన్నీ తనకు పంపాలని, చీఫ్ సెక్రటరీ తనకు వచ్చి రిపోర్టు చేయాలని ఆదేశాలివ్వసాగింది. ముఖ్యమంత్రి మద్దతున్న అధికారగణం తనను పట్టించుకోకపోవటం ఆమెను మరింత మండిస్తోంది. ప్రజాసమస్యలపై రోజూ పేపర్ కటింగ్స్ అధికారులకు పంపుతూ దీని గురించి ఏం చేశారో నాకు నివేదించండి అంటూ అడుగుతూంటుంది. 'ఇదెక్కడా చూడని విడ్డూరం. రాష్ట్రపతి సైతం ప్రధానికి యిలాటి పేపర్ కటింగ్స్ పంపరు' అన్నాడు నారాయణస్వామి.

వారంవారం తన వద్దకు స్వయంగా వచ్చి వారంలో జరిగిన విషయాలన్నిటిపై రిపోర్టు చేయాలని కిరణ్ చీఫ్ సెక్రటరీని ఆదేశించింది. "ఇప్పటికే ఎడిషనల్ సెక్రటరీ వారంవారం రిపోర్టును ఎల్‌జి ఆఫీసుకి పంపుతున్నారు. అంతకుమించి నేను చెప్పేదేమీ లేదు. ప్రభుత్వం ద్వారా జరిగే పనులకు బాధ్యత వహించవలసినది మంత్రులే. పుదుచ్చేరి వంటి చిన్న రాష్ట్రాలలో సెక్రటరీలు మంత్రులను రోజుకి రెండు, మూడుసార్లు కలుస్తారు. విషయాలు చెప్తూనే వుంటారు. ఇది చాలనట్లు ఎల్‌జికి కూడా రిపోర్టులు పంపడమంటే టైము వేస్టే" అని జవాబిచ్చాడాయన. ఆవిడ పదవిలోకి వచ్చిన దగ్గర్నుంచి వారాంతాలలో పొద్దున్న 6 గంటలకు పుదుచ్చేరి వూళ్లో రౌండ్లు కొడుతూ పరిసరాలు శుభ్రంగా వున్నాయో లేదో చెక్ చేస్తూ వుంటుంది. ఇప్పటికి 77 రౌండ్లు అయ్యాయి. తను రౌండుకి వెళ్లినపుడు వాళ్లూవీళ్లూ కాదు, ఏకంగా చీఫ్ సెక్రటరీ కూడా తనతో రావాలని ఆవిడ ఉద్దేశం. ఆయన వెళ్లలేదు. మీరు వచ్చి తీరాలంటూ ఆమె ఉత్తరాలు రాయసాగింది. "మీరు నాతో పాటు రాకపోవడం నాకు చింత కలిగిస్తోంది. ప్రధాని మోదీ స్వచ్ఛతకు, శ్రమదానానికి ఎంత ప్రాధాన్యత యిస్తారో మీకు తెలియనిది కాదు. మనం గిరి గీచుకుని వుండిపోకూడదు. మోదీ గారి కోసమైనా చేయవలసినదాని కంటె ఎక్కువ చేయాలి." అంటూ యీ మెయిల్ రాసింది యీ మధ్య. ఇలాటివాటికి చలించేవాడు కాదు, చీఫ్ సెక్రటరీగా వున్న 1986 బ్యాచ్ ఐయేయస్ మనోజ్ కుమార్ పరీడా.

ఇది పని కాదని, కిరణ్ కేంద్రానికి రాసింది – దిల్లీ ఎల్‌జి సర్వాధికారాలు చలాయిస్తున్నపుడు, తను మాత్రం ఎందుకు చలాయించకూడదని. ఇక్కడ చిన్న సాంకేతిక అంశం వుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 239 ప్రకారం రాష్ట్రానికి గవర్నరు ఎలాగో, కేంద్రపాలిత ప్రాంతాలకు రాష్ట్రపతి అలాగ. ఎల్‌జి రాష్ట్రపతి పక్షాన పనిచేస్తూ ఆయనకు కళ్లూ, చెవులూగా పనిచేస్తాడు తప్ప గవర్నరుతో సమానం కాలేడు. ఆర్టికల్ 240 ప్రకారం ఆ ప్రాంతాలకు ఎన్నికలు జరిగి ప్రజాప్రభుత్వం ఏర్పడినపుడు రాష్ట్రపతి లెజిస్లేటివ్ అధికారాలకు కత్తెర పడుతుంది. అయితే ఆర్టికల్ 239ఎ ప్రకారం సిద్ధాంతపరమైన విషయాలలో రాష్ట్రపతి అనుమతి తప్పనిసరి. ఏది సిద్ధాంతపరమైన నిర్ణయం, ఏది కాదు అనేదానిలోనే వివాదం వస్తోంది. దిల్లీ దేశరాజధాని కాబట్టి 239ఎఎ అనే ప్రత్యేక సవరణ తెచ్చి పోలీసుపై అధికారాన్ని కేంద్ర హోం మంత్రికి అప్పచెప్పారు. పుదుచ్చేరిలో అయితే పోలీసు రాష్ట్ర ప్రభుత్వం కిందే వుంటుంది. ఇది రాజ్యాంగపరంగా వున్న పరిస్థితి. అయితే ఫైళ్లు చూసే అధికారం తనకుందని కేంద్రం స్పష్టత యివ్వాలని కిరణ్ పట్టుబట్టడంతో 2017 జనవరి 27న సతీశ్ కుమార్ సింగ్ అనే హోం శాఖ అండర్ సెక్రటరీ ఐదు పేజీల క్లారిఫికేషన్ పంపారు. "రోజువారీ వ్యవహారాల్లోను, సిద్ధాంతపరమైన నిర్ణయాలలోను ఎల్‌జికి పాత్ర వుంటుంది కాబట్టి తను చూద్దామనుకుంటున్న కాగితాలను ఎల్‌జి తెప్పించుకోవచ్చు, అధికారులను పిలిచి మాట్లాడవచ్చు. ఎల్‌జికి కావలసిన సమాచారాన్ని అందించవలసిన బాధ్యత ముఖ్యమంత్రికి వుంది." అని దానిలో రాశారు.

కేంద్రం కిరణ్ బేదీ పక్షాన నిలిచి, ప్రజాస్వామ్యయుతంగా నెగ్గిన ప్రభుత్వం విలువ తగ్గిద్దామని చూస్తున్న యీ లేఖను పట్టించుకోకూడదని ముఖ్యమంత్రి, అతని అధికారగణం నిర్ణయించుకున్నారు. అది వచ్చాక కూడా చీఫ్ సెక్రటరీ ఆమెకు ఫైళ్లు పంపలేదు. ముఖ్యమంత్రి విలేకరులు అడిగితే "రాజ్యాంగానికి ఎక్కువ విలువ వుంటుందా? హోం శాఖ క్లారిఫికేషన్‌కు ఎక్కువ విలువ వుంటుందా? ఆ లేఖ వచ్చాక నేను అభ్యంతరం తెలుపుతూ హోం శాఖకు ఉత్తరం రాశాను. ఇప్పటిదాకా వాళ్ల నుంచి జవాబు రాలేదు." అన్నాడు. క్లారిఫికేషన్ వచ్చిన తర్వాత కూడా చీఫ్ సెక్రటరీ తనను పట్టించుకోవటం లేదంటూ కిరణ్ ఏప్రిల్ 15 న కేంద్రానికి ఫిర్యాదు చేసింది. ఎల్‌జి లేవనెత్తిన అంశాలపై తమ వంతు కర్తవ్యం నెరవేరుస్తున్నామని, రోజువారీ రిపోర్టులు పంపనవసరం లేదని చీఫ్ సెక్రటరీ సమాధానమిచ్చాడు. అతన్ని సమర్థిస్తూ నారాయణస్వామి "చీఫ్ సెక్రటరీ, యితర సెక్రటరీలు ముఖ్యమంత్రి కింద పనిచేస్తారు. వారి ప్రవర్తనపై ఎక్స్‌ప్లనేషన్ కోరే అధికారం కేంద్ర హోం శాఖకు మాత్రమే వుంది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని తన ప్రాధాన్యతలను నిర్ణయించుకోనివ్వండి. రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ పని మీది కాదు' అంటూ కిరణ్‌కు లేఖ రాశాడు. ఇది నచ్చని కిరణ్ మే 2 న దిల్లీకి వెళ్లి హోం మంత్రి రాజనాథ్ సింగ్‌ను వెళ్లి కలిసింది, ఆ విషయాన్ని తన ట్విటర్ ఖాతాలో పెట్టింది. ప్రతికూల పరిస్థితుల్లోనే కిరణ్ బేదీ చెలరేగిపోయేవారు. ఇప్పుడు కేంద్రంలో తన పార్టీ ప్రభుత్వం విరాజిల్లుతూండగా

వదిలిపెడతారా? – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)

ఎమ్బీయస్ : రాజమౌళి నిజాయితీ

దర్శకుడు రాజమౌళి మే 28న ఓపెన్ హార్ట్ విత్ ఆర్కేలో పాల్గొన్నారు. బాహుబలి కథ గురించి ఆయన ప్రస్తావించిన కొన్ని అంశాలు, వాటిని చెప్పిన తీరు నన్ను ఆకట్టుకున్నాయి. బాహుబలి మొదటి భాగం విడుదలయ్యాక నేను కథకు సంబంధించి కొన్ని అంశాలను ఎత్తి చూపితే, పాఠకుల్లో కొందరు 'అవన్నీ రెండో భాగంలో తెలుస్తాయి. ఆర్నెల్లలో రెండో భాగం రాబోతోంది కదా. కాస్త ఆగలేరా?' అని మందలించారు. ఆర్నెల్లనుకున్నది ఇరవై నెలల్కెంది. సాంకేతిక సమస్యలు మాత్రమే కారణం కాదు. 'మొదటి భాగానికి వచ్చిన స్పందనతో రెండో భాగం కథపై యింకా వర్క్ చేస్తున్నాం' అని విజయేంద్ర ప్రసాద్‌గారు చెప్పారు. ఇప్పుడు రాజమౌళి ఇంటర్వ్యూ చూసినా అర్థమౌతుంది – ఇంత పెద్ద ప్రాజెక్టుకి కథ, సీన్లు, డైలాగులు 'లాక్' చేసుకోలేదనీ, మళ్లీ మళ్లీ వాటిపై వర్క్ చేశారనీ! "శివగామి బాహుబలిని చంపాలనే నిర్ణయం తీసుకోవడం అంత పెద్ద ప్లే లేదు. నేను రెడీ చేసిన సీన్ చూసి మా పిల్లలు, వదిన, అన్నయ్య గొడవ చేశారు. శివగామి అలా ఎలా నిర్ణయం తీసుకుంటుంది? అని వాదించారు. ఒక మూడువారాలు షూటింగ్ ఆలస్యమైంది కూడా. బాహుబలిని చంపించడం రాజ్యానికి శ్రేయస్కరం అని నమ్మాలి. దాని కోసం మళ్లీ వర్క్ చేసి యిప్పుడున్న వెర్షన్ తీసుకొచ్చాం." అని రాజమౌళి చెప్పారు. సాధారణంగా దర్శకనిర్మాతలు మేం బౌండ్ స్క్రిప్టుతో షూటింగుకి వెళ్లాం అని చెప్తూ వుంటారు. కానీ రాజమౌళి నిజాయితీగా చెప్పారు – ఆ సీనును చిత్రీపట్టవలసి వచ్చింది అని.

నిజానికి కట్టప్ప బాహుబలిని చంపే సీను దర్శకుడిగా గుదిబండగా మారినట్లుంది. రాజమౌళే చెప్పారు – 'మొదటి సినిమా చివర్లో చిన్న ఝలక్‌లా వుండాలని, మొటదటి భాగానికి మంచి ఎండింగ్ వుంటే రెండో దానికి మంచి వెయిటింగ్ వుంటుందని అలా పెట్టాం, యింత ట్రెండ్ అవుతుందని వూహించలేదు' అని. జనాల ఫోకసంతా దానిపై పడేసరికి దాన్ని కన్విన్సింగ్‌గా ఎలా చెప్పాలా అని మల్లగుల్లాలు పడ్డారు. ఆ సీనును మళ్లీ చెక్కి యిప్పుడున్న ప్రకారం పెట్టినా రాజమౌళికి అంత తృప్తిగా లేదు. 'బాహుబలిని చంపడానికి శివగామి ఒప్పుకున్నపుడు ఎక్కువ డ్యూరేషన్ వుండాల్సింది. అలాగే బాహుబలిని చంపమని కట్టప్పతో శివగామి చెబితే అంత సులువుగా ఆయన ఒప్పుకోకూడదు. తల నేలకేసి బాదుకోవటమో, బతిమాలటమో.. యింకా ఏదో జరిగివుండాలి. అలాటి చోట్ల మరింత డ్రామా యాడ్ అవాల్సి వుంది.' అని చెప్పుకున్నారు.

ఈ అసంతృప్తికి కారణమేమిటంటే శివగామి పాత్ర, కట్టప్ప పాత్ర సరిగ్గా రూపొందకపోవడమని నా అభిప్రాయం. మొదటి భాగం చూస్తే శివగామి చాలా ఉదాత్తమైన పాత్రలా కనబడింది. దానికి తోడు బయట పబ్లిసిటీ చూసినా శివగామి అంటే అబ్బో అనిపించేసింది. 'మేం అలసిపోయి, నిరుత్సాహపడినపుడు శివగామి మాటలను గుర్తు చేసుకుని స్ఫూర్తి పొందేవాళ్లం' అని ఓ సారి రాజమౌళి చెప్పారు. అంటే జీవితం గురించి, పోరాటం గురించి ఏవో కోటబుల్ కోట్స్ ఆవిడ చేత చెప్పించారు కాబోలు అనుకున్నాను. బాహుబలి కథను ఒకాయన ఇంగ్లీషులో నవల రాస్తూ దానికి 'ద రైజ్ ఆఫ్ శివగామి' అని పేరు పెట్టారని చదివాను. ఇవన్నీ చూసి రాజమాతగా శివగామిని చాలా ఉన్నతంగా వూహించుకున్నాను. నాకు తెలిసి "రాజమకుటం"లో కన్నాంబ వేసిన రాజమాత పాత్ర అల్టిమేట్. శివగామిని కూడా ఆ లెవెల్లో తీర్చిదిద్దారనుకున్నాను.

కానీ రెండో భాగంలో శివగామిని చూసి కన్‌ఫ్యూజ్ అయిపోయాను. దేవసేనను తన కోడలిగా నిర్ణయించే విషయంలో తొందరపాటు, అహంకారం, మూర?త్వం కనబడ్డాయి. తన కొడుకు చిత్రపటం పంపలేదు, అతని గుణగణాలు వర్ణింపచేసి పెళ్లికూతుర్ని మెప్పించలేదు, పెళ్లి సంబంధాలు కలిపే బ్రాహ్మణుడినో (అశోక్ కుమార్ వేసిన పాత్ర), రాజబంధువులనో పంపలేదు, నగలు పట్టుకెళ్లిన సైనికాధికారితో బాటు పెళ్లికూతురు పల్లకీ ఎక్కి వచ్చేయాలనుకుంది. దేవసేన ఆస్థానానికి వచ్చాక జరిగిన పొరపాటు తెలిసింది. నాలిక కరుచుకోకపోగా తన పొరపాటు ఎత్తి చూపించినందుకు ఆమెపై పగ బట్టింది. ఆమెను చేసుకుంటే రాజువి కాలేవని బాహుబలిని బెదిరించింది. మొదటి భాగం క్లయిమాక్స్‌లో విలన్‌ను భల్లాలుడే చంపినా, 'ప్రజాక్షేమం కోసం ఆలోచించాడు కాబట్టి..' అంటూ బాహుబలికి పట్టం కడతానని చెప్పిన వివేకం అప్పుడేమైందో తెలియదు. వాడు తన మాట వినలేదు, తీసిపారేయ్.. అంతే, ప్రజాక్షేమం, మరోటీ జాన్తానై. ప్రజలు ఎంతమంది చచ్చినా ఫర్వాలేదని అనుకున్న భల్లాలుడికి పట్టం కడతానంది. సింహాసనం ఎక్కబోయే ముందు ప్రజల కష్టనష్టాలు తెలుసుకోవాలంటూ బాహుబలిని దేశాటనపై పంపింది కదా, భల్లాలుడికి ఆ రూలు ఎత్తివేసింది. తన మాట వినని బాహుబలికి బుద్ధి చెప్పాలన్న కసి తప్ప మరేమీ కనబడలేదు.

తనిచ్చిన మాటకు కట్టుబడి బాహుబలి సింహాసనం వదులుకున్నాడు. సైన్యాధిపతి ఉద్యోగం ఆమోదించాడు. స్తన్యమిచ్చి పెంచిన పెంపుడు కొడుకుపై శివగామిలో కొన్ని రోజులకైనా మమత మేలుకొనాలి కదా, తండ్రి కాబోతున్న అతన్ని, గర్భవతి ఐన అతని భార్యను చూడాలనిపించాలి కదా. ('బాహుబలి, భల్లాల దేవుడి మధ్య ఏ సీన్ పెట్టినా బ్రహ్మాండంగా వర్కవుట్ అయ్యేది, పెట్టడానికి కుదరలేదు' అని రాజమౌళి వాపోయారు. అహంకారానికి, మమకారానికి మధ్య శివగామి నలిగే సీన్లు పెట్టి వుంటే యింకా బాగా వర్కవుట్ అయ్యేదని నేను అనుకుంటున్నాను). అదేమీ జరగలేదు. సీమంతం నాడు వచ్చి అక్షింతలు యించుమించుగా విసిరేసి, దేవసేనను రెచ్చగొట్టింది. తన కళ్లెదురుగా భల్లాలుడు బాహుబలి ఉద్యోగం పీకేసినా చూస్తూ వూరుకుంది. బాహుబలి వంటి

బలశాలి, నమ్మకస్తుడు తన కొడుక్కి రక్షణగా వుంటే మంచిదని కూడా ఆమెకు తోచలేదు. గర్భవతి ఐన తన కోడలిపై చెయ్యి వేయబోయాడన్న అభియోగం ఎదుర్కున్న సేనాపతిపై కోపమూ రాలేదు. పెంపుడు కొడుకు, అతని గర్భవతి భార్య కోట బయటకు వెళ్లి సాధారణ మనుష్యుల్లా బతుకుతూంటే వెళ్లి పలకరించాలనీ అనుకోలేదు. బాహుబలిపై చాడీలు వినబడినపుడు వాటి నిజానిజాలు గూఢచారుల ద్వారా తెలుసుకోవాలనుకోలేదు.

పాత జానపద సినిమాల్లో తలతిక్క, అవకతవక రాజుల పాత్రలుండేవి. ఎవరేం చెప్పినా చటుక్కున నమ్మేయడం, అహంభావంతో ప్రతిభావంతులను అనుమానించడం, అవమానించడం వంటి పనులు చేసేవారు. అవి సియస్సార్ వంటి నటులు కాస్త హాస్యాన్ని రంగరించి పోషించేవారు. శివగామిది కూడా అలాటి పాత్రే. అయితే ఆమెను సీరియస్‌గా, దర్పంగా చూపించబోయారు. అది అతకలేదు. మొదటిభాగంలో చూపిన శివగామిని చూసి, బాహుబలిని ఎలా చంపమంటుంది అని రాజమౌళి కుటుంబసభ్యులు ఆశ్చర్యపడి వుండవచ్చు. కానీ రెండో భాగం సాంతం చూసి వుంటే తన మాట చెల్లలేదనే తిక్కకోపంలో ఆమె అలా చెప్పినా చెప్పి వుండవచ్చు అని సర్దుకునేవారు. కాస్త అతిశయోక్తిగా చెప్పాలంటే రెండో భాగంలో శివగామి నీలాంబరి అయిపోయింది.

ఇక కట్టప్ప కారెక్టరులో కూడా కాస్త గందరగోళం వుంది. బాహుబలిని చంపడానికి ఒప్పుకున్నవాడు డైరక్టుగా చంపకుండా తనను తాను గొలుసులతో కట్టేయించుకుని నిప్పుల్లో పడిపోయి డ్రామా అడి బాహుబలిని రప్పించడం దేనికి? కట్టప్ప మహావీరుడు కదా, బాహుబలిని ట్రాప్ చేసి, మోసం చేసి చంపాడని చూపిస్తే అతని కారెక్టరు దిగజారదా? రాజద్రోహ నేరం కింద కట్టప్పను శిక్షిస్తున్నారంటే అది బహిరంగ విచారణ అయి వుంటుంది తప్ప అర్ధరాత్రి ప్రయివేటుగా అమలు కాదన్న ఆలోచన కూడా బాహుబలికి రాలేదు. అక్కడికి వచ్చిపడ్డాడు. హఠాత్తుగా ఎక్కణ్నుంచో ఎవరో గాని వచ్చిపడ్డారు. కాలకేయులేమో అనుకుంటే, 'అబ్బే, కట్టప్పను నమ్మబుద్ధి కాక భల్లాలుడు మారువేషాల్తో పంపిన సైనికులు అయివుంటారు. అక్కడ డైలాగులు చూస్తే అదే తోస్తోంది. వాళ్లే బాణాలతో బాహుబలిని సగం చంపి కట్టప్ప ఒక్క పోటు పొడిస్తే బాహుబలి కూలే సదుపాయం ఏర్పరచారు' అన్నారు ఓ మిత్రులు. కావచ్చు. వచ్చినవాళ్లు ఎవరైనా కానీయండి, బాణసంచా కాల్చి కట్టప్ప బాహుబలిని సిల్‌హౌట్‌లో చంపడానికి ఎఫ్టి బ్యాక్‌డ్రాప్ క్రియేట్ చేసి వెళ్లారు.

కట్టప్ప సింహాసనంపై ఎవరుంటే వారికి విశ్వసనీయుణ్ని అంటాడు. మరి శివగామి మహేంద్ర బాహుబలిని రాజుగా (మాహిష్మతీ పాలకుణ్ని ఓసారి మహారాజు అంటున్నారు, మరోసారి చక్రవర్తి అంటున్నారు, ఎప్పుడేమన్నారో మర్చిపోయాను) ప్రకటించాక కట్టప్ప వెంటనే భల్లాలుణ్ని రాజుగా తిరస్కరించాలి. మహేంద్ర బాహుబలిని కాపాడడానికి ప్రయత్నించాలి. అతని తరఫున రాజమాత 'దేవసేనను కాపాడు' అంది కాబట్టి కనీసం దేవసేననైనా కాపాడాలి. మహేంద్ర బాహుబలి చనిపోయాడనుకుంటే అప్పుడు రాజమాతగా దేవసేన ఆటోమెటిక్‌గా శివగామి స్థానంలోకి వచ్చేస్తుంది. అలాటామెను రాజ్యాధికారం పోగొట్టుకున్న భల్లాలుడు బందీ చేస్తే వూరుకోకూడదు. తిరగబడాలి. పోనీ భల్లాలుణ్ని రాజుగా అంగీకరించాడనుకుంటే మొదటి భాగంలో దేవసేనను తప్పిస్తానని అనడం తప్పు. తిరస్కరించి దేవసేన తన ఆత్మగౌరవాన్ని కాపాడుకుంది.

సినిమా రెండో భాగంలో దేవసేన, అమరేంద్ర బాహుబలి పాత్రలు చాలా బాగా మలిచారు. పాత్రధారులు కూడా అద్భుతంగా చేశారు. దేవసేన పాత్ర ద్వారా పలికించిన సంభాషణలు కూడా చాలా బాగున్నాయి. మాహిష్మతీ రాజ్యం గొప్పేమిటి అని దేవసేన అడగడం నాకూ నచ్చింది. పెద్దపెద్ద విగ్రహాలు పెట్టుకున్నంత మాత్రాన గొప్పవాళ్లయిపోతారా? ఏకపక్షంగా వ్యవహరించే యీ రాజ్యం ఎందులో గొప్ప? అని ప్రేక్షకుడి మనసులో మాట దేవసేన పలికింది. 'నా మాటే శాసనం' అంటూ శివగామి చలాయించిన నియంతృత్వమే అన్ని అనర్థాలకు కారణమైంది. ఇలాటి మాహిష్మతీ రాజ్యం గురించి బాహుబలి 'జై మాహిష్మతి' అని ఎందుకంటాడో తెలియదు. చివర్లో చిన్న బాహుబలి చేత కూడా 'నా మాటే శాసనం' అనిపించారు. మరో ఏకపక్ష పాలన షురూ అన్నమాట!

రెండో భాగం మొదటి భాగం కంటె చాలా విషయాల్లో మెరుగ్గా వుంది. కొన్ని చోట్ల ఎమోషన్స్ పండాయి. నా ఉద్దేశంలో 20% ఎక్కువ మార్కులు వేయవచ్చు. రెండింటిని కలిపి కథ సరిసమానంగా సర్ది వుంటే బాగుండేది. యుద్ధాలు తగ్గించి రెండు యింటర్వెల్స్‌తో 18 రీళ్ల సినిమా తీసి వుంటే చక్కగా వుండేది. స్క్రిప్ట్ రాసుకున్నపుడు చాలా డ్రమటిక్ సీన్లు వున్నాయట. కానీ వాటిని సినిమాలో పెట్టేందుకు కుదరలేదని రాజమౌళి చెప్పారు. దాంతో అనేక సీన్లు ఫాస్ట్‌ఫాస్ట్‌గా వెళ్లిపోయాయని ఆయనే ఒప్పుకున్నారు. నాకూ అదే అనిపించింది. మొదటి భాగం తాపీ, రెండో భాగం ఆదుర్దాలా తోచింది. రెండో భాగంలో ప్రధానమైన ట్విస్టు శివగామి పంపిన సందేశం వలన ఏర్పడిన కమ్యూనికేషన్ గ్యాప్! సందేశం పంపినపుడు మా అబ్బాయికి చేసుకుందా మనుకుంటున్నాం అని చెప్పి వూరుకుంటారా? 'మా వాడు వీరుడు, శూరుడు, ఘనమైన మాహిష్మతీ రాజ్యానికి సర్వసైన్యాధ్యక్షుడు..' అంటూ బిరుదులతో సహా పేరు చెప్పరా? ఎంత అందగాడో చూడండి అంటూ ఓ చిత్రపటం పంపరా? 40, 50 ఏళ్ల క్రితం అరవ సినిమాల్లో యిలాటి ట్విస్టులే పెట్టేవారు. ఇంటి పక్కాయన వచ్చి అగ్గిపెట్టె అడుగుతూంటే, సంభాషణలో 'మీరడిగింది తప్పకుండా యిస్తాను' అనే ఒక్క వాక్యం మాత్రం చాటుగా కిటికీలోంచి విని అపార్థం చేసుకుని, భార్యను అనుమానించి యిల్లు వదిలి వెళ్లిపోయే హీరోలుండేవారు. ఆ తర్వాత ముస్లిము సోషల్స్‌లో హీరోయిన్ వేసుకున్న బురఖా వలన జరిగే కన్‌ఫ్యూజన్లు చూపించేవారు. బురఖా కారణంగా ఒకరనుకుని మరొకర్ని పెళ్లి చేసుకోవడం, ఆ తర్వాత చింతించడం వుండేది. సినిమాలకు యింత వయసు వచ్చాక, బాహుబలి వంటి పెద్ద ప్రాజెక్టులో పెళ్లికొడుకు పేరు చెప్పకపోవడం అనే చిన్న అంశంపై మొత్తం డ్రామా ఆధారపడడం వింతగా వుంది.

నా అనుమానం – విజువల్‌గా బాగుంటాయని కొన్ని సీన్లు ముందుగానే అనుకుని, వాటి చుట్టూ సంఘటనలు అల్లి, ఆ డాట్స్ కలిపి కథ అల్లారని. దాంతో కొన్ని పాత్రలకు అన్యాయం జరిగింది. అలాటి వాటిల్లో భల్లాలదేవుడి కొడుకు పాత్ర ఒకటి. అతను లేకపోయినా నష్టమేముందనిపించింది. అలాగే అవంతిక పాత్ర రెండో భాగంలో జూనియర్ ఆర్టిస్టు కంటె కనాకష్టంగా అయిపోయింది. ధీరోచితంగా మూడేసి బాణాలు ఒక్కసారి వేసిన దేవసేన క్లయిమాక్స్‌లో నిస్సహాయురాలిగా రథంలో పడివుండడమూ చిత్రంగా వుంది. కనీసం పెనుగులాడి వుండాల్సింది. నెత్తిమీద నిప్పుల కుంపటి వ్రతం విషయానికి వస్తే శివగామి చాలా దూరం నడిచినట్లు చూపారు. దేవసేనకు వచ్చేసరికి కోటలోనే అక్కడక్కడే తిరిగినట్లు చూపారు. అంటే ఆ గుడి ఏదో దగ్గరకు వచ్చేసిందా? ఆ నిప్పులను హోమగుండంలో బదులు తనను బందీగా వుంచిన గోతిలో పోసిందా? అర్థం కాలేదు. బాహుబలి ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించబడుతూ వేల కోట్లు సంపాదిస్తోంది. చూడడానికి భారీగా, అందంగా వుంది. తీసినవాడు తెలుగువాడే. అయినా కథ, సీన్లు విషయంలో ఒక సగటు ప్రేక్షకుడిగా నాకు అసంతృప్తి వుంది. చిత్రాన్ని రూపొందించిన రాజమౌళికీ వుంది. ఆ విషయాన్ని బయటకు చెప్పిన ఆయన నిజాయితీ అభినందనీయం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**జూన్ 05-06** **ఎమ్బీయస్ : ముమ్మారు తలాకుల పద్ధతి ముగుస్తుందా?**

మూడుసార్లు తలాక్‌లు చెప్పి భార్యను వదిలించుకోవడం ఇన్నాళ్లూ భారతీయ ముస్లిము భర్తల హక్కుగా చలామణీ అవుతూ వచ్చింది. ఆ హక్కును కొంతమంది ఉపయోగించుకోలేదు, మరి కొంతమంది జాగ్రత్తగా ఉపయోగించుకున్నారు, కానీ కొందరైనా దాన్ని దురుపయోగం చేశారన్న మాట వాస్తవం. కురాన్, దైవం గురించి చర్చలతో సరిపెట్టకుండా సాంఘిక నియమాలను కూడా ఏర్పరచింది. అది ఆనాటి అరబ్బు సమాజంలో అభ్యుదయవాదం కిందే లెక్క. కానీ కాలం మారుతూ వచ్చింది. అరేబియాకు భిన్నమైన సంస్కృతులున్న దేశాలకు కూడా ఇస్లాము వ్యాపించింది. అందువలన స్థానిక దేశకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కురాన్ స్మృతిలో మార్పులు, చేర్పులు చేసుకోవాలి, కొన్ని దేశాల్లో చేసుకున్నారు కూడా. పరాశర స్మృతి, మను స్మృతి యిలా మన దేశంలోనూ అనేక స్మృతులున్నాయి. వాటిని యిప్పుడు యథాతథంగా అమలు చేయాలంటే కుదరని పరిస్థితి. అలాగే షరియాను కూడా కాలానుగుణంగా అన్వయించే ప్రక్రియ సాగాలి. ఏ మతాన్ని సంస్కరించాలన్నా ఆ మతస్తులే ఆడా, మగా అందరూ కలిసి పూనుకోవాలి. విద్య నేర్చి ఆధునిక పోకడలు అవగతం చేసుకున్నవారు, సంప్రదాయానికి కట్టుబడ్డవారు అందరూ కూచుని చర్చించుకుని ఒక మధ్యేమార్గానికి అంగీకరించాలి. హిందూమతానికి వస్తే సంప్రదాయ పద్ధతులకు రక్షణగా బ్రాహ్మణ వ్యవస్థ నిలిచింది. దానికి కాపుగా క్షత్రియులు నిలిచారు. అయితే బ్రాహ్మణక్షత్రియులలోనే కొందరు పాత పద్ధతులను నిరసించారు. సంస్కర్తలుగా మారి ఛాందసులతో పోరాడారు. మార్పులు తెచ్చారు. అనేక యితర కులాల వారిలో కూడా సంస్కర్తలున్నారు. కానీ అగ్రకులాల సంస్కర్తలు సమాజాన్ని ప్రభావితం చేసినట్లుగా యితరులు చేయలేరన్నది వాస్తవం. ఏ మతంలోనైనా సరే, ముందువరుసలో నిలిచినవారు పూనుకుంటేనే పెనుమార్పులు వస్తాయి.

అదే విధంగా యితర ముస్లిము దేశాల్లో కూడా జరిగింది. భారత ముస్లిము సమాజంలో కూడా కాలగతిలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఛాందసవాదం వెనకబడింది. అయినా యితర మతస్తులతో పోలిస్తే మార్పు వేగం తక్కువనే చెప్పాలి. ముల్లాలు తమ పట్టు సడలిపోకుండా చూసుకుంటున్నారు. ముస్లిములలో ఉన్నత, మధ్యతరగతి ఉదారవాద ముస్లిముల కంటె సంఖ్యాపరంగా ఎక్కువగా వున్న దిగువ మధ్యతరగతి, పేద ముస్లిములు ముల్లాల ఉక్కు పిడికిలి నుంచి బయట పడలేకపోవడంతో ఉదారవాద ముస్లిములకు సంస్కరణలు చేపట్టడానికి శక్తియుక్తులు చాలటం లేదు. దీనికి తోడు ముస్లిములు గంపగుత్తగా ఓటు వేస్తారనే భావనతో, వారిని ఓటు బ్యాంకులుగా చూసే రాజకీయ పార్టీలు ముస్లిము సమాజానికి ద్రోహం చేస్తున్నాయి. 'ఏ వర్గంలోనైనా పేదవారే మూకుమ్మడిగా ఓటు వేస్తారు. పేద ముస్లిములు ముల్లాలు చెప్పినట్లు వింటారు. అందువలన ముల్లాలను సంతృప్తి పరిస్తే చాలు' యిదీ పార్టీలు వేసుకునే లెక్క. పేదరికం తగ్గిన కొద్దీ మతమౌఢ్యం తగ్గుతుంది. ముస్లిముల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిస్తే వారే కాదు, భారతీయ సమాజం కూడా ఎదుర్కుంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

దురదృష్టవశాత్తూ ఆ పని జరగటం లేదు. వాళ్లకు రిజర్వేషన్లు యిస్తాం, మదరసాల్లో మతపాఠాలు చెప్పే వారిని ప్రభుత్వ టీచర్లుగా గుర్తిస్తాం, ఉర్దూ స్కూళ్లు తెరుస్తాం (భాషకూ, మతానికి సంబంధం ఏమిటో వారికే తెలియాలి), ప్రభుత్వధనంతో హజ్‌కు పంపిస్తాం.. యిలాటి తాయిలాలు చూపిస్తారు కానీ వారి అసలు సమస్య ఏమిటో అది పరిష్కరించరు. కొన్ని వర్గాలు నడిపే ప్రయివేటు రంగ సంస్థల్లో ముస్లిములకు ఉద్యోగాలు కరువు. వారివే అధికాంశం కంపెనీలు. చాలామంది ముస్లిములు చిన్నా, చితకా ఉద్యోగాలు లేదా వ్యాపారాలు చేసుకుని బతకవలసి వస్తోంది. దాని కారణంగా వారి కుటుంబాలలో విద్యాబుద్ధులు తక్కువ, అభ్యుదయ భావాలు తక్కువ, ఆధునిక ఆలోచనా ధోరణులు తక్కువ. చీప్ లేబర్‌కు కేరాఫ్ ఎడ్రసుగా మారిన యీ ముస్లిం కుటుంబాలలో యువకులు తీవ్రవాదానికి ముడిసరుకుగా మారుతున్నారు. కొంత అభివృద్ధి చెందినవాడు కాస్త వెనకేసుకుని దాన్ని కాపాడుకోవడానికి శాంతిభద్రతలు వుండాలని కోరుకుంటాడు, దానికై పాటు పడతాడు. ఏమీ లేనివాడికి తెగింపు ఎక్కువ. కడుపు మండుతుంటే ఏ పని చేయడానికైనా సిద్ధపడతాడు. అందుకే శాంతి, అభివృద్ధి అవిభక్త కవలలు. పేదలు, దళితులు, మైనారిటీలు.. ఏ వర్గానికైనా సరే,

అభివృద్ధి ఫలాలు అందచేయకుండా శాంతంగా వుండమంటే పొసగదు. చిత్తశుద్ధితో బృహత్ప్రయత్నం చేస్తే తప్ప భారతీయ ముస్లింల స్థితిగతులు బాగుపడవు. అప్పటివరకు భారతీయ సమాజమూ స్థిమితంగా వుండలేదు.

మతఛాందసత్వానికి పేద ముస్లిములు బలి అవుతూంటే మరో పక్క కొందరు ధనిక ముస్లిములు ఆ ఛాందసత్వాన్ని తమ కనుకూలంగా మలచుకుంటున్నారు. తమ చిత్తానుసారం ప్రవర్తించడం, అదేమని సభ్యసమాజం అడిగితే యిది మా మతానికి సంబంధించిన విషయమని, యితరులు జోక్యం చేసుకోకూడదనీ దబాయించడం. దురదృష్టకరమైన విషయమేమిటంటే మత పెద్దలు వారిని వెనకేసుకుని వస్తున్నారు. ముస్లిము మహిళల విషయంలో చాలా అన్యాయాలు జరుగుతున్నాయి. వారు గొంతెత్తి నిరసన తెలిపినపుడల్లా అణచి వేయడానికి యీ మతపెద్దలు నడుం బిగిస్తున్నారు. జనాభాలో 50% మంది మహిళలే అయినా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డులో మహిళా సభ్యులు 10% మాత్రమే వున్నారు.  దానిలో సభ్యత్వం కోసం ప్రయత్నించి విఫలమై, వేసారిన షాయిస్తా అంబర్ అనే మహిళ ఆల్ ఇండియా ముస్లిము విమెన్ పర్సనల్ లా బోర్డు అని ఒకటి స్థాపించింది. ఆమె పోరాడిన కేసుల్లో ఇమ్రానా కేసు ఒకటి. ఇమ్రానాను ఆమె మావగారే చెరిచాడు. 'ఆయన చెరిచాడని నువ్వు ఒప్పుకున్నావు కాబట్టి యిప్పుడు ఆయనే నీ మొగుడు, నీ మొగుడు నీ కొడుకు' అని మౌలానాలు తీర్పు యిచ్చారు.  ఇమ్రానా లబోదిబోమంటూ కోర్టు తలుపులు తట్టింది. ముస్లిము మహిళా సంఘాలు ఆమెకు అండగా నిలిచాయి. కోర్టు మౌలానాల ఫత్వాను తిరస్కరించింది. 'మా పర్సనల్ చట్టాలను స్థిరీకరించాలి. (కోడిఫై చేయాలి). లేకపోతే యిలాటి ఫత్వాలే వస్తాయి.' అంటుంది షాయిస్తా. .

మార్పు కోసం పోరాడుతున్న అటువంటి మహిళా ఉద్యమకారులందరూ ఆమె సారథ్యంలో యిప్పుడు ముస్లిము మహిళా సంఘాలు ముమ్మారు తలాక్ (తలాక్ ఎ బిదాత్- ఇన్‌స్టంట్ డైవోర్స్)పద్ధతిని రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టుకి వెళ్లిన షయారా బానోకు అండగా నిలిచారు. వారు ఎత్తి చూపేది ఏమిటంటే అఫ్గనిస్తాన్‌తో సహా 20 ముస్లిము దేశాల్లో తలాక్ విధానాన్ని సంస్కరించారు. మూడుసార్లు గబగబా తలాక్ అని చెప్పేసి 'నీకూ నాకూ సంబంధం లేదు, విడాకులిచ్చేశాను ఫో' అనే పద్ధతి కురాన్‌లో కూడా లేదట. భార్యాభర్తల మధ్య తగాదా వచ్చినపుడు ఎవరైనా వచ్చి మధ్యవర్తిగా సంప్రదింపులు చేయాలి. కోపతాపాలు తగ్గి వివేకంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవడానికై 90 రోజుల గడువు యిచ్చారు. ఈ 90 రోజుల్లో భర్త ఒక్కోసారి తలాక్ అనవచ్చు. మొత్తం మూడు సార్లు అలా అంటే యిక వారిద్దరి మధ్య పొసగదని నిర్ధారణ జరిగి, విడాకులు అయినట్లే పరిగణించాలి. ఈజిప్టు, ఇరాక్, ఇండోనేసియా, యుఎఇ వంటి దేశాల్లో మూడుసార్లు తలాక్ అని వరుసగా అన్నా అది ఒక్కసారి అన్నట్టే లెక్క. కావాలంటే దాన్ని వెనక్కి తీసుకోవచ్చు. 98% ముస్లిము జనాభా వున్న అల్జీరియాలో రాజీ ప్రయత్నాలు విఫలమయ్యాక కోర్టు ద్వారా మాత్రమే విడాకులు తీసుకోవాలి. అంతే శాతం ముస్లిము జనాభా వున్న ట్యునీసియాలో కూడా కోర్టు అనుమతిస్తే తప్ప విడాకులు యిచ్చినట్టు కాదు. 96% వున్న టర్కీ 1926లో స్విజర్లండ్ చట్టాలనుసరించి షరియా సూత్రాలను అనేక వాటిని మార్చేసింది. అంతే జనాభా వున్న పాకిస్తాన్ 1961 లో ముస్లిము ఫ్యామిలీ లా ఆర్డినెన్స్ తెచ్చి వైవాహిక చట్టాలు అనేకం మార్చి, ముమ్మారు తలాక్‌ను చట్టవిరుద్ధం చేసింది. 86% జనాభా వున్న బంగ్లాదేశ్ 1961 ఉమ్మడి పాకిస్తాన్ చట్టాన్నే కొనసాగిస్తోంది.

మరి మన దేశంలో పరిస్థితి ఎలా వుంది? ప్రపంచంలో ముస్లిము అత్యధికంగా నివసించే దేశాల్లో మూడో స్థానం మనది. ముస్లిము మహిళల సంఖ్య 9 కోట్లు. 2011 జనాభా లెక్కల ప్రకారం వివాహితులైన ముస్లిము మహిళల్లో 13.5% మందికి 15 ఏళ్ల కంటె తక్కువ వయసులో పెళ్లయింది. 49% మందికి 14-19 ఏళ్ల మధ్య పెళ్లయింది. అంత చిన్న వయసులో పెళ్లి కావడం చేత వారిలో విద్యావంతులు తక్కువగా వుండి, తమ హక్కుల గురించి ఎలా అడగాలో కూడా తెలియటం లేదు. కొందరు ముస్లిము భర్తలు తలాక్‌ను ఒక వెక్కిరింతగా మార్చేసి, తమ వివాహబంధం మరుక్షణంలో ఉంటుందో, ఊడుతుందో తెలియని పరిస్థితిలోకి తమ భార్యలను నెట్టారు. ఓ భర్త ఆలస్యంగా ఆఫీసు నుంచి తిరిగి వచ్చాడు. భార్య నిద్రపోతోంది. తను వచ్చినా నిద్రలేవని భార్య కేసి చూసి కోపంతో మూడు సార్లు తలాక్ చెప్పేశాడు. మర్నాడు అత్తగారు నిద్ర లేపి 'మీ ఆయన తలాక్ చెప్పేశాడు, మూటా ముల్లె సర్దుకుని బయలుదేరు' అని చెప్పింది. ఒకామెకు గర్భం వచ్చింది. భర్త అబార్షన్ చేయించుకో అన్నాడు. ఈమె ఒప్పుకోలేదు. అంతే తలాక్ చెప్పేశాడు. 2015లో కేరళలో ఒకడు పెళ్లి చేసుకుని పది రోజులు కాపురం చేసి పెళ్లానికి చెప్పకుండా దుబాయి వెళ్లిపోయాడు. అక్కణ్నుంచి ఓ ఎస్సెమ్మెస్ కొట్టాడు, 'తలాక్, తలాక్, తలాక్' అని. ఈ మధ్య వాట్సప్ ద్వారా తలాక్‌లు చెప్పేస్తున్నారు. ఇటీవలే హైదరాబాదుకి చెందిన యిద్దరు వనితలకు వాట్సప్‌ల ద్వారానే విడాకులు అందాయి. మనిద్దరికి ఫలానా విషయంలో పడటం లేదని చెప్పడం లేదు, రాజీ ప్రయత్నాలు లేవు, ఇందుకోసం విడాకులు యిస్తున్నానని ఎదుట పడి చెప్పడం లేదు, వాట్సప్ పంపేయడం, చేతులు దులిపేసుకోవడం. ఏమైనా అంటే నాకా హక్కు కురాన్ యిచ్చిందని వాదించడం.  భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ వారు చేసిన సర్వేలో  విడాకుల్లో కూడా 66% మందికి కేవలం నోటిమాట ద్వారా విడాకులు పొందినవారే. పైగా విడాకులివ్వబడిన మహిళల్లో 95% మందికి భర్తల నుంచి మనోవర్తి రావటం లేదు.

ఇప్పుడు దీనికంతటికీ ఫుల్‌స్టాపు పడుతుందా లేదా అన్నదే ఆసక్తి కలిగించే అంశం. సుప్రీం కోర్టు దీని విషయమై గట్టిగా పరిశీలిస్తోంది. దీన్ని వారి సమ్ముఖానికి తీసుకెళ్లిన ధైర్యశాలి - షయారా బానో. ఉత్తరాఖండ్ వాసి. కుమావూ యూనివర్శిటీలో సోషియాలజీలో పోస్టు గ్రాజువేషన్ చేసింది. 21 ఏళ్ల వయసులో ఇలాహాబాద్‌లో రిజ్వాన్ అహ్మద్ అనే ఒక ప్రాపర్టీ డీలర్‌తో పెళ్లయింది. పెళ్లయాక కారు యివ్వకపోతే విడాకులు యిస్తామని బెదిరించారట. పెళ్లయిన ఏడాది దాకా పిల్లలు పుట్టకపోతే

అత్తగారు తలాకులు చెప్పించేస్తాను జాగ్రత్త అని బెదిరించిందిట. అది జరగకుండానే యీమె కడుపు పండింది. ఒక అమ్మాయి పుట్టింది. వయసు 13. తర్వాత పుట్టిన అబ్బాయి వయసు 11. ఆ తర్వాత ఆరుసార్లు భర్త అబార్షన్లు చేయించాడు. కుటుంబ నియంత్రణ మాత్రలు వాడనిచ్చేవాడు కాదు. ఈమె బాగా జబ్బు పడిపోయింది. 2015 ఏప్రిల్‌లో ఓ రోజు యీమెను తీసుకెళ్లి మొరాదాబాద్ రైల్వే స్టేషన్‌లో పడేసి, అత్తమావలకు ఫోన్ కొట్టాడు, వచ్చి తీసుకుపొండి అని. పిల్లల్ని తన దగ్గరే వుంచేసుకున్నాడు. ఆ తర్వాత ఆర్నెల్లకు స్పీడు పోస్టులో తలాక్‌నామా పంపేశాడు. ఇంకో ఆమెను పెళ్లి చేసుకున్నాడు.

ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్‌లో ఫ్యామిలీ కోర్టుకి వెళ్లి యీమె ఫిర్యాదు చేసింది. వాళ్లు రిజ్వాన్‌ను పిల్లలతో సహా కోర్టుకి రమ్మనమన్నారు. అతను రాలేదు. ఈమె సుప్రీంకోర్టులో పిటిషన్ పడేసింది. నూర్జహాన్ సాఫియా నియాజ్ స్థాపించిన భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ సంస్థ ఆమెకు అండగా నిలిచింది. వీళ్లంతా కలిసి ముల్లాలను 'మీరు చెప్పే సూత్రాలకు కురాన్‌లో ఆధారాలు చూపండి' అని నిలదీస్తున్నారు. తలాక్ విషయం ఒక్కటే కాదు, బహుభార్యాత్వం, వారసత్వం, మెహర్, పిల్లల సంరక్షణ వంటి విషయాల్లో కూడా మార్పు రావాలంటున్నారు. తలాక్ కేసు తేలితే 'నికా హలాలా' అనే పద్ధతిపై కూడా పోట్లాడదామని చూస్తున్నారు. అదేమిటంటే – విడిపోయిన భార్యను మళ్లీ పెళ్లి చేసుకుందామని భర్త అనుకుంటే ఎకాయెకి పెళ్లి చేసుకోలేడు. ఆమె వేరే ఎవరినైనా పెళ్లి చేసుకుని, కాపురం చేసి, అతనికి విడాకులు యిచ్చిన తర్వాతనే మళ్లీ యితన్ని చేసుకోవాలి. ఆ రోజుల్లో ఎందుకు పెట్టారో తెలియదు కానీ యిప్పుడీ పద్ధతి వింతగా అనిపిస్తుంది. దీనిపై సినిమాలు కూడా వచ్చాయి. (ఫోటో – ముస్లిం పర్శనల్ బోర్డు అధ్యక్షుడు సయ్యద్ మొహమ్మద్ రబీ హసానీ నద్వీ)

షయారా బానో కేసులో ఆమె భర్తతో బాటు ముస్లిం పర్శనల్ బోర్డు కలగజేసుకుని "మా ముస్లిముల పెళ్లి, విడాకులు వగైరా మా పర్శనల్ లా ప్రకారం జరుగుతాయి. మా పర్శనల్ లా న్యాయపరిధిలోకి రాదు. దానిలో జోక్యం చేసుకోకండి." అని సుప్రీం కోర్టుతో వాదించింది. న్యాయపరిధిలోకి వస్తుందని కోర్టులు ఎప్పుడో అభిప్రాయ పడ్డాయి. 2008లో ఢిల్లీ హై కోర్టు జడ్జ్ బి.డి. అహ్మద్ ముమ్మారు తలాక్ పద్ధతి పాపిష్టి పని అని రూలింగ్ యిచ్చారు. "ముస్లిములలో ఏ పంథా కూడా దాన్ని ఆమోదించదు. చరిత్రలో ఒకానొక ఘట్టంలో అది అమలులోకి వచ్చింది. దాన్ని తీసి అవతల పారేస్తే ఇస్లాం మౌలిక సూత్రాలకు ఏ మాత్రం భంగకరం కాదు." అన్నారాయన. ఇలాహాబాద్ హైకోర్టు యీ ఏప్రిల్‌లో తీర్పు చెపుతూ ఏ పర్శనల్ లా అయినా రాజ్యాంగం, చట్టం పరిధిలోనే పనిచేయాలని చెప్పింది. ఈ తలాక్ విధానం వ్యక్తి స్వేచ్ఛకు భంగకరం అని చెప్పింది. కొందరు ముస్లిం మతపెద్దలు దీన్ని వ్యతిరేకించారు.

సుప్రీం కోర్టు మాజీ జజ్ కెటి థామస్ కేరళ హైకోర్టులో పనిచేసే రోజుల్లో నేతృత్వం వహించిన బెంచ్ ఒక కేసులో కీలకమైన తీర్పు చెప్పింది. దాని ప్రకారం చర్చికి యిద్దరి మధ్య పెళ్లి నిర్వహించే హక్కు వుంది. ఒకసారి పెళ్లయ్యాక భార్య, భర్త యిద్దరికీ రాజ్యాంగం యిచ్చిన చట్టబద్ధమైన హక్కులుంటాయి. వాటిని చర్చి హరింపజాలదు. ఈ తీర్పును సుప్రీం కోర్టు కూడా ధృవపరిచింది. దాన్ని యీ తలాక్ కేసుకు అన్వయిస్తే ఒక వివాహితురాలిగా షయారా బానో హక్కులను ఏ మతాచారమూ హరించలేదు. మహిళా హక్కుల ఉద్యమనేత, ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యురాలు, లఖనవ్‌లో కాజీగా పనిచేసిన తొలి మహిళ అయిన సయీదా హమీద్ "2002లోనే షామీన్ ఆరా వెర్సస్ స్టేట్ ఆఫ్ యుపి కేసులో ఆర్ సి లహోటీ, పి వెంకట్రామరెడ్డి అనే సుప్రీం కోర్టు జజ్‌లు ఒకేసారి ముమ్మారు తలాక్ చెప్పడం చట్టబద్ధం కాదని, కురాన్ నిర్దేశించిన ప్రకారం తలాక్ చెప్పాలని రూలింగ్ యిచ్చారు. ముస్లిం పర్శనల్ లా బోర్డు దాన్ని వ్యతిరేకించలేదని నాకు గుర్తు. 2002లోనే బొంబాయి హైకోర్టు వారి ఔరంగాబాద్ బెంచ్ కూడా దగ్డూ పఠాన్ వెర్సస్ రహీమ్ బీ కేసులో కూడా ముమ్మారు తలాక్‌ను కొట్టివేసింది. ఇప్పుడు మళ్లీ దీనిపై చర్చేమిటో నాకు అర్థం కావటం లేదు." అన్నారు.

ముస్లిమ్ పర్శనల్ లా బోర్డు ఉపాధ్యక్షుడు, జమాత్ ఏ ఇస్లామీ హింద్ అధినేత అయిన మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ ఉమారీ "తలాక్ యివ్వడానికి వీల్లేదని భర్తలను నిర్బంధిస్తే భార్యలను వదుల్చుకోవడానికి భర్తలు క్రూరమైన పద్ధతులు అవలంబిస్తారు. వారిని సజీవంగా కాల్చేయవచ్చు, చంపేయవచ్చు, వారితో సంసారం చేయమని బెదిరించవచ్చు." అన్నాడు. ఎంత చిత్రమైన వాదనో చూడండి. కాపురం సరిగ్గా నడవకపోతే విడాకులు యివ్వవద్దని ఎవరూ చెప్పరు. ఎటొచ్చీ కాస్త సవ్యంగా యివ్వమనే ఎవరైనా అడిగేది. కురాన్ ప్రకారం 'ఖులా' పద్ధతిలో భార్య కూడా వివాహాన్ని విముక్తి కోరవచ్చు. అయితే మధ్యలో ఒక మతగురువుని మధ్యవర్తిగా పెట్టుకుని ఆ పని చేయాలి. భర్త విషయంలో మాత్రం అటువంటి నిబంధన పెట్టలేదు. అదీ చిక్కు. వివాహమన్నది యిద్దరు వ్యక్తుల మధ్య ఒప్పందం అనుకుంటే దాన్ని భంగం చేసే హక్కు యిద్దరికీ సమానంగా వుండాలి. కానీ ముస్లిము భర్తకు ఏకపక్షంగా హక్కు యివ్వడం జరిగింది.

'తలాక్ ఎ బిదాత్, బహుభార్యాత్వం, నికా హలాలాలు చట్టవిరుద్ధమైనవి, రాజ్యాంగవిరుద్ధమైనవి. ఎందుకంటే అవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15, 21, 26ల ద్వారా సంక్రమించిన మౌలిక హక్కులను హరిస్తున్నాయి. అందుకని రద్దు చేయాలి' అని షయారా బానో వాదన. 'మమ్మల్ని శాసించేది ముస్లిము పర్శనల్ లా మాత్రమే. దాని ప్రకారం యివన్నీ చెల్లుతాయి' అని షయారా భర్త వాదన. మతస్వేచ్ఛ అనేది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడే వుంటుందని రాజ్యాంగం లోని 25వ ఆర్టికల్ చెపుతుంది. ఆర్టికల్ 14 అందరికి సమాన హక్కులను యిస్తుంది. ముమ్మారు తలాక్ విషయంలో స్త్రీపురుషుల మధ్య వ్యత్యాసం వుంది. ఆర్టికల్ 15 (1) ప్రకారం పౌరుల మధ్య మత, జాతి, కుల, లింగ వివక్షత చూపకూడదు. దీని విషయంలో స్త్రీల పట్ల వివక్షత కనబడుతోంది. ఈ అంశాలపై నిర్ణయించడానికి సుప్రీం కోర్టు ఐదుగురు జజ్‌లతో ఒక రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. దానిలో చీఫ్ జస్టిస్

ఖేహర్ సిఖ్. యితర జస్టిస్‌లలో లలిత్ హిందూ, కురియన్ జోసెఫ్ క్రైస్తవుడు, నారిమన్ పార్శీ, అబ్దుల్ నజీర్ ముస్లిం. ముమ్మారు తలాక్ ఇస్లామ్‌కు మౌలికమైనదా (ఫండమెంటల్) కాదా అని, మౌలికమైనదైతే కోర్టు దీనిలో కలగచేసుకోవచ్చా లేదా, ఆ ఆనవాయితీకి పవిత్రత వుందా, వుంటే అది యితరులకు రాజ్యాంగపు ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందా అనే విషయాలు పరిశీలిస్తుంది. ఈ బెంచ్ వేసవి సెలవుల్లో కూడా పనిచేసి మే 18 వరకు యిరుపక్షాల వాదనలూ వింది. తీర్పు రిజర్వ్ చేసింది.

'ముమ్మారు తలాక్ సంప్రదాయం చట్టవ్యతిరేకం, రాజ్యాంగవిరుద్ధం' అని త్వరలోనే సుప్రీం కోర్టు తీర్పు యిచ్చినా అది అమలవుతుందా లేదా అన్న సందేహం రావడంలో ఆశ్చర్యం లేదు. 'నా భర్తకు బాగా డబ్బున్న నాకిస్తానన్న మనోవర్తి యివ్వటం లేదు. దయచేసి యిప్పించండి' అని షా బానో అనే మహిళ 1985లో సుప్రీం కోర్టుకి వెళితే పెళ్లింది. ఆమె భర్తకు అనేకమంది భార్యలు. వాళ్ల వలన పుట్టిన సంతానం మధ్య ఆస్తి తగాదాల్లో దృఢంగా మాట్లాడిందన్న కోపంతో 40 ఏళ్ల కాపురాన్ని ఒక్క నిమిషంలో మూడు తలాకులు చెప్పి ముగించేశాడు ఆమె భర్త. పైగా మనోవర్తి యివ్వడం మానేశాడు. అది సిపి 125 ప్రకారం నేరం. అది ఎత్తిచూపితే ఆమె భర్త "నేనూ, మా ఆవిడా ముస్లిములం. మా పర్శనల్ లా ప్రకారం మూణ్నెళ్ల కాలం (ఇద్దత్) తర్వాత మనోవర్తి యివ్వనక్కరలేదు. పెళ్లినాడు యిచ్చిన కానుక (మెహర్) తిరిగి యిచ్చేయాలి. అది యిచ్చేశాను. ఇక నాకే బాధ్యత లేదు." అని వాదించాడు. ముస్లిం పర్శనల్ బోర్డు కేసులో భాగస్వామిగా మారి (ఇంప్లీడ్) 'సిపిసి 125 ముస్లిం పర్శనల్ లాను అధిగమించజాలదు (ఓవర్‌రైడ్)' అని వాదించింది. కోర్టు షా బానో పక్షానే తీర్పు చెప్పింది. వివాహం పర్శనల్ లా ప్రకారం జరిగినా మనోవర్తి రాజ్యాంగానికి లోబడే వుంటుందని స్పష్టం చేసింది. అందువలన భర్త మనోవర్తి ఆపడానికి వీల్లేదని చెప్పింది.

వెంటనే ముస్లిం మతపెద్దలు యిది తమ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే అంటూ అల్లరి పెట్టారు. షా బానోకు వ్యతిరేకంగా వీధుల్లో ప్రదర్శనలు నిర్వహిస్తే లక్షలాది ముస్లిములు వాటికి హాజరయ్యారు. షా బానోకు అనుకూలంగా హాజరైనవారు వందల్లో వున్నారు. ఇది చూసి అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ కంగారు పడ్డాడు. మొదట్లో అతను సుప్రీం కోర్టు తీర్పును హర్షించాడు. పార్లమెంటులో దానిపై చర్చ జరిగినపుడు ఉదారవాద ముస్లిము ఐన ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ చేత తీర్పును వ్యతిరేకించినవారిపై దాడి చేయించాడు. కానీ యీ ప్రదర్శనలు చూసి, మెజారిటీ ముస్లిముల ఫీలింగ్సు చూసి కంగారు పడ్డాడు. ముస్లిము ఓటర్లకు కోపం వచ్చేస్తుందని భయపడి సుప్రీం కోర్టు రూలింగు చెల్లకుండా 1986లో చట్టం చేశాడు. ముస్లింలను ఆ విధంగా సంతృప్తి పరచినందుకు బదులుగా హిందువులను సంతృప్తి పరచడానికి అంటూ రామజన్మభూమిని తెరిపించాడు. అది క్రమేపీ అనేక వివాదాలకు దారి తీసింది. మాటల్లో, ఆలోచనల్లో పాశ్చాత్య నాగరికతకు పెద్దపీట వేసిన రాజీవ్ చేతల్లో మాత్రం అత్యంత హేయమైన మతఛాందసవాదానికి తెరతీసి, రెండు తప్పులు చేశాడు. వాటి ఫలితాలు 30 ఏళ్లు దాటినా అనుభవిస్తూనే వున్నాం.

ఇప్పుడు షయారో బానో కేసు కథ కూడా షా బానో కథలాగానే అవుతుందా అనే సందేహం రావచ్చు. ముస్లిం పర్శనల్ బోర్డుకి యిప్పటికీ సంప్రదాయ, ఛాందస ముస్లిముల్లో పట్టు వుంది. కానీ 30 ఏళ్లలో ముస్లిం మహిళలు చాలా మారారు. లక్షలాది ముస్లిం మహిళలు గళం విప్పుతున్నారు. ముస్లిమేతర సభ్యసమాజం కూడా దీనిపై చర్చిస్తోంది. మార్పు తెచ్చేందుకు అనుకూల సమయం వచ్చినట్లే వుంది. ఇది శుభపరిణామం. ఏ మార్పయినా సరే ఆ వర్గంలోని అధిక సంఖ్యాకులు ఆమోదించాలి. అప్పుడే దానికి ప్రభుత్వం వత్తాసు పలకగలుగుతుంది. వితంతు పునర్వివాహం, హరిజన ఆలయప్రవేశం.. వంటి సంస్కరణలు, సతీసహగమనం, కన్యాశుల్కం, బాల్యవివాహాలు – వంటి వాటిపై నిరసన... యిలాటివన్నీ ఆ యా వర్గాలలోని సంస్కరణవాదులు ఛాందసవాదులపై పోరాడి గెలిచినవే. ఆ పోరాటం జరగకుండా ప్రభుత్వం తనంతట తానుగా చట్టం చేస్తే అది అమలు కాదు.

ఇప్పుడు ముస్లిం సమాజం తమ బాగు కోసం కృషి చేస్తే ప్రస్తుతం వున్న మోదీ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందనుకోవచ్చు. ఎందుకంటే వారు హిందూ ఛాందసవాదానికి తలవొగ్గవచ్చు కానీ ముస్లిం ఛాందసవాదానికి తలవొగ్గే ప్రశ్నే లేదు. ముస్లిం ఓట్లు లేకపోయినా ఖాతరు చేయం అని జబర్దస్తీగా చేతల్లో కూడా చూపిస్తున్నారు వారు. అందువలన కోర్టు తలాక్‌కు వ్యతిరేకంగా తీర్పు చెపితే అది అమలు కావడం ఖాయమనిపిస్తోంది. మే 15న కేంద్రం తరఫున నివేదిస్తూ ఎటార్నీ జనరల్ ముకుల్ రోహ్‌తగి 'కోర్టు తీర్పు తలాక్‌కు వ్యతిరేకంగా వస్తే కేంద్రం దానికి అనుగుణంగా చట్టం చేస్తుంద'ని హామీ యిచ్చారు. తీర్పుతో సంబంధం లేకుండానే మీరు చట్టం చేయాల్సింది అని చీఫ్ జస్టిస్ అంటే 'అప్పుడు పార్లమెంటులో అది పాస్ అవుతుందో లేదో చెప్పలేం' అన్నాడు రోహ్‌తగి. భారతీయ ముస్లిము మహిళా ఆందోళన్ ముస్లిము ఫ్యామిలీ చట్టం ఎలా వుండాలో ఒక నమూనా తయారుచేసి రెండేళ్ల క్రితమే ప్రధానికి సమర్పించింది.

అది చట్టంగా మారుతుందేమోనని ముస్లిం పర్శనల్ బోర్డు కంగారు పడుతోంది. అది 1973లో ఏర్పడిన ఒక ప్రయివేటు బాడీ. దానిలో 51 మంది ఉలేమాలు (మతసూత్రాలను అన్వయించేవారు), 201 మంది మామూలు సభ్యులతో జనరల్ బాడీ వుంది. వారిలో సాధారణ పౌరులు, 25 మంది స్త్రీలు కూడా వున్నారు. బోర్డులో అహ్మదియా పంథా ముస్లిములను చేర్చుకోరు. మన దేశంలోని వివిధ ప్రాంతాలలోని ముస్లిములలో స్థానిక ఆచారాల బట్టి రకరకాల చట్టాలు అమల్లో వున్నాయి. వారిపై హిందూ సివిల్ కోడ్ ప్రభావం కూడా వుంది. వారందరినీ షరియాకు అనుకూలంగా మార్చాలని బోర్డు ప్రయత్నిస్తూంటుంది. పిల్లలకు నిర్బంధ విద్యా చట్టాన్ని వ్యతిరేకిస్తుంది. బాల్యవివాహాలను ప్రోత్సహిస్తుంది. వాటిని నియంత్రించడాన్ని వ్యతిరేకిస్తుంది. దీని పెత్తనం భరించలేని షియాలు, మహిళా ఉద్యమకారులు వేర్వేరు బోర్డులు పెట్టుకున్నాయి కానీ వాటికి పెద్దగా గుర్తింపు లేదు.

తమ తరఫున సుప్రీం కోర్టులో వాదిస్తున్న కపిల్ సిబ్బల్ ద్వారా ముస్లిము పర్సనల్ బోర్డు "మేమే సంస్కరణలు చేపడుతున్నాం. మాక్కాస్త టైమివ్వండి. ఈ లోపున మీ సంస్కరణలు మాపై రుద్దకండి." అని చెప్పించారు. సిబ్బల్ దేనికిదేనికో ముడిపెట్టి చాలా విచిత్రమైన వాదనలు వినిపించాడు. "జననం, మరణం, వివాహం వ్యక్తి మతానికి సంబంధించిన విషయాలు. రాజ్యాంగ పరిధిలోకి రావు. అయోధ్యలో ఫలానా చోటే రాముడు పుట్టాడని మేం నమ్ముతున్నాం, దాన్ని ప్రశ్నించడానికి వీల్లేదని హిందువులు అంటున్నట్లే, ముమ్మారు తలాక్ విషయంలో కూడా తమను ప్రశ్నించకూడదని ముస్లిములు భావిస్తున్నారు." అంటూ అసందర్భంగా మాట్లాడాడు. "సతీ సహగమనం, బాల్యవివాహాలు వంటివి చట్టాల ద్వారానే మాన్పించారు, మిస్టర్ సిబ్బల్" అని జస్టిస్ కురియన్ జోసెఫ్ గుర్తు చేసి నోరు మూయించారు.

"ముమ్మారు తలాక్ మంచి పద్ధతి కాదని మగవాళ్లకు మేం నచ్చచెప్పి మారుస్తాం. ముమ్మారు తలాక్‌కు ఒప్పుకోని మహిళ నికానామా (వివాహపత్రం)లో ఆ మేరకు షరతు చేర్పించాలి అని కాజీలకు చెప్తాం. అసలు ముమ్మారు తలాక్ పద్ధతిని ప్రోత్సహించవద్దని, దాన్ని ఉపయోగించము అని భర్తల నుంచి పెళ్లి సమయంలోనే హామీలు తీసుకోమనీ కాజీలకు సర్క్యులర్ జారీ చేస్తాం." అని ముస్లిము బోర్డు సిబ్బల్ ద్వారా కోర్టుకు చెప్పించింది. 'ఇదంతా కంటితుడుపు వ్యవహారం. పెళ్లనేది కాజీలు చేయాలని రూలు ఏమీ లేదు, ఎవరైనా చేయవచ్చు. పోనీ కాజీల వద్దనే చేసుకున్నారనుకున్నా, కాజీలకు చట్టపరంగా ఏ అధికారమూ లేదు. వారి మాట వరుడు ఖాతరు చేయవలసిన అవసరమూ లేదు. పైగా పర్సనల్ బోర్డు ఆదేశాలు మన్నించాల్సిన అగత్యం కాజీలకు లేదు. మహా అయితే దారుల్ ఉలూమ్ నుంచి పట్టా పుచ్చుకున్న కాజీలు మాత్రమే పర్సనల్ బోర్డు మాట వినవచ్చు. ఇతర సంస్థల నుంచి పట్టా పుచ్చుకున్నవారు ఈ ఆదేశాలు ఖాతరు చేయకపోవచ్చు. ఖాతరు చేద్దామనుకున్నా నికానామాలో అలాటి షరతు కోసం పట్టుబడితే యిదేదో పేచీకోరు పిల్లలా వుంది అనుకుంటారని వధువు పట్టుబట్టకపోవచ్చు. అయినా కాబోయే వివాహాల గురించిన విషయం. ఇప్పటికే పెళ్లయినవాళ్ల సంగతేమిటో చెప్పమనండి." అని అడుగుతున్నారు మహిళా సంఘాల తరఫున వాదిస్తున్న లాయర్లు. పురుషాహంకార పక్షపాతిగా తనను తాను చూపించుకుంటున్న ముస్లిం పర్సనల్ బోర్డు వద్ద దీనికి సమాధానం లేదు. (ఫోటో – షయారా బానో, షా బానో) **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**న్యూస్, వ్యూస్ 133 జూన్ 09, 10 ఎమ్బీయస్ : గుజరాత్‌లో ఎన్నికల ఆతురత**

ఈ డిసెంబరులో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. 19 ఏళ్లగా పాలిస్తున్న బిజెపికి వరుసగా నాలుగోసారి కూడా గుజరాత్ ఓటరు ఛాన్సిస్తాడా లేదా అనే ఉత్కంఠ పెద్దగా అక్కరలేదు. ఉత్తర ప్రదేశ్‌లోనే ఘనవిజయం సాధించిన మోదీ–అమిత్ ద్వయాన్ని సొంతరాష్ట్రంలో భంగపాటు కలిగించే పని గుజరాతీలు పెట్టుకోరు. మోదీ కేవలం ముఖ్యమంత్రిగా వుండే రోజుల్లో గుజరాత్ నుంచి బిజెపి ఎంపీలు ఓ మోస్తరుగా గెలిచేవారు. కానీ 2014 ఎన్నికలలో మోదీ ప్రధాని అభ్యర్థి అనేసరికి గుజరాత్‌లోని మొత్తం 26 పార్లమెంటు స్థానాలలో బిజెపికే ఓటేశారు. 60% ఓట్లు వచ్చాయి. అలా అని అన్నిటా బిజెపినే ఆదరిస్తారన్న గ్యారంటీ లేదు. ఉండి వుంటే మోదీ స్వయంగా ఎంపిక చేసిన ఆనందీబెన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించేవారు కారు. పటేళ్ల ప్రయోజనాల కోసం హార్దిక్ పటేల్ చేపట్టిన ఉద్యమం విజయవంతం కావడం కూడా బిజెపిని చికాకు పెట్టింది. పటేళ్లు ప్రధానంగా వ్యవసాయదారులు, గ్రామవాసులు. 2015 నవంబరులో జరిగిన జిల్లా, తాలూకా పంచాయితీ ఎన్నికలలో 70% కంటె ఎక్కువ సీట్లు కాంగ్రెసు గెలిచింది. కానీ మునిసిపల్ కార్పోరేషన్లన్నిటిలో బిజెపి గెలిచింది. అందుచేత బిజెపిని నగరప్రజలు, కాంగ్రెసుని గ్రామీణ ప్రజలు ఆదరించారని అనుకున్నారు.అందుకే ఆనందీబెన్ స్థానంలో విజయ్ రూపాణీని తీసుకుని వచ్చారు. రూపాణీ పరిపాలనలో సామర్థ్యం కనబరచడంతో బాటు, రాజకీయ చతురత కూడా ప్రదర్శిస్తున్నాడు.

2017 జనవరిలో గ్రామ పంచాయితీ ఎన్నికలు పార్టీ రహిత విధానంలో జరిగాయి. నెగ్గిన పదివేల మందిలో ఎక్కువమంది మా వాళ్లే అని ఎన్నికల తర్వాత బిజెపి, కాంగ్రెసు రెండూ చెప్పుకున్నాయి. సందేహాలు నివృత్తి చేయడానికి కాబోలు నెగ్గిన సర్పంచులతో బిజెపి ఒక సమావేశం ఏర్పరచింది. 7 వేల మంది హాజరయ్యారు. అంటే బిజెపివారే ఎక్కువగా నెగ్గారని తేటతెల్లమైంది. హార్దిక్ పటేల్ చిచ్చర పిడుగులా ప్రారంభమయ్యాడు కానీ అతి త్వరలోనే తడిసిపోయిన టపాకాయలా అయిపోయాడు. గుజరాత్‌లో బలం లేని శివసేనతో చేతులు కలవడం అతని అభిమానులను కలవరపరిచింది. జనాభాలో 12% మంది వున్న పటేళ్లు బిజెపికి, ఆరెస్సెస్‌కు ఎప్పుడూ వెన్నెముకలా నిలిచారు. హార్దిక్ వచ్చి దాన్నే హరించబోయాడని బిజెపి కంగారు పడింది. పటేళ్లపైన దృష్టి పెట్టి కొన్ని పథకాలు తయారుచేసింది. పటేళ్లకు కంచుకోట, గుజరాత్ ఆర్థికకేంద్రాల్లో ఒకటి అయిన సూరత్‌కు ఏప్రిల్ రెండోవారంలో మోదీ స్వయంగా వచ్చాడు. 11 కిమీల పొడుగునా రోడ్ షో ఏర్పాటు చేయించాడు. 25 అడుగుల ఎత్తున్న తన కటౌట్లు పెట్టించాడు. పటేల్ ప్రముఖులు సూచించిన అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాడు. వాటిలో హైటెక్ హాస్పటల్ ఒకటి. అక్కడే 12 వేల కోట్ల రూ.లతో నర్మదా నది ఆధారిత సౌనీ యోజనాను ప్రారంభించాడు. సౌరాష్ట్రలోని 115 నదులను 2019 నాటి కల్లా కలిపే ఆ ప్రాజెక్టు పూర్తయితే నదుల అనుసంధానంలో దేశంలో కల్లా పెద్ద ప్రాజెక్టు అవుతుంది. వ్యవసాయదారులైన సౌరాష్ట్ర పటేళ్లకు చాలా మేలు కలుగుతుంది. వాళ్లు బిజెపిని అంటిపెట్టుకుని వుంటారు.

ఇలాగే రాజకీయ ప్రయోజనాలు కూడా కలగలిపిన 26 చట్టాలను రూపాణీ యిటీవలి అసెంబ్లీ సమావేశాల్లో పాస్ చేయించాడు. రూపాణీ వచ్చిన దగ్గర్నుంచి పార్టీకి, ప్రభుత్వానికి మధ్య అనుబంధం పెంచుతున్నాడు. శాంతిభద్రతలు మెరుగుపరిచాడు. సేవా సేతు అనే కార్యక్రమం పెట్టి రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని చూస్తున్నాడు. తక్కిన రాష్ట్రాల లాగానే అక్కడా విద్య వ్యాపారమై పోయింది. ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు ముకుతాడు వేయాలని ప్రయివేటు స్కూళ్లలో ప్రైమరీ స్థాయిలో విద్యార్థి నుంచి సాంవత్సరిక ఫీజులకు పరిమితి విధించారు. ప్రైమరీ స్కూళ్లకైతే 15 వేలు, సెకండరీకి 25, హయ్యర్ సెకండరీకి 27 వేలు. అంతకుమించి వసూలు చేసినవాళ్లకు రూ. 5-10 లక్షల జరిమానా. స్కూలు మూసేసే ప్రమాదం కూడా వుంది. ఇది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఆనందాన్ని కలిగించే విషయం. ఇతర బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా యిలాటి చట్టం తేవాలనే ఆలోచనలో వున్నారట. చాలా నగరాల్లో రోజు (అడ్డా) కూలీలు వుంటూ వుంటారు. వీళ్లకు పర్మనెంటు ఉద్యోగం వుండదు, రోజూ పని కూడా వుండదు. రోజూ పొద్దున్నే నగరాల్లోని ప్రధాన రహదారుల్లో ఓ చోట గుంపుగా కూర్చుని వుంటారు. దొరికితే ఆ రోజుకి పని దొరికినట్లు. లేకపోతే పస్తే. వాళ్ల కోసం రూపాణీ 'శ్రామిక్ అన్నపూర్ణ యోజన' అనే పేర ఒక పథకం పెట్టాడు. 10 నగరాల్లో 88 రహదారుల్లో వున్న సుమారు 50 వేల మంది కూలీలకు రూ.10లకే భోజనం పెడతారు. పని దొరకనివాళ్లే అక్కడ భోజనం చేస్తారనుకోవాలి. ఇదొక మంచి పథకం.

రైతు సంక్షేమానికి వస్తే వేరుశెనగ రేటు పడిపోయినప్పుడు, ప్రభుత్వమే వెయ్యి కోట్ల రూ.లు వెచ్చించి పంటను రైతుల నుంచి కొంది. అపరాల విషయంలో కూడా యిలాగే జరిగితే అప్పుడు రూ.400 కోట్లు పెట్టి కొంది. గిరిజన ప్రాంతాల్లో సాగునీరు లభ్యత పెంచేందుకు రూ.4800 కోట్ల టెండర్లను ఆమోదించాడు. అడవిలో సేకరించిన సరుకులను అమ్మినపుడు గిరిజనులు అమ్మకాలలో సగం ప్రభుత్వానికి చెల్లించవలసి వచ్చేది. ఇప్పుడు ఆ రూలు ఎత్తివేసి, అమ్మినది మొత్తం మీరే వుంచుకోండి అని చట్టం పాస్ చేశాడు. మొత్తం 182 అసెంబ్లీ సీట్లలో 26 సీట్లలో గిరిజనులదే ఆధిక్యత. సుజలాం-సుఫలాం ఇరిగేషన్ స్కీము కింద మాహి, నర్మదా నదుల నుంచి ఉత్తర గుజరాత్‌లోని వెయ్యి చెఱువులకు నీటిని మళ్లించి నీటివసతి పెంచాడు. ఇక హిందూత్వ ఎజెండా కూడా వుంది కాబట్టి, గోవధ చేసేవారికి శిక్షను 10 సం.ల నుండి యావజ్జీవానికి పెంచాడు. చీకటి పడ్డాక ఆవులను ట్రక్కులలో తరలించకూడదు. ఈ రూలును ఉల్లంఘిస్తే ఆ ట్రక్కును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. గుజరాత్‌లో మద్యనిషేధం ఎన్నో దశాబ్దాలుగా అమల్లో వుంది. దానివలన మద్యం అలవాటున్నవాళ్లు గుజరాత్ పర్యటించడానికి వెనకాడుతూ వుంటారు. గుజరాత్‌లో వ్యాపార సరమైన సమావేశాలు, సెమినార్లు పెట్టరు. ఇది గమనించిన మోదీ పర్యాటకం, వ్యాపారం అభివృద్ధి చేయడానికి మద్యనిషేధం నియమాలను 2008లో కాస్త సడలించాడు. అయితే యిప్పుడు అల్పేశ్ ఠాకూర్ అనే ఒబిసి నాయకుడు సంపూర్ణ మద్యనిషేధం డిమాండ్ చేస్తూ ఉద్యమం చేస్తున్నాడు. దాన్ని తట్టుకోవడానికై రూపాణీ సడలింపులను అటకెక్కించి, ఉల్లంఘనలకు గతంలో కంటె ఎక్కువ శిక్షలు ప్రతిపాదిస్తూ చట్టం చేశాడు.

ఇలా రూపాణీ రకరకాలుగా ఎన్నో చర్యలు చేపట్టి ప్రజలను ఆకట్టుకోవాలని ఆత్రుత పడుతున్నాడు. ఇంత శ్రమ అవసరమా అనుకోవచ్చు అక్కడి పరిస్థితి పూర్తిగా తెలియనివారు. 2002 నుంచి అసెంబ్లీ ఎన్నికలలో బిజెపికి ఓట్ల శాతం, సీట్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2002లో 50% ఓట్లు, 127 సీట్లు వస్తే, 2007లో 49% ఓట్లు 117 సీట్లు వచ్చాయి. 2012 వచ్చేసరికి అది 48% ఓట్లు, 115 సీట్లు అయింది. ఇదే సమయంలో కాంగ్రెసు కొద్దిగా పుంజుకుంటోంది. దాని ఓట్ల శాతం 38-39% మధ్య వూగుతోంది. సీట్ల విషయానికి వస్తే 2002లో 51, 2007లో 59, 2012లో 61 తెచ్చుకుంది. మోదీ లేడు కాబట్టి యీసారి ఎన్నికలలో మరిన్ని ఓట్లు, సీట్లు తెచ్చుకోవచ్చన్న అంచనా వారిది. వారి బలం పెరిగినా, తమ బలం తరిగినా తమకు అప్రదిష్ఠ అని అమిత్ షా భావన. అందుకని ఎందుకైనా మంచిదని కాంగ్రెసు నుంచి నాయకులను గుంజుకునే పనిలో పడ్డాడు. ఈ తరహా ప్రయోగాలు యితర రాష్ట్రాలలో చేసి మంచి ఫలితాలు సాధించాడు కాబట్టి యిక్కడా అదే మంత్రం వేస్తున్నాడు. ఆ మంత్రానికి వశమైనవారిలో శంకర్ సింగ్ వాఘేలా వున్నట్లు వార్తలు వస్తున్నాయి. వాఘేలాకు రాజకీయ స్థిరత్వం లేదు. గాలి ఎటు వీస్తూంటే అటు మళ్లగల సమర్థుడు. స్వతహాగా బిజెపి నాయకుడు. 1995 సెప్టెంబరులో అప్పటి బిజెపి ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్‌పై తిరుగుబాటు చేసి, ఓ ఏడాది పోయిన తర్వాత బిజెపిని చీల్చి కొత్త పార్టీ పెట్టి కాంగ్రెసు మద్దతుతో ముఖ్యమంత్రి అయిపోయాడు. తర్వాత కొన్నాళ్లకు కాంగ్రెసులో చేరిపోయాడు. మంచి పదవులు సంపాదించుకున్నాడు. యుపిఏ 1 హయాంలో టెక్స్‌టైల్ మంత్రిగా వున్నాడు.

ఏం చూసుకునో కానీ కాంగ్రెసుకు యీసారి గుజరాత్‌లో గెల్చేస్తామని ధీమా పట్టుకుంది. ఈ మధ్య గిరిజనుల సమస్యలను ఎత్తి చూపడానికి నవసర్జన్ ఆదివాసీ అధికార్ యాత్ర పేర ఒక కార్యక్రమం చేపడితే దానికి మంచి స్పందన వచ్చింది. హార్దిక్ పటేల్‌ను దువ్వితే బిజెపికి పటేళ్లను దూరం చేస్తాడన్న ఆలోచన ఒకటి. కలిసికట్టుగా ఏదైనా చేస్తే ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవచ్చు. కానీ తక్కిన రాష్ట్రాలలోగానే యిక్కడా కాంగ్రెసుకు కార్యకర్తల కంటె నాయకులు ఎక్కువ. ఎవరికి వారు తాము ముఖ్యమంత్రి పదవికి అర్హులమనుకుంటారు. పిసిసి అధ్యక్షుడు భరత్ సోలంకి వారిలో ఒకడు. అతను గత ముఖ్యమంత్రి స్వర్గీయ మాధవ్ సింహ్ సోలంకి కొడుకు. మాధవ్ సింహ్ గతంలో కొన్ని ఒబిసి కులాలను ఏకం చేసి కాంగ్రెసును అధికారంలోకి తెచ్చాడు. తండ్రి వారసత్వం పుణికి పుచ్చుకున్నానని భరత్ అనుకుంటూ వుంటాడు. ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నవారిలో వాఘేలా మరొకడు. వీళ్లిద్దరూ కాక శక్తిసింగ్ గోహిల్, సిద్ధార్థ్ పటేల్ అని మరో యిద్దరున్నారు. తక్కినవాళ్లని కాదని తనకే ముఖ్యమంత్రి పదవి యిస్తానని కాంగ్రెసు

అధిష్టానం మాట యివ్వాలని వాఘేలా బ్లాక్‌మెయిల్‌తో సహా రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాడు.

రాజస్థాన్‌కు గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసి, ప్రస్తుతం అధిష్టానం తరఫున గుజరాత్ కాంగ్రెసు వ్యవహారాలకు యిన్‌చార్జిగా వున్న అశోక్ గెహలాట్ మే 10న పార్టీ సమావేశం ఏర్పాటు చేసి భరత్‌కు, వాఘేలాకు మధ్య సయోధ్య కుదర్చడానికి ప్రయత్నించాడు. ముఖ్యమంత్రిగా తమ పేరు ప్రకటించాలని కోరవద్దని యిద్దరికీ నచ్చచెప్పాడు. ఆ సమావేశం జరిగాక తను అలిగానని చూపడానికి వాఘేలా 30 మంది సీనియర్ కాంగ్రెసు నాయకులను ట్విటర్‌లో అనుసరించడం మానేశాడు. (అన్ ఫాలోయింగ్). ఆ నాయకుల్లో రాహుల్ గాంధీ కూడా వున్నాడు. అమిత్ షా తనను ఆహ్వానించాడని, తను బిజెపిలోకి వెళ్లిపోయే అవకాశాలున్నాయని, ముందుగా కాంగ్రెసు ఎమ్మెల్యేగా వున్న తన కొడుకు మహేంద్ర సింహ్‌ను బిజెపిలోకి పంపిస్తున్నాడనే వార్తలు ప్రచారంలో పెట్టాడు. బిజెపికి వ్యతిరేకంగా తను గతంలో పెట్టిన ట్వీట్‌లను తన ఖాతా లోంచి తీసేశాడు. జులైలో రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. గుజరాత్ అసెంబ్లీ నుంచి బిజెపి రెండు సీట్లు సులభంగా గెలవగలదు. మూడో సీటుకి కాంగ్రెసు అధిష్టానం సోనియాకు ఆత్మీయుడైన అహ్మద్ పటేల్‌ను మళ్లీ నిలబెడుతోంది. అతన్ని ఓడించి, తాము గెలవాలంటే 11 కాంగ్రెసు ఎమ్మెల్యేల ఓట్లు చేతిలో వున్న కాంగ్రెసు నాయకుణ్ని ఎవరినైనా బిజెపి వైపు తిప్పుకోవాలి. వాఘేలా చేతిలో 8 మంది ఎమ్మెల్యేలున్నారట. అందువలన బిజెపి వాఘేలాకు గేలం వేస్తుందని, దానిలో పడడానికి అతను సిద్ధంగా వున్నాడని చెప్పుకుంటున్నారు. అతను ఒబిసి కేటగిరీలోకి వచ్చే క్షత్రియ కులస్తుడు. ఆ కులం వారు యిన్నాళ్లూ కాంగ్రెసుకు అండగా వున్నారు. అతని నిష్క్రమణతో కాంగ్రెసుకు ఆ మేరకు బలం క్షీణిస్తుందని ఒక అంచనా. తను బిజెపిలోకి వెళ్లిపోతున్నట్లు వచ్చిన వార్తల గురించి వాఘేలా మండిపడ్డాడు "నేనేమైనా చెప్పానా? అమిత్ షా ఏమైనా వచ్చి నన్ను పిలిచాడా?" అని ఉరిమాడు. ఆ తర్వాత కనబడకుండా పోయాడు. చివరకు భరత్ జూన్ మొదటివారంలో వాఘేలా యింటికి వెళ్లి మాట్లాడాడు. తమ మధ్య విభేదాలు లేవని యిద్దరూ మీడియాకు చెప్పుకున్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించేది లేదని, పంజాబ్‌లో కూడా అలా చేయలేదని అధిష్టానం భరత్ ద్వారా చెప్పించిందట. మరి వాఘేలా బిజెపిలోకి మారతాడా, లేదా? వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017) (ఫోటో – విజయ్ రూపాణీ, శంకర్ సింగ్ వాఘేలా)**

**జూన్ 11,12 ఎమ్బీయస్ : హిమాచల్‌లో కాంగ్రెసు అవస్థ**

హిమాచల్ ప్రదేశ్‌లో యీ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. 1977 నుంచి అక్కడ కాంగ్రెసు, బిజెపి మార్చిమార్చి గెలుస్తూ వున్నాయి. ప్రస్తుతం వున్నది కాంగ్రెసు. అంటే వచ్చేసారి బిజెపి రావాలి, లెక్క ప్రకారం. ఆనవాయితీ మార్చేస్తాం అని కాంగ్రెసు చెప్పుకోవాలంటే వాళ్ల ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ తలమునకలా అవినీతి ఆరోపణల్లో మునిగిపోయాడు. అతనికి బదులు వేరే ఎవరూ కానరావటం లేదు. ఎవరో ఒకరిని తెచ్చి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపాలి. బిజెపి తరఫున గతంలో ముఖ్యమంత్రిగా చేసిన ప్రేమ్ కుమార్ ధూమల్ కూడా అవినీతి బురద అంటించుకున్నాడు. అందువలన అతనికి కూడా ప్రత్యామ్నాయం వెతుకుతోంది బిజెపి.

2012లో బిజెపి ప్రభుత్వం వుండేది. ధూమల్‌పై అవినీతి ఆరోపణలున్నా బిజెపి అధిష్టానం ఖాతరు చేయకుండా అతనికే మద్దతు పలుకుతూ వచ్చింది. అతనిపై ఫిర్యాదులు చేసిచేసి విసిగిన బిజెపి కార్యకర్తలు బయటకు వెళ్లిపోయి హిమాచల్ లోక్‌హిత్ పార్టీ అని పెట్టుకున్నారు. ఎన్నికలలో వారు ఒక్క సీటు మాత్రమే గెలిచినా 10% ఓట్లు తెచ్చుకుని బిజెపి కంచుకోటల్లో బిజెపిని దెబ్బ కొట్టారు. మధ్యలో కాంగ్రెసు లాభపడింది. 68 సీట్లలో కాంగ్రెసుకు 36 వచ్చాయి. బిజెపి 26తో సరిపెట్టుకోవలసి వచ్చింది. కాంగ్రెసు ముఖ్యమంత్రి అభ్యర్థి వీరభద్ర సింగ్‌పై అప్పటికే అవినీతి ఆరోపణలున్నాయి. వాటి కారణంగా ప్రజలతనికి ఓటెయ్యరని బిజెపి అంచనా వేసింది. కానీ అది తప్పింది. వీరభద్ర సింగ్‌కు ప్రజల్లో చాలా పలుకుబడి వుంది. అందరికీ అందుబాటులో వుంటాడు. అనేకమందికి సహాయాలు చేశాడు. దానధర్మాలు విరివిగా చేశాడు. అతని యింటికి ఎవరు వెళ్లినా ఉంచుకో అని కాస్త డబ్బు చేతిలో పెట్టే రివాజు వుందట. అది ఎక్కణ్నుంచి ఎలా వస్తోందో సామాన్యుడికి అనవసరం. తనను ఆదరంగా చూశాడు, చాలు. అలాటి మారాజు మీద అనవసరంగా కేసులు మోపి అల్లరిపాలు చేస్తున్నారు అనుకున్నాడు. సింపతీ వర్కవుట్ అయింది. కాంగ్రెసు గెలిచింది, అతను ముఖ్యమంత్రి అయ్యాడు. ముఖ్యమంత్రిగా వుండగా మరిన్ని చిక్కుల్లో యిరుక్కున్నాడు.

హిమాచల్ రాజకీయాల్లో వీరభద్ర సింగ్ 82 ఏళ్ల కురువృద్ధుడు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్రమంత్రిగా, హిమాచల్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశాడు. పరిపాలనా సమర్థుడు, ప్రజలకు ఆప్తుడు. అయినా అవినీతి, పదవీదుర్వినియోగం, మనీ లాండరింగ్ కేసుల్లో భార్యతో సహా యిరుక్కున్నాడు. వాళ్లతో బాటు ఒక తెలుగువాడి పేరు కూడా వినబడుతోంది. వాకమళ్ల చంద్రశేఖర్ అని. అతను తరిణి గ్రూపు ప్రమోటరు. హిమాచల్‌లోని చంబాలో వెంచర్ ఎనర్జీ అండ్ టెక్నాలజీస్ పేర 15 మెగావాట్ల సాయికోఠీ హైడల్ పవర్ ప్రాజెక్టు పెడదామనుకున్నాడు. వీరభద్ర సింగ్ ముఖ్యమంత్రిగా వుండగా 2004 సెప్టెంబరులో దీని అనుమతిని రద్దు చేశాడు. తర్వాత 2007లో మళ్లీ అనుమతి యిచ్చాడు. ఈ రెండు చర్యల మధ్య చంద్రశేఖర్ వివిధ రకాలుగా 6 కోట్ల రూ.ల వరకు సింగ్‌కు ఆర్థిక లబ్ధి చేకూర్చాడుట. 2013లో ఆ ప్రాజెక్టుకి అనుమతి పొడిగించినపుడు ముఖ్యమంత్రిగా వున్న సింగ్‌కు ఎంపీగా వున్న అతని భార్య ప్రతిభకు మరో రూ.1.80 కోట్లు చెల్లించాడట. మెహరౌలీలో వున్న ఫామ్‌హౌస్ మార్కెట్ విలువ రూ. 27 కోట్లుంటుంది. దాన్ని

రూ.1.20 కోట్లకే కొన్నట్లు చూపించి, తక్కినది క్యాష్‌లో యిచ్చాడని అమ్మినవాళ్లు యిన్‌కమ్ టాక్స్ వాళ్లకు చెప్పేశారు. కొన్నదాన్ని మేపుల్ అనే కంపెనీ పేర రిజిస్టర్ చేయించాడు. ఆ కంపెనీలో సింగ్ కొడుకు విక్రమాదిత్య సింగ్, కూతురు అపరాజితా సింగ్ భాగస్వాములు. అంతేకాదు, తరిణి ఇంటర్నేషనల్ కంపెనీ రూ. 16.8 కోట్లు ఐపిఓ ద్వారా సేకరించి మేపుల్‌కు బదిలీ చేసింది. ఎందుకు అంటే మాకు వాళ్లకీ వున్న కాంట్రాక్టు వలన అని జవాబిచ్చాడు చంద్రశేఖర్. ఆ కాంట్రాక్టు ఏమిటో, మేపుల్ వాళ్లు తరిణికి ఏం పనిచేసి పెట్టారో చూపించలేక పోయాడు.

'నీ కంపెనీలకు లాభాలు తగ్గుతున్నా వీరభద్ర సింగ్‌కు డబ్బు ఎలా బదిలీ చేయగలిగావ'ని ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు చంద్రశేఖర్‌ను అడిగారు. 'మా అమ్మమ్మ త్రిపురాన అహల్యాదేవికి విజయనగరం జిల్లాలో 45 ఎకరాల భూమి వుంది. దానిలో పళ్లు, సుగంధ ద్రవ్యాలు పండిస్తుంది. ఆవిడ యిచ్చింది' అని జవాబిచ్చాడితను. టాక్సు అధికారులు వెళ్లి చూడగా అతనిచ్చిన అడ్రసులో అహల్యాదేవి వుంటుంది కానీ ఆవిడ యితనికి చుట్టమేమీ కాదు. ఆవిడ యింట్లో అద్దె కుంటున్నాయన పేరు వాకమళ్ల నాగభూషణరావు. ఏ బాదరాయణ సంబంధం కలుపుకున్నాడో మరి. ఆవిడకు 45 ఎకరాలు వున్న మాట నిజమే కానీ ఆ పొలంలో సగం ఖాళీగా పడి వుంది. తక్కిన దాంట్లో మామిడి, జీడిమామిడి చెట్లున్నాయి. చంద్రశేఖర్ లంచంగా ఎంత యిచ్చాడో, సింగ్‌కు చెందిన బ్లాక్‌మనీని ఏ మేరకు  లాండరింగ్ చేసిపెట్టాడో యింకా తేలాలి.

ఇదంతా పాత గాథ. ఇప్పుడు కొత్తగా ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చాక 2015 నుంచి సిబిఐ తవ్వితీస్తున్న కేసులు వేరు. బ్లాక్‌మనీని వైట్ చేసుకోవడానికి వీరభద్ర సింగ్ తనకు వ్యవసాయభూములపై ఆదాయం వచ్చిందని చూపించాడు. అది సిబిఐ నమ్మటం లేదు. సింగ్‌కు షిమ్లా జిల్లాలో శ్రీఖండ్ ఆర్చర్డ్ అని వ్యవసాయక్షేత్రం వుంది. దాని మేనేజర్ ఆనంద్ చౌహాన్ సింగ్ తరఫున ఆరున్నర కోట్ల బ్లాక్‌మనీని 2009-12 మధ్య లాండరింగ్ చేశాడని సిబిఐ అంటోంది. సింగ్ ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్‌లో వ్యవసాయంపై వచ్చిన ఆదాయాన్ని రూ.47.4 లక్షలుగా చూపించాడు. కానీ చౌహాన్ బ్యాంక్ ఖాతాలో ఏకంగా రూ. 6.5 కోట్లు జమ అయ్యాయి. అవి ఎక్కడివి అని అడిగితే 'ఇవి సింగ్ గారి క్షేత్రంలో ఆపిల్ పళ్లు అమ్మగా వచ్చిన డబ్బు. నేను దానికి కేర్ టేకర్‌ను. మా యిద్దరి మధ్య స్టాంపు పేపరు మీద రాసుకున్న ఒక ఎంఓయు (అంగీకార పత్రం) వుంది. దాని ప్రకారం ఆ డబ్బు నా దగ్గరే దాచి వుంచాను' అన్నాడు. 2012లో సింగ్ గత మూడేళ్లవి రివైజ్‌డ్ ఐటీ రిటర్న్స్ దాఖలు చేశాడు. 2009-10లో రూ.7.35 లక్షల ఆదాయం వచ్చిందని మొదట్లో చెప్పి తర్వాత కాదు, కాదు 2.21 కోట్లు వచ్చిందన్నాడు. అదే విధంగా 2010-11 అంకెను రూ.15 లక్షల నుంచి రూ.2.8 కోట్లకు పెంచాడు. 2011-12 అంకెను రూ.25 లక్షల నుంచి రూ.1.55 కోట్లకు పెంచాడు. పంట విపరీతంగా పండేసిందని చెప్పుకున్నారు. 'ఓహో అలాగా అయితే అన్ని యాపిల్స్‌ని మార్కెట్‌కు ఎలా తరలించారు? ట్రక్కుల వివరాలివ్వండి' అంటే 'అబ్బే, ట్రక్కులు కాదు, స్కూటర్ల మీద, మారుతి 800 కారులోనూ తరలించార' అని చెప్పారు. పోనీ ఏ మార్కెట్‌లో అమ్మారో చెపితే మీ సరుకు అక్కడికి చేరిందో లేదో అక్కడి రికార్డులు వెరిఫై చేస్తాం అన్నారు టాక్సువారు. ఏ రికార్డూ లేని, మూలపడిన మార్కెట్ పేరు చెప్పారు వీళ్లు.

ఆ 6 కోట్ల డబ్బు ఎక్కణ్నుంచి వచ్చిందో చెప్పలేక యిలాటి తికమక సమాధానాలు చెపుతున్నారని అర్థమై పోతోంది. సరే మీకు, ఏపిల్ డీలర్‌కు మధ్య ఎంఓయు వుందన్నారు కదా, ఆ దస్తావేజు పట్టుకు రండి అన్నారు.  అది 2008 జూన్ 17న నాన్-జ్యుడిషియల్ స్టాంప్ పేపరుమీద రాసినట్లుంది. దానిపై వున్న సీరియల్ నెంబరు ప్రకారం చూస్తే ఆ స్టాంప్ పేపరు నిజానికి 2008 సెప్టెంబరు 24న నాసిక్‌లో ప్రింటు చేసినట్లుంది. అంటే తర్వాత ఎప్పుడో స్టాంప్ పేపరు కొని  పాత తారీకు వేసేశారన్నమాట. జూన్ 15న మరో ఏపిల్ డీలర్‌తో రాసుకున్న ఎమ్ఓయు వున్న స్టాంపు పేపరుదీ యిదే కథ. ఎవరికీ పండనంత పంట మీకెలా పండింది అని సింగ్‌ను అడిగితే 'అంతా దేవుడి దయ' అన్నాడు. అతనికి వున్న 105 బిఘాల (ఎకరానికి రెండున్నర బిఘాలు) భూమిలో 3200 చెట్లున్నాయి. మహా అయితే ఏడాదికి 15 వేల పెట్టెల ఏపిల్స్ పండవచ్చు, వాటిపై రూ.15 లక్షల ఆదాయం రావచ్చు. ఐటీ వాళ్లు ఉదారంగా లెక్కలు వేసినా ఎక్కువలో ఎక్కువ ఏడాదికి రూ.64 లక్షలకు మించి రాకూడదు. మరి సింగ్ గారికి కోట్లకు కోట్లు వచ్చిపడ్డాయి. (కెసియార్ కూడా వ్యవసాయం చేసి ఎకరాకు కోటి రూ.లు సంపాదించిన మాట, ఆయన ముఖ్యమంత్రి అయ్యాక కూడా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్న సంగతీ యిక్కడ గుర్తుకు వస్తే అది నా తప్పు కాదు) ఈ సంగతులన్నీ అరుణ్ జేట్లీ 2012లో రాజ్యసభలో లేవనెత్తి హిమాచల్ ఎన్నికలకు ముందు వీరభద్ర సింగ్‌ను అప్రతిష్ఠ పాలు చేయాలని చూశాడు. కానీ దానివలన సానుభూతి పెరిగింది తప్ప తరగలేదు.

ఇప్పుడు అతని వ్యవహారాలపై ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్), సిబిఐ విచారణ జరుపుతున్నాయి. సరైన సాక్ష్యాధారాలతో ఒక్కసారి బిగించి వుంటే బాగుండేది. అది జరగకుండానే 2015 సెప్టెంబరు 26న సింగ్ తన చిన్న కూతురు మీనాక్షి కుమారిని ఫరీద్‌కోట్‌కి సంబంధించిన రాజకుటుంబంతో పెళ్లి చేస్తూండగా 18 మంది ఇన్‌కమ్‌టాక్స్ అధికార్లు ముఖ్యమంత్రి నివాసంపై దాడి చేశారు.  దాడి చేయడానికి అది తప్ప మరొక సమయం దొరకలేదా? అని సాధారణ ప్రజలకు అనిపించింది. తర్వాతి రోజుల్లో గాలి జనార్దనరెడ్డి, నితిన్ గడ్కరీ వంటి వాళ్లు వైభవంగా పెళ్లిళ్లు చేశారు. గాలిని పెళ్లి తర్వాత ప్రశ్నలడిగారు. నితిన్‌ను అదీ అడిగినట్లు లేదు. పెళ్లి సమయంలోనే పరువు తీయాలని చూడడం అవతలివాళ్లకు అనవసర సానుభూతి ప్రయోజనం కలిగించినట్లే. సింగ్, అతని భార్య ప్రతిభ అక్రమాస్తుల (రాబడికి మించిన ఆస్తుల) కేసులో తమపై వేసిన ఎఫ్ఐఆర్ కొట్టివేయమని కోరుతూ ఢిల్లీ

హైకోర్టును ఆశ్రయించారు. కానీ కోర్టు వారి అభ్యర్థనను తిరస్కరించింది. 2016 మేలో ఇడి మనీ లాండరింగ్‌తో సంపాదించిన ఆస్తులు అంటూ, ఢిల్లీ గ్రేటర్ కైలాశ్‌లో సింగ్‌కు వున్న రెండస్తుల మేడను స్వాధీనం చేసుకుంది. దాని విలువ రూ.8 కోట్లు. దానితో బాటు ఎల్ఐసి పాలసీలు, ఫిక్సెడ్ డిపాజిట్లు కూడా స్వాధీనం చేసుకుంది. 2016లో ఆగస్టులో సింగ్‌ను, భార్యను విచారించింది. 'ఇదంతా మోదీ చేయిస్తున్నదే, వసుంధరా రాజే, రమణ్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్ వంటి ముఖ్యమంత్రులపై కూడా కేసులున్నాయి. వారెవరిపై చూపించనంత కాఠిన్యం నాపై చూపిస్తున్నారంటే యిది రాజకీయ దురుద్దేశమే' అని సింగ్ వాపోయాడు.

ఆరోపణలు బయటకు వచ్చిన కొత్తల్లో అతని పార్టీ ఎమ్మెల్యేలు అతని వెనక దృఢంగా నిలిచారు. అతనికి వున్న మాస్ లీడరు యిమేజి తమను మళ్లీ గెలిపిస్తుందని వారి ఆశ. పోనుపోను సిబిఐ, ఇడి ఉచ్చు బిగిస్తున్న కొద్దీ పరిస్థితి మారుతోంది. అవినీతి, ఫోర్జరీ అనే నేరాలపై 2017 మార్చిలో సింగ్‌పై, అతని భార్యపై సిబిఐ చార్జిషీటు దాఖలు చేసింది. ఏప్రిల్ మొదటివారంలో రూ. 27 కోట్ల మెహరౌలీలో ఫామ్‌హౌస్ కూడా స్వాధీనం చేసుకుంది. అది సింగ్ కొడుకు విక్రమాదిత్య సింగ్ కంపెనీ ఐన మేపుల్ డెస్టినేషన్స్ పేర వుంది. ఏప్రిల్ మూడోవారంలో ఇడి సింగ్‌ను 9 గంటలు ఏకధాటిగా ప్రశ్నలతో ముంచెత్తింది. మే 29 న సిబిఐ స్పెషల్ కోర్టు వాళ్లకు బెయిల్ యిస్తూనే పాస్‌పోర్టులు అప్పగించమంది. ఇవన్నీ చూసిన ఎమ్మెల్యేలలో కొందరికి వీరభద్ర సింగ్ పార్టీకి బరువుగా మారిన యీ అవకాశాన్ని వినియోగించుకుని తామే ఎందుకు ముఖ్యమంత్రులు కాకూడదని అనిపించసాగింది. కేసుల్లో తనకు శిక్ష పడవచ్చని ఊహించిన సింగ్ తన అసెంబ్లీ స్థానంలో వచ్చే ఎన్నికల్లో తన కొడుకు విక్రమాదిత్య నిలబడతాడని ముందే ప్రకటించాడు.

సింగ్ వారసత్వాన్ని వదుల్చుకుందామని సోనియా నిశ్చయిస్తే అతని స్థానంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నవారిలో ఆనంద శర్మ ఒకడు. అతను సోనియాకు ఆప్తుడే కానీ రాష్ట్రప్రజల్లో పలుకుబడి లేదు. ఇంకో అభ్యర్థి కౌల్ సింగ్ ఠాకూర్. ప్రస్తుత కాబినెట్‌లో ఆరోగ్యశాఖామాత్యుడు. సింగ్‌ను విమర్శిస్తాడు. మూడో వ్యక్తి సుధీర్ శర్మ. కాబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖకు మంత్రి. సింగ్‌కు అనుయాయి. నాలుగో వ్యక్తి – సింగ్ వ్యతిరేకించినా 2012లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించబడి కొనసాగుతున్న సుఖ్వీందర్ సింగ్ సుక్కు. వయసు 52 కాబట్టి యువనాయకుడిగా లెక్క కానీ రాజకీయంగా బలమైనవాడు కాదు. కానీ ఆశ బాగానే వుంది. 'వీరభద్ర సింగ్ యిప్పటికే 6 సార్లు ముఖ్యమంత్రిగా చేశారు కాబట్టి ప్రజలు, ముఖ్యంగా యువత మార్పు కోరుకుంటున్నారు. నేను బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ వ్యవస్థను బలోపేతం చేశాను.' అని చెప్పుకుంటున్నాడు. ఈ ఆశావహులందరూ యీ సారి పార్టీ వీరభద్ర సింగ్‌పై ఆధారపడకుండా సమిష్టి నాయకత్వానికి బాధ్యతలు అప్పగించాలని, ఎవరినీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించ కూడదనీ కోరుకుంటున్నారు. ఎందుకంటే 2012లో పార్టీ హై కమాండ్ వద్దంటున్నా వీరభద్ర సింగ్ పార్లమెంటు స్థానానికి రాజీనామా చేసి, తనపై అవినీతి ఆరోపణలున్నా అసెంబ్లీ గోదాలోకి దిగి 36 స్థానాలు గెలిచి చూపించడంతో హై కమాండ్ ఏమీ చేయలేక పోయింది. ఈ సారి అలా జరగడానికి వీల్లేదని యీ నాయకుల పట్టుదల. ఇప్పటికి కూడా 23 మంది ఎమ్మెల్యేలు సింగ్ నాయకత్వంపై విశ్వాసం ప్రకటిస్తూ మే 26న ఒక లేఖపై సంతకాలు పెట్టారు.

కాంగ్రెసు పక్షాన బలమైన నాయకుడు చిక్కుల్లో పడిన యీ సమయాన్ని బిజెపి ఉపయోగించుకుని, పొరుగున వున్న ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో లాగానే యిక్కడా తమ తడాఖా చూపించాలనుకుంది. ఏప్రిల్ 27న షిమ్లాలో పెద్ద సభ ఏర్పాటు చేసి మోదీని ఆహ్వానించింది. అధికారికంగా అయితే అది "ఉడాన్" (ఎయిర్ కనెక్టివిటీ స్కీము) ప్రారంభించడానికి వచ్చినట్లు లెక్క. కానీ 'అవినీతిమయమైన ప్రభుత్వాన్ని కూలదోయండి' అంటూ మోదీ పిలుపు నీయడంతో ఆ పర్యటన రాజకీయపు రంగు పులుముకుంది. ఒక వారం తర్వాత అమిత్ షా రాష్ట్రప్రభుత్వంపై విరుచుకు పడ్డాడు. ఆంధ్ర, తెలంగాణలలో మాట్లాడినట్లే అక్కడా 'కేంద్రం ఉదారంగా నిధులు యిస్తున్నా, పనులు జరగటం లేదు. నిధులు చూస్తే దుర్వినియోగం అవుతున్నాయి.' అని ఆరోపించాడు. బిజెపికి అనుకూల పవనాలు వీస్తున్నా వారి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరు వస్తారు అనేది ఒక ప్రశ్న వుంది. గతంలో రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన సీనియర్ నాయకుడు ప్రేమ్ కుమార్ ధూమల్ అవినీతి ఆరోపణలకు గురై వున్నాడు. అందువలన సింగ్ కంటె మెరుగైన నాయకుడిగా పార్టీ చూపించలేదు. కేంద్రంలో ఆరోగ్యమంత్రిగా వున్న 56 ఏళ్ల జెపి (జగత్ ప్రకాశ్) నడ్డాను మోదీ ఎంపిక చేయవచ్చని ఒక అంచనా వుండడంతో చాలామంది బిజెపి ఎమ్మెల్యేలు నడ్డా చుట్టూ తిరుగుతున్నారు. అది గ్రహించిన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడైన 52 ఏళ్ల సత్‌పాల్ సింగ్ సత్తీ తనను తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపుకోవడానికి వెనుకాడుతూ కాంగ్రెసును విమర్శించడంతో సరిపెడుతున్నాడు. 'కేంద్రం ఐఐఎమ్ యిస్తానంది, ఎయిమ్స్ యిస్తానంది, స్మార్ట్ సిటీ ప్రాజెక్టు యిచ్చింది. కానీ రాష్ట్రప్రభుత్వం అలసత్వం వలన వాటిలో అడుగు ముందుకు పడటం లేదు." అంటున్నాడు. బిజెపి అధినాయకత్వం ఎవరి వూహలకు అందకుండా, ఎవరికీ తెలియని వారిని గద్దెపై కూచోపెడుతోంది. హరియాణాలో మనోహర్ లాల్ ఖట్టర్, ఉత్తరాఖండ్‌లో త్రివేంద్ర సింగ్ రావత్, యుపిలో యోగి ఆదిత్యనాథ్ – వీరు ముఖ్యమంత్రులవుతారని ముందస్తు సూచనలు ఏమీ లేవు. అలాగే హిమాచల్‌లో కూడా అజయ్ జమ్వాల్ అనే ఆరెస్సెస్ ప్రచారకుడు, బిజెపి ఆర్గనైజింగ్ సెక్రటరీని ముఖ్యమంత్రి చేసినా చేయవచ్చు అంటున్నారు. పోనుపోను పోరు యింకా చిక్కనవుతుందనుకోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017) (ఫోటో – వీరభద్ర సింగ్, జెపి నడ్డా)**

**న్యూస్, వ్యూస్ 134 జూన్ 13** **ఎమ్బీయస్ : ఐర్లండ్‌కు భారత సంతతి ప్రధాని**

ఐర్లండ్‌కు ప్రధాని అయిన లియో వారాడ్కర్ భారతీయ సంతతికి చెందినవాడు. ఆయన తండ్రి డా॥ వారాడ్కర్ ముంబయికి చెందిన మహారాష్ట్రీయుడు. ఆయన ఇంగ్లండులో ఒక ఆసుపత్రిలో పనిచేసే రోజుల్లో ఐర్లండ్ లోని వాటర్‌ఫోర్డ్‌కు చెందిన నర్సుతో ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నాడు. వాళ్లకు కూతురు పుట్టాక ఐర్లండ్‌లోని డబ్లిన్‌కు తరలిపోదామని నిశ్చయించుకున్నారు. లియో అక్కడే పుట్టాడు. పెరిగాడు. డాక్టరీ చదివాడు. సెంటర్-రైటిస్టు భావాలకు చెందిన ఫైన్ గేల్ పార్టీలో 23 ఏళ్ల వయసులో 2002లో చేరాడు. ఐదేళ్లలో ట్రెయినీ డాక్టరుగా పనిచేస్తూనే ప్రజాప్రతినిథిగా ఎన్నికయ్యాడు. పదేళ్ల తర్వాత 38 ఏళ్ల వయసులో ఏకంగా ప్రధాని అయిపోయాడు. అతను ప్రధాని కావడం చిత్రమైన పరిస్థితుల్లో జరిగింది.

ఇంగ్లండ్‌కు పక్కనున్న దీవి ఐర్లండ్. దానిలో ఉత్తర భాగమైన ఉత్తర ఐర్లండ్ గ్రేట్ బ్రిటన్‌లో భాగం. దక్షిణ ఐర్లండ్ బ్రిటన్ నుంచి విడిపోతూ వచ్చి చివరకు 1949లో రిపబ్లిక్ ఆఫ్ ఐర్లండ్‌గా ఏర్పడింది. 2011లో దాని జనాభా 45 లక్షలు. 2011లో జరిగిన ఎన్నికలలో పార్లమెంటులో వున్న మొత్తం 157 సీట్లలో లియో పార్టీ ఐన ఫైన్ గేల్‌కు 76 వచ్చాయి. లేబర్ పార్టీకి 37 వచ్చాయి. ఇద్దరూ కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. లియో నాయకుడైన ఎండా కెన్నీ ప్రధాని అయ్యాడు. లియో ట్రాన్స్‌పోర్టు మంత్రి అయ్యాడు. ఆ ప్రభుత్వం జనాదరణ పొందకపోవడం చేత 2016 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలలో ఫైన్ గేల్ 26 సీట్లు పోగొట్టుకుని 50 తెచ్చుకుంది. లేబర్ పార్టీ మరీ దారుణంగా 30 సీట్లు పోగొట్టుకుని 7 మాత్రమే తెచ్చుకుంది. ఫియన్నా ఫెయిల్ అనే పార్టీ గతంలో కంటె 24 సీట్లు ఎక్కువగా తెచ్చుకుని 44 సీట్లతో రెండవ స్థానంలో నిలిచింది. సగం కంటె ఎక్కువ సీట్లు కావాలంటే 79 రావాలి. లేబరు పార్టీతో చేతులు కలిపినా లాభం లేదు కాబట్టి 50 సీట్ల ఫైన్ గేల్ 44 సీట్లున్న ఫియన్నా ఫెయిల్‌తో బేరసారాలు సాగించింది. 63 రోజుల పాటు చర్చలు జరిగినా ఏమీ తేలలేదు. చివరకు 'మేం ప్రభుత్వంలో పాలు పంచుకోము. మీరు మైనారిటీ ప్రభుత్వం ఏర్పరచండి.' అని ఫియన్నా ఫెయిల్ అంది.

ఆ విధంగా ఎండా కెన్నీ రెండోసారి ప్రధాని అయ్యాడు. లియోకు యీ సారి సోషల్ ప్రొటెక్షన్ మంత్రిత్వ శాఖ లభించింది. పక్కదారి పట్టిన సంక్షేమ పథకాల నిధులు సంగతి తేల్చడానికి అతను నడుం బిగించడంతో అతనికి పేరు వచ్చింది. కానీ కెన్నీకే పాపం వ్యవహారం సజావుగా సాగలేదు. బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు రావడం అతనికి యిష్టం లేదు. బ్రెగ్జిట్ జరిగితే ఉత్తర ఐర్లండ్‌తో భద్రతా సమస్యలొస్తాయని వాదించాడు. దాన్ని బ్రిటన్ ఖండించింది. ఈ లోగా మారిస్ మెక్‌కాబే అనే విజిల్ బ్లోవర్ (పారా హుషారీ) వివాదం అతనికి యిబ్బంది తెచ్చిపెట్టింది. ఐర్లండ్ పోలీసు వ్యవస్థలో జరుగుతున్న మోసాలను మారిస్ 2013లోనే అప్పటి ప్రధాని ఎండా కెన్నీకి, ట్రాన్స్‌పోర్టు మంత్రి లియో వారాడ్కర్‌కు విన్నవించాడు. వారిద్దరూ న్యాయశాఖా మంత్రికి చెప్పుకోమన్నారు. అతను విషయాలు బయటకు రాకుండా తొక్కేయడంతో బాటు రహస్యాలు బయటపెట్టినందుకు మారిస్‌ను పోలీసు కమిషనర్ ద్వారా హింసించాడు. ఇవన్నీ 2016 తర్వాత బయటకు రావడంతో కొందరు ప్రజాప్రతినిథులు ఎండా కెన్నీపై తిరగబడ్డారు. పరిస్థితి చేజారుతోందని గ్రహించిన కెన్నీ తను పార్టీ అధ్యక్ష పదవి నుంచి, దాని తర్వాత ప్రధాని పదవి నుంచి తప్పుకుంటాననిమే 17న ప్రకటించాడు. ప్రకటన చేశాక కాస్త ఊగిసలాడాడు కానీ చివరకు పార్టీలో జూన్ 2న ఎన్నికలు నిర్వహించాడు. ఆ ఎన్నికలలో పార్టీ నాయకుడిగా లియో నెగ్గాడు. జూన్ 13 నుంచి కెన్నీ స్థానంలో ప్రధాని కూడా అయిపోయాడు.

చాలా సనాతన భావాలున్న దేశంగా ఐర్లండ్‌కు పేరు. రోమన్ కాథలిక్ క్రైస్తవం అక్కడ చాలా పాప్యులర్. లియో చూడబోతే సగం ఇండియన్, పైగా హోమో సెక్సువల్. ఇద్దరు పురుషులు కానీ, ఇద్దరు స్త్రీలు కాని పెళ్లి చేసుకోవచ్చా లేదా అని ఐర్లండ్‌లో 2015లో ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండం) జరిగింది. 2015 మేలో సేమ్-సెక్స్ మారేజిని ఐర్లండ్ పార్లమెంటు ఆమోదించింది కూడా. దానికి కొద్ది నెలల ముందే ఐరిష్ నేషనల్ రేడియోకి యిచ్చిన యింటర్వ్యూలో యితను బహిరంగంగా తను హోమో అని చెప్పేసుకున్నాడు. అయినా అతని పాప్యులారిటీకి ఏ లోపం రాలేదు. 2016లో మళ్లీ ఎన్నికయ్యాడు. ఐర్లండ్‌లో అబార్షన్ యిప్పటికీ చట్టవిరుద్ధమే. 'అది మరీ కఠినంగా వుంది. మార్చాలి' అంటాడితను. ఆర్థిక విధానాల విషయంలో అతను ఫ్రీ మార్కెట్ సిద్ధాంతాలను నమ్ముతాడు. అటువంటి భావాలే అతనికి పార్టీ నాయకత్వాన్ని కట్టబెట్టాయి.

అతని ఎదుట గృహవసతి, ప్రజారోగ్యం వంటి చాలా సమస్యలే వున్నాయి. అన్నిటి కంటె పెద్ద సమస్య బ్రిటన్ యూరోపియన్ యూనియన్‌లోంచి బయట పడిన తర్వాత ఎదురయ్యే సమస్య. ఏది పరిష్కరిద్దామన్నా అతనిది మైనారిటీ ప్రభుత్వమే. అందువలన కత్తి మీద సాము లాటి ఉద్యోగమే లియోది. దాన్ని ఎంత సమర్థవంతంగా ఎంతకాలం నడుపుకుని వస్తాడో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**న్యూస్, వ్యూస్ 134 జూన్ 14** **ఎమ్బీయస్ : కేరళలో ఐసిస్ ప్రభావం**

విద్యావంతులు ఎక్కువగా వున్న కేరళలో ఐసిస్ యువతను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. హిందూ, క్రైస్తవ యువతీయువకులను స్నేహితుల ద్వారా ఇస్లాం ఘనత గురించి చెప్పించి, మతం మార్పించి, పైకి సాధారణ సంస్థల్లా కనబడే కొన్ని సంస్థల్లో చేర్పించి,

మతతీవ్రవాదం బాగా నూరిపోయించి, తలిదండ్రుల నుంచి దూరం చేసి, పరిశుద్ధమైన ఇస్లాం అనుసరిస్తున్న దేశాలను చూసి తీరాలి అంటూ తన ప్రాబల్యం వున్న దేశాలకు రప్పించుకుంటోంది. ఎంతమంది ఐసిస్‌లో చేరుతున్నారో కచ్చితంగా చెప్పలేకపోయినా ఇస్లాంలోకి మతాంతీకరణలు జోరుగానే సాగుతున్నాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం 2011-16 మధ్య 5793 మంది ఇస్లాంలోకి మారారు. మతం మారిన వారిని తిరిగి హిందువులుగా మార్చే పనిలో నిమగ్నమైన ఆర్ష విద్యా సమాజం నిర్వాహకులు "ఇస్లాం, క్రైస్తవంలోకి మారిన వారు తమ పొరపాటు తెలుసుకుని మా దగ్గరకు వస్తారు. వారిలో సందేహాలు మిగిలిపోతాయి. ఇతర మతాలను హిందూమతంతో పోల్చి వాదనలు చేస్తారు. అందుకని మేము యితర మతాలను కూడా అధ్యయనం చేసి, వాటి కంటె హైందవం ఎందుకు మెరుగైనదో చెప్పాల్సి వస్తుంది. 2009 నుంచి యిప్పటివరకు కనీసం 3 వేల మందిని అలా మార్చాం. ఇప్పటికీ నెలకు కనీసం 100 మందైనా అలా వస్తూ వుంటారు." అంటున్నారు. ఇది మతాంతీకరణతో ఆగకుండా వివాహం, తదనంతరం యెమెన్ వంటి దేశాలకు పంపడం  వరకు సాగుతోంది. ఇలాటి వ్యవహారంలో అఖిల అనే అమ్మాయి విషయంలో కేరళ హైకోర్టు కలగజేసుకుని మే 24న తీర్పు యివ్వవలసి వచ్చింది కూడా.

అఖిల ఒక హిందూ మలయాళీ అమ్మాయి. తమిళనాడులోని సేలంలో శివరాజ్ హోమియోపతి కాలేజీలో బిఎచ్ఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ) చదువుతూ వుండేది. అక్కడ ఆమెకు యిద్దరు ముస్లిం స్నేహితురాళ్లు దొరికారు. వారి తండ్రి ఆబూబకర్. వారంతా ఆమెకు ఇస్లాం గొప్ప మతమని బోధించడంతో మతం మారదామని నిశ్చయించుకుంది. గత ఏడాది జనవరి 7న హౌస్ సర్జన్సీ పూర్తి చేయకుండానే, తన తల్లిదండ్రులకు చెప్పకుండానే సేలం వదిలి కేరళలోని మళప్పురంలో సాయినాబా అనే ఆమెతో కలిసి వుంటే ఆ వూళ్లోనే వున్న సత్య సారణి ట్రస్టు నిర్వహించే రెండు నెలల ఇస్లాం కోర్సులో చేరింది. 1994లో ప్రారంభించిన యీ ట్రస్టు ఇస్లాం గురించి తెలుసుకోదలచిన స్త్రీపురుషులకు 2 నెలల కోర్సు నిర్వహిస్తూ వుంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 50 మంది వుంటారు. వారిలో 30 మంది దాకా హిందువులు లేదా క్రైస్తవులే. "మేం ఇస్లాం గురించి అవగాహన పెంచుతున్నాం తప్ప మతం మారమని ఎవరినీ ఒత్తిడి చేయం. మాకో సిలబస్ వుంది. ప్రతీ నెలా ప్రభుత్వాధికారులు  వచ్చి విద్యార్థుల వివరాలు కనుక్కుని వెళుతూంటారు. మగవాళ్లకు, ఆడవాళ్లకు వేర్వేరు హాస్టళ్లున్నాయి. వారి మధ్య ప్రేమ వ్యవహారాలను మాకై మేము ప్రోత్సహించం." అని దాని నిర్వాహకులు చెప్పుకుంటారు. కూతురు మళప్పురం చేరిన విషయం తెలుసుకున్న అఖిల తండ్రి అశోకన్ కేరళ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ (వ్యక్తి ఆచూకీ చెప్పాలని కోరే అర్జీ) దాఖలు చేశాడు. అప్పటికే ఆమెకు 23 ఏళ్ల వయసు కాబట్టి, మైనారిటీ తీరిపోయిన వ్యక్తి తన యిష్టానుసారంగా ఎక్కడైనా వుండవచ్చు, మేము కలగచేసుకోము అంటూ కోర్టు ఆ అర్జీని తిరస్కరించింది. అయితే ఆమె దేశం విడిచి వెళ్లరాదని, సత్య సారణిలో కోర్సు చేస్తున్నట్లు రుజువు చూపాలని మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది.

2016 ఆగస్టులో అశోకన్ మళ్లీ కోర్టు తలుపు తట్టాడు. "మా అమ్మాయి సిరియా వెళ్లాలనుకుంటోంది. ఆ మేరకు తను పంపిన మెసేజి చూడండి." అంటూ. కోర్టు కేసు చేపట్టేసరికి అఖిల ఎక్కడికో వెళ్లిపోయిందంటూ సాయినాబా చెప్పింది. కోర్టు విస్మయం ప్రకటించింది. విచారణ నడుస్తూండగానే అఖిల ప్రత్యక్షమైంది. "నువ్వు సాయినాబాతో ఎందుకు వుంటున్నావ్? నీ వైద్యవిద్య పూర్తి చేయలేదు, తలిదండ్రుల వద్దకూ వెళ్లలేదు. ఏమిటి విషయం? పైగా నీకు గాని, సాయినాబాకు గాని పెద్దగా ఆర్జన లేదు కదా, ఇంత ఖరీదైన లాయర్లను ఎలా పెట్టుకోగలుగుతున్నారు? మీ వెనక ఎవరున్నారు?" అని కోర్టు అడిగింది. 2016 డిసెంబరు 19 న అఖిల కోర్టుకి వచ్చి "నేను సేలం వెళ్లి చదువు పూర్తి చేస్తాను." అని అఫిడవిట్ రాసి యిచ్చింది. అలా అన్నది రెండు రోజుల తర్వాత కోర్టులో హాజరై "నాకు పెళ్లయిపోయింది." అంది. ఆమె భర్త పేరు షఫీన్ జహాన్. సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ) పార్టీ సభ్యుడు. ఒక క్రిమినల్ కేసులో నిందితుడు కూడా. అతని ఫేస్‌బుక్ పోస్టులు చూస్తే అతని యెమెన్ సరిహద్దులకు వెళ్లినట్లు తెలుస్తోంది. 2016 అక్టోబరులో ఎన్ఐఏ అరెస్టు చేసిన ఐసిస్ ఏజంటు మాన్సి బురాక్‌తో సంబంధ బాంధవ్యాలున్నట్లు ఆరోపణలున్నాయి. అతనితో పెళ్లి కోసం అఖిల ఇస్లాంలోకి మారిపోయి, తన పేరును హాడియాకు మార్చుకుంది. సాయినాబా యింట్లో పెళ్లి తంతు పూర్తయింది. ఇదంతా తెలిసి కోర్టు నివ్వెరపోయింది. తన వ్యవహారాలు తనే మేనేజ్ చేసుకునేవారి పక్షాన కోర్టే బాధ్యత తీసుకునే 'పేరెన్స్ పాట్రియేట్' అనే సూత్రం కింద మే 24న ఆ వివాహాన్ని రద్దు చేసింది.

ఈ తీర్పు విని ఎస్‌డిపిఐకు పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ)లతో సంబంధమున్న ముస్లిం ఏకోపన సమితి జూన్ 5న వీధుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఎర్నాకులంలో పొద్దుటి నుంచి సాయంత్రం వరకు హర్తాల్ నిర్వహించింది. మలయాళ రచయిత ఎమ్ఎన్ కరస్సేరీ "ఈ తీర్పు వ్యక్తి స్వేచ్ఛను హరిస్తోంది." అన్నారు. పిఎఫ్ఐకు సన్నిహితంగా వుంటే "తేజస్" పత్రిక సంపాదకుడు పి. కోయా తీర్పు పక్షపాతంగా వుందని, మహిళల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. "మాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా వాళ్లిద్దరూ ఒకరి నొకరు తెలుసుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. ఈ దేశంలో సహజీవనం చేస్తే నేరం కాదు. పెళ్లి చేసుకుంటే నేరమై పోయింది. కోర్టు వాళ్లిద్దరినీ విడదీసింది. పోలీసులు ఆమెను తలిదండ్రుల వద్దకు పంపి గృహనిర్బంధంలో పెట్టారు. ఇంటినిండా సిసిటివి కెమెరాలు అమర్చారు." అని విరుచుకు పడ్డారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)–**

గల్ఫ్ దేశాలకు నాయకత్వం వహించడానికి సౌదీ అరేబియా ఉబలాటపడుతూంటుంది. పైగా దానికి అమెరికా మద్దతు కూడా వుంది. మధ్యప్రాచ్యంలో వున్న కొన్ని దేశాల పాలకులలో కొందరితో శత్రుత్వం, కొందరితో స్నేహం నెరపుతూంటుంది. పడని దేశాల్లో ఇరాన్ మొదటి స్థానంలో వుంది. ఎమిరేట్స్ వంటి దేశాలు సౌదీ బాటలో నడుస్తూ వుంటాయి. కానీ 27 లక్షల జనాభా వున్న చిన్న దేశమైన కతార్ మాత్రం తన బాటన తను పోతూ వుంటుంది. ఇరాన్ వంటి దేశాలతో సఖ్యంగా వుంటుంది. సౌదీకి దాన్ని చూస్తే ఒళ్లు మంట. ఇరాన్ పేరెత్తితేనే కంపర మెత్తిపోయే ట్రంప్ మే 22న సౌదీ అరేబియా సందర్శించి దానికి పూర్తి మద్దతు ప్రకటించాడు. రెండు రోజుల తర్వాత కతార్ అధికారిక వెబ్‌సైట్‌లలో ట్రంప్‌పై విమర్శలు, ఇరాన్‌పై ప్రశంసలు గుప్పిస్తూ వ్యాసాలు వచ్చాయి. 'ఇజ్రాయేల్‌తో స్నేహాన్ని కొనసాగిస్తాం, సౌదీ అరేబియా, యుఎఇ, ఈజిప్టుల నుంచి అవసరమైతే రాయబారులను వెనక్కి రప్పిస్తాం' అనే ప్రకటనలు కనబడ్డాయి.

ఇది చూడగానే సౌదీ తదితర దేశాలకు గంగవెర్రులెత్తాయి. కతార్ మీడియాను బహిష్కరించాయి. 'ఆ పోస్టింగ్స్ మేం పెట్టలేదు. మా వెబ్‌సైట్ ఎవరో గానీ హ్యాక్ చేశారు.' అని కతార్ ప్రకటించింది. కానీ అప్పటికే కతార్ మీడియాపై నిషేధం ప్రకటించాయి కాబట్టి సౌదీ తదితర దేశాల ప్రజలకు కతార్ వెర్షన్ తెలియరాలేదు. అవి అక్కడితో ఆగలేదు. జూన్ 5న కతార్‌తో అన్ని దౌత్య సంబంధాలు తెంపుకున్నాయి. భూ, సముద్ర, వాయు ప్రయాణాలను, రవాణాను నిషేధించాయి. రెండు వారాల్లోగా తమ పౌరులను కతార్ నుంచి వెనక్కి రప్పించుకోవాలని, తమ దేశాల్లో వున్న కతారీలను వెనక్కి పంపేయాలని ఆజ్ఞలు జారీ చేశాయి. దాని వలన కతార్ విమానాలను తమ భూభాగాలపై అనుమతించటం లేదు. కతార్ ఓడలను తమ నౌకాశ్రయాల్లోకి రానీయటం లేదు. వీరు ప్రకటన చేసిన మర్నాడు బెహరైన్, మాల్దీవులు, యెమెన్, లిబియాలు కూడా అటువంటి ప్రకటనే చేశాయి. కతార్‌పై సానుభూతి చూపుతూ వ్యాసాలు ప్రచురించేవారికి 15 సం.ఎల శిక్ష వేస్తామని యుఎఇ హెచ్చరించింది.

దీంతో కతార్‌లో కల్లోలం ప్రారంభమైంది. వారి ఆహార పదార్థాల దిగుమతుల్లో 40% సౌదీ నుంచే వస్తాయి. ప్రస్తుతం కతార్ విమానాలు చుట్టు తిరిగి వెళుతున్నాయి. ఇప్పటిదాకా సమస్య పరిష్కారం కాలేదు. నిజంగా కతార్ వెబ్‌సైట్ హ్యాక్ అయిందా? అయిందనే అని అమెరికన్ గూఢచారి సంస్థ ఎఫ్‌బిఐ అంటుంది. గల్ఫ్ దేశాల మధ్య కలతలు సృష్టించడానికి రష్యాయే హ్యాక్ చేయించిందని వారి ఆరోపణ. కానీ కతార్ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో సౌదీ తదితర దేశాలనే దోషులుగా పేర్కొన్నారు. ఆ దేశాలే తమ అఫీషియల్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి ఆ ప్రకటన పెట్టి, దాన్ని సాకుగా చూపి, తమను యిరకాటంలో పెట్టాయని ఆరోపించారు. ఒక ప్రకటన యింతటి వివాదానికి దారి తీస్తుందా అనే సందేహం రావచ్చు. దానికి చాలా నేపథ్యం వుంది.

సౌదీ అరేబియాకు కతార్‌ను తమ చెప్పుచేతల్లో వుంచుకోవాలనే కోరిక ఎప్పణ్నుంచో వుంది. షేక్ ఖలీఫా తానీ (1932–2016)ని కతార్ ఎమిర్ (పాలకుడు)గా చేయడానికి, కొనసాగడానికి అది దోహదపడింది. ఖలీఫా 1957 నుంచి తన సోదరుడు అహ్మద్ బిన్ అలీ కాబినెట్‌లో మంత్రిగా వుండేవాడు. తర్వాత ప్రధానిగా కూడా చేశాడు. 1972లో అతని నుంచి అధికారాన్ని గుంజుకుని తనే ఎమిర్ అయిపోయాడు. దానికి సౌదీ సహకరించింది. కతార్‌లో సహజవాయు నిక్షేపాలు చాలా వున్నాయి. వాటిని మరీ ఎక్కువగా వాడవద్దని సౌదీ యిచ్చిన సలహాను అతను మన్నించాడు. 1995లో అతను స్విజర్లండ్‌లో వుండగా అతని కొడుకు హమాద్ తిరుగుబాటు చేసి తను ఎమిర్ అయిపోయాడు. ఇతను ఆర్థిక విధానాల్లో కానీ, విదేశాంగ విధానాల్లో కానీ సౌదీని ఎదిరించి స్వతంత్రంగా వ్యవహరించాడు. తండ్రి విధానాలకు విరుద్ధంగా తమ కున్న వాయునిక్షేపాలను విస్తారంగా వాడకంలోకి తెచ్చాడు. ప్రపంచంలో గ్యాస్ నిలువలు అధికంగా వున్న రష్యా, ఇరాన్‌ల సరసన చేరాడు. ఇరాన్‌తో చేతులు కలిపి సౌత్ పార్స్ అని ప్రపంచంలోనే పెద్ద గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి పరిచాడు. సహజవాయువు ఎగుమతి చేసే దేశాల్లో ప్రథమస్థానాన్ని అందుకుని, గల్ఫ్‌లో అత్యంత సంపన్న దేశంగా మార్చాడు. కతార్ జనాభాలో 25% మంది భారతీయులే. అక్కడి ప్రజల తలసరి ఆదాయం 1.40 లక్షల డాలర్లు. తనకున్న ఆర్థికబలంతో రాజధాని దోహాలో అనేక అంతర్జాతీయ పోటీలు నిర్వహించసాగాడు. 2022లో ఫీఫా వ(ర)ల్డ్ కప్ అక్కడే నిర్వహించబడుతోంది. వీటితో బాటు ప్రపంచంలో అనేక చోట్ల స్థిరాస్తులు కొన్నాడు. సౌదీని లక్ష్యపెట్టడం మానేశాడు.

ఇదంతా సౌదీకి రుచించలేదు. ఇతన్ని దింపేసి ఫ్రాన్సులో తలదాచుకున్న తండ్రిని మళ్లీ అధికారంలోకి తేవాలని 1996లోను, 2005లోని తిరుగుబాటు చేయించబోయింది కానీ అవి సఫలం కాలేదు. ఈ కుట్రలలో సౌదీలతో చేతులు కలిపారన్న అనుమానంపై హమాద్ 5 వేల మంది కతార్ పౌరులకు పౌరసత్వ హక్కులు తీసివేశాడు. చివరకు పెద్దాయన 2016లో పోయాడు. సౌదీకి నచ్చని అంశాల్లో కతార్ ఆర్థికంగా బలపడడం ఒకటే కాదు, రాజకీయంగా అది వీళ్లకు ప్రతికూలంగా మారింది. 2011లో ఈజిప్టు నియంత హోస్నీ ముబారక్‌కి వ్యతిరేకంగా ముస్లిం బ్రదర్‌హుడ్ ఆందోళనలు ప్రారంభించినపుడు ముబారక్‌కి సౌదీ తదితర దేశాలు మద్దతివ్వగా, హమాద్ బ్రదర్‌హుడ్‌కి మద్దతిచ్చాడు. బ్రదర్‌హుడ్ గెలిచి, మోర్సీ ప్రధాని అయినపుడు అతని ప్రభుత్వానికీ యిచ్చాడు. కానీ కొన్నాళ్లకు మిలటరీ కుట్ర చేసి మోర్సీని దింపేసింది. అలాగే పాలస్తీనా తీవ్రవాద సంస్థ ఐన హమాస్‌కు హమాద్ మద్దతివ్వగా మితవాద సంస్థ ఫతాకు చెందిన పాలస్తీనా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌కు సౌదీ మద్దతిస్తుంది. అరబ్ స్ప్రింగ్ రోజుల్లో లిబియా, సిరియాలలో తిరుగుబాటు సంస్థలకు హమాద్ ఆర్థిక, హార్దిక సహాయాలు అందించాడు.

వీటన్నిటినీ మించి గల్ఫ్ దేశాలను మండించిన చర్య ఏమిటంటే అల్-జజీరా టీవీ నెట్‌వర్క్‌ను కతార్ ప్రారంభించడం! అరబ్ స్ప్రింగ్ సమయంలో అది గల్ఫ్, మధ్యప్రాచ్య దేశాలలోని తిరుగుబాటుదారులకు మద్దతిస్తూ వారి ప్రభుత్వాలకు ముప్పు తెచ్చిపెట్టింది. పాశ్చాత్య మీడియా దాచేసిన కోణాలను వెలికి తీస్తూ అల్-జజీరా తన ఇంగ్లీషు, అరబిక్ భాషల ప్రసారాల ద్వారా అరబ్ దేశాల్లో చాలామంది అభిమానులను సంపాదించుకుని ప్రాచుర్యంలోకి వచ్చింది. అది ప్రజల్లో అసంతృప్తిని పెంచి, తీవ్రవాదాన్ని పోషిస్తోందని సౌదీ తదితర దేశాల ఆరోపణ. 2002లో సౌదీ రాచకుటుంబాన్ని విమర్శిస్తూ అల్ జజీరా ఒక కార్యక్రమం ప్రసారం చేసినపుడు సౌదీ ప్రభుత్వం దోహా నుండి తన రాయబారిని వెనక్కి రప్పించేసి ఐదేళ్లపాటు ఏ ఉన్నతాధికారినీ పంపలేదు.

ఎవరేమన్నా కతార్ తన దారిలో తను దూసుకుపోతోంది. కొన్ని ప్రాంతాల ఆధిపత్యంపై బెహరైన్‌తో దానికి వివాదం వుంది. అది 2001లో పరిష్కారమైంది. సౌదీతో సరిహద్దు సమస్య వుంది. పరిస్థితులు యిలా వుండగానే హమాద్ తన 61వ యేట 2013లో తన అధికారాన్ని కొడుకు తామీమ్‌కు అప్పగించి స్వచ్ఛందంగా గద్దె దిగిపోయాడు. కొడుకు వచ్చిన తర్వాతైనా కతార్ విధానాల్లో మార్పు వస్తుందేమో అనుకుని సౌదీ ఆశపడింది కానీ తామీమ్ తండ్రి విధానాలే పాటిస్తున్నాడు. 2014 మార్చిలో సౌదీ, బహరైన్, యుఏఇ తమ రాయబారులను కతార్ నుంచి వెనక్కి రప్పించుకున్నపుడు, రాజీ యత్నాలు జరిగి, కాస్త దిగి వచ్చాడు. 1979లో ఇరాన్‌లో రాజరికాన్ని కూలదోసి విప్లవ ప్రభుత్వం ఏర్పడ్డాక, దానికి వ్యతిరేకంగా గల్ఫ్ దేశాలన్నీ కలిసి జిసిసి (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్) ఏర్పరచుకున్నాయి. దానికి అమెరికా సైనిక సహాయం అందిస్తోంది. విదేశ వ్యవహారాల్లో, భద్రతాపరమైన విషయాల్లో జిసిసి చెప్పినట్లు వింటానని, బ్రదర్‌హుడ్ సభ్యులను తమ దేశం నుంచి పంపించివేస్తాననీ, ఈజిప్టులో అల్ జజీరా ఆఫీసు మూసేస్తాననీ తామీమ్ ఒప్పుకున్నాడు. సౌదీకి రాజు కావాలని ఆశపడుతున్న ప్రస్తుత యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్, యుఏఇ యువరాజు మొహమ్మద్ బిన్ జాయేద్ యిది చాలదని, తామీమ్‌కు యింకా బాగా బుద్ధి చెప్పాలని ఎదురు చూస్తున్నారు. ఇంతలో ఓ ఘటన జరిగింది.

2015 డిసెంబరులో కతార్ రాజకుటుంబానికి చెందిన కొందరు, వారి స్నేహితులు మొత్తం 26 మంది ఇరాక్‌లో ముతన్నా ప్రాంతంలోని అడవిలోకి వేటకు వెళదామనుకున్నారు. అక్కడ టెర్రరిస్టులు ఎవరూ రారు కదా అని ఇరాక్‌ను సంప్రదిస్తే రారు, సురక్షిత ప్రాంతమే అని హామీ యిచ్చింది. సరే అని వెళ్లారు. ఇరాన్ మద్దతిచ్చే షియా మిలిటెంట్ గ్రూపు కతేబ్ హెజ్‌బొల్లా అనే సంస్థ వారిని కిడ్నాప్ చేసింది. వదలాలంటే పెద్ద మొత్తం యివ్వాలంది. కతార్ వాళ్లకు యివ్వడం యిష్టం లేదు. నెలల తరబడి చర్చలు జరిగాయి. 15 నెలల తర్వాత రాచకుటుంబీకులు కూడా వున్నారు కాబట్టి వాళ్లడిగినంతా యివ్వక తప్పదనుకున్నారు. ఈ ఏప్రిల్ 15న అర బిలియన్ డాలర్ల విలువైన కరెన్సీని 23 సంచుల్లో పట్టుకెళ్లి బాగ్దాద్‌కు వెళ్లి యిచ్చారట. మేం ఏమీ ఏమీ యివ్వలేదని కతార్ అంటోంది కానీ ఆరు రోజుల తర్వాత బందీలందరూ విడుదలయ్యారు. ఈ విధంగా ఇరాన్‌కు, అది మద్దతిచ్చే మిలిటెంట్ గ్రూపులకు డబ్బు సమకూర్చినందుకు సౌదీ తదితరులకు కతార్‌పై విపరీతంగా కోపం వచ్చింది. అది జరిగిన నెల్లాళ్లకే ట్రంప్ సౌదీ రావడం, కతార్ వెబ్‌సైట్‌లో కామెంట్స్ రావడం, తన్మూలంగా నిషేధం విధించడం జరిగాయి. పరిస్థితి చక్కదిద్దుదామని కువాయిత్ రాజు షేక్ సబా అల్-అహ్మద్ జూన్ 6న రియాథ్‌కు వెళ్లాడు. అవేళ తమీమ్ తమపై నిషేధానికి వ్యతిరేకంగా ప్రసంగిద్దామనుకున్నా సబా సలహాపై ఆగిపోయాడు. గతంలో సబా కతార్-సౌదీ వివాదాల్లో పెద్దమనిషిగా వ్యవహరించాడు. అందుకే యీ గౌరవం. కానీ యీసారి పని కాలేదు. టర్కీ, సుదాన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి ముందుకు వస్తున్నాయి. సౌదీ, యుఏఇ దురుసుగా వున్నాయి. "ముస్లిమ్ బ్రదర్‌హుడ్‌తో, ఇరాన్‌తో, హమామ్‌తో కతార్ అన్ని సంబంధం బాంధవ్యాలు తెంచుకోవాలి." అంటున్నాయి. కతార్ ఒక్కటే టెర్రరిస్టులకు సాయం చేస్తోందనడానికి లేదు. అలాటి ఆరోపణలు సౌదీలపై, ఎమిరేట్స్‌పై కూడా వున్నాయి.

ఈ వివాదంలో ఎటువైపు మొగ్గాలి అనే విషయంపై అమెరికాలో కాస్త గందరగోళం వుంది. రెండవ గల్ఫ్ యుద్ధం తర్వాత అమెరికా సౌదీ అరేబియా, బహరైన్‌లతో బాటు కతార్‌లోని అల్ ఉదీద్ వద్ద కూడా మిలటరీ బేస్‌లు నెలకొల్పింది. అక్కడ 11 వేల మంది అమెరికన్, సహచర దేశాల సైనికులు పనిచేస్తున్నారు. అక్కణ్నుంచి 100 ఎయిర్‌క్రాఫ్టులు ఆపరేట్ అవుతున్నాయి. ఇరాన్‌కు వ్యతిరేకింగా అక్కడి దేశాలన్నీ కూడగట్టాలని చూస్తున్న ట్రంప్‌కు సౌదీ డబ్బిచ్చి ఆకట్టుకుంటోంది. కానీ కతార్‌ను పూర్తిగా వ్యతిరేకం చేసుకునే స్థితిలో అమెరికా లేదు. రాజీకి ప్రయత్నించినా సౌదీ, యుఏఇ దిగి రావటం లేదు. 'మేం చెప్పబోయే దానికి కతార్ తల ఒగ్గకపోతే యీ బహిష్కారం ఏళ్ల తరబడి సాగుతుంది' అని ప్రకటనలు చేస్తున్నాయి. దానితో విసిగిన యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ట్రంప్ గతంలో మాట్లాడినదానికి భిన్నంగా మంగళవారం నాడు సౌదీ, యుఎఇలను నిలదీసింది – "ఏ కారణాల చేత మీరు కతార్ దిగ్బంధం చేస్తున్నారు? అది మొదలై రెండు వారాలైనా మీకేం కావాలో యిప్పటివరకు మీరెందుకు చెప్పటం లేదు? కతార్ వెబ్‌సైట్ హ్యాక్ కాలేదనడానికి, కతార్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తోందని అనడానికి మీ వద్ద వున్న ఆధారాలేమిటి?" అని. స్టేట్ డిపార్టుమెంటుకు అధినేతగా వున్న రెక్స్ టిల్లర్‌సన్ గతంలో ఎక్సాన్ మోబిల్ అనే ఆయిల్ కంపెనీని నిర్వహించాడు. దానికి కతార్‌లో చాలా పెట్టుబడులున్నాయి. అందుకే కాబోలు అతను 'అందరూ దిగి రావాలి." అంటున్నాడు. "ముందు మా మీద విధించిన ఆంక్షలు ఎత్తివేస్తేనే చర్చలకు వస్తాం." అంటున్నాడు కతార్ విదేశాంగ మంత్రి. ఇది ఎన్నాళ్లు సాగుతుందో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017) (ఫోటోలు – సౌదీ అరేబియాలో ట్రంప్, కతార్ పాలకుడు తమీమ్)**

సినారె స్మారకసభలు యింకా జరుగుతూనే వున్నాయి. ఆయనను వ్యక్తిగతంగా తెలిసినవాడిగా కొన్ని విషయాలు రాద్దామనిపిస్తోంది. అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని అరుదుగా చూస్తాం. కవుల్లో ఆయనది ప్రత్యేకస్థానం. ప్రాచీన కవితను ఆయన నిరసించలేదు, మరీ ఆధునిక పోకడలు పోలేదు. రెండిటికీ వారధి లాంటివాడు. ఆయన కవిత్వం నాకు హాయిగా తోస్తుంది. చిన్నప్పటి చదువంతా ఉర్దూలోనే సాగడం వలన ఉర్దూ సాహిత్యపు వైభవాన్ని సొంతం చేసుకుని దాన్ని తెలుగులోకి దించగలిగారు. దాశరథికి తప్ప వేరే తెలుగు సినీ కవులకు యీ సౌలభ్యం లేకపోయింది. అందుకే యితరులు వుపయోగించని అనేక విలక్షణ పదప్రయోగాలు ఆయన చేయగలిగారు. ఇంగ్లీషు కూడా బాగా చదువుకున్న వ్యక్తి. మంచి చదువరి. పండితుడు. అధ్యాపకుడు, విమర్శకుడు, పరిశోధకుడు కాబట్టి ప్రాచీన, ఆధునిక కవులు, సాహిత్యకారులందరినీ బాగా అధ్యయనం చేశాడు. దాశరథికి యీ సౌలభ్యం లేకపోయింది. తొలిదశలో దాశరథి, సినారె కలిసి సికింద్రాబాదు పబ్లిషరు కొండా శంకరయ్యగారికి బాలల బొమ్మల రామాయణం వంటివి రాశారు. తెలంగాణ కవిద్వయంగా మద్రాసులో, ఆంధ్రప్రాంతంలో పర్యటించి తమ కవిత్వంతో ఆకట్టుకున్నారు. అయితే కాలక్రమంలో దాశరథి కంటె నారాయణ రెడ్డి ముందుకు దూసుకుపోయారు. అనేక రకాలుగా విస్తరించారు. ఉస్మానియాలో ఆయన ఉద్యోగం ఆయనకు బాగా సహకరించింది. ఆయన చాలా మంచి ఉపాధ్యాయుడని చెప్తారు. తక్కిన క్లాసుల విద్యార్థులు కూడా యీయన లెక్చర్లు వినడానికి వచ్చి కూర్చునేవారట.

నారాయణ రెడ్డిగారు రూపసి. కృష్ణశాస్త్రి గారి తర్వాత అందమైన కవుల్లో సినారె పేరు చెప్పాలి. శేషేంద్ర శర్మగారు కూడా ప్రత్యేకంగా కనబడేవారు కానీ ఆయనను చూస్తే నా కెందుకో ఆత్మీయతాభావం కలిగేది కాదు. నారాయణరెడ్డిగారి ఎప్రోచబుల్‌గా వుండేవారు. పైగా మంచి వక్త. ఆరుద్రగారు ఓ సారి అన్నారు – రాత టెక్నిక్కు వేరు, కూత టెక్నిక్కు వేరు అని. కవులందరూ, రచయితలందరూ మంచి వక్తలు కాలేరు. శ్రీశ్రీ, ఆరుద్ర కూడా గొప్ప కవులే కానీ మంచి వక్తలు కారు. నారాయణరెడ్డిగారు మాటలు పొదుగుకుంటూ, ఆచితూచి మాట్లాడుతూ, మాటవిరుపుతో చమత్కారం సాధిస్తూ ఎలాటి సభనైనా రక్తి కట్టించగలరు. హైదరాబాదులో తర్వాత్తర్వాత అనేకమంది వ్యాఖ్యాతలు వచ్చారు కానీ 40, 50 సంవత్సరాల క్రితం నుంచి ప్రభుత్వ ఫంక్షన్ కానీ, సినిమా ఫంక్షన్‌కానీ ఆయనే వ్యాఖ్యానం చెప్పేవారు. చక్కగా రాసుకున్న స్క్రిప్టుకు అప్పటికప్పుడు సమయస్ఫూర్తితో జోడించిన చెణుకులు జోడిస్తూ ప్రేక్షకులను అలరించేవారు. వ్యాఖ్యానమన్నా, ప్రసంగమన్నా నారాయణ రెడ్డిగారినే అందరూ అనుకరించేవారు – ఎట్‌లీస్ట్ హైదరాబాదులో! కవిత్వం చదివే ధోరణిలో కూడా ఆయన్నే అనుకరించేవారు. కొన్ని వాక్యాలు రిపీట్ చేసినపుడు ఆయన వేర్వేరు విధాలుగా ధ్వనింపచేసి చప్పట్లు అందుకునేవాడు. ఆ టెక్నిక్కు పట్టుబడని వాళ్లు కూడా ఆయన్ని అనుకరిస్తూ ప్రతీ వాక్యం రిపీట్ చేసి బోరు కొట్టించేవారు. నారాయణరెడ్డి గారు అధ్యాపకుడు కాబట్టి అనేకమంది ప్రత్యక్ష శిష్యప్రశిష్యులున్నారు. ఆయన కవి, ప్రసంగకర్త, వ్యాఖ్యాత కూడా కాబట్టి అయనను అనుకరించే అనేకమంది ఏకలవ్య శిష్యులూ ఏర్పడ్డారు.

హైదరాబాదులో ఒక పక్క పాఠాలు చెపుతూ, మరో పక్క సభల్లో విరివిగా పాల్గొంటూ, యివి చాలనట్లు వారాంతాలలో మద్రాసుకి వెళ్లి సినిమా గీతాలు రాసి వచ్చేవారు. ఆయన ప్రధానంగా గేయకవి. అద్భుతమైన లలితగీతాలు, గేయకావ్యాలు రాశారు. అందువలన సినిమా పాటలకు యీజీగా మళ్లగలిగారు. ఆయన సినీరంగ ప్రవేశం గురించి చాలా మందే రాశారు. గత పదేళ్లగా ఆయన సభల్లో పదేపదే చెప్పుకున్నారు. ఒక్కటి మాత్రం నిజం – ఆయన వేగంగా, క్వాలిటీ తగ్గకుండా రాయగలిగేవాడు. మద్రాసులోనే నివాసం వున్నవాళ్లు ఎంత ఔట్‌పుట్ యిచ్చారో, యీయన హైదరాబాదు నుంచి వెళ్లి కూడా అంతా యిచ్చేవాడు. మళ్లీ అందులో కూడా అన్ని రకాలూ రాయగలిగాడు. అందుకే శ్రీశ్రీ వెక్కిరించాడు – సినారె, భళారె, సినీ రె–డీమేడ్ సరుక్కీ తయారె అని. ఈ లిమరిక్‌కు కాప్షన్ "కిరాణాకొట్టు" అని పెట్టాడు. అంటే ఏ సరుకు కావాలంటే అది దొరుకుతుందన్నమాట.

ఆయన ఏయే గొప్ప పాటలు రాశాడన్న విషయం నేను రాయటం లేదు. చాలామందే రాశారు. తను రాసిన పాటల నేపథ్యం గురించి ఓ పత్రికలో "పాటలో ఏముంది? నా మాటలో ఏముంది?" అనే శీర్షిక నిర్వహించి, తర్వాత పుస్తకాలుగా కూడా విడుదల చేశారు. పాటల్లో కొత్త పలుకుబళ్లు పరిచయం చేశారు. నిర్మాత దర్శకులతోనే కాదు, సాటి రచయితలతో కూడా ఎన్నడూ పేచీలు పడినట్టు లేదు. "కర్ణ" సినిమాకు అన్ని పాటలూ రాస్తున్నపుడు దానికి పోటీగా "కురుక్షేత్రం" తీస్తున్న కృష్ణ తమకూ రాయమని అడిగారు. ఆ సినిమాలో లేని ఘట్టమైతేనే రాస్తాను అని చెప్పారు సినారె. సుభద్రార్జునుల మధ్య పాట ఆ సినిమాలో లేదుగా, అది రాయండి అన్నారు కృష్ణ. ఆ పాటే 'మ్రోగింది కల్యాణవీణ'! మద్రాసు రచయితలతో పోలిక చెప్పినపుడు యింకో విషయం కూడా చెప్పాలి. వాళ్లు కొన్ని సినిమాలకు కథ, మాటలు కూడా రాసేవారు. ఈయన వాటి జోలికి పోలేదు. చిత్రపరిశ్రమ హైదరాబాదుకి తరలి వచ్చాక కూడా ఆయన సినిమాలకు కథలు రాస్తాననలేదు. ఇక మాటల విషయానికి వస్తే నాకు తెలిసి మూడు సినిమాలకు రాశారు. వైఫల్యాన్ని రుచిచూశారు.

మొదటిది "ఏకవీర". డైలాగులు అద్భుతంగా, పూర్తి వచన కవిత్వంలా వుంటాయి. కానీ సినిమా చూసేది సగటు ప్రేక్షకుడు. హాల్లో వుండగా అంతంత కవిత్వాన్ని ఆస్వాదించడం కష్టం. సినిమా అంటే హీరో వలచిన హీరోయిన్‌ను సాధించి పెళ్లాడాలి. ఆ సినిమాలు యిద్దరు హీరోలు. ఇద్దరి ప్రేమా విఫలమే. ఇద్దరు హీరోయిన్లు, వాళ్లిద్దరి ప్రేమా విఫలమే. ఇంత మొరోజ్ థీమ్‌కు తోడు

అప్పటికప్పుడు అర్థం కాని డైలాగులు తోడవడంతో సినిమా ఫ్లాపయింది. ఆత్రేయ నడిగారట – 'ఏకవీర డైలాగులు ఎలా వున్నాయి?' అని. ''బాగున్నాయి. తెలుగులో వుంటే యింకా బాగుండేవి.'' అన్నారట! సినారె డైలాగులు రాసిన మరో సినిమా ''అక్బర్, సలీం, అనార్కలి'' ఆ చిత్ర దర్శకనిర్మాత ఎన్టీయార్ మొఘల్ ఏ ఆజమ్ వలన చాలా ప్రభావితమై పోయారు. తను పృథ్వీరాజ్ కపూర్‌ను యిమిటేట్ చేయడమే కాక, తెలుగు సినిమా డైలాగులు ఆ సినిమా డైలాగుల ఫక్కీలో రాయమని సినారెను అడిగారు. దాంతో తెలుగు సింటాక్స్‌లో బదులు ఉర్దూ సింటాక్స్‌లో డైలాగులు తయారయ్యాయి. ఉదాహరణకి 'మీరెప్పుడు వస్తారు?'కి బదులు 'వస్తారు మీరు ఎప్పుడు?' టైపన్నమాట. దాంతో ఆ సినిమా డైలాగులూ జనాలకు నచ్చలేదు. చిత్రసీమ హైదరాబాదుకి తరలి వచ్చాక సినారెది మోనోపలీ కాలేదు. అప్పటికే పోటీగా వేటూరి వచ్చేశారు. ఈయనలాగే అన్ని తరహా పాటలూ రాశారు. సినారెకు అశ్లీలగీతాలు రాయకూడదనే పట్టింపు వుంది. వేటూరికి లేదు. ఈయన లాగే ఆయనా వేగంగా రాసేవారు. సినారె లాగే పాటలు తప్ప మాటల జోలికి, కథ జోలికి వెళ్లలేదు.

ఆయనలో చెప్పుకోదగిన మరొక కోణం – ఆయన మంచి ఎడ్మినిస్ట్రేటర్. అనేక పదవులు అతి సమర్థవంతంగా నిర్వహించారు. ఏ పదవిలో పనిచేసినా దానికి వన్నె తెచ్చారు. కులపక్షపాతం, ప్రాంతీయపక్షపాతం, అవినీతి వంటి ఆరోపణలు ఎప్పుడూ ఆయన దరి చేరలేదు. అయితే ఆయన స్వతహాగా లౌక్యుడు. అధికారంలో ఎవరున్నా వారితో సర్దుకుపోగల లక్షణం వుంది. పదవుల కోసం బహిరంగంగా భజన చేసినట్లు కనబడలేదు. హుందాగా ప్రవర్తిస్తూనే పనులు జరిపించుకున్నారు. అందుకే ఆయన కెరియర్‌లో ఉత్థానపతనాలు లేవు. ఎప్పుడూ ఎదుగుతూనే పోయారు. ఆయనకు జ్ఞానపీఠ్ వచ్చినపుడు లాబీయింగ్ వలనే వచ్చిందని కొందరు విమర్శించారు. నా దృష్టిలో ఆయన దానికి పూర్తిగా అర్హుడు. పద్మభూషణ్‌కూ తగినవాడే. భారతరత్న వస్తుందని ఆయన ఆశించారు కానీ రాలేదు.

రాజ్యసభ ఎంపీగా కూడా రాణించారు. అనేకమంది సినిమా నటులు, క్రీడాకారులు, కళాకారులు రాజ్యసభ ఎంపీలుగా వున్నపుడు సభలకు వెళ్లేవారు కారు. వెళ్లినా నోరు విప్పేవారు కారు. కానీ యీయన మాత్రం తన పదవీకాలంలో 600 దాకా ప్రశ్నలు వేశారట. ఖుశ్వంత్ సింగ్ వంటి జర్నలిస్టు కూడా రాజ్యసభ సభ్యుడిగా యింత చురుగ్గా వున్నాడనుకోను. ఎంపీగా ఎంపీలాడ్స్ నిధులను ఆయన చక్కగా వినియోగించారు. అనేక సాంస్కృతిక సమాజాల హితానికి విరాళాలిచ్చారు. ఆ నిధులను అమ్ముకునే ఎంపీలు కూడా వున్నారని వింటూ వుంటాం. కానీ అలాటి ఖర్మ ఎప్పుడూ పట్టలేదు. మొదటినుంచి దర్జాగానే బతికాడు. దర్జాగానే వెళ్లిపోయాడు.

నాకు చిన్నప్పటి నుంచి ఆయన కవిత్వం యిష్టం. ''కర్పూర వసంతరాయలు'', ''నాగార్జున సాగరం'', ''మధ్యతరగతి మందహాసం''... యిలా ఏం రాసినా నచ్చేది. ''స్రవంతి'' అని దక్షిణ భాషా హిందీ ప్రచార సభ వారు మాసపత్రిక ప్రచురించేవారు. దానిలో ఆయన రచనలు చాలా వచ్చేవి. మా వరప్రసాద్‌కి కూడా ఆయన అభిమాన రచయిత. ఆయన గేయకావ్యాలపై మేం నడిపిన లిఖిత మాసపత్రికలో వ్యాసాలు రాశాడు. ఇద్దరం కలిసి యువభారతి సమావేశాలకు వెళ్లి యితరుల ఉపన్యాసాలతో బాటు సినారె ఉపన్యాసాలు కూడా విని ఉత్తేజితులమౌతూ వుండేవాళ్లం. వరప్రసాద్ పారిశ్రామికవేత్త అయ్యాక పారిశ్రామికవేత్తల సమావేశం ఒకదానిలో చక్కటి తెలుగులో మంచి ప్రసంగం చేశాడు. ముఖ్య అతిథిగా వచ్చిన సినారె చాలా యింప్రెస్ అయి 'మీరెవరు?' అని వాకబు చేశారు. వరప్రసాద్ సంతోషంతో తలమునకలై ఆయనతో స్నేహం పెంచుకుని, వాళ్లింటికి తరచుగా భోజనానికి పిలిచేవాడు. ఆ విధంగా ఆయనకు చాలా ఆప్తుడయ్యాడు. సినారె ఒక పుస్తకాన్ని వరప్రసాద్‌కు అంకితం యిచ్చారు కూడా.

నేను 1995లో హైదరాబాదుకి తిరిగి వచ్చాక వరప్రసాద్ ద్వారా సినారె పరిచయమయ్యారు. మేము ''హాసం'' పత్రిక పెట్టినపుడు ఆయన ప్రోత్సహించారు. బాగోగులు చెప్పేవారు. ''హాసం'' పుస్తకాలు ప్రచురణ చేపట్టాక ఎస్.వి.రామారావు గారు రాసిన ''సినారె సినీసూక్తులు'', ఎంకె రాము గారు రాసిన ''సినారె కవిత్వంలో లయాత్మకత'' పుస్తకం ప్రచురించాం. మేం వేసిన అనేక పుస్తకాలు ఆయన ఆవిష్కరించారు. ఎస్ వి రామారావుగారి ఆధ్వర్యంలో మేం నడిపే మా ''హాసం క్లబ్బు''కు సినారె అనేకసార్లు వచ్చారు. హాస్యకవితలు, హాస్యరచనలు చేయకపోయినా ఆయనకు హాస్యం యిష్టం. వచ్చి జోకులు చెప్పేవారు. మేం ప్రత్యేకంగా ఆహ్వానించకపోయినా సరే, మనవాళ్లదేగా అంటూ వచ్చేసేవారు. కొన్ని విషయాల్లో ఎంతో పట్టుదలగా వుండే ఆయన, మనుషులు నచ్చితే ఎలాటి భేషజాలకూ పోరు. ఎన్టీయార్‌కు వ్యతిరేకంగా తీసిన ''మండలాధీశుడు'' సినిమాలో సారథి అనే హాస్యనటుడు సినారెను ప్యారడీ చేశాడు. ఎన్టీయార్ పాత్ర వేసిన కోట శ్రీనివాసరావుపై ఎన్టీయార్ అభిమానులు మండిపడ్డారు. సినారె పాత్రను హాస్యాస్పదం చేసినందుకు ఆయన అభిమానులూ నొచ్చుకున్నారు. కానీ ఆయన సారథిపై వ్యతిరేకత ఏమీ పెట్టుకోనట్లుంది. ఓ సారి సారథికి ''హాసం క్లబ్బు'' తరఫున సన్మానం చేస్తున్నాం. సినారె ఫోన్ చేసి 'ఇవాళ కార్యక్రమం ఏమిటి?'' అని అడిగి 'సారథికి సన్మానం' అని చెపితే 'సరే, నే వస్తా' అంటూ వచ్చి ఆయన చేతుల మీదుగా సన్మానం చేశారు.

సభాకార్యక్రమాల్లో సినారె అనే అంశంపై పెద్ద వ్యాసమే రాయవచ్చు. సాహిత్యసమాజాల పాలిటి ఆయన కల్పతరువు. అర్ధశతాబ్దిగా చూశాను. ఏ చిన్న సంఘం వాళ్లు వెళ్లి పిలిచినా ఆయన వచ్చి ప్రసంగించి ప్రోత్సహించేవారు. పెద్దతనం వచ్చాక రోజూ సభలకు వెళ్లడం హాబీగా మారింది. బహుశా సెలక్టివ్ కూడా అయ్యారేమో. కానీ ఎన్నో దశాబ్దాల పాటు అనేక ఔత్సాహిక కార్యకర్తలను ప్రోత్సహిస్తూ వచ్చారు. యువభారతి వంటి గొప్ప సంస్థకు ఆయన మూలస్తంభం. ఆంధ్ర సారస్వత పరిషత్ అయితే చెప్పనే అక్కరలేదు. ఎంతో చేశారు. అందుకే ఆయన భౌతిక కాయాన్ని అక్కడ కొద్దిసేపు వుంచారు. హైదరాబాదు అనే కాదు, అనేక వూళ్లకు

వెళ్లి ప్రసంగాలు చేసి, అక్కడి సభలకు గ్లామర్ తెచ్చారు. గత పది, పదిహేను ఏళ్లగా రోజూ రవీంద్ర భారతికో, త్యాగరాయ గానసభకో వచ్చి ప్రసంగించి, 8, 8.30 లోపున వెళ్లిపోయేవారు. చాలా సందర్భాల్లో ఆయనే సభాధ్యక్షుడు కాబట్టి అప్పట్లోగా సభ ముగించమనేవారు. ఎవరైనా దీర్ఘోపన్యాసం చేసినా, చెప్పినదే చెపుతున్నా అసహనం ప్రదర్శించేవారు. ఆపేయమనేవారు. తను మాట్లాడేటప్పుడు వేదిక మీద వున్నవారు తమలో తాము మాట్లాడుకుంటూ వుంటే మందలించేవారు.

ఆయన సభలో వున్న గంటా, గంటన్నరా నిర్వాహకులు కానీ, గాయనీగాయకులు కానీ, ఆర్కెస్ట్రా కానీ, వక్తలు కానీ, అందరూ చాలా జాగ్రత్తగా ఒళ్లు దగ్గర పెట్టుకుని వుండేవారు. పాటలకు రీసౌండ్ పెట్టినా, ఆర్కెస్ట్రా మరీ లౌడ్‌గా వున్నా మార్చమనేవారు. పాటలో శ్రావ్యత వుండాలని నొక్కి చెప్పేవారు. ఒక హెడ్మాస్టరులా అందర్నీ అదిలించేవారు. యువభారతి నాటి రోజుల్లో ఎవరైనా వ్యక్తి గురించి ప్రసంగవ్యాసాలుండి వినబుద్ధిగా వుండేవి. ఈ రోజువారీ మీటింగుల్లో ఒక అంశం గురించి దీర్ఘంగా మాట్లాడడం వుండేది కాదు. పైగా యితర వక్తలు కూడా వుంటారు. అందుకని 10 ని.ఎలు దాటకుండా తన స్వోత్కర్ష కాస్త చెప్పుకుని సన్మానితుల గురించో, సభలో అంశం గురించో ఒకటి రెండు చక్కటి మాటలు చెప్పి ముగించేవారు. పోనుపోను చర్వితచర్వణమై పోయి, కాస్త బోరు కొట్టేది. కానీ ఎప్పటికప్పుడు ఆయన పదాలకు కొత్త విరుపులు వేసో, కొత్త పదబంధం సృష్టించో చివరకు బాగుంది అనిపించేవారు. నేను మొదటిసారి ఆయన ఎదుట సభలో మాట్లాడినపుడు నెర్వస్‌గా ఫీలయ్యాను. అప్పటికే మాట్లాడడం అలవాటైనా, అవేళ క్లుప్తంగా, ముచ్చటగా ప్రసంగం తయారుచేసుకుని యింట్లో రెండు, మూడు రిహార్సల్స్ వేసుకుని మాట్లాడాను. విని ఆయన తలవూపారు. చాలు బాబూ అనుకున్నాను. తర్వాత చాలాసార్లు మాట్లాడే సందర్భం వచ్చింది.

నారాయణరెడ్డిగారిలో వున్న సుగుణాలు రాశాక, ఆయనలో నాకు నచ్చని అంశం కూడా రాయకపోతే యీ ఎలిజీ సమగ్రం కాదు. 1969 తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగినపుడు ఆయన సమైక్యవాది. ఆ విషయాన్ని ధైర్యంగా చెప్పారు కూడా. 'వీర తెలంగాణ నాది, వేరు తెలంగాణా కాదు' అని. ఆయనకు అప్పుడు అశోక్‌నగర్‌లో యిల్లుండేది. కట్టేనాటికి ముగ్గురు కూతుళ్లే కాబోలు, వాళ్ల పేర్లు గంగ, యమున, సరస్వతి కాబట్టి యింటికి 'త్రివేణి' అని పెట్టుకున్నారు. తర్వాత నాలుగో అమ్మాయి కృష్ణవేణి కూడా పుట్టింది. ఆ యింటి గోడమీద ఉద్యమకారులు 'వీర తెలంగాణ యోధుడా, వేరు తెలంగాణ కోరు' అని బొగ్గుతో రాశారు. 'తెలుగుజాతి మనది' పాట రాసినందుకు ఆయనను తిట్టిపోశారు. అయినా చలించలేదు. అలాటిది యిటీవలి ఉద్యమంలో మాత్రం ఆయన వేరు తెలంగాణ కావాలి అంటూ ప్రకటన యిచ్చారు. అప్పటి సమైక్యవాదులు కొందరు యిప్పుడు వేర్పాటువాదులు అయ్యారు. అభిప్రాయాలు మార్చుకోవడంలో తప్పు లేదు.

కానీ అన్యాయం ఏమిటంటే – ఆయన 'తెలుగుజాతి మనది – పాట ఎన్టీయార్ చెపితే రాశాను. అది నా అభిప్రాయం కాదు' అని స్టేటుమెంటు యిచ్చారు. పాటలో ఏముంది..? మొదటి సంకలనంలో ఆ పాట ఎలా రూపుదిద్దుకుందో ఆయనే స్వయంగా రాశారు. 'తల్లా? పెళ్లామా?' సినిమాకు యీయన పాటలన్నీ రాశారు. ఆ సందర్భంగా మద్రాసులో వున్న ఎన్టీయార్‌తో బుర్లు చెపుతూ వుండగా వేర్పాటు ఉద్యమం గురించి ఎన్టీయార్ వాకబు చేశారు. 'నేను సమైక్యవాదం ప్రబోధిస్తూ ఒక పత్రికలో ఒక గేయం రాశాను. అది అచ్చయింది. వినండి' అంటూ సినారె పాడి వినిపించారు. ఎన్టీయార్ అది వింటూనే యిన్‌స్పయిరై 'దీన్ని పాటగా రాసి యివ్వండి. సినిమాలో సందర్భం లేకపోయినా సందర్భం కల్పించి మరీ పెడతాను' అన్నారు. ఈయన పాటగా మార్చి యిచ్చారు. అలాటిది యిప్పుడు అది నా అభిప్రాయం కాదు అని ఎలా అంటారు? ఈ విషయాన్ని ఆత్మీయులు అడగ్గా 'ఏం చేయమంటారు? పాతికమంది యింటి మీద పడి ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా స్టేటుమెంటు యిస్తావా? లేదా? అని కూర్చున్నారు. తప్పలేదు' అని వాపోయారు. ఆ మాట నిజమే కావచ్చు, హైదరాబాదులో మీడియా కానీ, ఉద్యమకారులు కానీ ఎంత ఎగ్రెసివ్‌గా వున్నారంటే సమైక్యవాదం గురించి ఎవరూ ధైర్యంగా మాట్లాడలేకపోయారు. నిజం చెప్పాలంటే సినారెను నెత్తిన పెట్టుకుని మోసినవారిలో ఆంధ్ర మూలాల ఆర్గనైజర్లే ఎక్కువమంది వున్నారు. ఆయన ఎవరి పట్లా వివక్షత చూపించలేదు కూడా. అయితే యింత స్టేచర్ వున్న వ్యక్తి కూడా ఆ బెదిరింపులకు లొంగారే అని బాధ వేస్తుంది. ఆయన యిబ్బందులు ఆయనకుండవచ్చు. ఏది ఏమైనా ఆయన మహానుభావుడు. ఆయనకు యిదే నా అశ్రుతర్పణం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**జూన్ 21,22 ఎమ్బీయస్ : ఓడి గెలిచిన ఛాందసుడు కోర్బిన్**

బ్రిటన్ ఎన్నికలలో కన్సర్వేటివ్ (టోరీ) పార్టీయే మళ్లీ గెలిచిందని అందరికీ తెలుసు. అయినా నెగ్గిన తెరీసా మే కంటె విశ్లేషకులు ఎక్కువగా చర్చిస్తున్నది 262 సీట్లు మాత్రమే తెచ్చుకున్న లేబరు పార్టీ లీడరు జెరెమీ కోర్బిన్ గురించి! బ్రెగ్జిట్ సందర్భంగా బేరసారాలు ఆడడానికి 650 సీట్ల పార్లమెంటులో తనకు ప్రస్తుతం వున్న ఐదు సీట్ల ఆధిక్యత చాలదు, మరింత బలం కావాలంటూ కన్సర్వేటివ్ ప్రధాని మే మూడేళ్ల ముందస్తుగా ఎన్నికలు ప్రకటించి జూదమాడింది. కానీ ఆవిడ అది జూదమనుకోలేదు. ప్రజలు తనకు బ్రహ్మాండమైన మెజారిటీ కట్టబెడతారనుకుంది. అయితే లెక్క తన్నేసింది. గతంలో కంటె ఓట్ల శాతం 5.5% పెరిగినా సీట్లు మాత్రం 13 తగ్గి 317 మాత్రమే తెచ్చుకోగలిగింది. త్రిశంకు సభ తప్పించుకోవడానికి చాలా విషయాల్లో భావైక్యత లేని ఉత్తర ఐర్లండ్‌కు చెందిన పది సీట్ల ఫార్-రైటిస్టు డెమోక్రాటిక్ యూనియనిస్టు పార్టీ (డియుపి)తో పొత్తు పెట్టుకుని సింపుల్ మెజారిటీ కంటె జస్ట్ 1 ఎక్కువ సంపాదించింది.

వాళ్లను తృప్తి పరచడానికి నిన్ననే ఐర్లండ్‌కు బిలియన్ పౌండ్ల ఋణసహాయాన్ని ప్రకటించింది. ఇప్పటికే అనేక పథకాలకు నిధులు చాలకుండా సతమతమవుతున్న బ్రిటన్ ఆర్థికవ్యవస్థకు యిదో భారం. ఈ విధంగా ప్రధాని మే యిమేజి దిగజారగా, అవతల అదే సమయంలో గతంలో కంటె 30 సీట్లు ఎక్కువ తెచ్చుకున్న లేబరు పార్టీ నాయకుడు కోర్బిన్ యిమేజి పెరిగింది.

వామపక్షాలు ఒకప్పటి వామపక్షాలు కాదు. వాటిల్లో ఒకప్పటి సిద్ధాంతబలిమి లేదు. గ్లోబలైజేషన్ కారణంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారాలి అనుకుంటూ అవి రైటిస్టు పార్టీలకు నకలుగా మారి, సెంటర్‌కు జరగసాగారు. రైటిస్టులూ మరీ బెట్టుగా లేకుండా మెత్తబడి, సెంటర్‌కు జరగసాగారు. చివరకు యిరుపక్షాలు యించుమించుగా మధ్యేవాదులుగా మారడంతో రైటిస్టులకు, లెఫ్టిస్టులకు గల తేడా ఏమిటో అర్థం కాని ఓటర్లు ఎవరికి వేసినా ఒకటేలే అనే పరిస్థితికి చేరారు. అందువలన వామపక్షాలకు కచ్చితంగా ఓటేసే ఓటు బ్యాంకులు తరిగిపోతున్నాయి. ప్రపంచమంతా యిదే పరిస్థితి వ్యాపిస్తోంది. మౌలిక వామపక్ష భావాలైన సమసమాజం, అందరికీ అవకాశాలు, అందరితో చర్చించి విభిన్న భావాలను కలుపుకుపోవడం, విపరీత జాతీయ భావాలకు, ప్రాంతీయ భావాలకు లొంగకపోవడం.. యిత్యాది భావాలన్నీ బూజుపట్టినవి అని వామపక్ష నాయకులే అనుకుని వాటిని పక్కకు నెట్టేసి, తాము ముందుండి ప్రజలను నడిపించే బదులు, భావోద్వేగాలకు లోనైన ప్రజలు ఏమంటే దానికి తానతందాన అనసాగారు. పాతకాలపు సిద్ధాంతాలు నమ్ముకున్నవారిని ఛాందసులుగా, చాదస్తులుగా ముద్ర కొట్టారు. పార్టీలో పైకి రానివ్వలేదు.

లేబరు పార్టీలో మొన్నటివరకు కోర్బిన్ పరిస్థితి అదే. ఎందరో నాయకులు ప్రజలను ప్రభుత్వ స్కూళ్లల్లో తమ పిల్లల్ని చేర్పించమని ప్రబోధిస్తూనే తమ పిల్లల్ని కార్పోరేటు స్కూళ్లకు పంపుతారు. బ్రిటన్‌లో ప్రభుత్వమే నడిపే ప్రత్యేక పాఠశాలలు - గ్రామర్ స్కూళ్లు. తన కొడుకుని గ్రామర్ స్కూలుకు కాకుండా మామూలు స్కూలుకు పంపుతానంటే అతని భార్య ఒప్పుకోలేదు. ఆ విషయంపై గొడవ పడి యిద్దరూ విడిపోయారు. ఆమె అతని రెండో భార్య. విడాకులకైనా సిద్ధపడ్డాడు కానీ సిద్ధాంతాలకు విడాకులు యివ్వడానికి సరేననలేదు. ఇలాటి చాదస్తుణ్ని చూస్తే పార్టీలో లోకువే మరి. 1983 నుంచి అతను ఎంపీగా నెగ్గుతూ వస్తున్నా అతన్ని వెనుక బెంచీల్లోనే కూర్చోబెట్టారు. అతని మొండితనాన్ని వేళాకోళం చేసేవారు. ఇతనూ తక్కువ తినలేదు. సిద్ధాంతాలకు విరుద్ధంగా పార్లమెంటులో ఓటేయమని విప్ జారీ చేస్తే అంతరాత్మ ప్రబోధం అంటూ ధిక్కరించేవాడు. అతని చర్యల్లో నిజాయితీ వుంది కాబట్టి పార్టీ అతనిపై చర్య తీసుకోలేదు.

అతను మరీ పేదకుటుంబం నుంచి వచ్చినవాడు కాదు. తండ్రి ఎలక్ట్రికల్ ఇంజనియర్. తల్లి గ్రామర్ స్కూల్లో మాథ్స్ టీచరు. కానీ సింపుల్‌గా జీవించడం నేర్చుకున్నాడు. శాకాహారి. మద్యం సేవించడనే చెప్పాలి. 68 ఏళ్ల వయసులో కూడా ఆఫీసుకి సైకిలు మీద వస్తాడు. ఎంపీలందరిలో ట్రావెల్ ఎలవన్సు అతి తక్కువగా తీసుకునేవాడు అతనే. అతనికి సెన్సాఫ్ హ్యూమర్ కూడా ఎక్కువే. ఓ సారి ఒక ఎంపీ అతనిపై కోపం తెచ్చుకుని నిన్ను చావగొడతాను చూడు అనే అర్థంలో "స్కూల్లో చదివే రోజుల్లో నాకు బాక్సింగ్‌లో మెడల్స్ వచ్చాయి తెలుసా?" అని బెదిరిస్తే అదే జరిగితే నేను పోట్లాటకు దిగనులే అని అర్థం వచ్చేట్లు యితను "అవునా, నాకు పరుగు పందాల్లో వచ్చాయి!" అని చెప్పి అతన్ని కూడా నవ్వించాడు.

బ్రిటన్‌లో లేబరు పార్టీ ప్రభుత్వం వున్నా, కన్సర్వేటివ్ పార్టీ ప్రభుత్వం వున్నా గత కొన్ని దశాబ్దాలుగా అది అమెరికాకు తోకగా మారిపోయింది. అది యిచ్చే ఆర్థికసాయానికి లోబడిపోయి యూరోప్‌లో, మధ్యప్రాచ్యంలో అమెరికా తన స్వప్రయోజనాలకై చేపట్టిన ప్రతి దుశ్చర్యకు వంత పాడింది. లేబరు పార్టీ సభ్యుడైనా సరే, కోర్బిన్ తన సొంత ఆలోచనలు వ్యక్తం చేస్తూనే వున్నాడు. ఎవరిమీదనైనా సరే తీవ్రవాద ముద్ర కొట్టి దూరం పెట్టేబదులు, వారితో చర్చించి వారి సమస్యలు కనుక్కుని, పరిష్కారం సాధించడం మంచిదని వాదిస్తూ వచ్చాడు. పాలస్తీనాలో ప్రభుత్వం నడుపుతున్న మితవాద సంస్థ ఫతాకు బ్రిటన్ రాజకీయ నాయకులందరూ మద్దతిస్తూండగా అక్కడి తీవ్రవాద సంస్థ ఐన హమాస్‌యే ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది అని అంటాడు కోర్బిన్. ఎక్కడో పాలస్తీనా మాట పక్కన పెడదాం. ఇంగ్లండుకు వ్యతిరేకంగా దక్షిణ ఐర్లండ్ తీవ్రవాదులు ఐఆర్‌ఏ పేరుతో చాలా దాడులు చేశారు. 1984లో థాచర్ కాబినెట్ సభ్యులు అనేవకమంది సమావేశమైన బ్రైటన్ హొటల్‌పై బాంబులతో దాడి చేశారు. ఇంగ్లండు ప్రజలంతా ఐర్లండు వారిపై ఎంత రగులుతూంటారో వూహించుకోవచ్చు. ఆ సమయంలో కూడా కోర్బిన్ కొన్ని వారాల తర్వాత ఇద్దరు ఐఆర్‌ఏ సభ్యులను, అక్కడి తీవ్రవాద పార్టీ నాయకుణ్ని ఆహ్వానించి ఉపన్యసించమన్నాడు. అదీ అతని ఉదారత్వం. యుద్ధానికి వ్యతిరేకి. ఇలాటి వ్యక్తి తన పార్టీలో వస్తున్న మార్పులను జీర్ణించుకోలేకపోయాడు.

1994 అక్టోబరులో టోనీ బ్లయర్ అప్పుడు ప్రతిపక్షంలో వున్న లేబరు పార్టీకి నాయకుడిగా ఎన్నికయ్యాడు. బ్లాక్‌పూల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో తమ పార్టీ రాజ్యాంగంలో, ఆలోచన విధానాల్లో మార్పు రావాలని ప్రతిపాదించాడు. 1918లో తయారైన పార్టీ రాజ్యాంగంలోని 4 వ క్లాజు 'ఉత్పత్తి సాధనాలపై ప్రజలకే అధికారాలు' (కామన్ ఓనర్‌షిప్) ఉండాలని చెపుతుంది. "మారుతున్న నేటి సమాజంలో, ప్రతి వ్యక్తి వ్యక్తిగతంగా ఎదగాలని చూస్తున్న యీ రోజుల్లో యిది పనికిరాదు. ఈ సిద్ధాంతాన్ని ప్రజలు అర్థం చేసుకోవటం లేదు. టోరీలు కావాలని పెడర్థాలు తీస్తున్నారు. ఈ క్లాజు ఎత్తేయాలి. రెండున్నరేళ్ల తర్వాత రాబోయే ఎన్నికలు మనకో అవకాశాన్ని యివ్వబోతున్నాయి. ఈలోగా మనం మారాలి. మారామని ప్రజల్ని నమ్మించాలి. అప్పుడే ప్రభుత్వంలో మార్పు సాధ్యం. మన నినాదం 'కొత్త లేబరు - కొత్త బ్రిటన్' కావాలి." అన్నాడు. పార్టీలో చాలామంది కన్విన్స్ కావడంతో తర్వాతి ఏడాది జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఆ మార్పులు ఆమోదించారు కూడా.

ఆ సమయంలో కోర్బిన్ బిబిసికి యిచ్చిన యింటర్వ్యూలో "సమాజంలో పైకి ఎదుగుతూన్న మధ్యతరగతి వాళ్లను ద ృష్టిలో పెట్టుకుని టోనీ ప్రతిపాదనలు చేశాడు. కానీ సమాజంలో ఆ ఒక్క వర్గమే కాదు, నిరుద్యోగులు, చిరుద్యోగులు, నిరుపేదలు అందరూ వున్నారు. లేబరు పార్టీ తమకోసం ఏం ఆలోచిస్తోందో మనం వాళ్లకు చెప్పగలగాలి. లేకపోతే మనం వాళ్ల మద్దతు పోగొట్టుకుంటాం." అని హెచ్చరించాడు. కానీ పార్టీ టోనీనే నమ్మింది, 1997 మేలో అతని మేనిఫెస్టో ప్రకారమే పోటీ చేసింది. ఆ ఎన్నికలలో నెగ్గడంతో 'తాము 'ఇక్ష్వాకుల కాలం నాటి' సోషలిజాన్ని పట్టుకుని వేళ్లాడడానికి బదులు మధ్యేవాద (సెంట్రిస్టు) రాజకీయాలవైపు పయనించాలని లేబరు పార్టీ నాయకులందరూ గాఢంగా నమ్మసాగారు. కోర్బిన్ ఒంటరివాడయ్యాడు.

అమెరికా సద్దాం హుస్సేన్‌పై పగబట్టి, అతని వద్ద అణ్వాయుధాలని అబద్ధపు ప్రచారం చేసి ఇరాక్‌పై యుద్ధానికి దిగింది. ఇంగ్లండును కూడా కలిసి రమ్మంది. ఇంగ్లండు ప్రజలకి అది యిష్టం లేకపోయినా టోనీ అమెరికా చెప్పినట్లే ఆడాడు. దీన్ని లేబరు పార్టీలోని సోషలిస్టు కాంపెయిన్ గ్రూపు వారు వ్యతిరేకించారు. దాని నాయకులు పార్టీ ఎన్నికలలో టోనీని ఎదిరిస్తూ నిలబడ్డారు, కానీ తగినంతమంది మద్దతుదార్లు కరువై ఓడిపోయారు. టోనీ 2001, 2005 ఎన్నికలలో కూడా నెగ్గాడు. 2007లో గార్డెన్ బ్రౌన్‌కు అధికారం అప్పగించి దిగిపోయాడు. ఎన్నికలు ఐదేళ్ల కోసారి అనడంతో బ్రౌన్ 2010 వరకు పాలించాడు. టోనీ, బ్రౌన్ విధానాలే పార్టీలో చెల్లుబాటయ్యాయి. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా కోర్బిన్ తన విధానాలు మార్చుకోలేదు. పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ పార్టీ విప్‌ను ధిక్కరిస్తూ పార్లమెంటులో 1997-2010 మధ్య దాదాపు 400 సార్లు ఓటేశాడు.

చివరకు 2010 ఎన్నికలలో లేబరు పార్టీ ఓడిపోయింది. టోరీ ఐన కామెరాన్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. తర్వాత 2015 ఎన్నికలలో పూర్తి మెజారిటీ సాధించి మళ్లీ ప్రధాని అయ్యాడు. బ్రెగ్జిట్‌పై రిఫరెండం నిర్వహించి ప్రజాభిప్రాయం తన అభిప్రాయానికి విరుద్ధంగా వుందని తెలిసి, తెరీసా మే కు అధికారం అప్పగించి దిగిపోయాడు. 2015 ఎన్నికలలో రెండోసారి వరుసగా ఓటమి కలగడంతో లేబరు పార్టీ పూర్తి నిరాశానిస్పృహల్లో మునిగిపోయింది. అధ్యక్షుడిగా మిల్లిబాండ్ రాజీనామా చేశాడు. అతని స్థానంలో పార్టీకి నాయకత్వం వహించడానికి ఎవరూ ముందుకు రాలేదు. గతంలో పార్టీ విధానాలను ప్రతిఘటించిన నాయకులను కదలేశారు. 'ఇంతకుముందు మేం పోటీ చేసి ఓడిపోయాం కదా, వద్దులే' అంటూ వాళ్లు తప్పుకున్నారు. అలాటి విపత్కర పరిస్థితుల్లో కోర్బిన్ పేరు ప్రతిపాదించారు – ఎలాగూ ఓడిపోతాడులే అనుకుంటూ. 35 మంది మాత్రమే అతని పేరు నామినేట్ చేశారు. టోనీ బ్లయర్ మౌనంగా కూర్చోలేదు. 'కోర్బిన్ లాటి పాతకాలపు వామపక్షవాదులను తిరస్కరించండి. ఓటమిలో వున్నాం కదాని యిప్పటి విధానాలను తిరగదోడకండి.' అని పిలుపు నిచ్చాడు. అంతేకాదు, కోర్బిన్‌కి ఓటేసినవాళ్లు గుండెమార్పిడి చికిత్స చేయించుకోవాలి అంటూ వెక్కిరించాడు కూడా.

పార్టీలో అధినాయకత్వం కోర్బిన్‌ని సీరియస్‌గా తీసుకోకపోయినా, చిత్రంగా యువనాయకులు అతన్ని నమ్మారు. ట్రేడ్ యూనియన్లు అతనికి అండగా నిలిచాయి. కోర్బిన్ పార్టీ నాయకుడయ్యాడు. ఇది చూసి అందరూ నిర్ఘాంతపోయారు. "ద ఎకనమిస్ట్" పత్రిక తన 2015 సెప్టెంబరు సంచికలో "బ్యాక్‌వర్డ్స్, కామ్రేడ్స్" (ఇది వెనకడుగు సుమా) అని లేబరు పార్టీ సభ్యులను హెచ్చరించింది. బ్రిటన్ వామపక్షీయులను కోర్బిన్ కాలగర్భానికి తీసుకెళ్లి పూడ్చిపెడతాడని జోస్యం చెప్పింది. ఆ పత్రిక ఒక్కటే కాదు, యావత్తు మీడియా కోర్బిన్‌పై కక్ష కట్టేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ చేసిన ఒక అధ్యయనం ప్రకారం 2015 సెప్టెంబరు 1 నుంచి నవంబరు 1 వరకు వచ్చిన మీడియా రిపోర్టులన్నీ అతనిపై విషం కక్కాయి. అతని మీదనే కాదు, అతని సమర్థకులపై కూడా విరుచుకుపడ్డాయి. టాబ్లాయిడ్‌లలో అయితే అతన్ని వెక్కిరించని రోజు లేదు. చివరకు మీడియా ధోరణి ఎంతవరకు వెళ్లిందంటే అతనికి టెర్రరిజంతో, బ్రిటన్ శత్రువులతో లింకు పెట్టారు. 'దీని కారణంగా ప్రజలకు అతని గురించి స్పష్టమైన అవగాహన కలగలేదు. ప్రెస్ వాచ్ డాగ్ (కావలి కుక్క) గా వ్యవహరించలేదు, ఎటాక్ డాగ్ (దాడి చేసే కుక్క)గా ప్రవర్తించింది' అంది ఆ అధ్యయనం.

ఈ ప్రచారం ప్రభావం లేబరు పార్టీ నాయకులపై కూడా పడింది. గతంలో కోర్బిన్‌ని సమర్థించినవారు సైతం విమర్శించసాగారు. లేబరు పార్టీ బ్రెగ్జిట్‌కు వ్యతిరేకం. టోరీ పార్టీలో కొందరు బ్రెగ్జిట్‌కు వ్యతిరేకం కాబట్టి వారితో చేతులు కలిపి పనిచేయాలని కొందరు లేబరు పార్టీ నాయకులు భావించారు. కానీ ఏ అంశంలోనూ టోరీలతో వేదిక పంచుకోనని భీష్మించడంతో కోర్బిన్‌పై వీరికి చికాకేసింది. రిచర్డ్ మర్ఫీ అనే మాజీ కోర్బిన్ సమర్థకుడు 'ఈ కోర్బినామిక్స్ పతనావస్థకు వచ్చింది. కోర్బిన్, అతని టీము కలిసి ప్రపంచాన్ని ద్వేషించడం నేర్పుతున్నారు తప్ప పరిష్కారమార్గాలు చూపించలేక పోతున్నారు.' అని వ్యాసం రాశాడు. సీమా మల్‌హోత్రా అనే లేబరు ఎంపీ 'దేశానికి బలమైన నాయకత్వం కావాలి తప్ప కోర్బిన్ కాదు' అంటూ అతను ఏర్పరచిన షాడో కాబినెట్‌లోంచి తప్పుకుంది. ఈ మార్చిలో స్కాటిష్ నేషనల్ పార్టీ లీడరు నికోలా స్టర్జియాన్ 'లేబరు పార్టీ వైఫల్యం వలన టోరీ ప్రభుత్వం ఎల్లకాలం కొనసాగే దురవస్థ వచ్చిపడింది' అంది. (గతంలో 56 సీట్లున్న యీవిడ పార్టీకి యీ సారి 35 మాత్రమే వచ్చాయి) ఏప్రిల్‌లో లిబరల్ డెమోక్రాటిక్ లీడరు టిమ్ ఫెరాన్ 'బ్రిటన్ రాజకీయ చరిత్రలోనే అత్యంత చెత్త నాయకుడు కోర్బిన్' అన్నాడు. (ఇతనికి గతంలో కంటె 4 సీట్లు పెరిగి 12 వచ్చినా ఓట్ల శాతం 0.5% తగ్గింది)

ఇవన్నీ చూసి కాబోలు బ్రిటన్ ప్రధాని తెరీసా మేకు అమిత ధైర్యం వచ్చేసింది. కోర్బిన్ నాయకత్వంలో ప్రధాన ప్రతిపక్షం చచ్చుబడి వుంది కాబట్టి తన మెజారిటీ పెంచుకోవడానికి యిదే అదను అనుకుంది. నేను మార్గరెట్ థాచర్‌కు మించిన ఐరన్ లేడీని. బ్రెగ్జిట్ బేరసారాల్లో నా తడాఖా చూపిస్తా అనే యిమేజితో మూడేళ్ల ముందుగా ముందస్తు ఎన్నికల టళితే మెజారిటీ యింకా

పెరుగుతుంది అనుకుంది. జూన్ 8 న ఎన్నికలు అని ఏప్రిల్ 18 న ప్రకటించేసింది. కోర్బిన్‌పై ఎవరికీ ఆశలు లేవు కాబట్టి, ఆమె గెలుపు ఖాయమనీ, లేబరుకు ఘోరపరాజయం తప్పదనీ అందరూ నమ్మారు. ఒపీనియన్ పోల్స్‌లో టోరీలకు 20 పాయింట్ల ఆధిక్యత వుంది. అయితే ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ పరిస్థితిలో మార్పు వచ్చింది. తన ప్రత్యర్థులు ఏమంటున్నా పట్టించుకోకుండా కోర్బిన్ ప్రజల్లోకి వెళ్లాడు. సాధారణంగా ఎన్నికల సమయంలో ట్రేడ్ యూనియన్ లీడర్లతో సమావేశాలు జరిపి మూసిన తలుపుల వెనుక నాయకులతో ఒప్పందాలు చేసుకుని ఎన్నికల వ్యూహాలు రచిస్తారు. కానీ యితను సరాసరి జనంలోకి వెళ్లి తన ఆలోచనలు చెప్పాడు. వాళ్లు అతని మాటలు విన్నారు.

ఈ గ్లోబలైజేషన్‌తో వచ్చిన మార్పుకు ప్రజలంతా హర్షిస్తున్నారని, చాలా సుఖంగా వున్నారనీ మార్కెట్ మాయాజాలం, మీడియా మనల్ని నమ్మిస్తోంది తప్ప సాధారణ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందలేదు. కొందరు మధ్యతరగతివాళ్లు బాగుపడ్డారు తప్ప పేదలు అల్లాడుతున్నారు. పొదుపు చర్యల పేరుతో తెరీసా విద్య, వైద్యరంగాలలో విధించిన కోతల వలన వారు బాధలు పడుతున్నారు. బ్రెగ్జిట్ తర్వాత ఉద్యోగాలు మరిన్ని తగ్గి నిరుద్యోగం మరీ తీవ్రమౌతుందన్న భయంతో వున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన నాయకుడు కోర్బిన్ ఒక్కడే. అతను పార్లమెంటులో ప్రశ్నలు వేయడానికి ముందు తనకు ప్రశ్నలు పంపమని ప్రజల్ని కోరేవాడు. వాళ్లు పంపిన వాటిని ప్రధానికి సంధించేవాడు. అందువలన అతను తమలో ఒకడు అని ప్రజలు ఫీలయ్యారు, అతని మాటలకు స్పందించారు. ముఖ్యంగా యువత అతని వెంట పరుగులు తీసింది. మీడియా తనకు వ్యతిరేకంగా వుంది కాబట్టి కోర్బిన్ సోషల్ మీడియాను నమ్ముకున్నాడు. యువతను యింకా బాగా చేరాడు.

ఎన్నికల వాగ్దానాలు చేసినప్పుడు కూడా కోర్బిన్ అన్ని వర్గాలనూ మెప్పించాలని ప్రయత్నించలేదు. తమ పార్టీ మానిఫెస్టోలో 4 వ సెక్షన్ మళ్లీ పెడతానన్నాడు. కార్పోరేషన్లకు, ఏటా 80 వేల పౌండ్ల కంటె ఎక్కువ వేతనం వచ్చేవారికీ పన్నులు పెంచుతానన్నాడు. విద్య, వైద్య రంగాలకు తగ్గుతూ వస్తున్న నిధుల గురించి ఆందోళన వ్యక్తం చేశాడు. పోలీసు బజెట్ తగ్గించడం అనర్థం అన్నాడు. ఆ మాటలు నిజమనిపించేట్లు ఎన్నికలకు సిద్ధమవుతూండగానే మూడు టెర్రరిస్టు దాడులు జరిగాయి. మాంచెస్టరులో దాడి జరిగాక కోర్బిన్ 'ఇతర దేశాల వ్యవహారాల్లో మనం కలగజేసుకునే విధానంలో మార్పు రావాలి' అంటూ ప్రకటించాడు. ఎన్నికలలో ఓటింగు శాతం 2% పెరిగి, 68.7%కి చేరింది. చివరకు ఫలితాలు చూసి అందరూ విస్తుపోయారు.

లేబరు పార్టీ ఓటు శాతం ఒక్కసారిగా 9.5% పెరిగింది. 1945లో రెండవ ప్రపంచయుద్ధానంతరం 10.4% పెరిగింది. ఆ తర్వాత యీ స్థాయిలో పెరిగినది యిప్పుడే. దశాబ్దాలుగా టోరీలు గెలుస్తూ వచ్చిన నియోజకవర్గాల్లో లేబరు గెలిచింది. బ్రెగ్జిట్‌కై ఓటేసిన స్థానాల్లో కూడా గెలిచింది. లండన్‌లో అత్యంత సంపన్నులు నివసించే కెన్సింగ్‌టన్ నియోజకవర్గంలో కూడా లేబరు అభ్యర్థి గెలిచారు. లండన్‌లో మొత్తం ఆరు సీట్లు టోరీలు కోల్పోయారు. 2015లో 12.9% ఓట్లు తెచ్చుకున్న యుకె ఇండిపెండెన్స్ పార్టీ యీసారి పూర్తిగా కుప్పకూలింది. వాళ్ల ఓట్లన్నీ టోరీలకే వచ్చాయనుకున్నారు కానీ కొన్ని ఓట్లు లేబరుకి కూడా వెళ్లాయని పరిశీలకుల అంచనా. మొత్తం మీద చూస్తే లేబరుకి టోరీల కంటె 2.3% ఓట్లు తక్కువే వచ్చాయి. (కానీ యీ 40% కూడా 2001 నుంచి చూస్తే అత్యధికం) సీట్ల విషయంలో 52 తక్కువ వచ్చాయి. అయినా కోర్బిన్ 'నవ్విన నాప చేనే పండింది' అనే సామెత నిజం చేశాడు. నాప చేను సామెత మాట ఎలా వున్నా, ప్రజల నాడిని పట్టుకున్నవాడికి, ప్రజలతో మమేకం అయినవాడికి, పరిస్థితులతో రాజీ పడకుండా సిద్ధాంతాన్ని నమ్ముకున్న 'ఛాందసుడి'కి కూడా ఆలస్యంగానైనా మంచి రోజులు వస్తాయని మరొక్కసారి రుజువైంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**న్యూస్, వ్యూస్ 136 జూన్ 23** **ఎమ్బీయస్ : గూరా?లాండ్ ఆందోళనకు అసలు కారణం...?**

డార్జిలింగ్ ప్రాంతంలో గూరా?లాండ్ ఉద్యమం గూరా? జనముక్తి మోర్చా (జిఎఎమ్) నాయకుడు బిమల్ గురుంగ్ నాయకత్వంలో జూన్ 8 నుంచి ఉధృతంగా, హింసాత్మకంగా సాగుతోంది. మిలటరీ సహాయంతో దాన్ని అదుపు చేద్దామని చూస్తున్నారు. సోషల్ మీడియాను ఆందోళనకారులు ఉపయోగించుకుంటున్నారనే సమాచారం రావడంతో బెంగాల్ ప్రభుత్వం ఆ ప్రాంతాల్లో యింటర్నెట్‌ను నిషేధించింది. ఉద్యమం ప్రారంభమే తీవ్రస్థాయిలో మొదలైంది. రాష్ట్రప్రభుత్వం డార్జిలింగ్‌కు కూడా ప్రాధాన్యత యిస్తోందని చూపడానికి మమతా బెనర్జీ 45 సం.ల తర్వాత జూన్ 8న డార్జిలింగ్‌లో గవర్నరు బంగళాలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసింది. తమ హయాంలో పర్వత ప్రాంతంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు ఎలా చెప్పాలో చర్చించింది. ఆ బంగళాకు 200 మీ.ల దూరంలోనే వేలాదిమంది జిజెఎమ్ కార్యకర్తలు పోగుపడి రెండు గంటల పాటు పోలీసుల మీద, బాంబులు, రాళ్లు విసిరారు. 50 మందిని గాయపరిచారు. పబ్లిక్, ప్రయివేటు వాహనాలను తగలబెట్టారు. ముఖ్యమంత్రి, తక్కిన మంత్రులు ఎవరూ బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పోలీసులు లాఠీ చార్జి చేసి, బాష్పవాయు ప్రయోగం చేసి గుంపులను చెదరగొట్టారు. దానికి నిరసనగా మర్నాడు జిజెఎమ్ 12 గంటల బంద్ నిర్వహించింది. 10 వేల మంది టూరిస్టులు డార్జిలింగులో చిక్కడిపోవడంతో సైన్యం సహాయంతో వారిని వెనక్కి పంపిన మమతా బెనర్జీ తను మాత్రం కలకత్తా తిరిగి వెళ్లిపోకుండా ధైర్యంగా జనాల మధ్య తిరుగుతూ వారికి ధైర్యం చెప్పింది. అది గురుంగ్‌ను మరింత మండించింది.

నిజానికి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో వున్నంతకాలం పర్వతప్రాంతాల్లో అలజడి సాగుతూనే వుంది. మమతా అధికారంలోకి వచ్చాక గురుంగ్‌తో చర్చలు జరిపి 2011లో గూరా?లాండ్ టెరిటోరియల్ ఎడ్మినిస్ట్రేషన్ (జిటిఏ) అనే ప్రాంతీయ మండలి ఏర్పాటు చేసి వారికి చాలా అధికారాలు కట్టబెట్టింది. అంతేకాదు అతనిపై వున్న హత్య కేసును తొక్కిపెట్టి వుంచింది. గురుంగ్‌తో విభేదించి బయటకు వెళ్లి అఖిల్ భారతీయ గూరా? లీగ్ అని సంస్థ పెట్టిన మదన్ తమాంగ్ అనే అతన్ని 2010లో గురుంగ్ అనుచరులు నడివీధిలో నరికి చంపారు. ఆ కేసు పెండింగులో పెట్టడంతో, అధికారం దక్కడంతో గురుంగ్ శాంతించాడు. మూడు దశాబ్దాల అనిశ్చిత పరిస్థితుల తర్వాత గత ఆరేళ్లగా ఆ ప్రాంతంలో శాంతి ఏర్పడింది. దానితోబాటు అభివృద్ధి కూడా బాగా జరగసాగింది. మమతా ప్రత్యేక శ్రద్ధ వహించి అక్కడి జిల్లాలను అభివృద్ధి పరిచింది. వివిధ జాతులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి జిజెఎమ్ ప్రాధాన్యతను తగ్గించింది. అందువలన తృణమూల్ పార్టీకి అభిమానులు పెరగసాగారు. అది గమనించి హర్కా బహదూర్ ఛెత్రి అనే అతను గురుంగ్ నుంచి విడిపోయి, తృణమూల్‌కు సహకరించసాగాడు. గురుంగ్‌కు యింకో యిబ్బంది కూడా వచ్చిపడింది. 2015లో సిబిఐ అతనితో సహా 23 మంది జిజెఎమ్ నాయకులపై మదన్ తమాంగ్ హత్య కేసులో కేసులు పెట్టింది.

పరిస్థితి యిలా వుండగా మే నెలలో పర్వత ప్రాంతాల్లోని నాలుగు మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరిగాయి. డార్జిలింగులోని 32 సీట్లలో జిజెఎమ్ 31 గెలిచింది, కురసాంగ్‌లో 20లో 17, కాలింపాంగ్‌లో 21లో 19 గెలిచింది. అయితే 12 మంది జిజెఎమ్ నాయకులు తృణమూల్‌కు ఫిరాయించిన మిరిక్ మునిసిపాలిటీలో జరిగిన ఎన్నికలలో మాత్రం తృణమూల్ 9 సీట్లలో 6 గెలిచి నెగ్గి సొంతంగా అధికారం చేజిక్కించుకుంది. గతంలో యిలా ఎన్నడూ జరగలేదు. వ్యవహారం యిలా సాగనిస్తే పర్వతప్రాంతంలో తన పలుకుబడి తగ్గిపోతుందని గురుంగ్ భయపడ్డాడు. ఇంతలో మే నెలలోనే మమతా బెంగాల్‌లో బెంగాలీని రెండవ లేదా మూడవ భాషగా తప్పనిసరిగా నేర్చుకుని తీరాలని నిబంధన పెట్టింది. ఇదే అదనుకుని జిజెఎమ్ జూన్ 1, 2 తారీకుల్లో స్కూళ్ల బంద్ నిర్వహించింది. వెంటనే మమతా తన అడుగు వెనక్కి తీసుకుని ఆ ఆదేశాలు డార్జిలింగ్, తెరాయి, దోఆర్స్‌లోని కొన్ని ప్రాంతాలకు వర్తించవని, అక్కడ బెంగాలీ ఐచ్ఛికమని సవరించుకుంది. కానీ జిజెఎమ్ ఆందోళన చేయడానికే నిశ్చయించుకుంది.

జూన్ 8 నాటి సంఘటనల తర్వాత జూన్ 12 నుంచి ప్రభుత్వాఫీసుల నిరవధిక బంద్‌కు పిలుపు నిచ్చింది. దుకాణాలు కూడా మూసేయమంటే స్థానిక ప్రజలకు కోపం వస్తుందేమోనని దడిసింది. శాంతిభద్రతల అదుపుకు జూన్ 13 నుంచి సైన్యాన్ని దించారు. జూన్ 15న గురుంగ్ యింటిపై దాడి చేసి విల్లమ్ములతో సహా అనేక ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. గురుంగ్ అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. నిరవధిక సంపూర్ణ బంద్‌కు పిలుపు నిచ్చాడు. అది యింకా కొనసాగుతోంది. జిటిఏకు జులైలో ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో తృణమూల్ గెలిస్తే గురుంగ్ పాప్యులారిటీ పూర్తిగా అడుగంటిపోతుంది. అందువలన ఎలాగైనా ఆ ఎన్నికలను వాయిదా వేయించాలని యీ ఆందోళన కొనసాగిస్తున్నాడు. ఆందోళనను పెద్ద స్థాయికి తీసుకెళ్లాలని గూరా?లాండ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలంటూ పాత డిమాండ్‌ను పునరుద్ధరించాడు. ఆ సెంటిమెంటు యింకా వర్కవుట్ అవుతోందిలా వుంది, ఆందోళన పెద్ద యెత్తునే నడుస్తోంది.

జిజెఎమ్, కేంద్రంలో అధికారంలో వున్న ఎన్‌డిఏలో భాగస్వామి. దాని మద్దతుతోనే 2009, 2014 ఎన్నికలలో బిజెపి డార్జిలింగ్ పార్లమెంటు స్థానం గెలిచింది. కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పడదు. అందువలన మమత రాజకీయ మద్దతుకోసం కేంద్రంపై ఆధారపడకుండా సొంతంగా జిజెఎమ్‌కు ముకుతాడు వేయాలని చూస్తోంది. ఇప్పటిదాకా వారి ఆధ్వర్యంలో నడిచిన జిటిఏకు ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు ఏ విధంగా ఖర్చయ్యాయో ఆడిట్ చేయాలని ఆదేశించింది. జిటిఏకు 2011లో రూ. 3 వేల కోట్లు యిచ్చారు. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 1000 కోట్లు యివ్వగా కేంద్రం 600 కోట్లు యిచ్చింది. కానీ జిటిఏ జమాఖర్చులు రాయటం లేదు. 2013-14 నుంచి దానిలో సభ్యులుగా వున్న జిజెఎమ్ నాయకుల ఆర్థిక నేరాల గురించి తెలుసు. అయినా యిన్నాళ్లూ వూరుకున్నారు. ఇప్పుడు బందాలు వేయాలి కాబట్టి ఆడిట్‌ను తెరపైకి తెచ్చారు. అంతేకాదు, జిజెఎమ్ పాలించిన మూడు హిల్ మునిసిపాలిటీలు – డార్జిలింగ్, కలింపాంగ్, కురసాంగ్‌ల నిధులను కూడా ఆడిట్ చేయిస్తోంది.

ఇక గురుంగ్ ఆగ్రహం పట్టరాకుండా వుంది. మమతపై నిప్పులు కక్కుతున్నాడు, బెదిరిస్తున్నాడు. మమత బెదరటం లేదు. 'నెత్తిమీద మదన్ తమాంగ్ కేసు పెట్టుకుని నన్ను బెదిరించడానికి ఎంత ధైర్యం? ఏదైనా తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి నాకు ఒక్క నిమిషం పట్టదు' అంది. గురుంగ్ 'ఆవిడ బెంగాల్‌కు ముఖ్యమంత్రి ఐతే, నేను గూరా?లాండ్‌కు ముఖ్యమంత్రిని. బెంగాలీని ఐచ్ఛిక భాషగా కూడా యిక్కడ ఒప్పుకోము. ఆవిడ తన పవరు చూపిస్తే, నేను నా తడాఖా చూపిస్తా' అన్నాడు. చూపిస్తున్నాడు. కానీ అతను చేస్తున్నది పులిస్వారీ! ఇప్పుడు ఉద్యమం విరమిస్తే బలహీనుడనే ముద్ర పడుతుంది. కొనసాగిస్తే టూరిస్టులు రావడం మానేస్తారు. టూరిజమే జీవనోపాధిగా బతుకుతున్న స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు అతన్ని తిట్టుకుంటారు. ఈ యిరకాట పరిస్థితిలోంచి బయటపడాలంటే కేంద్రం చొరవ తీసుకుని మధ్యవర్తిత్వం వహించాలి. కానీ కేంద్రం ప్రేక్షకస్థానం వదలి రావటం లేదు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017) (ఫోటో – బిమల్ గురుంగ్)**

**న్యూస్, వ్యూస్ 136 జూన్ 24** **ఎమ్బీయస్ : మహారాష్ట్రలో ఋణమాఫీ**

ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలన్న తాపత్రయంతో వున్న బిజెపి ముందూవెనకా చూసుకోకుండా రైతు ఋణమాఫీ ప్రకటించేసింది. నిజానికి ఆంధ్ర, తెలంగాణల రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన ఋణమాఫీకి కేంద్రంలో వున్న బిజెపి ఏ మాత్రం సహకరించలేదు. అది దండగమారి వ్యవహారం అన్నట్లు, రైతులకు క్రమశిక్షణారాహిత్యం మప్పుతున్నట్లు ప్రవర్తించింది. ఆర్‌బిఐ ద్వారా హెచ్చరికలు జారీ చేయించింది. అయితే యుపికి వచ్చేసరికి ఛాన్సు తీసుకోకూడదని ఆ ప్రకటన చేసింది. సింహావలోకనం చేసి చూస్తే ఆ హామీ లేకపోయినా గెలిచేదనిపిస్తుంది. ఏది ఏమైనా యుపిలో బిజెపి తీసుకున్న ఆ విధానం వలన దేశమంతా అన్ని రాష్ట్రాలలో ఋణమాఫీ డిమాండ్లు తలెత్తే పరిస్థితి వచ్చిపడింది. ప్రస్తుతం మహారాష్ట్ర ఆ ఉచ్చులో పడింది. నోట్ల రద్దు ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదిపివేసింది. ఇంకా కోలుకోలేదు. ఇంతలో జిఎస్‌టి వస్తోంది. దానివలన అత్యధికంగా నష్టపోయే రాష్ట్రం అదే. నష్టాల్లో వున్న మునిసిపాలిటీలకు నిధులు సమకూరుస్తామని యిటీవలే ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివార్ ప్రకటించాడు. ఏడవ పే కమిషన్ తర్వాత ఉద్యోగుల జీతాలు పెరగబోతున్నాయి. ఈ పరిస్థితుల్లో మాఫీ అంటే ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు యిష్టం లేదు.

అయితే రైతు ఉద్యమం బలంగా వున్న మహారాష్ట్రలో రైతు సంఘాలు తీవ్ర ఆందోళన చేపట్టాయి. జూన్ 5-9 మధ్య రైతులు పాలు, కూరగాయలు రోడ్లపై పారబోశారు. నగరాలకు, పట్టణాలకు పాలు, కూరలు అందకుండా చేశారు. ఇదే అవకాశమని అధికారం పంచుకుంటున్న శివసేనతో బాటు కాంగ్రెసు, ఎన్‌సిపి వంటి ప్రతిపక్షాలు సైతం వారికి మద్దతివ్వసాగాయి. ఫడ్నవీస్‌కు గత్యంతరం లేకపోయింది. ఋణమాఫీ తథ్యమని, అయితే అది ఎలా చేయాలో నిర్ణయించడానికి ఓ కమిటీ వేస్తానని అన్నాడు. రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్ అధ్యక్షతన కమిటీ వేశాడు కూడా. యుపిలో యిచ్చారు కాబట్టి మహారాష్ట్ర బిజెపి ప్రభుత్వానికి కూడా యివ్వదని గ్రహించిన ఫడ్నవీస్ తెలుగు రాష్ట్రాలలా ఏదో కొంత పరిమితికి లోబడి యిద్దామనుకున్నాడు. కానీ ఆందోళన మార్గంలో వున్న రైతు సంఘాలు, ప్రతిపక్షాలు పరిమితితో సంబంధం లేకుండా అన్ని స్థాయిలలో వున్న 31 లక్షల మంది రైతులకు, అన్ని రకాల ఋణాలు మాఫీ చేయాలని అడుగుతున్నాయి. అలా యిస్తే రూ. 1.32 లక్షల కోట్లు కావాలి. రాష్ట్ర బజెటే రూ. 1.25 లక్షల కోట్లు. అందువలన యితర ఆదాయం వున్నవారికి, ప్రభుత్వోద్యోగులకు, ఐదెకరాల కంటె ఎక్కువ భూమి వున్నవారికి, లక్షకు మించి అప్పున్నవారికి మాఫీ చేయకూడదని లెక్కలు వేస్తున్నారు. అలా ఫిల్టర్ చేసి తీసేస్తే రూ. 30 వేల కోట్లతో సరిపెట్టవచ్చు.

కానీ పైకి అలా చెపితే రైతు సంఘాలు గగ్గోలు పెడతాయి. అందువలన కమిటీ యింకా చర్చలు సాగిస్తోందని జులై 25 నాటికి మాఫీ పథకానికి రూపురేఖలు ఏర్పడతాయని చెప్తున్నారు. నిజానికి మహారాష్ట్ర బిజెపి తన ఎన్నికల మానిఫెస్టోలో దీన్ని పెట్టలేదు. అయినా యుపి కారణంగా మెడకు చుట్టుకుంది. చివరకు ఏదో ఒక రూపంలో దానికి ఔననక తప్పదు. ఇక అప్పణ్నుంచి రైతుల భాగోతాలు బయట పడవచ్చు. తెలుగు రాష్ట్రాలలో చూడండి, పరిమితికి మించి తీసుకున్నారని, ఒకే భూమిపై రెండేసి సార్లు తీసుకున్నారని, డాక్యుమెంట్లు పెట్టకుండా జిరాక్స్‌లు పెట్టారని, ప్రభుత్వం పెట్టిన లక్ష్యాలు చేరడానికి బ్యాంకు అధికారులు రైతులతో కలిసి కుమ్మక్కయి, యివ్వవలసిన దాని కంటె చాలా కేసుల్లో ఎక్కువ యిచ్చారని బయటకు వచ్చేసింది. దాంతో ప్రభుత్వాలు చాలా కేసుల్లో మాఫీ చేయలేదు. తీసుకున్న ఋణాలకు వడ్డీలు పెరిగిపోయాయి. బ్యాంకులు కొత్త ఋణాలు యివ్వలేదు. రైతులు విపరీతంగా నష్టపోయారు. మహారాష్ట్ర రైతులు మనవాళ్ల కంటె ఎక్కువ నిజాయితీపరులైతే తప్ప యీ కథ అక్కడా పునరావృతం కావడం తథ్యం. ఇక్కడి ప్రభుత్వాలు రైతుల మోసాలను వెల్లడిస్తూనే సెక్యూరిటీ లేకుండా రైతులకు కొత్త అప్పులివ్వాలని బ్యాంకులకు ఆదేశాలిచ్చాయి. బ్యాంకులు బేఖాతరు చేశాయి. రైతులు వెళ్లి మొరపెట్టుకున్నా మంత్రులు ఏమీ చేయలేకపోతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఋణమాఫీ తేలేలోగా బ్యాంకులు పంటలు వేసుకునే రైతులకు రూ. 10 వేలు పంట ఋణం యివ్వాలని ఆదేశాలిచ్చింది. అదేం కుదరదు అని బ్యాంకులు చెప్పేశాయి. రైతులకు అనేక సమస్యలున్నాయని, వాటికి పరిష్కారాలు కూడా వున్నాయనీ తెలిసినా ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులేయవు. ఋణమాఫీ అనే అడ్డదారిలో వాళ్లను ఆకట్టుకుందామని చూస్తున్నాయి. కల్తీ విత్తనాలతో, కల్తీ ఎరువులతో పంటలు నాశనమై, మార్కెటింగు సౌకర్యాల లేమి వలన పండిన దాన్ని అమ్ముకోలేని రైతు వచ్చే ఏడాది కూడా అప్పుల పాలయితే అప్పుడు వీళ్లేం చేస్తారు? **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017) (ఫోటో – దేవేంద్ర ఫడ్నవీస్)**

**జూన్ 30** **ఎమ్బీయస్ : గృహనిర్బంధంలో సౌదీ మాజీ యువరాజు**

జూన్ 21 వరకు మహమ్మద్ బిన నయీఫ్ సౌదీ అరేబియా యువరాజు. సౌదీ అరేబియాకు ఇంటీరియర్ (హోం) మంత్రి. అంతర్జాతీయంగా అందరికీ తెలిసిన వ్యక్తి. రాజు గారి తర్వాత రాజు కావలసినవాడు. అంతలో అదృష్టం తిరగబడింది. రాజు గారికి మూడో భార్య ద్వారా కలిగిన ప్రియతమ పుత్రుడైన 31 ఏళ్ల సల్మాన్ అతని స్థానంలోకి వద్దామనుకున్నాడు. అంతే జూన్ 21న రాజాజ్ఞలు వెలువడ్డాయి. నయీఫ్‌ను దింపేసి సల్మాన్‌ను ఎక్కించేశారు. నయీఫ్‌కు యువరాజు హోదాతో బాటు మంత్రి పదవి కూడా పోయింది. అతని స్థానంలో అతని సోదరుడి కొడుకును కూర్చోబెట్టారు. సరేలే అనుకుంటూండగానే అతన్ని గృహనిర్బంధంలో పెట్టారనే వార్తలు వస్తున్నాయి.

నయీఫ్ సౌదీ అరేబియా వ్యవస్థాపకుడి పౌత్రుడు. ప్రస్తుతం వున్న రాజుగారి సోదరుని కుమారుడు. అమెరికాలో చదువుకున్నాడు.

టెర్రరిజానికి బద్ధ వ్యతిరేకి. సౌదీలోని కౌంటర్ టెర్రరిజం విభాగానికి నాయకత్వం వహిస్తూ, అల్ కాయిదా పట్ల అతి కఠినంగా వ్యవహరిస్తూ పాశ్చాత్య దేశాల మెప్పు పొందాడు. టెర్రరిస్టులను ఎలా ఎదుర్కోవాలో 1985-88 మధ్య అమెరికాలో ఎఫ్‌బిఐ వద్ద సెక్యూరిటీ కోర్సెస్‌లో తర్ఫీదయ్యాడు. తర్వాత 1992-94 మధ్య ఇంగ్లండులో స్కాట్లండ్ యార్డ్ వద్ద తర్ఫీదు అయ్యాడు. పదేళ్ల క్రితం తమ దేశం మీద దాడి చేసిన అల్ కాయిదాపై విరుచుకుపడి దాని నడుం విరక్కొట్టాడు. దానికి అమెరికా నుంచి, ఇంగ్లండ్ తదితర యూరోప్ దేశాల నుంచి మద్దతు లభించింది. అతనిపై ఇస్లామిక్ టెర్రరిస్టు గ్రూపులు పగబట్టాయి. ఇప్పటివరకు నాలుగు హత్యాప్రయత్నాలు జరిపాయి. మూడోసారి ఓ రంజాన్ నాడు అతనికి అభినందనలు తెలపడానికి వచ్చినట్లే వచ్చి ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు తనను తాను పేల్చేసుకున్నాడు. నయీఫ్ గాయపడినా అతని ఆత్మస్థయిర్యం చెక్కు చెదరలేదు.

ఇలాటి యువరాజు యీ రోజు పంజరంలో చిలుక అవుతాడని ఎవరూ వూహించలేదు. కానీ రాజరికాల్లో ఎప్పుడైనా ఏదైనా జరగవచ్చు. రాకుమారుడు సల్మాన్‌కు పదవీలాలస ఎక్కువ, దూకుడు ఎక్కువ అంటున్నారు. నయీఫ్‌ను తప్పిస్తే తప్ప తను వెలుగులోకి రానని లెక్క వేసి వుంటాడు. తండ్రి తల వూపాడు. సల్మాన్‌ను యువరాజుగానే కాదు, రక్షణ మంత్రిగా కూడా నియమించాడు. అంటే అమెరికా నుంచి ఖరీదైన రక్షణ సామగ్రి దిగుమతి చేసుకోవడంలో, పొరుగున వున్న యెమెన్‌తో యుద్ధం చేయడంలో యిక సల్మాన్‌దే ప్రముఖపాత్ర. యువరాజుగా రావడానికి సల్మాన్ ఉబలాట పడ్డాడు కానీ ఆ పదవి ఉత్తినే అప్పగించేయడానికి నయీఫ్ సుముఖంగా లేడు. అందువలన బలవంతంగా దించారని ప్రజలు చెప్పుకుంటున్నారు. అబ్బే, అదేం లేదు, వారిద్దరి మధ్య ఏ గొడవలూ లేవు అని చెప్పడానికి నయీఫ్ చేతిని సల్మాన్ ముద్దాడుతున్న వీడియోను సౌదీ ప్రభుత్వ మీడియా పదేపదే ప్రసారం చేస్తోంది. మరి అలాటి పరిస్థితుల్లో అతనిపై ఆంక్షలు విధించి గృహనిర్బంధంలో పెట్టడం దేనికి?

సౌదీలో అమెరికాకు అత్యంత ఆప్తుడు నయీఫ్. అతనితో యీ విధంగా వ్యవహరించడాన్ని అమెరికా ప్రభుత్వంలోని కౌంటర్ టెర్రరిజం, యింటెలిజెన్సు శాఖలు నిరసిద్దామనుకుంటున్నాయి. కానీ ట్రంప్ చూడబోతే సౌదీ రాజుతో పూసుకుపూసుకు తిరుగుతున్నాడు. మార్చి నెలలో సల్మాన్ అమెరికాకు వచ్చి వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో విందు కుడిచాడు. అప్పుడే వాళ్లిద్దరి మధ్య బేరసారాలు కుదిరి వుంటాయి. ట్రంప్ యిటీవలే సౌదీ వచ్చి వాళ్లను వాటేసుకుని వెళ్లాడు. ట్రంప్ అల్లుడు జారేద్ కుష్నర్ కూడా సౌదీ పక్షమే. సౌదీ రాజకుటుంబాన్ని ఏమీ అనలేకపోయినా కనీసం తమ చిరకాల మిత్రుణ్ని ఎలాగైనా తప్పించి, అవమానభారం నుంచి తప్పించాలని అమెరికా యింటెలిజెన్సు పక్షాలు అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. నయీఫ్‌కు ఒక భార్య, యిద్దరు కూతుళ్లు వున్నారు. దేశం విడిచి అమెరికాకు వెళ్లి స్థిరపడదామనే ఆలోచన వచ్చి వుంటుంది. రాకపోయినా, వస్తుందేమో, అమెరికా వెళ్లి రక్షణ పొంది తమపై ఆగ్రహంతో సౌదీ రహస్యాలన్నీ వాళ్లకు చెప్పి వేస్తాడేమోనన్న భయం పట్టుకుంది రాజుకి, కొడుక్కి. అందువలన ఎక్కడికీ వెళ్లకుండా కట్టుదిట్టం చేయడానికి యింట్లోనే నిర్బంధించారు. ఈ విషయం బయటకు పొక్కగానే 'అబ్బే, అదేం లేదు, యిది ఛేంజ్ ఓవరు పీరియడ్. నయీఫ్ కొద్దిగా అలకలో వుండి వుండవచ్చు. ఈ పరిస్థితుల్లో విదేశాలు వెళ్లడం దేనికి అంటున్నామంతే' అంటున్నారు అధికార వర్గాలు. రాచకుటుంబంలోని యితర బంధువులు యువరాజు సల్మాన్ ఉద్ధృతి కారణంగానే యింత తీవ్ర చర్యలు జరుగుతున్నా యంటున్నారు. దీని పర్యవసానాలు ఎలా వుంటాయో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2017)**

**ఎమ్బీయస్ : పోరాటయోధుడు ఫిడల్ కాస్ట్రో (నోట్స్ మాత్రమే వ్యాసం అసంపూర్ణం)**

1991లో సోవియత్ యూనియన్ విచ్ఛిన్నమవుతున్నపుడు ఫిడల్ కాస్ట్రో మెక్సికోకు వెళ్లాడు. కొందరు జర్నలిస్టులు అతన్ని చుట్టుముట్టి "రష్యాలో కమ్యూనిజం ఎందుకు విఫలమైంది?" అని అడగసాగారు. అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించిన తర్వాత క్యూబా రష్యా సహాయంపైనే ఆధారపడి మనుగడ సాగించిందని అందరికీ తెలుసు. రష్యా కూలిపోతే క్యూబా పని కూడా అయిపోయినట్లే అని అందరూ అనుకున్నారు. కమ్యూనిస్టులు ఘనంగా చెప్పుకునే దీపస్తంభం రష్యాయే కుప్పకూలిన తర్వాత యిక చిన్న దేశాలకు దిక్కెవరు? నువ్వెలా బతికి బట్టకడతావ్? అనే ధ్వని ఆ ప్రశ్నల్లో గమనించాడు ఫిడల్. ఎడమ అరచేతిలో కుడిపిడికిలి గుద్దుతూ "రష్యాలో కమ్యూనిజం ఎందుకు విఫలమైంది అని అడుగుతారే కానీ క్యూబాలో ఎందుకు విఫలం కాలేదని అడగరేం?" అని గద్దించాడు. చాలా మంచి ప్రశ్న. విలేకరులు సమాధానం చెప్పలేని ప్రశ్న. కేవలం భవిష్యత్తు మాత్రమే సమాధానమివ్వగల ప్రశ్న. అది జరిగి పాతికేళ్లు గడిచింది. క్యూబా పతనం కాలేదు. అక్కడ రౌల్ కాస్ట్రో హయాంలో నడుస్తున్నది అచ్చమైన కమ్యూనిజం కాదని, వాస్తవ పరిస్థితులతో రాజీ పడిన కమ్యూనిజమేనని అనవచ్చు. ఆ మాట కొస్తే కాపిటలిజం కూడా శుద్ధమైన కాపిటలిజంలా మిగల్లేదు. కార్మిక సంక్షేమ విధానాలను సోషలిజం నుంచి కాపీ కొట్టి బతుకుతోంది. తక్కిన లాటిన్ అమెరికా దేశాలలాగే క్యూబాను కూడా నల్లిని నలిపినట్లు నలిపివేయవచ్చని భావించి 1961లో "బే ఆఫ్ పిగ్స్" దండయాత్రలో భంగపడ్డాక కెనెడీ ప్రభుత్వం 10 బిలియన్ డాలర్ల ఫండ్ ఏర్పాటు చేసింది. తన మాట వింటూ క్యూబాపై వాణిజ్యసంబంధాలు తెంపుకున్న లాటిన్ అమెరికా దేశాధిపతులతో "మీ మీ దేశాల్లో కూడా క్యూబాలోలా భూసంస్కరణలు చేపట్టండి, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయండి. మేం సాయం చేస్తాం." అని చెప్పింది. అప్పుడు ఫిడల్ ఎద్దేవా చేశాడు – "భూసంస్కరణలనేవి మ్యూనిస్టు పదజాలమంటూ ఆ మాట వినడానికే యిష్టపడని అమెరికా దాని కోసం నిధులు వెచ్చిస్తాననడమే క్యూబా విప్లవ విజయానికి సంకేతం." అని. అలా కాపిటలిజం కూడా కాలానుగుణంగా

మార్పులు చేసుకుంటూనే పోతూంటుంది. ఈ విషయంలో పాపం కెనెడీ కేటాయించిన నిధులు లాటిన్ అమెరికా దేశాలను ఏలుతున్న రైట్‌వింగ్ మిలటరీ నియంతలకే భోజ్యం అయిపోయి రైతులకు చేరలేదు.

నిజానికి కాస్ట్రో తను కమ్యూనిస్టునని చాలాకాలం చెప్పుకోలేదు. తర్వాతి రోజుల్లో అలా చెప్పుకోవడానికి, అర్ధశతాబ్ది పాటు హీరోలా వెలుగొందడానికి అమెరికా చేసిన ఉపకారమే కారణం. అయితే అది కావాలని చేసిన సాయం కాదు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలన్నిటిలో అమెరికా వ్యాపారస్తుల ప్రయోజనాలు కాపాడడానికి అమెరికా ప్రభుత్వం సిఐఏ ద్వారా ఎంతటి ఘాతుకానికైనా తలపెట్టేది. ఉదాహరణకి సెంట్రల్ అమెరికాలోని గ్వాటెమాలాలో జాకొబొ అర్బెంజ్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై భూసంస్కరణలు చేపట్టాడు, కార్మికుల హక్కులు కాపాడసాగాడు. అమెరికా వాణిజ్యసంస్థ ఐన యునైటెడ్ ఫ్రూట్ కంపెనీకి అవి నష్టాలను తెచ్చిపెట్టాయి. ఆ కంపెనీ ఒత్తిడిపై అమెరికా ప్రభుత్వం సిఐఏకు ప్రభుత్వాన్ని కూల్చే పని అప్పచెప్పింది. అది 1952లో 58 మంది నాయకుల పేర్లతో జాబితా తయారుచేసి, వారిని చంపడానికి తన మాట వినే తిరుగుబాటుదారులకు ఆయుధాలు సరఫరా చేసింది. వారి ద్వారా 1954లో కుట్ర జరిపించి, అర్బెంజ్‌ను చంపించి, అతని ప్రభుత్వాన్ని కూలదోసింది. అంతకు ఏడాది క్రితం ఇరాన్ ప్రధాని ఐన మొహమ్మద్ మొసాదేను తొలగించి అరెస్టు చేసి మూడేళ్ల పాటు జైల్లో పెట్టి, చచ్చిపోయేదాకా గృహనిర్బంధంలో వుంచింది. అతని తప్పేమిటంటే – భూసంస్కరణలు అమలు చేయడం, బ్రిటిషు ఆయిల్ కంపెనీలను జాతీయం చేయడం! 1961లో సోషలిస్టు సంస్కరణలు తలపెట్టిన కాంగో అధ్యక్షుడు పాట్రిస్ లుముంబాను చంపించింది. బ్రెజిల్‌లో చోవో గౌలార్ట్‌ను 1964లో గద్దె దింపింది. 1965లో జువాన్ బోష్ ప్రజాస్వామికంగా జరిగిన ఎన్నికలో గెలిచి గద్దె నెక్కబోతూ వుంటే అడ్డుకుంది. వీళ్లెవరూ కమ్యూనిస్టులు కారు. ఆర్థిక ఉదారవాదులు, అభివృద్ధి ఫలాలు పేదలకు కూడా అందాలని తలపెట్టినవారు మాత్రమే! వారి వలన తమ పెట్టుబడిదారుల వాణిజ్య ప్రయోజనాలు దెబ్బ తింటాయని తోస్తే చాలు అమెరికా యిలాటి కుట్రలు పన్నింది.

అమెరికా మద్దతుతో, ఆయుధాలతో క్యూబాను క్రూర నియంతలా పాలించిన ఫల్జెన్సియో బాతిస్తా కాస్ట్రో, అతని అనుచరులు లేవదీసిన విప్లవంలో పరాజితుడై 1959 జనవరి 1న దేశం విడిచి పారిపోయాడు. కాస్ట్రో జనవరి 8న హవానా చేరి అధికారం చేపట్టాడు. అప్పుడు అమెరికాకు అధ్యక్షుడిగా వున్నది రిపబ్లికన్ ఐన ఐసెన్ హొవర్. కాస్ట్రో ప్రభుత్వాన్ని వెంటనే గుర్తించాడు. అయినా కాస్ట్రో అమెరికాను విశ్వసించలేదు. క్యూబాలో బాతిస్తా అభిమాని అని తోచిన ప్రతీవాడిపై చర్య తీసుకోవడం మొదలుపెట్టాడు. చాలామంది అరెస్టయ్యారు. కొందర్ని చంపివేశారు కూడా. ఇది అమెరికాకు రుచించలేదు. అమెరికాకు నచ్చదని తెలిసి కూడా క్యూబాలో ఆర్థిక వ్యత్యాసం తగ్గించి ప్రజలకు మేలు చేకూర్చాలని 1959 మేలో భూసంస్కరణలు మొదలుపెట్టినందున తనను కూడా అమెరికా శత్రువుగా పరిగణిస్తుందని సందేహిస్తూనే 1960లో యునైటెడ్ నేషన్స్ సభలో పాల్గొనడానికి అమెరికా పర్యటనకు వెళ్లాడు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో రష్యా అధినేత నికితా కృశ్చేవ్ కాస్ట్రోను కౌగలించుకుని అభినందనలు తెలిపాడు. అప్పటికి కాస్ట్రో కమ్యూనిస్టు కానే కాదు, ఒక నియంతను కూలదోసిన విప్లవకారుడంతే. కానీ కృశ్చేవ్ కౌగలింతతో యితనూ కమ్యూనిస్టే అయి వుంటాడనే జంకుతో ఐసెన్ హొవర్ అతన్ని కలవనన్నాడు.

తన దేశానికి తిరిగి రాగానే క్యూబాలోని ప్రైవేటు భూములను జాతీయం చేశాడు. అమెరికన్ కార్పోరేషన్ల అనుబంధ కంపెనీలతో సహా వందలాది ప్రైవేటు కంపెనీల ఆస్తులను, అమెరికన్ టెలిఫోన్ కంపెనీని జాతీయం చేశాడు. దాంతో ఆమెరికాకు ఆగ్రహం మరింత పెరిగి 1960 అక్టోబరులో ఆర్థిక దిగ్బంధం చేసింది. అప్పటివరకు క్యూబా ఆదాయమంతా అమెరికాకు ఎగుమతి చేస్తున్న పంచదార, అమెరికా నుంచి టూరిస్టుల ద్వారా మాత్రమే. క్యూబా ఆర్థికవ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తే తప్ప ప్రజలకు కాస్ట్రోపై మనసు విరగదని అమెరికన్ స్టేట్ డిపార్టుమెంటు నివేదిక సమర్పించింది. రష్యాతో బంధం పెంచుకోవడం ద్వారా కాస్ట్రో దీన్ని తట్టుకోగలిగాడు. 1961లో ఐసెన్ హొవర్ ప్రభుత్వం క్యూబాతో అన్ని దౌత్యసంబంధాలను తెంపుకుంది. ఆ వారసత్వం డెమోక్రాటిక్ పార్టీ తరఫున నెగ్గిన అధ్యక్షుడు జాన్ కెన్నెడీకి వచ్చింది. 1961 జనవరిలో అతను అధికారంలోకి వచ్చిన మూణ్నెళ్లకే సిఐఏ ఆధ్వర్యంలో 'బే ఆఫ్ పిగ్స్' వద్ద దాడి జరిపించాడు. క్యూబా నుంచి గతంలో పారిపోయి వచ్చిన 1400 మంది క్యూబన్లకు ఆయుధాలు యిచ్చి, ఒక పారా మిలటరీ దళాన్ని సిఐఏ తయారుచేసింది. దాన్ని ముందు పెట్టుకుని క్యూబాలో బే ఆఫ్ పిగ్స్ వద్ద దళాలను దింపి క్యూబాను ఓడించి హస్తగతం చేసుకోవాలని సిఐఏ ప్లాను. అంటే యిందులో అమెరికన్ ప్రభుత్వం హస్తం ప్రత్యక్షంగా కనబడదన్నమాట. వాళ్లు తీరంలో దిగగానే క్యూబన్ దళాలు వారిని అడ్డుకున్నాయి. మూడు రోజుల యుద్ధంలో దాడి జరిపిన వారిలో 100 మంది చనిపోయారు. 1200 మంది పట్టుబడ్డారు. ఇదో పెద్ద విజయం కాకపోవచ్చు కానీ యిది కెనెడీ ప్రతిష్ఠను మసకబార్చింది. అమెరికాను ఎదిరించిన వీరుడిగా కాస్ట్రోను నిలబెట్టింది. దెబ్బకి రష్యాకు క్యూబాకు పరమ ఆప్తురాలై పోయింది. ఉక్రోషంతో కుతకుతలాడి పోయిన కెనెడీ 1962 ఫిబ్రవరిలో క్యూబాపై ఆర్థిక ఆంక్షలు విధించాడు. ఆ విధంగా క్యూబా రష్యా కౌగిట్లోకి మరింతగా వెళ్లేందుకు దోహదపడ్డాడు. క్యూబా ఉత్పత్తులను కొనడమే కాక, అన్ని విధాలా అండగా నిలిచింది రష్యా. క్యూబన్ ప్రజలకు ఆహారం, గృహవసతి, ఉచిత విద్య, ఉయ్యాల నుంచి సమాధి దాకా వైద్యసదుపాయం ఏర్పరచడానికి కావలసినంత ధనం సమకూర్చింది. దానికి ప్రతిగా అమెరికాకు 90 మైళ్లు దూరం మాత్రమే వున్న క్యూబాలో న్యూక్లియార్ కాపబుల్ బాలిస్టిక్ మిస్సయిల్స్ పెట్టుకుంటానంది. సరేనన్నాడు కాస్ట్రో. అయితే కెనెడీ భయపడ్డాడు. ఇక్కణ్నుంచి తీసేయమని రష్యాను అడిగాడు. అయితే మీరు ................ లో పెట్టిన యిన్‌స్టాలేషన్స్ తీసేయండి అన్నాడు కృశ్చేవ్. ఇద్దరి మధ్య బేరం కుదిరింది, తీసేశారు. ఇది కాస్ట్రోకు నచ్చలేదు. కానీ రష్యాను ఏమీ అనలేక

పూరుకున్నాడు. ఆ విధంగా క్యూబా ధర్మమాని 1962 అక్టోబరులో అమెరికా, రష్యాల మధ్య రాబోయిన అణుయుద్ధం ఆగిపోయింది.

ఇవన్నీ పైకి కనబడేవి. కానీ రహస్యంగా అమెరికా అతన్ని హత్య చేయడానికి చేసిన ప్రయత్నాలు చూసి విక్రమార్కుడు కూడా విస్తుపోతాడు. దశాబ్దాల పాటు క్యూబాపై ఆర్థిక ఆంక్షలు విధించి, ఆ చిన్ని దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. కిరాయి సైనిక మూకల చేత దాడులు చేయించింది. అతనిపై వందలాది (కరక్టుగా చెప్పాలంటే 638 అని ఒక బిబిసి డాక్యుమెంటరీ అంటుంది) హత్యాప్రయత్నాలు చేయించింది. బయట నుంచి చేసే బాంబు దాడులు అవీ ఎలాగూ వున్నాయి. ఆత్మీయుల ద్వారా తాగే పాలలో, పూసుకునే కోల్డ్ క్రీమ్‌లో, రాసే పెన్నులో, వాడే రుమాలులో, కాల్చే చుట్టలో, వేసుకునే డైవింగ్ దుస్తుల్లో విషం ప్రయోగించి చూశారట. అయినా బతికి బట్టకట్టాడు. అతన్ని చంపాలని, అణచాలని ప్రయత్నించిన 10 మంది అమెరికా అధ్యక్షులు వచ్చారు, వెళ్లారు కానీ కాస్ట్రో క్యూబాను పాలిస్తూనే పోయాడు. ఈ అధ్యక్షులందరూ ఒక్కలాటి వారే అనడానికి లేదు. కాస్ట్రోను ద్వేషిస్తూనే రకరకాల పద్ధతుల్లో క్యూబాను వంచాలని చూశారు. కెనెడీ తర్వాత వచ్చిన లిండన్ జాన్సన్ క్యూబాకు వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షలు మరింత కఠినంగా అమలు చేశాడు. ఆ తర్వాత వచ్చిన నిక్సనూ అంతే. వీళ్లిద్దరూ రిపబ్లికన్లే. నిక్సన్ క్యూబన్ జాలర్లను అరెస్టు చేయించాడు కూడా. 1974లో వచ్చిన ఫోర్డు రిపబ్లికనే ఐనా ఆంక్షలు కాస్త సడలించి, అమెరికన్ వ్యాపారవేత్తలను క్యూబా వెళ్లమని ప్రోత్సహించాడు. 1977లో వచ్చిన డెమోక్రాట్ జిమ్మీ కార్టరు  అమెరికా తరఫున ఒక ఆఫీసును హవానాలో తెరిచి, క్యూబాను వాషింగ్టన్‌లో ఆఫీసు తెరుచుకోమన్నాడు. క్యూబా ప్రవాసులు స్వదేశానికి వెళ్లి రావడానికి అనుమతించాడు. 1981లో రిపబ్లికన్ రోనాల్డ్ రీగన్ వచ్చాక మళ్లీ ఆంక్షలు కఠినతరం చేశాడు. ఇతని తర్వాత 1989లో వచ్చిన బుష్ సీనియర్ అతని కంటె నాలుగాకులు ఎక్కువ చదివాడు. అతని కాలంలోనే 1991లో రష్యా కూలిపోయింది. ఇదే అదనని క్యూబాను మరింత అణచాడు. తమ వద్దనుండి సబ్సిడీలు పొందే త ృతీయ కూటమి దేశాలు క్యూబాతో సంబంధాలు పెట్టుకోకూడదని శాసించాడు. సోవియత్ రష్యా కూలిపోయిన తర్వాత నిలదొక్కుకోవడానికి కాస్ట్రో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాడు. కానీ అమెరికా తన ఆంక్షలు సడలించకుండా బిగబట్టి రష్యాతో బాటు, క్యూబా కూడా పతనం కావాలని సకలయత్నాలు చేసింది. క్యూబాకు పెట్టుబడులు రాలేదు. దాన్ని ఒక ప్రత్యేక సమయంగా గుర్తించమని కోరిన కాస్ట్రో మాట మన్నించి ప్రజలు కష్టాలు ఓర్చుకున్నారు. పెట్రోలు ధరలు పెరిగినప్పుడు కాస్ట్రో చైనా నుంచి లక్షలాది సైకిళ్లు దిగుమతి చేసుకుని మోటారు వాహనాల బదులు వాడమంటే అలాగే చేశారు. చెరుకునే నమ్ముకుంటే లాభం లేదు, మరో రంగం ద్వారా ఆర్జించాలి అనుకుని టూరిజంను ప్రోత్సహిస్తే దానికీ సహకరించారు. ఇది 1993లో డెమోక్రాటిక్ పార్టీ తరఫున వచ్చిన బిల్ క్లింటన్‌కు నచ్చలేదు. ఆంక్షలు కఠినంగా అమలు చేయడంతో బాటు కాస్ట్రో వ్యతిరేక కార్యకలాపాలు ప్రోత్సహించాడు. 2001లో అధికారంలోకి వచ్చిన జూనియర్ బుష్ కూడా అంతే. కాస్ట్రో వ్యతిరేక శక్తులకు మరింత ధనం సమకూర్చాడు. ఇతని కాలంలోనే కాస్ట్రో గద్దె దిగి, తన తమ్ముడు రౌల్‌కు పగ్గాలు అప్పగించాడు.

వీళ్లిలా తంటాలు పడుతూనే వున్నా కాస్ట్రో క్యూబాలో వర్ధిల్లాడు. మనసున్న నియంతలా దేశాన్ని ఏలాడు. ఆడంబరంగా జీవించలేదు. స్టాలిన్ రష్యాను భయంతో గుప్పిట్లో పెట్టుకున్నాడు. అనుమానం తగిలిన ప్రతివాడి ప్రాణమూ తీశాడు. కాస్ట్రోకు ఆ అవసరం పడలేదు. అతను అనేక ప్రజాహక్కులు హరించినా ప్రజలు అతన్ని ప్రేమించారు, ఆరాధించారు. అతన్ని పేరు పెట్టి పిలిచారు. సోవియత్ రష్యా అండ పోయాక వారు యిడుముల పాలయ్యారు, అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలతో నలిగారు. 'ఈ ప్రత్యేక పరిస్థితుల్లో మనం పొదుపుగా జీవించాలి. వాడి పారేసిన వస్తువులను మళ్లీ వాడకంలోకి తెచ్చుకోవాలి, రిపేర్ చేయాలి, రీసైకిల్ చేయాలి' అంటూ అతను చేసిన హితబోధను తలకెక్కించుకుని అమలు చేశారు. కాస్ట్రోను తప్పుపట్టలేదు. ఈ సమయంలోనే ఇండియన్ కమ్యూనిస్టు పార్టీలు 10 వేల టన్నుల గోధుమలను, 10 వేల టన్నుల బియ్యాన్ని సేకరించి క్యూబాకు పంపాయి. 49 ఏళ్ల పాలన తర్వాత 2006లో 79వ యేట అతను అనారోగ్యంతో పక్కు తప్పుకుని తమ్ముడు, సహవిప్లవకారుడు రౌల్‌కు అధికారం అప్పగిస్తే ఆమోదించారు. విద్య, వైద్య రంగాల్లో కాస్ట్రో పాలిత క్యూబా సాధించిన విజయాలు అపూర్వమని ప్రపంచం ముక్తకంఠంతో కీర్తించింది. 96% అక్షరాస్యత, శిశుమరణాల రేటు తగ్గింపు, సగటు ఆయుర్దాయం పెరుగుదల, రోగనిరోధక పరిశోధనల్లో అగ్రస్థానం – యిలా వైద్యరంగంలో ఎన్నో ఘనతలున్నాయి. 35 వేల మంది క్యూబన్ వైద్యులు వివిధ దేశాల్లో వెళ్లి పనిచేశారు. ప్రస్తుతం 1.90 లక్షల మంది క్యూబన్ వైద్యులు అనేక వెనుకబడిన దేశాల్లో తమ సేవలు అందిస్తున్నారు. క్యూబా ప్రజల పాలిట కాస్ట్రో అమెరికా సామ్రాజ్యవాద భూతంతో తలపడుతున్న నిరాయుధుడైన సాహసి. చివరివరకు తన ప్రజల మన్ననలు అందుకుంటూనే కాస్ట్రో ప్రశాంతంగా కన్ను మూశాడు. ప్రపంచం దృష్టిలో అమెరికా విలన్‌గానే మిగిలిపోయింది.

నిజానికి కాస్ట్రో తన రాజకీయ పోరాటం ప్రారంభించినపుడు కార్ల్ మార్క్స్, లెనిన్ సూత్రాలు వల్లించలేదు. నియంతలా పాలిస్తున్న ఫల్జెన్సియో బాతిస్తా క్రూర పాలనను ఎదిరిస్తున్నా అంతే అనుకున్నాడు.

కానీ తన దేశంలో చేసిన ప్రయోగం సఫలం కావడంతో యితర దేశాల్లో కూడా నియంత ృత్వం కూలదోయడానికి ఎంతో దోహదపడ్డాడు. బొలీవియాలో అమెరికా మద్దతుతో నడుస్తున్న అవినీతిమయమైన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి చె గువెరాను పంపాడు. అంతకు ముందే అతన్ని 1965లో కాంగోకు పంపాడు. లుముంబా హత్య తర్వాత పాశ్చాత్య దేశాలు తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని అక్కడ నెలకొల్పాయి. దానిపై తిరుగుబాటు చేయడానికి చే కాంగో వెళ్లి క ృషి చేశాడు. ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో నియంత ృత్వానికి, వలసప్రభుత్వాలకు వ్యతిరేకంగా నడిచిన అనేక ప్రజా ఉద్యమాలకు కాస్ట్రో అనేక రకాలుగా సాయపడ్డాడు. కొన్ని

విజయవంతమయ్యాయి, కొన్ని కాలేదు. పాలస్తీనాకు మద్దతు ప్రకటించాడు. అల్జీరియాలోని స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ వీరులకు క్యూబాలో తర్ఫీదు యిచ్చారు. గాయపడిన వీరులకు వైద్యసదుపాయం కల్పించారు. 1962లో అల్జీరియాకు స్వాతంత్ర్యం వచ్చాక పాశ్చాత్య దేశాలు మొరాకో ద్వారా 1963లో దండెత్తినపుడు క్యూబా సేనలను పంపి వారిని నిలువరించింది. సిరియాలో, ఇరాక్‌లో, దక్షిణ యెమెన్‌లో ప్రజాప్రభుత్వాలకు సాయంగా నిలబడింది. ఇరాక్ 1980లో ఇరాన్‌తో యుద్ధానికి దిగడంతో కాస్ట్రో వారికి సాయం నిలిపివేశాడు. మెరియం అనే సోషలిస్టు ఇథియోపియా స్వాతంత్ర్యం కోసం పోరాడినపుడు, పాశ్చాత్య దేశాల మద్దతుతో సోమాలియా దానిపై దండెత్తినపుడు క్యూబాయే దానికి అండగా నిలిచింది. సౌత్ ఆఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, నమీబియాలో సౌత్ వెస్ట్ ఆఫ్రికా పీపుల్స్ ఆర్గనైజేషన్, అంగోలాలో పాప్యులర్ మూవ్‌మెంట్ ఫర ద లిబరేషన్ ఆఫ్ అంగోలా, మొజాంబియిక్‌లో మొజాంబియిక్ లిబరేషన్ ఫ్రంట్ – యివన్నీ కాస్ట్రో సహాయాన్ని పొందినవే. తెల్లవారి పాలనలో వున్న సౌత్ ఆఫ్రికా అంగోలా పై దాడి చేసినపుడు క్యూబా 40 వేల సైనికులతో ప్రత్యక్ష యుద్ధసహకారం చేసి దాన్ని కాపాడింది. లాటిన్ అమెరికాలో, ఆఫ్రికాలో స్వాతంత్ర్య సమరాలకు క్యూబా చొరవ తీసుకోవడం రష్యాకు రుచించలేదట. అయినా వారు వారించలేదు, క్యూబాకు తాము అందించే ఆయుధసహాకారాన్ని ఆపలేదు.

ఇది చాలనట్లు అమెరికన్ల ఆస్తులను జాతీయం చేశాడు కాస్ట్రో.

కమ్యూనిజం బతికి బట్టకట్టలేదు, కాస్ట్రోయిజం నిలిచింది.

మనసున్న నియంత, నిరాడంబరత

విద్యావంతులైన పౌరులు, ఆరోగ్యవంతులైన పౌరులు విచక్షణ ఉపయోగించారు

పౌరహక్కులు హరించినా సహించారు

లాటిన్ అమెరికాలో ఎందరో నియంతలు

ఎంతో రాజకీయ అస్థిరత

దాంతో పోలిస్తే యిది బెటరనుకున్నారు

కాస్ట్రో మంచి వక్త

వారసత్వ రాజకీయాలు చేయలేదు

తమ్ముడు విప్లవవీరుడే

మార్పును కొద్దికొద్దిగా తెస్తున్నారు

## డిసెంబరు ఎమ్బీయస్ : నోట్ల రద్దుపై పాయింట్లు

క్యాష్‌లెస్ లావాదేవీలు – 23/12/16 – క్యాష్–జిడిపి నిష్పత్తి మన దేశంలో 12% వుంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. దీన్ని 6%కి తీసుకురావాలని లక్ష్యం.

డిజిటల్ ట్రాన్సాక్షన్‌పై మర్చంట్ వీసా, మాస్టర్ కార్డ్, పేటిఎమ్ వంటి కంపెనీలకు కట్టేది 2–2.5%. పే టిఎమ్‌పై డిసెంబరు 31 వరకు చార్జీలు లేవంటున్నారు. తర్వాత ఏమవుతుందో ఎవరికీ తెలియదు. డెబిట్ కార్డుల వినియోగంపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) పేర వేసే 1% చార్జీలను డిసెంబరు 31 వరకు తీసేశారు. జనవరి 1నుంచి మార్చి 31 వరకు వెయ్యి రూ.ల వరకు 0.25%, వెయ్యి నుంచి 2500 వరకు 0.5% క్యాప్ పెట్టారు. డెబిట్ కార్డు – సేవింగ్స్ బ్యాంక్ ఖాతాదారుకి యిస్తారు. అతనికి డిపాజిట్‌పై 4% వడ్డీ యిస్తారు. ఆ డబ్బును 6.5% రేటుకి అప్పిస్తారు. మధ్యలో మిగిలినది నిర్వహణ ఖర్చులకు పోగా లాభం. ఆర్‌బిఐ అధ్యయనం ప్రకారం కస్టమరు బ్యాంకు బ్రాంచ్‌కు వస్తే ఒక ట్రాన్సాక్షన్‌కు అయ్యే ఖర్చు రూ.30–32, ఎటిఎమ్‌లో అదే ట్రాన్సాక్షన్ చేస్తే అయ్యే ఖర్చు రూ.14–15. అలాటప్పుడు డెబిట్ కార్డు వాడకందారుకి చార్జి ఎందుకు వేయాలి? క్రెడిట్ కార్డు విషయంలో అయితే కస్టమరు ఆ మేరకు అప్పు తీసుకుంటున్నాడు కాబట్టి ఆ చార్జిలేవో అతను కట్టడం ధర్మం. కానీ మర్చంట్ నెత్తిన చార్జిలు పడుతున్నాయి. డెబిట్ కార్డు విషయంలో కూడా కస్టమరు తన దాకా రాకుండా తప్పించుకుంటున్న బ్యాంకు మర్చంట్ నెత్తిన చార్జీలు ఎందుకు రుద్దాలి? మర్చంట్ వద్ద తీసుకున్న యీ చార్జిలో సింహభాగం ఇస్యూయర్ బ్యాంక్ (కార్డు జారీ చేసిన బ్యాంకు)కు పోతుంది. తక్కినదాన్ని ఎక్వయిరర్ బ్యాంకు (పిఓఎస్ మిషన్ అమర్చిన బ్యాంకు), వీసా, రూపే, మాస్టర్‌కార్డ్ వంటి పేమెంట్ గేట్‌వేలు పంచుకుంటాయి. తన నెత్తిమీద పడుతున్న చార్జీలను వ్యాపారస్తుడు ఏం చేస్తున్నాడు? అశీస్ దాస్ అనే ఐఐటి, ముంబయి ప్రొఫెసరు, ఆర్‌బిఐలో మానిటరీ పాలసీ విభాగంలో డైరక్టరుగా పని చేస్తున్న ప్రజ్ఞా దాస్ కలిసి "శానిటైజింగ్ డిస్టార్షన్స్ ఇన్ డిజిటల్ పేమెంట్స్" పేర రాసిన పుస్తకంలో "వ్యాపారస్తుడు యీ చార్జీలను తన వద్దకు వచ్చిన కస్టమర్లందరికీ వడ్డిస్తున్నాడు. ఆ మేరకు వస్తువు ధర పెంచుతున్నాడు." అని స్పష్టంగా రాశారు. అయితే చార్జీలు పూర్తిగా తీసేయడానికి ఆర్థిక శాఖ యిచ్చగించటం లేదు. చార్జీలు తీసుకోకపోతే ఆ యా పేమెంట్ కంపెనీలకు ఎవరు చెల్లిస్తారని అడుగుతున్నారు. నోట్ల ముద్రణ, నిర్వహణ వ్యయం తగ్గుతుంది కాబట్టి ఆర్‌బిఐయే భరించవచ్చు. నోట్ల రద్దు సందర్భంగా వెనక్కి రాని నోట్ల విలువ చెల్లించే బాధ్యత తప్పించుకుంది

కాబట్టి ఆర్‌బిఐకు ఆ మేరకు లాభం వచ్చినట్లే. ఆ లాభం లోంచి దీన్ని భరించవచ్చు.

24/12/16 వాషింగ్టన్ పోస్టు ప్రకారం - క్యాష్ లావాదేవీలు జర్మనీలో 80%, అమెరికాలో 32%, ఇండియాలో 95%. ఇండియాలో అనార్గనైజ్‌డ్ సెక్టార్ వాటా 45%. జపాన్, స్విస్‌లలో నెగటివ్ వడ్డీ రేట్ల భయంతో ప్రజలు నగదు యిళ్లల్లో దాచిపెట్టుకుంటారు. భారత్‌ను క్యాష్‌లెస్‌గా మార్చడమంటే ఎఫ్1 రేసులో ఎడ్లబండిని పరిగెట్టించినట్లే!

నోట్ల రద్దు తర్వాత పిఓఎస్‌ల వాడకం పెరిగింది. స్టేటుబ్యాంక్‌లో నవంబరు 9కి ముందు రోజుకి రూ. 94 కోట్ల విలువ చేసే 3.75 లక్షల లావాదేవీలు జరిగితే తర్వాతి రోజుల్లో రోజుకి రూ.324 కోట్ల విలువైన 16.43 లక్షల లావాదేవీలు జరుగుతున్నాయని బ్యాంక్ ఎండీ చెప్పారు. గత ఏడాది మేం రోజుకి 300 టెర్మినల్స్ పెట్టాం. నోట్ల రద్దు తర్వాత రోజుకి వెయ్యి పెడుతున్నాం అన్నారాయన. రోజుకి 3 వేలు పెట్టాలనే టార్గెట్ పెట్టాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టింది.

పైగా 100 రూ.ల నోటు ఎన్నిసార్లు చేతులు మారినా ఖర్చు లేదు, అదే డిజిటల్ ద్వారా చేస్తే ప్రతీసారీ దానిపై 2 రూ.ల వరకు పోతూ వుంటుంది. అందుకే యింకా ఎక్కువ మంది వాడటం లేదు. ఆర్బీఐ డిసెంబరు 20 న విడుదల చేసిన అంకెల ప్రకారం - డిసెంబరు 07 న మొత్తం లావాదేవీల విలువ 4022 బిలియన్లయితే కార్డు ద్వారా జరిగినవి 17 బిలియన్లు. పిపిఐ (?) ద్వారా 7 బిలియన్లు, మొబైల్ ద్వారా జరిగినవి 44 బిలియన్లు. వారం పోయాక డిసెంబరు 14 న చూస్తే మొత్తం 4682 బిలియన్లు, కార్డుతో 15, పిపిఐతో 7, మొబైల్‌తో 45. డిసెంబరు 20 న మొత్తం 4231 బి. కాగా కార్డుతో 11, పిపిఐతో 6, మొబైల్‌తో 62. అంటే మొబైల్ వాడకం పెరిగింది కానీ తక్కినవి పెరగటం లేదు.

23/12/16 - పేటిఎమ్ వగైరాలు - ఇలాటివి ఈ-వాలెట్ అప్లికేషన్లు మొత్తం 55 వున్నాయి. పేటిఎమ్ వాడకం వెయ్యి రెట్లు పెరిగింది. చిన్న వ్యాపారస్తులు దాన్ని ఆమోదించారు కానీ పెద్ద వ్యాపారస్తులు యింకా ఒప్పుకోవటం లేదు. పేటిఎంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకు ఖాతాలోంచి సొమ్ము వెళ్లిపోతోంది కానీ వాలెట్‌లో జమ కావటం లేదు. ఏపిల్ హేండ్‌సెట్ యూజర్లు ఒక బగ్ కారణంగా పేటిఎమ్ చెల్లింపులు చేయలేకపోతున్నారట. తక్కినవారికి కూడా 'నో ట్రాన్సాక్షన్ ఐడీ' రావటం లేదు. మామూలుగా అయితే 48 గంటల్లో జమ కావాలని, కానీ బ్యాంకు సర్వర్లు బిజీగా వుండటంతో ఆలస్యమవుతోందని కంపెనీ సంజాయిషీ.

పిఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్లు దేశంలో 15 లక్షలు వున్నాయి. ఇంకా 20 లక్షలు కావాలని బ్యాంకర్లు తయారీదారులను అడుగుతున్నారు. వీటిని దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుత అవసరాల బట్టి వీటికి బిఐఎస్ (భారతీయ ప్రమాణాల సంస్థ) లేబులింగ్ నుంచి మినహాయింపు యిచ్చి దిగుమతి అనుమతిస్తున్నారు. మరి వీటి నాణ్యత ఎలా వుంటుందో తెలియదు.

నోట్ల లభ్యత - ఆర్‌బిఐ బ్యాంకుల ద్వారా చేసిన కొత్త నోట్ల మొత్తమెంత? - 23/12/16 - తెలంగాణకు ఆర్‌బిఐ యిచ్చినది 22 వేల కోట్లు. దానిలో రూ.100 కంటె తక్కువ డినామినేషన్ గల నోట్ల శాతం 5% మాత్రమే.

ఆర్‌బిఐ ప్రకారం - నవంబరు 27 దాకా ఎటిఎంలు, బ్యాంకుల ద్వారా ప్రజలు విత్ డ్రా చేసుకున్న కొత్త నోట్ల విలువ 2.16 లక్షలు. డిసెంబరు 6 వరకు 4 లక్షల కోట్లు కొత్త నోట్లు విడుదల చేశాం. వీటిలో 2.94 లక్షల కోట్లు పెద్ద నోట్లు.

21/12/16 నవంబరు 4 వరకు 18 లక్షల కోట్ల నోట్లు జనాల్లో చలామణీలో వున్నాయి. 6 లక్షల కోట్లు ఆర్‌బిఐ లాకర్లలో వున్నాయి.

21/12/16 నవంబరు 8 నుంచి డిసెంబరు 19 వరకు ఐటివారికి మొత్తం 677 ఐటీ దాడులు జరిగాయి. 3100 నోటీసులు యిచ్చారు. పట్టుకున్న నగదు, నగల విలువ రూ.428 కోట్లు. దానిలో పట్టుబడిన కొత్త నోట్ల విలువ రూ.86 కోట్లు. (అన్నీ 2 వేల నోట్లే). లెక్క చూపని ధనం విలువ రూ.3185 కోట్లు. 220 కేసులను ఇడికి అప్పగించింది.

ఎటిఎం కాలిబ్రేషన్ నవంబరు 30 వరకు సాగిందని, దాంతో దేశంలో 1.80 లక్షల ఎటిఎంలు పనిచేయలేదని కేంద్రమంత్రి చెప్పారు.

10/12/16 ఓ సర్వే ప్రకారం దేశంలో 13 ప్రధాన నగరాల్లో ఏటిఎంలలో 69% పని చేయలేదు. భువనేశ్వర్‌లో 84% త్రివేండ్రంలో 73% పనిచేయడం వలన యీ అంకె యిలా వచ్చింది. చెన్నయిలో పని చేయని ఎటిఎంలు 88%, బెంగళూరులో 89%, హైదరాబాదులో 98%,

రాజకీయ పార్టీలకు విరాళాలు - 2015-16లో రూ.20 వేలకు మించి వచ్చిన విరాళాలు - బిజెపికి 613 (77 కోట్లు, కితం ఏడాది 437 కోట్లు), కాంగ్రెసుకు 918 (20 కోట్లు, కితం ఏడాది 141 కోట్లు), విరాళాల్లో 77% కార్పోరేట్ల నుండే వచ్చాయి.

05/01/17 బ్యాంక్ ఆఫ్ అమెరికా-మెరిలించ్ లెక్క ప్రకారం - 500, 1000 నోట్ల విలువ 15.55 లక్షల కోట్లు వుంటుందని, దానిలో 14 లక్షల కోట్లు డిసెంబరు 19 నాటికే బ్యాంకుకు చేరిపోయాయి. ఇంకో లక్ష కోట్లు తర్వాత వచ్చింది. తిరిగి రానిది 50 వేల కోట్లు మాత్రమే. ఆర్‌బిఐ యింకా అంకెలు విడుదల చేయలేదు. పాత నోట్ల విలువ 17 లక్షల కోట్లు వుందని బిజెపి వారంటున్నారు. ఒక రిపోర్టు ప్రకారం దేశంలో 60 లక్షల మంది అంటే జనాభాలో 0.5% మంది 7 లక్షల కోట్లు జమ చేశారట. అంటే తక్కిన 8 లక్షలు దేశంలో 99.5% మంది జమ చేశారన్నమాట!

డిమానిటైజేషన్ వలన భారత ఆర్థికరంగం కుచించుకు పోతుంది అన్నారు హాప్కిన్స్ వర్శిటీలో అప్లయిడ్ ఎకనమిస్ట్ అయిన జాన్స్ హాప్కిన్స్ అన్నారు.

డిమానిటైజేషన్ వలన మాన్యుఫేక్చరింగ్ రంగం దెబ్బ తింది. నికాయ్ ఇండియా మాన్యుఫేక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ డిసెంబరులో 49.6 అయింది. నవంబరులో అది 52.3 వుంది. 2016లో యిదే అతి తక్కువ. పారిశ్రామిక ఉత్పత్తిలో 38% వాటా వుండే మౌలిక రంగ వృద్ధి శాతం అక్టోబరులో 6.6 వుంటే నవంబరుకు 4.9 అయింది.

బ్రిటిషు కరెన్సీ ముద్రణ సంస్థ దిలారూ కి 1997-98లో ఆర్‌బిఐ కాంట్రాక్టు యిస్తే ఆ ప్రెస్ ముద్రించిన కరెన్సీ ఉగ్రవాదుల చేతిలోకి వెళ్లిందని 2011-12 జెపిసి గుర్తించి, 2011లో నిషేధించారు. అయితే దిలారూ ఇండియా ప్రై. లి.గా అవతారమెత్తి మోదీ సర్కారుతో సంబంధాలు పెట్టుకుంది. 10 రూ.ల ప్లాస్టిక్ నోట్ ముద్రణకు దాన్ని, మరో మూడు కంపెనీలను ఆర్‌బిఐ ఎంపిక చేసింది. ఊమెన్ చాండీ దీన్ని బయటపెట్టాడు. మోదీ సమాధానం లేదు.

గురుమూర్తి ప్రకారం - మన్‌మోహన్ సింగ్ హయాంలో 2004-10 మధ్య డిజిపి పెరుగుదల 8.4% వున్నా అది స్థిరాస్తి, బంగారం వగైరా ఆస్తుల విలువ పెరుగుదల వలన మాత్రమే కనబడింది. అందుకే కొత్త ఉద్యోగాల కల్పన 27 లక్షలు మాత్రమే జరిగింది. పెద్దనోట్లు 2004లో 34% వుంటే, 2010 నాటికి 79%, 2016 నాటికి 87% అయ్యాయి. వీటిలో వెయ్యి నోట్ల విలువలో 65%, 500 నోట్లలో 35% వెనక్కి బ్యాంకుల్లోకి రాలేదని ఆర్‌బిఐ అంది. .

అర్థక్రాంతి వాళ్లు పన్నులు రద్దు చేయమన్నారు. ఆ తర్వాతే నోట్ల రద్దు అన్నారు. ప్రభుత్వం మొదటి మాట వినలేదు. వాళ్లు జియస్టీకి వ్యతిరేకం, బిటిటి కావాలంటారు. ప్రభుత్వం పట్టించుకోలేదు. పార్టీలకు ప్రభుత్వమే నిధులు సమకూర్చాలని వారి సలహా. అదీ పట్టించుకోలేదు. మేం చెప్పిన క్రమాన్ని పాటించి వుంటే ప్రస్తుత గందరగోళం వుండేది కాదని అనిల్ బోకిల్ అన్నారు.

నవంబరు 8 రాత్రి దేశవ్యాప్తంగా 15 టన్నుల బంగారం అమ్ముడుపోయింది. సాధారణంగా యిది ఆరు రోజుల్లో అమ్ముడు పోయే మొత్తం. దీని విలువ 5 వేల కోట్లు. ఇది పాత నోట్లతో జరిగింది. 6 లక్షల మంది బంగారు వ్యాపారస్తులలో 1800 మంది నిబంధనలు ఉల్లంఘించారని భారత బంగారం, ఆభరణ వర్తకుల సంఘం (ఐబిజెఏ) అంది.

రద్దుకై మోదీ రెవెన్యూ కార్యదర్శి గుజరాతీ ఆఫీసరు హస్‌ముఖ్ అధియాపై ఆధారపడ్డారు. గుజరాత్ సిఎంగా వుండగా 2003-06 వరకు అధియా ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2015లో రెవెన్యూ కార్యదర్శిగా నియమించబడ్డాడు. టెక్నికల్‌గా అరుణ్ జైట్లే కింద పనిచేయాల్సి వున్నా ప్రధానితోనే డైరక్టుగా వ్యవహరిస్తాడు. అతనితో పాటు మరో ఐదుగురు అధికారులకు మాత్రమే తెలుసట.

కార్పోరేట్లు బ్యాంకుల నుండి తీసుకున్న 28 లక్షల కోట్ల అప్పు తిరిగి యివ్వలేదని రఘురామ రాజన్ చెప్పాడు. దానిలో ముకేశ్ అంబానీ 1.87 లక్షల కోట్లు, అనిల్ 1.24 లక్షల కోట్లు బాకీ వున్నారు. విజయ్ మాల్యా వంటివారి 1.14 లక్షల కోట్లను మాఫీ చేసింది.

దేశం మొత్తంలో వున్న కరెన్సీ విలువ 16.4 లక్షల కోట్లు

దానిలో 86.3% అంటే 14.20 లక్షల కోట్లు 500, 1000

38% నోట్లు 1000వి, 47% 500 వి, 10% 100వి, 4% 100 కన్నా తక్కువవి, 1% చిల్లర నాణాలు.

మన దేశంలో నల్లధనం జిడిపి 135.67 లక్షల కోట్ల రూ.లలో దాదాపు 50% పేనై వుంటుందని అంచనా అంటే 67.85 లక్షల కోట్లు.

ఇంకో లెక్క ప్రకారం జిడిపి 156 లక్షల కోట్లు. దానిలో 20% అంటే 30 లక్షల కోట్లు నల్లధనం.

అంటే మొత్తం బ్లాక్ మనీ ద్రవ్య సప్లయి (16.40 లక్షల కోట్లు) కంటె 4 రెట్లు ఎక్కువన్న మాట.

అయినా ధనరూపంలో వుండే బ్లాక్ మనీ 16.40 లక్షల కోట్లలో 6% 1 లక్ష కోట్లు మాత్రమేట.

సెంటర్ ఫర్ మానిటారింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక ప్రకారం

నోట్ల రద్దు వలన గృహస్థులపై భారం - 15 వేల కోట్లు, బ్యాంకులపై 35,100 కోట్లు, ప్రభుత్వం, ఆర్‌బిఐపై 16,800 కోట్లు, వ్యాపారాలపై 61,500 కోట్లు, మొత్తం 1.28 లక్షల కోట్లు.

కొత్త కరెన్సీ ముద్రించడానికి నిరంతరం పని చేసినా 2017 మే దాకా పడుతుంది.

•••